

Blank Page

I

జీవన సమరం

వ్యథార్త జీవుల యథార్థ గాథలు

డాక్టర్ రావూరి భరద్వాజ
రచన

II

JEEVANA SAMARAM (Struggle for existence) Life sketches of Prisoners of hungerland trying to escape through sweat and toil; investing their only capital, their brain and skill and above all their determination to live as humans.

By Dr. RAVURI BHARADWAJA

తొలి ముద్రణ

1981

హక్కులు

రచయితవి

ముఖచిత్రం

శ్రీ బాపు

ముఖచిత్ర ముద్రణ

ఎవాన్ - హైదరాబాదు

గ్రంథ ముద్రణ

శ్రీ లక్ష్మీప్రెస్ - గుంటూరు

వెల : 30 రూపాయలు

ప్రతులకు :

శ్రీ కమలా పబ్లిషింగ్ హౌస్

విజయవాడ - 2

వ్యధార్త జీవ్ యథార్థ గాథలు

మిత్రులు భరద్వాజగారిని 'ఈనాడు' తెలుగు వారికి కొత్తగా పరిచయం చేయ వలసిన అవసరం ఉన్నదని, నే ననుకోవడం లేదు. కొంచెం ఇంచుమించుగా మూడున్నర దశా బ్దాలుగా, తెలుగు పాఠకులకు వారు బాగా తెలుసు. ఒక రచయితను మరొకరెవరో పరిచయం చేయడం వల్ల, అర్ధ సత్యం మాత్రమే అభివ్యక్త మవుతుం దనుకొంటాను. ఇంతకన్నా మంచి మార్గమేమిటంటే ఆ రచయిత రచనలను నిశితంగా పరిశీలించడం! అలా పరిశీలించినప్పుడు-రచయిత బాహిర స్వభావమే కాకుండా, ఆంతరిక స్వభావం కూడా మనకు అవగాహన మవుతుంది!

గడచిన 35 సంవత్సరాలుగా పుంఖాను పుంఖంగా వెలువడిన భరద్వాజ కథలను, నవలలను పరిశీలించి చూసినప్పుడు, క్రమానుగతమైన ఒక పరిణామం మనకు గోచరిస్తుంది. చాలామంది విమర్శకులన్నట్లుగా, ఈ పరిణామం ఆరోగ్యకరమైనదీ, అభ్యుదయాత్మకమైనదీనూ నిజమే - ఒకప్పుడు భరద్వాజ లేఖిని నుండి ఎడాపెడా సెక్సు కథలు వెలువడ్డాయి. అయితే-వాటిల్లో కేవలమూ సెక్సు మాత్రమే లేదు; ఆ సెక్సు సంబంధాలను నిర్ణయించే సాంఘిక పరిస్థితులూ, సామాజిక వాతావరణమూ కూడా ఆ రచనల్లో ఉన్నాయి. ఒక సంఘటనను కళాత్మకంగా చిత్రించడం ముఖ్యమే! అంతకన్నా ముఖ్యం - ఆ సంఘటన వెనుకగల సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలను చిత్రించడం! భరద్వాజగారు ఈ రెండవ పనిని నిర్భయంగానూ, నిస్సంకోచంగానూ చేశారు. అలా చేశారు గనుకనే, ఆయన సృష్టించిన వందలాది పాత్రల పట్ల మనకు సానుభూతి, అనుకంప కలుగుతుందే తప్ప, ఈర్ష్య, ద్వేషం, అసహ్యం కలగవు. ఆపాత్రలు కూలీలయినా, మాలీలయినా; భ్రష్టులయినా, నికృష్టులయినా; పతితలయినా, పవిత్రులయినా; జారులైనా, చోరులైనా; మన హృదయాన్ని కరుణ రస ప్లావితం చేస్తాయి!

'ఈనాడు' దినపత్రికను ప్రజాజీవనానికి మరింత సన్నిహితంగా తీసుకురావాలనేది మా ప్రయత్నం. సహస్ర ముఖాలుగా విడిగి విస్తరిన సామాజిక జీవనాన్ని, 'ఈనాడు' ప్రతి

వింబించాలన్నది మా ఆశయం! సువిశాలమూ, సువిస్తృతమూ అయిన మానవ జీవితంలోని ఏకొద్ది భాగాలనో స్పృశించినంత మాత్రాన సరిపోదు. బతుకు కోసం మానవుడు పడే పాట్లు - అసంఖ్యాకంగా ఉన్నాయి. వీటిలో ఏ కొన్నింటినో మనం వృత్తులుగా గుర్తిస్తున్నాం సరే - మరి మిగిలిన వాటి మాటేమిటి? అవి వృత్తులు కానే కావా? మాటవరసకు 'కావు' అని అనుకున్నా, ఆ కాని వృత్తులనే అంటిపెట్టుకుని బతుకుల్ని వెళ్లమారుస్తున్న వారి సంగతేమిటి? వారు - ఆయా వృత్తుల్నే ఎందుకు అంటిపెట్టుకుని ఉన్నారు? ఆ వృత్తుల్లోని కష్టసుఖాలేమిటి? వారు - అల్లానే జీవించడం వెనుకగల పరిస్థితులేమిటి? "పతితులూ, భ్రష్టులూ, బాధా సర్పదష్టులూ" అయిన - ఈ సోదరీసోదరుల జీవితగాధలను అక్షరబద్ధం చేసి పాఠకులకు అందచేయాలనీ, ఈ బాధామయ గాధా పరంపరకు 'జీవన సమరం' అన్న శీర్షికను ఉంచాలనీ సంకల్పించినప్పుడు, 'ఈ శీర్షిక నిర్వాహకులెవ' రన్న ప్రశ్న ఉదయించనే లేదు.

ఎందుకో మనవి చేస్తాను-

భరద్వాజ జీవితం వడ్డించిన విస్తరి కాదు బతుకులోని కష్టాలనూ, కన్నీటినీ కడ ముట్టా చూసినవాడు. చారెడు గంజి కోసమూ, బారెడు గుడ్డ కోసమూ కలవరించిన వాడు ఆకలి, అవమానం, అవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ, పుక్కిలింతలుగా అనుభవించిన వాడు. జీవనపథంలో కాలూని నిలవడం కోసం, రకరకాల వృత్తుల్ని చేసినవాడు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను, కష్టనష్టాలను, అమానుషత్వాన్ని పడిలంగా గుండెల లోతుల్లో దాచుకున్న వాడు. అయితే అతని ఈ అనుభవాలు, జ్ఞాపకాలు, వృధాకాలేదు. భరద్వాజ వాటిని వృధా కానివ్వలేదు కూడా. వాటి సారాన్ని వొడిసి, పిండి, పిల్చుకొని, మహా రచయితగా ఎదిగాడు. ప్రఖ్యాత రచయిత, క్వాజా అహమ్మద్ అబ్బాస్ అన్నట్లు - 'భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతు, వైవిధ్యం, వెల్లివిరియడానికీ, ఆయన పాత్రలు జీవ చైతన్యంతో స్పందించడానికీ, విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్యకారణాలు!'

V

'జీవన సమరం' వంటి ఉదాత్తమైన శీర్షికను నిర్వహించడానికి చాలా దక్షతలు కావాలి. వివిధ వృత్తుల వారిని కలుసుకోవాలి. వారు చెప్పినవన్నీ ఓపికగా వినాలి. వారు చెప్పని వాటినీ, వాటి పూర్వాపరాలనూ, వారినుండి నేర్పుగా రాబట్టాలి. ఆయా వృత్తులకు సంబంధించిన సాంకేతికపరమయిన సమాచారాన్ని సేకరించాలి. వారి అంతరంగాన్ని, వారి ఆలోచనల్ని, అనుభూతుల్ని, 'రికార్డు' చేయాలి. వారనుభవిస్తున్న పరిస్థుత స్థితికి వెనుకగల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను విపేచించుకోవాలి. ఈ పనులన్నీ 'ఉద్యోగ ధర్మం' గా కాకుండా, అంతకు మించిన మానవతా దృక్పథంతో చేయవలసి ఉంటుంది. ఆ వృత్తిపట్ల, వృత్తిదారుల పట్ల, సానుభూతి, అనుకంప, ఆత్మీయత, ఉన్నవారు తప్ప - ఈ శీర్షికను నడపలేరు.

మిత్రులు భరద్వాజకు ఈ దక్షతలన్నీ ఉన్నాయనడం చర్విత చర్వణ మవుతుంది. సుమారుగా ఒక ఏడాదిపాటు కొనసాగిన ఈ 'ఫీచర్' మేము ఆశించినదానికన్నా అధికాధిక మైన ప్రజాదరణను పొందింది. "వారానికొకసారి కాకుండా, రోజువిడిచి రోజు ప్రచురించ" మన్న వారూ, "ప్రతిరోజూ ప్రచురించ వలసిందే" నన్నవారూ, చాలామంది ఉన్నారు. తెలుగుదేశం నాలుగు చెరగుల నుండి మాత్రమే కాకుండా, ఆంధ్రేతర ప్రాంతాలలో ఉన్న 'ఈనాడు' పాఠకుల నుండి కూడా ఈ శీర్షికా నిర్వాహకుణ్ణి అభినందిస్తూ వందలాది లేఖలు మా కార్యాలయానికి చేరుతూ ఉండేవి. ఒక్కో 'జీవిత చిత్రం' పరిచయిత మైనప్పుడల్లా, ఆ దురదృష్టవంతులకు, ధన సహాయం అందచేసిన పాఠకులున్నారు. ఉద్యోగ సదుపాయాలు కలుగజేసిన వారూ ఉన్నారు. హైదరాబాద్ నగర పరిసరాల నుండీ. దూర ప్రాంతాల నుండీ కూడా, ఎందరెందరో ఉదారులు, దయాపరులు, మా కార్యాలయానికొచ్చి, ఆయా దురదృష్టవంతుల వివరాలను తెలుసుకొని - వారి బ్రతుకుల్ని మెరుగు పరచిన సందర్భాలు చాలా ఉన్నాయి. తెలుగు పత్రికా ప్రపంచంలో ఇటు వంటి సంఘటన అపూర్వం! ఈ గౌరవం అతిరాలా మిత్రులు భరద్వాజగారికి లభించినందుకు గర్విస్తున్నాను.

ఒక విషయాన్ని ఎన్నుకోవడంలోనూ, ఎన్నుకొన్న విషయాన్ని 'రసగుళిక' గా రూపొందించడంలోనూ, భరద్వాజ అవలంబించే విధానం విశిష్ట మయింది. రచనా ప్రారంభం-పఠితలో ఉత్సుకతను రెకొక్కలుపని పఱుంలో, పాఠకుడు పక్క శీర్షికకు వెడతాడు. జీవిత చరిత్ర చెబుతూనే, పూర్వాపరాలను వివరిస్తూనే, కారణాలను ఉటంకిస్తూనే, ఎక్కడా 'అతి' అని పించకుండా చూసుకోవాలి. చదవడం పూర్తయ్యాక, ఓ గాఢమైన నిట్టూర్పు వెలువడాలి. కన్నీటిబిందువు పఠిత కన్నుల్లో కదలాలి. అమానుషమైన ఈ వ్యవస్థ మీద జుగుప్స కలగాలి. దీన్ని మార్చాలన్న ఆలోచన మెదడులో మెరవాలి. ఇందులో ఏ వొక్కటి లోపించినా ఆరచన అమేరకు తెటుకు పడినట్లేమరి!

'జీవన సమరం' శీర్షికన వెలువడిన ఈ రచనలన్నీ, మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. ఇందులోని వ్యక్తులు - మనకు బాగా తెలిసినవారు. మనతోబాటు మన మధ్యనే జీవిస్తున్నవారు. వీరిని గురించి మనం ఆలోచించం! వీరిని చూసి మనం స్పందించం. ఈ "అధోజగత్స హోదరు" ల బతుకుల్లోకి తొంగి చూడాలంటేనే మనకు భయం.

శ్రీ భరద్వాజ - మనం చేయలేని ఈ పనులన్నీ చేశారు. వారి బతుకుల్లోకి తొంగిచూసి, స్పందించి, మనల్ని స్పందింపచేశారు. వేయేళ్ల తెలుగు సాహిత్య చరిత్రకు - అచ్చంగా, అట్టడుగు వర్గాల యథార్థ చరిత్రలతో నిండిన తొట్టతొలి గ్రంథాన్ని చేర్చిన ఘనత - భరద్వాజకు లభించి నందుకు వారిని మనసారా అభినందిస్తున్నాను.

అలాంటి గ్రంథానికి 'కృతికర్త' కాగలిగినందుకు మిత్రులు శ్రీ కోట పున్నయ్య గారికి శుభాకాంక్షలు అందచేస్తున్నాను.

'ఈనాడు' కాంపౌండ్
హైదరాబాద్

చెరుకూరి రామోజీరావు
చీఫ్ ఎడిటర్ : 'ఈనాడు'

VII

అక్షరాభిషేకం

"కొందరు గొప్పవారుగా జన్మిస్తారు"
అదృష్టవంతులు !
"ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది"
వీరూ అదృష్టవంతులే !
"మంకొందరు గొప్పదనాన్ని సాధిస్తారు."

మనం చెప్పుకోవలసింది వీరిని గురించే! చెప్పుకోడానికి కావలసినన్ని అంశాలు కూడా వీరి జీవితాల్లోనే లభిస్తాయి. ఎంచాతనంకే ఈ చివరి కోవకు చెందినవారు, గొప్పగా జన్మించలేదు. ఇంకెవరో, ఏవోప్రయోజనాల నాశించి, లేని గొప్పదనాన్ని వీరికి మప్పనూ లేదు. కానీ వీరు గొప్పదనాన్ని సాధిస్తారు, సాధించారు. అలా సాధించడానికి ముందు, కోటాను కోట్లుగా ఉన్న అతి మామూలు వ్యక్తుల్లో వీరూ ఒకరయి వుండాలి. పరిస్థితుల ఆటుపోట్లకు, వీరూ అతలాకుతలమయి ఉండాలి. సుడిగాలిలో చిక్కుకొన్న గడ్డిపరకలా వీరూ, గిరికీలు తిరిగి వుండాలి. ఎప్పుడు, ఏ దిక్కుకు, ఎగసి పోవాలో, ఎప్పుడు ఏ మళ్లకంచె మధ్య నిళ్ళబ్దంగా రాలి పోవాలో, వీరికి తెలియకపోవాలి రేపటి సంగతి సరేసరి -మరుక్షణానికేం జరుగుతుందో కూడా తెలీని, అనిశ్చిత వాతావరణంలో వీరు మనుగడ సాగిస్తూ వుండాలి. వీరందరూ సామాన్యులే! సామాన్యంగా జన్మించి, సామాన్యంగా జీవించి, సామాన్యంగానే కనుమరుగయి పోతారు. వీరిలో ఏ నూటికొకరో కాదు - ఏ కోటికొకరో - శక్తివంతులుంటారు. అయితే ఆ శక్తి వైకి కనబడదు. అది చిచ్ఛక్తి లాగా అణు గర్భంలో నిక్షిప్తమయి వుంటుంది. మరుభూముల్లోని ఏ రాయో, ఏ రప్పో, వారికి ఆసరాగా దొరుకుతుంది. అక్కడ కాస్త ఆగుతారు. ఆగి ఊపిరి తీసుకుంటారు. మెల్లిమెల్లిగా తొలుచుకొంటూ, నేలలోకి వేళ్లను జొనుపుతారు. ఆ నేలలోని జీవరసాన్ని పీల్చు

కొంటారు. ఎండలోంచీ, గాలిలోంచీ, ఆహారాన్ని సేకరించుకొంటాడు. ప్రతికూల వాతావరణం లోంచే, తమక్కావలసిన శక్తిని పిండుకొంటారు. పిండుకొని, పిండుకొని, నిటారుగా ఎదుగుతారు. ఈ పెరుగుదల ఎంతదాకానా ? ఆకాశమే వారికి ఆవలి సరిహద్దు!

గొప్పదనాన్ని సాధించడమంటే అదీ! అట్టడుగునుండి, అతి సామాన్యంగా జీవితాన్ని ప్రారంభించి, అనంతాకాశంలోకి శీర్షమెత్తిన అసామాన్యులు, ప్రపంచ చరిత్రలో కొద్దిమందే వున్నారు. అబ్రహాం లింకన్, మైకేల్ ఫారడె, వాషింగ్‌టన్ కార్వర్, ఇంకా... ఇంకా...మనదేశానికి సంబంధించినంత వరకూ, లాల్‌బహుదూర్ శాస్త్రి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, జి. డి. నాయుడు, దామోదరం సంజీవయ్య, వంటివారు ఈ కోవలోకే వస్తారు. సామాన్య కుటుంబాల్లో, చాలా సామాన్యంగా జన్మించిన వీరంతా పరమాద్భుతమైన విజయాలను సాధించారు.

శ్రీ కోట పున్నయ్యగారిని, పార్లమెంటు సభ్యులుగానే చాలా మంది ఎరుగుదురు. ఆ స్థాయిని చేరుకోవడానికి వెనుక గల సంక్షుభిత చరిత్ర తెలిసిన వారు - ఆయనను కూడా, ఆ పై శ్రేణిలోకే చేర్చుతారు.

'జీవన సమరం' సామాన్యుల జీవిత చిత్రణా సంపుటం. ఈ సామాన్యుల జీవితాలు నాకు కొంత వరకూ తెలుసు. మిత్రులు పున్నయ్యగారికి క్షుణ్ణంగా తెలుసు. వీరి చీకటి బతుకుల్లో వెలుగు రేకలు ప్రసరించాలని, మనసారా కోరే వారిలో శ్రీ పున్నయ్యగారొకరు.

అందుకే ఈ జీవన సమరాన్ని వారికి అందించడం-

పున్నయ్యగారూ !

అందుకోండి !!

'పద్మాలయ'
హైదరాబాదు-457

డాక్టర్ రావూరి భరద్వాజ

VII

అడుగు నుండి ఆకాశం వేపుగా...

జాతీయోద్యమ నాయకత్వాన్ని మహాత్ముడు చేపట్టి అప్పటికి ఎంతోకాలం కాలేదు. అంతదాకా మరీ మితధోరణిలో నడుస్తున్న జాతీయోద్యమం - మహాత్ముని రాకతో కొత్తపుంతలు తొక్కింది.

ఆయన శంఖారావం–ఆ సేతు శీతనగ పర్యంతం ప్రతిధ్వనించింది. ఆ ధ్వని తరంగాలు కులీన వర్గాలను, మధ్యతరగతి మేధావులనూ కదిలించాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, న్యాయవాదులు, వైద్యులు - చేస్తున్న వృత్తుల్ని పరిత్యజించి ఉద్యమంలో కొచ్చారు. ఖద్దరు కట్టడం నేరం. తాగుడు మానండనడం నేరం. 'భారత మాతకు జయ్' అనడం నేరం. గాంధీజీ పేరెత్తడం నేరం. ఈ నేరాలకు ఆనాటి ప్రభుత్వం దారుణమైన శిక్షలను విధించేది. నడివీధిలో తోలుకొరడాలతో నెత్తురు చిందేలాగా బాదడం, లాఠీలతో కాళ్లు చేతుల్ని విరిచేయడం, జన సమూహాలపై గుర్రాలను ఉరికించడం, తుపాకులతో - పిట్టల్ని కాల్చినట్లు కాల్చడం, కఠిన కారాగారవాస శిక్షలను విధించడం, ద్వీపాంతరాలకు పంపించడం - కొన్ని సందర్భాలలో ఉరితీయడం - ఆరోజుల్లో సర్వసాధారణం.

స్వదేశీ సంస్థానధీశులు, మహారాజులు, రాజులు, నవాబులు, చిన్నా పెద్దా జమిందారులు - బ్రిటిషువారి చేతి ఎత్తు బిడ్డలూ పెంపుడు కుక్కలూ అయినారు. వారివారి ప్రాంతాల్లో - ఫ్యూడల్ వ్యవస్థ తాండవమాడుతూ ఉండేది. ఇండియాలో ఈ చిన్నా పెద్ద సంస్థానాలన్నీ భాగాలే అయినా, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించినంత వరకూ, వారు దాదాపుగా స్వతంత్రులు. ఆ స్వాతంత్ర్యాన్ని ప్రజా పీడనంలో, ప్రజా దోపిడీలో వారు ఎక్కువగా ఉపయోగపెట్టుకుంటూ ఉండేవారు. అక్కడి ప్రజలకు, మిగిలిన దేశంలో ఏం జరుగుతున్నదీ కూడా తెలీదు. అంచాతనే మహాత్ముడు - తన ప్రచారాన్ని స్వదేశ సంస్థానాలకూ కూడా విస్తరింపచేశారు.

కృష్ణాజిల్లాలోని గంపలగూడెం జమిందారీ గ్రామం. అయినా - ఈ జమిందార్లకు జాతీయోద్యమం పట్ల సానుభూతి ఉండేది. రహస్యంగా - ఆ ఉద్యమానికి చేయూతనిస్తూ ఉండేవారు.



కోట కోటయ్యగారనే ఓ సామాన్య గృహస్థు తనభార్య మహాలక్ష్మిగారితో, గంపలగూడెంలో సంసార పక్షంగా కాలక్షేపం చేస్తూ ఉండేవారు. ఆయన శైవభక్తుడు, జ్ఞాని. విశుద్ధ వర్తనుడు. ఒకరికి చెప్పడమే తప్ప, చెప్పించుకోవలసిన అవసరం లేనివాడు. ఆయనకు నలుగురు బిడ్డలు. అంజయ్య, పున్నమ్మ, పున్నయ్య ముత్తమ్మగార్లు.

"నన్ను బాగా చదివించాలని మా నాన్నగారి కోరిక. చదువు మీద నాకు ఆసక్తి కలగడం కోసం - చదివినవారి గాథలెన్నో నాకు చెబుతూ ఉండేవారు. సాయంకాలం కాగానే, ఆరుబయట నులకమంచం వేసుకుని, తను వెల్లకితలా పడుకొనేవారు. నమ్మ పొట్టమీద కూచోబెట్టుకొనేవారు. చినచిన్న పద్యాలు, నాచేత పలికిస్తూ ఉండేవారు....ఆయనగొంతు చాలా శ్రావ్యమయింది. భారతం నుండీ, భాగవతం నుండీ, ఎన్నెన్నో పద్యాలు, గొంతెత్తి మానాన్నగారు పాడడం, నా చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉన్నది." అన్నారు పున్నయ్యగారు ఓసారి.

చిన్నప్పుడు ఎర్రగా, బొద్దుగా, బుసబుసలాడుతూ ఉండేవాడేమో, ఇరుగుపొరుగు అమ్మలక్కలు పున్నయ్యను కిందికి దించేవారే కాదు....

"మీరట్లా ఎత్తు అలవాటు చేస్తే, నాదుంప తెగిపోతుందర్రా! వాడికి ఎత్తుకొనే ఈడు దాటిందాకా - మీరే ఎత్తుకొంటానంటేనే వాణ్ని తాకండి. లేకపోతే మానేయండి" అనేది మహాలక్ష్మిగారు.

అయినా ఎవరు వింటారు గనక ?

అలా ఎత్తు మరిగిన బిడ్డ, ఆటలూ మరిగాడు. గోళీలు, బిళ్లంగోడు, తొక్కుడుబిళ్ల, గాలిపటాలు, కోతికొమ్మచ్చులు, దాగుడుమూతలు, చెండాటలు -

ఓసారి కోతికొమ్మచ్చ లాడుతున్నప్పుడు – కాలుజారి, కొమ్మ పట్టుతప్పి, కిందపడ్డప్పుడు, కాళ్లు రెండూ విరిగిపోయాయి.

మరింక రావడం కష్టమన్నారు పెద్దవాళ్లు. కోటయ్యగారు, ఆకులురుద్ది, పసర్లు పూసేవారు. మహలక్ష్మిగారు వెన్నతో మర్దన చేసేది. చూసేందుకు కాళ్లు బాగానే ఉన్నా - నడవడం సాధ్యమయ్యేది కాదు.

"మొన్న మొన్నటి దాకా నేనూ నడిచాను. పరుగెత్తాను. నాకళ్లముందు నడుస్తున్నవారినీ, పరుగెడుతున్న వారినీ, చూసి, నాలోనేను కుమిలిపోయేవాణ్ణి. నడవడానికి ప్రయత్నించేవాణ్ణి. కానీ కాలు కదలదు. కదపలేను. నేనెందుకూ పనికిరాననీ పనికి రాకపోయినా, బతికి బట్టగడితే చాలుననీ, మానాన్నగారు అనుకుంటూ ఉండేవారు. నావైద్యం కోసం, ఆయన తపించిపోయారు. ఆ వ్యధచూసి, నేను మరింత బాధపడేవాణ్ణి. కనీసం - ఆయన ఆనందంకోసమన్నా, నాకు నడవడం రావడం అవసరమనుకొన్నారు. అతి ప్రయత్నం మీద కాళ్లను కదిలించగలిగేవాణ్ణి. రెండువేపులా మోకులు కట్టి, వాటిని పట్టుకుని, నడవడం నేర్చుకున్నాను....ఇలా నేర్చుకోవడానికి నేనుపడిన శ్రమను మీ ఊహకు వదిలేస్తున్నాను" అన్నారు పున్నయ్యగారు.

ఇంటికావలికి తప్ప, ఎందుకూ పనికిరాడనుకొన్న పున్నయ్య - మళ్లీ మామూలు కుర్రవాడయినాడు. శుభం! మరి చదువు మాటేమిటి? అంతో ఇంతో ఇంట్లో చెప్పినా - ఈ పెరటిమందు, వైద్యానికి పనికొస్తుందా? దూరంగా ఉన్న పాఠశాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. నివాసానికీ, పాఠశాలకూ మధ్య పొలాలు. పొలం గట్టు మీదుగా, భారతంలోని పద్యాలో, భాగవతంలోని పద్యాలో, గొంతెత్తి పాడుతూ, మధ్యమధ్య 'బాందులాగూ సరిచేసుకుంటూ, తూనీగల్నీ, ఆరుదర్శి పురుగుల్నీ పట్టుకుంటూ, అప్పుడప్పుడు- నేస్తాలతో, పిల్లెమ్మ ఆట లాడుకొంటూ ప్రాథమిక విద్యను నేర్చుకుంటూ, నేర్చుకుంటూ ఉన్న సమయంలో–

గంపలగూడెం జమిందారైన కోటగిరి గోపాలరావుగారు సహృదయులు. కావడానికి జమిందారేగాని, ఆవర్గం వారిలో సాధారణంగా ఉండే భేషజంగాని, తాము అధికులమన్న అహంకారం గాని, వారిలో ఉండేవి కావు. ఆయనకు చాలా భూముయిండే . స్వంత కమతం ఉండేది. వ్యవసాయం పనులన్నీ స్వయంగా చూసుకునేవారు. ప్రతిరోజూ, పొలం గట్లంట, బొదబొదలాడుతూ పద్యాలు పాడుతూ పోతున్న ఆ 'మంచి గుమ్మడి పండు' ను ఒకరోజున గోపాలరావుగారు ఆపారు–

"నువ్వెవరి కుర్రాడివోయ్?" అన్నారాయన.

"కోటయ్యగారబ్బాయి నండీ" అన్నాడు పున్నయ్య బితుకుబితుగ్గా.

"నీకెన్ని పద్యాలొచ్చేమిటి?" అన్నారు గోపాలరావుగారు, కుర్రాడి భుజం తడుతూ.

పున్నయ్యలో భయం తీరింది. చొక్కాతో ముఖంమీది చెమట తుడుచుకున్నాడు.

"ఊ చెప్పు" అని బుజ్జగించారాయన.

ఆ బుజ్జగింపుతో కుర్రాడు కాస్త గీరపోయాడు. "మీకెన్ని కావాలండీ?" అన్నాడు తలెత్తి.

'హారిపిడుగా!' అనుకుని ఉండాలి గోపాలరావుగారు.

"ఓ వంద" అన్నారు గోపాలరావుగారు.

"ఓస్ ఇంతేనా? నాకు రెండొందల్దాకా వచ్చు" బొందులాగూ సర్దుకొంటూ అన్నాడు పున్నయ్య.

"ఏదీ, గజేంద్రమోక్షంలో నీకు నచ్చిన పద్యం - బాగా గొంతెత్తి చదువు".

"నాకు వేళయిందండీ! నాకోసం, మా అమ్మానాన్నా ఎదురు చూస్తుంటారండీ! ఆలస్యమైతే, వాళ్లు గాభరా పడతారండీ!" అన్నాడు పొద్దు కేసి చూస్తూ.

"మీ నాన్నతో నేను చెబుతాలే! చదువు!" అన్నారు గోపాలరావుగారు.

మరింక తప్పదనుకొన్నాడు పున్నయ్య - అనుకుని –

"లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, ప్రాణముల్ తావుల్ దప్పెను, మూర్ఛవచ్చె...." అంటూ చదివాడు. సరిగ్గా సందర్భానికి సరిపోయిన పద్యమిది!

ఆ పద్యం వింటూనే గోపాలరావుగారి కళ్లు మెరిశాయి!

"ఆ సంఘటన, నాజీవితాన్ని మార్చిందండీ! గోపాలరావుగారు, మా నాన్నగారితో మాట్లాడి,నన్ను తమ ఇంటికి తీసుకొచ్చుకున్నారు. అక్కడేతిన్నాను. అక్కడే చదువుకున్నాను. అక్కడే నిద్రపోయాను .... రోజులు గడుస్తున్నకొందికీ, నేను పరాయివాడినన్న భావం వారికీ, నాకూకూడా లేకుండాపోయింది. నన్ను ఆయనగారూ, వారి భార్య అన్నపూర్ణమ్మగారూ కన్నకొడుకులాగా చూశారు. నేనూ వారిద్దర్నీ తల్లితండ్రుల్లాగానే పూజించాను. గంపలగూడెంలో చదువయింది. బెజవాడలో హైస్కూలువిద్య పూర్తయింది. ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. కాలేజీలో చేరాను. అప్పుడు మా తెలుగుశాఖలో విశ్వనాధ సత్యనారాయణగారుండే వారు. ఆయన పాఠం చెప్పడం – ఎంతకీ తెమలదు. విక్రమోర్వశీయం, పాఠంచెప్పడం నాకింకాగుర్తు. నాలుగు పంక్తులు చదివి, నాలుగు గంటలపాటు వివరించే వారాయన. విశ్వనాధవారి అంతేవాసిత్వంవల్ల, తెలుగుసాహిత్యంవల్ల నాకు అభిరుచి పెరిగింది. పాఠ్యాంశాలలో లేకపోయినా, ఆధునిక కావ్యాలు తెగచదువుతూ ఉండేవాణ్ణి. దువ్వూరి రామిరెడ్డి, నాయని సుబ్బారావు, రాయప్రోలు, దేవులపల్లి, జాషువా, వేదుల, నండూరి – వీరి రచనలకోసం వెర్రెత్తిపోయేవాళ్ళం" అన్నారాయన.

సాహిత్య రంగంలోకి రావలసినవాడు కాస్తా–రాజకీయాలవేపు మొగ్గారు. విద్యార్థిసంఘాలు, యువజన సంఘాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు – మధ్యమధ్య సాంస్కృతికకార్యక్రమాల నిర్వహణ – 24 గంటలూ సరిపోయేవికావు.

సెలవుల్లో నాటకాలాడుతుండేవాడు. అవీ – 'ప్రేమించుకొందాం, పెళ్లిచేసుకొందాం' – రకానివికావు. దేశభక్తి ప్రపూరితాలైనవీ, ప్రజల్ని స్వాతంత్ర్య సముపార్జనకు పురికొల్పేవీనూ.

పోలీసులు నిఘావేయడం ప్రారంభించారు. ఆచూకీలుతీయడం ఆరాలుగుంజడం మొదలెట్టారు. ఓసారి అకిరిపల్లిలో నాటక ప్రదర్శనం జరుగుతోంది. పోలీసులు దాడిచేశారు. పట్టుకున్నారు. జైల్లో ఉంచారు....

చదువు పూర్తయింది. ఇప్పు డేంచేయాలి? ఉద్యోగమా ? చాలామంది లక్ష్యమిదే! అందాకా పున్నయ్యగారు పెరిగిన రాజకీయ వాతావరణం, ఆయన్ని ప్రజలవేపు నడిపించింది. దేశం దారిద్ర్యంతో విలవిలలాడి

పోతూ ఉంది. ఒక్కపూటయినా కడుపునిండా తినగలుగుతున్నవారి సంఖ్య బహు స్వల్పం. దరిద్రమంటే తను తెలియనివాడుకాదు. తనకో ఉదారుడైనవ్యక్తి సహాయం చేయవచ్చుగాక, వారయినా ఈ కోట్లాదిమందికీ సాయం చేయలేరుగదా!

గోపాలరావు దంపతులు, తమ పెద్దబిడ్డగా భావించుకున్న పున్నయ్యగారి వివాహం జరిపించాలని సంకల్పించారు.

నందమూరులో పైడిముక్కల కోటయ్యగారికి అంతో ఇంతో ఈ జాతీయోద్యమపు గాలి వంటపట్టించి. చదువుకోవడం. అచ్చుగా మగవారి హక్కే కాదని, స్త్రీలు కూడా చదువుకోవాలనీ ఆయనకు ఆనాడే గట్టి విశ్వాసాలుండేవి. ఈ విశ్వాసాలను కోటమ్మగారు బలపరిచి, తగినభార్యనిపించుకొన్నది. ఈ దంపతుల నాలుగవ సంతానం సావిత్రి. అపుడా అమ్మాయి స్కూల్‌ఫైనల్ చదువుకొంటున్నది.

అడనిలోని ఉసిరకకూ, సముద్రంలోని ఉప్పుకూ సంబంధం కుదిరింది. అబ్బాయికి అమ్మాయి నచ్చింది. అమ్మాయికి అబ్బాయీ నచ్చాడు. వివాహం శాస్త్రోక్తంగా జరిగింది చాలామంది పెద్దలు వచ్చి ఆశీర్వదించారు.

"ఆ తరువాతనే సమస్యలు ప్రారంభమయ్యాయండీ! అంతదాకా వొంటరిగాణ్ణి. తిన్నా తినకపోయినా కాలం గడిచేది. ఇప్పుడలా కాదు. నామీద ఆధారపడిన వారున్నారు. వారిని తిండికి మాడేట్లు చేసే హక్కు నాకు లేదుగదా. అందుకోసమే ఉద్యోగ ప్రయత్నం చేయవలసి వచ్చింది" అన్నారు పున్నయ్య తన ప్రయత్నాలను వివరిస్తూ.

రైల్వేశాఖలో ఏదో ఉద్యోగం గురించి ప్రకటన వస్తే - దానికో దరఖాస్తు పడేశారు. పరీక్షలో ఉత్తీర్ణులయి, ఉద్యోగంలో చేరారు. కొంతకాలం ఉద్యోగం చేశారు. కానీ అందులో ఇమడ లేకపోయారు. తన చుట్టూ దుస్సహమైన దారిద్ర్యం తాండవిస్తూ ఉంది. దాన్ని చూస్తూ తను ఉండలేకు. ఈ ఉద్యోగంలో ఉండి, ఆ పరిస్థితుల్ని మార్చనూ లేడు. అయినవారు, కాదంటున్నా వినకుండా చేస్తున్న ఉద్యోగానికో సలాం కొట్టారు.

మాతామహాలకు సంబంధించిన ఖమ్మం జిల్లాను కేంద్రంగా చేసుకొని, తమ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శ్రీయుతులు జలగం వెంగళరావు, శీలం సిద్దారెడ్డి, కొలిపాక కిషన్‌రావు, హీరాలాల్ మోరియా, తోటకూర వెంకటప్పయ్య, జలగం కొండలరావుగార్లతో తనూ చేరిపోయారు. చాలా సంవత్సరాలపాటు కలిసిమెలిసి పనిచేశారు, ఇప్పటికీ చేస్తూ ఉన్నారు.

కాలినడకన జిల్లా అంతటా పర్యటించారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రయత్నించారు. సహకార సంఘాలు, యువజన సంఘాలు, రైతు-కూలీ సంఘాలు, గ్రంథాలయోద్యమం, మొదలైన రంగాలన్నింటి లోనూ పనిచేశారు.

అనేక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. తన అధికారాన్ని మూగజీవుల అభ్యుదయం కోసం వినియోగించారు.

1957లో ఖమ్మంజిల్లా పాలేరు నియోజకవర్గంలో అసెంబ్లీ సభ్యత్వానికి కాంగ్రెసు పార్టీ టికెట్టు లభించింది. కానీ పరాజయం తప్పలేదు. ఇది జరిగినకొద్ది రోజులకే రాజ్యసభ సభ్యత్వం ఆయనను వరించింది.

మనదేశాన్ని పాలించిన ప్రధానమంత్రు లందరి హయాంలోనూ, ఆయన పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలలోచేరే అవకాశాలూ వచ్చాయి. కానీ, తను విశ్వసించినవారికీ, తనను విశ్వసించినవారికీ, ఆపీశాలనిచ్చి; తనువైదొలగారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అతిముఖ్యమైన నిర్ణయాలను కేంద్రం తీసుకొనవలసిన కీలక సమయాల్లో, ఆయన తనవంతు బాధ్యతను విజయవంతంగా నిర్వహించారు. ప్రాజెక్టుల మంజూరు, కేంద్ర పరిశ్రమల స్థాపన, నిధుల కేటాయింపు వంటి ప్రధానాంశాలలో, ఆయనకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్నాయి.

జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, శ్రీమతి ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయ్‌ల కాలంలో. వివిధ ఉపసంఘాలలో సభ్యులుగాఉండి, ఆ సంఘాలను శక్తివంతమూ, చైతన్యవంతమూ, చేశారు. దేశవిదేశాల్లో పర్యటించి భారతీయ సాంస్కృతిక సంపదను, విదేశీయులకు అందజేశారు.

ఆయన తోడ్పాటుతో వెలిసిన ధార్మిక సంస్థలు, విద్యాసంస్థలు, సంక్షేమ యోజనలు, చాలాఉన్నాయి, ఆయన చలువతో ఉద్యోగాలు సంపాదించుకున్నవారు వేలసంఖ్యలో ఉన్నారు.

ఒక వ్యక్తి ఏ పదవిలో ఉన్నారన్నది ముఖ్యంకాదు. ఉండి ఏమిచేశారన్నదే ముఖ్యం. తనుచేసింది స్వల్పమనీ చేయవలసిందింకా, అనంతంగా, ఉన్నదనీ, ఆయన తరచుగా అంటూ వుంటారు.

"దేశం సువిశాలమయింది. సమస్యలు అనంతంగా ఉన్నాయి. అవన్నీ పరిష్కారం కావాలి. అందరికీ తిండికావాలి. గుడ్డకావాలి. నీడకావాలి చదువుకునే అవకాశంకావాలి. సాంఘికన్యాయం, ఆర్థికన్యాయంకావాలి. అప్పుడే సంఘం సుభిక్షంగా ఉన్నట్టు. దాన్నే సంక్షేమ రాజ్యమంటాం. ఆసంక్షేమ సాధనకోసం, నాకృషి ఏపాటి తోడుపడ్డా నాజన్మ ధన్యమయినట్లు భావిస్తాను." అంటారాయన వినయంగా.

ఆ నమ్మితే ఆయనకు శ్రీరామరక్ష।

—పెండేకంటి వెంకటసుబ్బయ్య

[కేంద్ర – అంతరంగిక, పార్లమెంటు వ్యవహారాల శాఖల సహాయమంత్రి]

XVII


మిత్రులు

కోటపున్నయ్య

గారికి

Blank Page

అన్నమో రామచంద్రా !



అంజమ్మ పుట్టిన మూడేళ్ళకు మనకు స్వరాజ్యం వచ్చింది. స్వరాజ్యం రావడానికీ అంజమ్మ పుట్టడానికీ కొంత సంబంధం ఉంది. అంజమ్మ తండ్రిపేరు నరసారెడ్డిగారు. ఆ కాలంలో ఆయన పేరుమోసిన దేశభక్తుడు కాదు. అసలాయన ఉన్న వాతావరణంలో, ఖాదీ గట్టడమే గొప్ప. ఖాదీని కట్టుకోమని, తనచుట్టూవున్నవారిని బలవంతం చేయడం యింకా గొప్ప. పోలీసుల్ని కాదని, సభల్లో పాల్గొనడం, అప్పుడప్పుడు ఉపన్యాసాలివ్వడం మరీ గొప్ప. ఈ 'గొప్ప'లన్నీ మన దృష్టిలో సర్కారువారి దృష్టిలో ఇవన్నీ నేరాలేగదా. నేరం చేసినప్పుడు శిక్ష అనుభవించవలసిందేగదా. నరసారెడ్డిగారు కూడా శిక్ష అనుభవించారు.

నరసారెడ్డిగారికీ, రావుబహద్దూర్ వెంకట్రామా రెడ్డిగారికీ చాలా దూరంగా బంధుత్వం వుంది. నరసారెడ్డిగారి చుట్టాలు వెంకట్రామారెడ్డి గారిని కలుసుకొని మంతనాలు జరిపారు. బంధుత్వాన్ని కాదనలేక తన బాధల్ని కాదనలేక పింగళి వెంకట్రామ రెడ్డిగారు. ఆయన ఏం చేశాడో మనకయితే తెలీదుగానీ, నరసారెడ్డిగార్ని మాత్రం నిజాం పోలీసులు ఒదిలిపెట్టారు.

1941వ సంవత్సరంలో హైదరాబాదు సంస్థాన రాజకీయాలు, పరమ గందరగోళంగా వున్నాయి. బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, ముందుముల నరసింగరావు, రంగారెడ్డి రావినారాయణ రెడ్డి, ముగ్దుం మొహిద్దీన్‌వంటి దేశభక్తులు ప్రభుత్వంతో ప్రత్యక్షంగానూ అలా సాధ్యం కానప్పుడు పరోక్షంగానూ పోరాటాలు జరుపుతున్నారు. గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభలు చేపట్టిన రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సరిగ్గా ఆ సమయంలో పుట్టింది అంజమ్మ.

నరసారెడ్డిగారు ఇప్పటిదాకా ఉంటే తప్పకుండా మంత్రి అయి వుండేవాడో కాకోగాని రెండుచేతులా సంపాదించుకొనే అవకాశాలు మాత్రం ఆయనవుండేవి. ఉన్నా ఆయనదగ్గర అలా సంపాదించుకొనే లక్షణాలు లేవంటారు ఆయన్నెరిగినవాళ్లు. ఆయన ఆ రోజుల్లోనే చాలా ఆస్తిని తగలేసుకొన్నాడు. ఆయనతోపాటు పోరాటంలో పనిచేసినవాళ్లు మంచి మంచి పదవుల్లో వుండీ 'కానుకలు' అందుకొనీ, 'పార్టీఫండు' వసూలు చేసుకొనీ నిశ్చింతగా వున్నారు. ప్రభుత్వంలోకి వస్తూనే, తమకూ, తమవారికీ కావలసిన పనులన్నీ చేసుకొన్నారు. నరసారెడ్డిగారు బతికేవుంటే ఈ లతోడ్కారు పనులు చేసి వుండేవారనుకోవడం మహా దోషం.

సంస్థానంలో పోరాటం ఉధృతం అవుతున్నప్పుడు కాశీం రజ్వీ రంగంలో కొచ్చాడు. రజాకార్లు సంస్థానమంతటా ఇసుళ్ళలా పుట్టుకొచ్చారు. వారికీ, స్వాతంత్ర్య యోధులకూ, బాహా బాహీ యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధంలోనే నరసారెడ్డి చచ్చిపోయాడు. అప్పటికి అంజమ్మ వయసు నాలుగు సంవత్సరాలు.

పోయిందంతా పోగా మిగిలిన ఆ కాస్త భూమితోనే యల్లమ్మ సంసారాన్ని నెట్టుకు రావాల్సొచ్చింది. అంజమ్మకాక ఆమెకింకా ముగ్గురు పిల్లలున్నారు. నరసారెడ్డిగారిమీద గల రాజకీయ కక్షతో ప్రత్యర్థులు యల్లమ్మను నానా కష్టాలపాలూ చేశారు. ఆ రోజుల్లో సాగుభూములకు పట్టాలు, దస్తావేజులు, రిజిస్ట్రేషన్లూ ఉండేవి కావేమో, ఉన్నా ఆగొడవ లన్నీ యల్లమ్మగారికి తెలియవేమో, మొత్తంమీద తేలిందేమిటంటే– ఆమె సాగుకింద వున్నభూమిని అంతకుముందెప్పుడో నరసారెడ్డిగారు ఇంకెవరికో అమ్మేశారు. ఇది అన్యాయమని యల్లమ్మగారు గోలకెత్తారు. అంతేగానీ తనదే న్యాయమని రుజువు చేసుకోలేకపోయారు. ఫలితంగా యల్లమ్మ సంసారం కీడిని పడింది.

"ఆ తరువాత కథ చెప్పాలంటే ఏట్నాళ్ళూ పూట్నాళ్ళూ పడుతుంది నాయనా! ఎప్పుడన్నా తీరిగ్గా చెబుతాను. అయినా ఇదంతా ఎందుకడుగుతున్నట్టి బిడ్డా ?" అన్నది అంజమ్మ అనుమానంగా.

ఎందుకడుగుతున్నదీ వివరించాక కళ్ళనీళ్ళు పెట్టుకొంది. "ఇంతకాలంగా నా దగ్గరకొచ్చినవాళ్ళూ లేరు. ఈ సంగతులన్నీ అడిగినవాళ్ళూ లేరు." అంటూ ప్రారంభించింది మళ్ళా అంజమ్మ.

ఆమెకు పెళ్ళయింది. వెంకురెడ్డి మొజాంజాహీ మార్కెట్ దగ్గరున్న పళ్ళ కమీషన్ కొట్లల్లో పనిచేసేవాడు. లారీల్లో వచ్చిన సరుకును దింపడం, లెక్క సరిగ్గా వుండేట్లు చూసుకోవడం - ఇత్యాది పనులన్నీ వెంకురెడ్డి చేస్తూ వుండేవాడు. ఏడెనిమిదేళ్ళపాటు సంసారం బాగానే జరిగింది. ఒకసారి తాగివున్న లారీ డ్రైవరు బండిని అడ్డగోలుగా తిప్పడంతో వెంకురెడ్డి లారీకిందపడి నజ్జునజ్జయిపోయాడు. 'సర్కారు దవాఖాన'కు తీసుకుపోతున్న సమయంలోనే అతను శాశ్వతంగా కళ్ళు మూశాడు.

"అప్పటికే నాకు మగ్గురు కొడుకులున్నారయ్యా. భగవంతుడు నా తాడు తీసుకుపోయాడు. తోడబుట్టినవాళ్ళదీ అంతంతమాత్రమేనాయె. ఏం చెయ్యను బిడ్డా! సద్దామనుకొన్నా. కానీ పసిబిడ్డల్ని వొదిలి సావలేక పొయ్యా". అని ఏడుస్తున్నది అంజమ్మ.

ఎవరో దయామయులు చందాలేసుకొని ఈ బండి కొనిపెట్టారట. కొంతకాలం ఈ బండిమీద ఉల్లిపాయలు, చింతపండు, మిరపకాయలు, కూరగాయలు పెట్టి అమ్మిందట. దానివల్ల నికరాదాయమింటూ లేదుట. పైగా అప్పులు కూడా పెట్టాలిసొచ్చేదట. అప్పులడిగితే తక్కువ లెక్కలు చెప్పడం, ఎగవేయడం, తగాదాలాడడం—ఈ తలనొప్పి భరించ లేక ఆ పని మానేశానన్నది అంజమ్మ.

మళ్ళా ఇబ్బందులూ, కష్టాలూ అంజమ్మను ముసురుకొన్నాయి. చిన్నబిడ్డలు ఆకలికి తాళలేక, చిన్న చిన్న దొంగతనాలు చేసేవారుట. సరిగ్గా ఆ సమయంలోనే ఇదుగో ఇప్పుడు చేస్తున్న ఈ పని దొరికింది. ప్రారంభంలో అయిదారుగురికన్నా అన్నం తెప్పించుకొనేవారు కాదుట.

"ఇప్పుడు ఇరవైరెండు మంది దాకా దొరికారయ్యా. పెద్దపిల్ల లిద్దరూ ఇళ్ళకెళ్ళి సంచులూ, టిఫెనుగిన్నెలూ పట్టుకొస్తారు. దోపలోవున్న యిళ్ళనుంచి నేనే తీసుకొంటాను. సమయానికి అన్నం అందించకపోతే అయ్యలకు కోపం. ఇళ్ళదగ్గరేమో— 'ఇదిగోవస్తి— అదిగోవస్తి'నంటూ ఆలస్యం చేస్తారు. వానమ్మోది, వరదొచ్చేది, ఎంచలమ్మోది, నలి పీక్కు తినేది—నేనుమాత్రం మానుకోను నాయనా. ఎందుకన్నామంచిదని టూ పెద్దోడికొక్కడా నేర్పి వుంచా....చూరాన్నిబట్టి రేటు వుంటుంది బిడ్డా. 5 రూపాయల్నించి, 10 దాకా యిస్తారు. అయ్యలు తినిపోగా మిగిలిందాన్ని నేను మూటగట్టుకొని నా బిడ్డలకు పెట్టుకొంటాను నాయనా.

"అద్దెకొంప. మొప్పయ్ యిస్తున్నా. పిల్లలకు, చదువూలేదు, చట్టు బండలూ లేదు. ఇంకెప్పుడన్నా తీరిగ్గా రా బిడ్డా అన్నీ వివరంగాచెబుతా" అంటూ అన్నం బండిని తోసుకుపోయింది అంజమ్మ.

తప్పెట్లోయ్ తాళాలోయ్ !

'త్రాళం' అన్నమాటకు చాలా అర్థాలున్నాయి. ఇద్దరు మల్లయోధులు హోరా హోరీగా పోరాడుతున్నప్పుడు ఎదుటివారిని చిత్తుచేసేందుకు ఒక యోధుడు ఉపయోగించే బంధవిశేషం అని ఒక అర్థం పున్నిట్టి మహాభారతం చెబుతున్నది. తాడిచెట్టు అసీ, పాట పాడేటప్పుడు లయ కోసం చేతితో చేసే చప్పుడు అనీ, కాల పరిమాణం తెలియచేసే విధాన మనీ, 'బీగం' అనీ ఇల్లాగా చాలా వున్నాయి.

అసలీ బీగాలు ఎప్పుడు వెలిశాయో ఖచ్చితంగా చెప్పగల ఆధారాలేమీ లేవు. అనాది మానవునకు ఏ పూట తిండి ఆ పూటకే కాక, మరో పూటకూడా సంపాదించటం నేర్చుకొన్నప్పటి నుండీ ఈ తాళం అంటే బీగం వాడుకలోకి వచ్చి ఉండాలి. తన సంపాదనను మరొకరు కాజేయ కుండా దాచుకోవడానికి అతను అనుసరించిన విధానాలన్నీ తాళం తయారు కావడానికి తోడ్పడ్డాయి. తన ఆర్జనను కొంద నెరియల్లోనో, గుహల్లోనో దాచిపెట్టి అది మరొకరికి కనపడకుండా ఏ రాతిపలకనో అడ్డంపెట్టి వుంటాడు అనుకొంటే అదే మొదటి తాళమని మనం చెప్పుకుందాం.

వ్యక్తిగత ఆస్తులు పెరిగినకొద్దీ అవి మరొకరు దోచుకుపోకుండా దాచుకోవలసిన అవసరాలు కూడా పెరుగుతూనే వున్నాయి. ఇలా పెరుగు తున్న అవసరాలే రకరకాల తాళాలు వెలియడానికి కారణాలవుతున్నాయి.

నిజమే కాని ఇవన్నీ తాళాలు బాగుచేసే జహంగీరుకు తెలియవు. అతనికి తెలిసిందల్లా ఎలాంటి తాళాన్నయినా సులువుగా అర్థం చేసుకో వడం. దానికొచ్చిన జబ్బేమిటో క్షణాలమీద అంచనా వేయగలగడం.

జహంగీర్ తాతగానీ, తండ్రిగానీ, ప్రారంభంనుండి ఈ వృత్తిలో లేరు. ఆతని తాత మునీమ్‌లో ప్రార్థనలు చేసేవాడుట. అప్పటి జాగీర్దారు వారి తాతగారికి పాతికెకరాల మాన్యం, రెల్ల గుర్రం కానుకగా యిచ్చారు. అతని తండ్రి హయాంలో కూడా మాన్యం వుండేది. తాతలూ తండ్రులూ ఖాగాలు పంచుకునేటప్పటికి ఎకరానికన్నా తక్కువగా వచ్చింది.

జహంగీర్ తండ్రి వయసులో వున్నప్పుడు నవాబులాగా బతికా డుట కాని ముసలితనంలో గంపెడు సంసారాన్ని ఈదడానికి చాలా కష్టాలు పడ్డాడు.

కొంతకాలం వ్యవసాయం పనులు చేశాడు. ఏపెల్లకాలమూ, ఆ పనులైనా వుండవుగదా. వర్షాకాలంలో కటికపస్తువులు చేసేవారు ఇది పని కాదనుకుని పట్నం చేరుకున్నారు. ఆ తరువాత ఒక కమ్మరిదగ్గర నమ్మెట వేయడానికి కుదిరాడు. పనికొత్త చాతకాదు చెమటలు కక్కుతూ మణుగు బరువుండే నమ్మెట తీసుకొని దాకలిమీద కాలిన ఇనుప ముక్క


ుద దెబ్బలు వేస్తుంటే అణుసు ముక్కలు లేచి, పాదాన్నీ చర్రుమని కాలుతుండేవిట. పొద్దుకూకుబూ పనిచేస్తే రూపాయికూడా గిట్టేది కాదు. వాంతోనే తెల్లజొన్నలు కొనుక్కుని రొట్టెలు చేసుకు తినేవారు.

జహంగీరును చదివించాలని వాళ్ళనాన్న తపనపడ్డారు కానీ కుదిరిందికాదు. అందుకని తను పనిచేసేచోటనే తిత్తులు వూదడానికి కొడుకును పెట్టాడు.

ఆ పని నాకుకొత్త. మరీ చిన్నవాణ్ణి. గూడలు పులిసిపోయేవి సార్, రోజుకు పావలా యిచ్చేవాళ్లు. ఒకసారి ఆలస్యంగా పనిలోకొచ్చా. సేటుకు కోపంవచ్చి సదుకోల్ కడ్డీతో కాలిమీద కొల్చాడు అన్నాడు జహంగీర్ పిక్కమీద వాతను చూపిస్తూ.

ఆ తరువాతనే జహంగీర్ తన పెనతల్లి దగ్గరకు పారిపోయాడు. ఆవిడ భర్త తాళాలు బాగుచేస్తూ వుంటే తనూ నేర్చుకున్నాడు. రకరకాల తాళాలను తన చిన్నాన్న బాగుచేస్తూ వుంటే జహంగీర్ అబ్బురంగా చూసేవాడు. తరవాత తనూ చిన్న చిన్న మరమ్మత్తులు ప్రారంభించాడు. ఇప్పుడా వృత్తిలో ఆరితేరాడు.

జహంగీర్ దగ్గర కొన్ని వందల తాళపు చేతులున్నాయి. వాటి వన్నింటినీ తీగకు తగిలించి కాసులపేరులాగా గోడకు వేళ్ళాడేశాడు. తాళాన్ని చూస్తూనే అదెక్కడ చెడిపోయిందో అతను కనుక్కోగలడట.



"రోగిని చూడగానే అతనికి ఏ జబ్బున్నదో డాక్టరుకు తెలియదా? అలాగే నాకూ తెలుస్తుంది" అన్నాడు జహంగీర్. తన జీవితకాలంలో కొన్నివేల తాళాలు బాగుచేయగలిగానన్నాడు జహంగీర్. "ఇప్పుడు మరీ చిత్రమైన తాళాలు వస్తున్నాయండీ. ఆ తాళాలకు రెండు తాళపు చెవులుంటాయి. ఒకటి పోయిందనుకోండి మరింక అది పనికిరాదు దాన్ని బాగుచేస్తే ఎక్కువఛార్జీ తీసుకొంటాను" అన్నాడు జహంగీర్ నవ్వుతూ.

నిజానికందులో బాగు చేయవలసింది కూడా ఏమీ వుండదనీ, ఇంకో తాళంచెవి తయారు చేయడమేనని అన్నాడు. కానీ ఖాతాదారులతో

అతనలా చెప్పడు. ఏవేవో బెట్లు చెడిపోయాయనీ, అవన్నీ సరిదిద్ది కొత్త చెవిని తయారుచేయాలనీ తాను చెబుతాట్ట. రెండురోజుల వ్యవధి కావాలంటాట్ట. కాని అంత టైం అనవసరమనీ, గంటలోపుగానే ఇంకోచెవిని తయారు చేయవచ్చుననీ అన్నాడు.

"మరీ తొందరగా చేస్తే బాగా చేశానని వాళ్ళనుకోరు. ఈ కాస్త దానికే ఇంతరేటా అంటారు. అందుకని కాస్త నాటకమాడి" అని నవ్వాడు జహంగీర్.

అతనియిట్లూ బోలెడన్ని తాళాలు తిరేరుకు ఎదురుచూస్తూ పడి వున్నాయి. కొన్నింటి కెలసనాయల్లో నానవేశాడు. అలని ఛార్జీలు పనిని బట్టీ, తాళాన్నిబట్టీ, వచ్చిన ఖాతాదారుని బట్టీ మారుతుంటాయి.

పెక్టిల్‌తాళం లగాయతు బాంకులి తాళాలదాకా అటిను బాగు చేస్తాడు. ఒకసారి వొక బాంకుతాళం చెడిపోయిందట. బాగుచేసి యాభయి రూపాయలు వసూలు చేశాడట. "ఆదాయం సంగతి చెప్పకేం సార్, ఒక్కోరోజు మూడునాలుగ్గూడా రాపు. ఇంకోరోజున పదిహేను ఇరవై దాకా కళ్ళచూస్తాను" అంటాడు జహంగీర్.

ఇంతచేసినా పొట్టకూ, బట్టకూ, అస్తా బిస్తాగా సరిపోతుందే తప్ప తాను చెనకేసుకున్నదేమీ లేదంటాడు. ఈ పనిలోకూడా పోటీపెరిగిందని, అందువల్ల గతిలేక ఏదోకాడికి పనిచేయక తప్పదని అతనన్నాడు.

జహంగీర్ ఇల్లు చాలా చిన్నది. ఓ కలిగినవారి గోడకు ఆనబెట్టి చిన్న రేకులపాక వేసుకొన్నాడు. అన్నీ చిన్న సీనారేకులు. అవి గాలికి లేచిపోకుండా బరువుకోసం రాళ్ళను మోపుచేశాడు. ఇంటిముందుగా మురుక్కాలవ. రేకులతడికెను వాకిలిఅడ్డంగా వేసి దాన్ని తాడుతో ముడి వేశాడు. చిన్నపిల్లలూ భార్యా వూరికి వెళ్ళారట. ఇంట్లోకూడా తాళం చేతుల గుత్తులూ, తాళాలు వేళ్ళాడుతున్నాయి.

కలవారి సంపదకు కాపలాకాసే వేలాది తాళాలను బాగుచేయగల జహంగీర్ పాక తలుపుకు ఓ చిన్న తాళం కప్పకూడా లేకపోవడం ఆశ్చర్యం కదూ?

"మా కొంప కెందుకండీ బాబూ తాళాలు? ఎత్తుకు పోవడానికేముంది గనక – నా దరిద్రంతప్ప?" అని బాధగా నవ్వాడు జహంగీర్ పెరిగిన గడ్డాన్ని బియ్యపువేళ్ళతో సవరించుకొంటూ.

అవును. జహంగీరును దోచుకోవడానికి అతని దగ్గర దరిద్రంతప్ప ఏమిలేదు కదా!

మరుగు పడిన మానవత్వం

ఊహకు వాస్తవానికి మధ్య, భావనకూ వాస్తవానికి మధ్య కొండ తేడాలుండడం వేరు, అపారమైన భేదాలుండడం వేరు. మొదటి స్థితిని భరిస్తాం, రెండవస్థితినీ భరిస్తాం, కానీ ఈ రెండవ స్థితి అమానుషంగా వుంటుంది. అలా వుంటుందని అనడానికి 'సాయిత్రి' జీవిత మొక్క ముక్క.

"ఇప్పుడంటే ఇలా అయిపోయింది గానీ చిన్నప్పుడు సావిత్రి బొద్దుగా, గుమ్మడి పాదులా, ముచ్చటగా వుండేది. దానికి తోడు మనుమకు ముందు పుట్టిన ఆడపిల్ల గనక అచ్చటా ముచ్చటా అన్నీ తీర్చారు అమ్మా నాన్నా.

'ఇప్పుడిట్లా మాడిపోయాను గానండీ చిన్నప్పుడు బొద బొద లాడుతూ, నీడలా తేలుతూ వుండేదాన్నటండి. బాగా పాడిపంటా ఉన్న కుటుంబం'' అన్నది సావిత్రమ్మ.



అలాంటి కుటుంబం బాగా చిదికి పోయింది. సావిత్రికి కాస్త ఊహతెలిసే నాటికి అమ్మా నాన్నా కూలిపనికి బయలుదేరుతున్నారు వాళ్ళతో బాటు తనూ కూలిపని చేసింది. కలుపు తీయడం మిరపనాట్లు, ఎరువు చల్లడం, పనస్కాయకోత, కందికోత లాంటి పనులన్నీ చేసింది.

"మొదట్నుంచి నా బతుకు కష్టాల బతుకే అయిందండీ. చిన్నప్పుడెప్పుడన్నా సుఖపడ్డానేమో నాకు గుర్తులేదు. సుఖమన్నది ఇంతవరకూ లేదు.'' అన్నది సావిత్రమ్మ చీరిన మిరపకాయల్లోకి మళ్ళీ కూరుతూ.

ఆ పనుల రోజుల్లోనే తనకు చూరంగా మేనమామ వరస అయ్యే చుట్టంనొకడు బస్తీనుంచి వచ్చాడు వచ్చి తటింబ్లోనే దిగాడు తన పెళ్ళి విషయం. ఎమ్మె ప్రస్తావించింది ఆ మామయ్య అంతా పని అన్నట్లు మాట్లాడాడు. వారం రోజులకల్లా మామయ్య, ఇంకో పాతికేళ్ళ కుర్రాణ్ణి వెంటబెట్టు కొచ్చాడు. అతగాడు గుంటూరు జూట్‌మిల్లులో నాలుగు డబ్బులు సంపాయిస్తున్నాడు. సావిత్రికి అతనికి పెళ్ళయిపోయింది.

"ఆ తరవాతగానీ, ఆ మాయ నాకు తెలియలేదయ్యా:" అన్నది సావిత్రమ్మ, ఆ జ్ఞాపకాలను తలుచుకొని వణికిపోతూ.

సావిత్రిని పెళ్ళి చేసుకొన్న ఆ దౌర్భాగ్యుడు ఆమెను గుంటూరు తీసుకెళ్ళాడు. రెండు రోజుల తరువాత రాజమండ్రికి తీసుకెళ్ళాడు రాజమండ్రిలోనే ఆమెను వోకంపెనీకి ఆమ్మకొన్నాడు. అలా అమ్మి కొండాడన్న అనుమానం ఏపాటి కలిగినా సావిత్రమ్మ బాజ్జో వేచ్చుండేది. రాజమండ్రి నుండి అమలాపురం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, తెనాలి, విజయవాడ. ఇలా తను ఊరూరా తిరిగింది. తిరిగిందనడం తప్పు, తనను ఊరూరా తిప్పారు. యీ అయిదారు సంవత్సరాల్లో తను సర్వ నాశనమయి పోయింది. తనకు తనది అని చెప్పుకోడానికేమి మిగల్లేదు.

విజయవాడలో ఉన్నప్పుడు తనకు పారిపోయే అవకాశం కలిగింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నది సావిత్రమ్మ. ఆమెనెవరో తీసుకెళ్లారు. తెల్లవారుజామున ఆమెను రిక్షా ఎక్కించి రెండు రూపాయలు చేతికిచ్చి పంపించాడాయన. రిక్షా రైల్వేబ్రిడ్జి క్రిందగా వస్తున్నప్పుడు సావిత్రమ్మకో ఆలోచన వచ్చింది. రిక్షాను స్టేషనువైపు పట్టించింది. కదలడానికి సిద్ధంగా వున్న రైల్లోకొచ్చి పడ్డది.

"ఆక్కడా చాలా కష్టాలు పడ్డాను బాబుగారూ. ముందుగా రౌడీ నాకొడుకులు వెంటపడ్డారు. భగవంతుని దయవల్లతప్పుకొన్నా. ముందుగా, గంటలమ్మ చెట్టుదగ్గరున్న గుడిసెల్లో వుండేదాన్ని. ఏడాదిక్రిందటే ఈ సినిమాహాలు పక్కకొచ్చాను" అన్నది సావిత్రమ్మ.

అవిడ ఈ మాటరాగానే ఆదరించినవాడు వెంకటేశం. అతను మేలంపాటి పాడే కంపెనీలో పనిచేస్తున్నాడు.

"ఆ మహారాజే నాకింత నీడచూపించాడయ్యా" అన్నది సావిత్రమ్మ. అక్కడెక్కడోవున్న వెంకటేశానికి చెయ్యెత్తి దణ్ణం పెడుతూ.

అతనికి బతుకుగా తయారవకూడదన్న ఉద్దేశ్యంతోనే సావిత్రమ్మ ఈ వ్యాపారం ప్రారంభించింది. సావిత్రమ్మకి వంటకాలేమి మొదట్లో చాత కావుట. ఒకటా, రెండా చెప్తాక ఇప్పుడు ఆరితేరా నంటున్నదామె.

"మిర్చి, బజ్జీ, ఆలుబజ్జీ, మిసాలావడ, చక్కిరాలు, జంతికలు, అప్పడాలు, ఆలుబోండా, బూంది అన్నీ చేస్తాను. సాయంకాలం 5 గంటల నుంచీ, రాత్రి పదకొండు గంటలదాకా జేరం ఉంటుంది" అన్నది సావిత్రమ్మ.

తను సెనగపిండి వాడిస్తున్నది. ధర తక్కువ గనక బఠాణీపిండిని వాడుతానన్నది. అందులో జొన్నపిండి కూడా కలుపుతాననీ, రంగుకోసం మిఠాయిల్లో వాడే రంగుల్ని కలుపుతానన్నది.

''మసాలా వడకు సెనగపప్పే వాడాలండీ. లేకపోతే వడకు రుచి రాదు'' అన్నదామె. బజ్జీ మిరపకాయలు, ఉల్లిపాయలు తను రోజూ మార్కెట్‌కెళ్ళి కొన్నుకొస్తుంది. మిరపకాయబజ్జీల్లో రెండు రకాలు తయారు చేస్తుంది. ఒకరకం పావలాకు రెండు. ఇంకో రకం 20పైసలకు రెండు. రోజూ వ్యవసాయంగా వచ్చే ఖాతాదారులకయితే, పెద్ద సైజు బజ్జీలను 20 పైసలకు రెండు చొప్పున ఇస్తుంది. రోజుకు 40, 50 రూపాయల దాకా అమ్ముతుంది. అన్ని ఖర్చులూ పోను 10, 12 రూపాయల దాకా మిగులుతాయి.

కట్టీనూనె వాడనసే అలా వాడటం ఎల్లా, ఖాతాదారులు రారన్నీ, సావిత్రమ్మ చెప్పింది. సెగ తగలగానే పొగలు రేగే నూనెలు వాడటం వల్ల నూనె బానలిలో మరిగి ఆవిరయి పోతుందనీ, అది నష్టమనీ, సావిత్రమ్మ అన్నది.

''ఎండాకాలంలో గిరాకీ తక్కువగా వుంటుంది. వానకాలం, చలికాలం బేరాలు బాగ వుంటాయి''.

వెంకటేశానికి భార్య చచ్చిపోయి చాలాకాలమయింది ముగ్గురు పిల్లలు ఉన్నారు.

''ఆ ముగ్గురూ నా పిల్లలే అనుకుంటున్నా, వాళ్ళకోసమే ఇదంతా. నాతల ఎట్లాగూ నాశనమయింది బాబూ ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో తెలియదు. వచ్చే జన్మలోనయినా సుఖపడితే అంతేచాలు'' అన్నది సావిత్రమ్మ. దోరగా వేగిన మిరపకాయబజ్జీలను, బానలిలోంచి పైకితీస్తూ,,

రెక్కాడినా డొక్కాడదు !

వేలాది సంవత్సరాల కిందట, రాతి కొడవళ్ళనూ, గొడ్డళ్ళనూ, కత్తులనూ, మనిషి వాడిన మాట నిజమే : అంతకు ముందు దశకన్నా, రాతి పనిముట్లను వాడే దశ. చాలా మెరుగయిందనడంలో సందేహం కూడా లేదు. అయితే, రాతి పనిముట్లతోనే మానవుడు సంతృప్తి పడ లేదు. అంతకన్నా మేలయిన వాటికోసం, అతను అన్వేషణలు సాగించాడు. ఈ కృషి ఫలితంగా, లోహాలతో అతనికి నేస్తం ఏర్పడింది. ఈ స్నేహం అతని బతుకును అద్భుతంగా మార్చింది. ఇప్పటికీ మారుస్తున్నది. ఎక్కువ బొగ్గునూ లోహాలనూ ఉపయోగించుకొంటున్న దేశాలు పారిశ్రామికంగా ముందడుగు వేస్తున్నాయి; ఆ పని చేయలేని దేశాలు ఎదుగు దశను దాటి ముందుకెళ్ళ లేకపోతున్నాయి.

తొలిసారిగా లోహాలతో పరిచయం ఏర్పడినప్పుడు, ఆనాటి మానవుడు, వాటిని సవ్యంగానే ఉపయోగించుకొన్నాడు. అంతవరకూ తను వాడుతున్న రాతిగొడ్డళ్ళను, కొడవళ్ళను, కత్తులను, పక్కగా ఉంచి— లోహంతో — ఇనపలోహంతో — వాటిని చేయడం ప్రారంభించాడు. ఈ లోహపు పనిముట్లు, రాతివాటికన్నా, అన్ని విషయాల్లోనూ మేలైనవని రుజువయింది. గట్టి దెబ్బ తగిలితే, రాతిగొడ్డలి ముక్కలు కావచ్చు. కాని ఇనప గొడ్డలి కక్కుపోతుంది, లేదా వొంగిపోతుంది, అంతేగాని ముక్కలయిపోదు. ఈ సదుపాయం, ఆనాటి మానవునికి ఎంతో శ్రమను తగ్గించి, అతనికి కాలాన్ని పొదుపుచేసి పెట్టింది. ఆ రోజుల్లో ఈ పనిముట్లను ఏ విధంగా తయారు చేసేవారో, యిప్పుడూ దాదాపుగా అదే పంథాలోనే తయారు చేస్తున్నారని, శ్రీరాములును చూస్తే తెలుస్తుంది. ఎన్నో విషయాల్లో, ఎన్నెన్నో మార్పులు కొట్టవచ్చినట్లుగా కనపడుతున్నాయి. వీటిలో కొన్నింటిని మనమెన్నడూ ఊహించి ఉండం : ఇది నిజమేగాని — ఈ మార్పులు అన్ని రంగాలకూ విస్తరించలేదనడానికి శ్రీరాములే ఒక ఉదాహరణ !

అసలాయనిది ఈ ఊరేకాదు. వారి పూర్వీకులు, భీమవరం ప్రాంతంలో ఉండేవారట. అక్కడ పొట్ట జరక్క కంచం, మంచం, నెత్తినేసుకొని, బెజవాడదాకా వచ్చారు. ఇక్కడ కూడా ఇమడ లేక, ఉయ్యూరు దాపుల్లో స్థిరపడిపోయారు. స్థిరపడిపోయారంటే, ఆర్థికంగా కాదు; మరింత అక్కణ్ణించి కదిలినా, ఎదురుకోడం కష్టం గనక అక్కడే ఉండిపోయారు.

కమ్మరం, శ్రీరాములుకు అసలే కొత్తకాదు. ఆయన తాతగారూ, తండ్రిగారూ, అదేపని చేశారు. ఆయన తమ్ముళ్ళందరూ, ఇప్పటికీ ఆ పనే

చేస్తున్నారు. శ్రీరాములు తన పన్నెండో ఏటనుండి కొలిమి దగ్గర కూచుంటున్నాడంటే, ఆయనకు కొలిమితోనూ దాగలితోనూ అక్కడి పనితోనూ, పావుశతాబ్ది అనుభవం ఉన్నదన్నమాట. ఇంత కాలంలోనూ, ఆయన గడించిన అనుభవం అపారం. కానీ. తను పనిచేసే పద్ధతిలో ఘోర్పేమీ లేదంటారాయనగారు.

"నా పనిలో రెండు రకాలున్నాయండీ! నా అంతట నేనేకొడవళ్లు గొడ్డళ్ళు, గీత కత్తులు, ఎరుకల కత్తులు, చెప్పుల కత్తులు, చెరుకు కత్తులు తయారుచేసి అమ్ముతూ ఉంటాను. ఇంకోరకం ఏమిటంటే వీటిని సరిచి, సానాడించి, పదును పెట్టడం. ఈ రెండు రకాల పనుయా నాదగ్గర కొస్తాయండి!" అన్నాడు శ్రీరాములు.

వీటిని తయారు చేయడానిక్కావలసిన ఉక్కు ముక్కల్ని, గుంటూరు నుంచి విజయవాడ నుంచి తెచ్చుకుంటూ ఉంటాడు. ఏకలిగి నయ్యా దగ్గరో నోటురాసి డబ్బు తెచ్చుకొని, ఉక్కు పలకల్నీ ముక్కల్నీ కొంటాడు. వాటిని పనిముట్ల కింద మార్చి, అమ్మకొంటూ ఉంటూడు.

చెరుకు కత్తుని సరిచి. సానాడించి పదును పెడితే 6, 7 రూపాయలిస్తారు. అదే కొత్తది కావాలంటే, కత్తి సకింపును బట్టి 10, 12 రూపాయలకు తక్కువ కాకుండా అమ్ముతాడు. కొత్తకొడవలి 4.4న్నర, మకి ఎద్దడి రోజు లైతే 5 రూపాయలు. ఉక్కుముక్క అవతలి వారే తెచ్చుకొంటే 3 రూపాయలు కూలి. అదే చెప్పుల కత్తికి (చర్మకారులు



వాడేది) 6,7 రూపాయలు. కొత్తదయితే 10 రూపాయలూ తీసుకొంటాడు. తాటాకు నరకడానికి పనికొచ్చే గవళ్ళ కత్తికి కూడా ఇదే రేట్లు.

"ఒక్కోసారి సరచవలసిన అవసరం ఉండదండీ: కొడవలి ఎక్కడా కక్కుపోదు. కానీ చస్తే తెగదు. అలాంటప్పుడు సానపడితే సరిపోతుందండీ! సాన పట్టడానికయితే. కొడవలకి ముప్పావలా తీసుకొంటాను. చెరుకుత్తికి రూపాయి, గొడ్డలికీ రూపాయే ఇస్తారండీ: చెప్పుల కత్తి. గవళ కత్తి. ఎరికల కత్తి. గీత కత్తి. సానపడితే, రెండురూపాయలిస్తారు. కొత్త గొడ్డలి, అంతా నాదే ఐతే 6,7 రూపాయలకిస్తాను. ముక్క-

తెచ్చిచ్చారనుకోండి 3, 4 రూపాయల కూలి చూసుకొని తయారైన గొడ్డలి పడేస్తా'' అన్నాడు శ్రీరాములు.

పంచదార ఫ్యాక్టరీ, సంవత్సరంలో 5, 6 మాసాలు పని చేస్తుంది. ఆరోజుల్లో చెరుక్కర్తులకు గిరాకీ ఉంటుంది. నవంబరు, డిసెంబరు మాసాల్లో, కొదవళ్లకు వత్తిడి ఉంటుంది. ఈతభావతులన్నీ శ్రీరాములకు తెలుసు గనుకనే, అతను ఎప్పటికప్పుడు, జనానిక్కావలసిన వాటిని తయారుచేసి సిద్ధంగా ఉంచుతాడు.

''ఇవన్నీ వొక్కరెక్కమీద తయారు కావండీ : తిత్తులూదే మనిషికి రోజుకు ఆరు రూపాయలివ్వాలి. కొలిమి పనిచేసే వాడికి పది రూపాయలివ్వాలి. సమ్మెట వేసేవాళ్ళు, ముగ్గురన్నా ఉంటేతప్ప, పనులు కావండి; వారికైతే మనిషివొక్కింటికి రోజుకు ఏడు దాకా ఇవ్వాల్సించే నంది: కొలిమిలోకి కావల్సిన బైలుబొగ్గు కొట్టివ్వడానికి, ఇతర చిల్లర మల్లర పనులు చేయడానికి వొకడు కావాలి వాడికి 5, 6 ఇస్తానండి సాన లాగడానికి ఇద్దరు మనుషులకూ కలిపి రోజుకు 15, 16 దాకా ఇస్తుంటా నండి'' అన్నాడు శ్రీరాములు, తనపనివాళ్ళనందరినీ పరిచయం చేస్తూ.

వాళ్లా 'ఈనులో' మంటూ, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నారని పించింది.

''కొలిమి పేడికి నెత్తురంతా ఆవిరయిపోయింది. మలాటాతో, నరం, రెక్కలు, ముక్కలు చెక్కలయిపోయాయి. ఇన్నేళ్ళు వచ్చినా తిన్నదంతా అరుగుతుందిగానీ బాబూ, తృప్తిగా తినడానికే నాకేమీ ఉండదండి :'' అన్నాడు శ్రీరాములు.

అలా అంటునప్పుడు, అతని బక్కపేగులు గుర గుర మన్నట్లని పించింది.

ఖరీదు కట్టే షరాబు లేడు !

భారతీయ సంస్కృతి. ఏ ప్రాంతానికో ఏ కాలానికో మాత్రమే పరిమితమయి లేదు. అనంత కాలాల నుండి ఆసేతు హిమాచల పర్యంతం, అది విడిగి విప్పారుతూనే వున్నది. మన దేవాలయాల నిర్మాణంలో, అక్కడి శిల్పాల్లో, మన ఆభరణాల్లో, సాహిత్యంలో, సంగీతంలో, ఆచార వ్యవహారాల్లో, నిత్యజీవితంలో, తత్వ చింతనలో ఈ సంస్కృతి అంతర్వాహినిగా ప్రవహిస్తూనే వున్నది. భారతీయ శిల్పాల ఉక్కు పొగరులను తాకిన గండ శిలలు అనూహ్యమైన సౌందర్యాలను విరజిమ్ముతున్నాయి. 'మన ప్రతిభా ప్రాభవాలకు ఈ శిల్ప సంపద, ఒక చక్కని ప్రతీక' అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు.

ఈ ప్రతిభా ప్రాభవాలకు వారసుడే మన ఆగమయ్య. ఆగమయ్య చేతిలో నల్లరాళ్ళు నలువ రాణులుగా మారడం, బండరాళ్ళు అందాల బొమ్మలుగా రూపొత్తడం చాలా మామూలు. ఒక రాయిని చూస్తూనే దాని చహరాలన్నీ ఇట్టే గ్రహించగలడు ఆగమయ్య. ఆ రాయి ఏ శిల్పాని కన్నా పనికొస్తుందో రాదో కంటి కొనతో చూచి చెబుతాడు. ఒక్కో



రాయి పైకి బాగానే వుంటుందిగానీ లోపల దోషం వుంటుందిట. అలాంటి రాళ్ళు శిల్పాలు చెక్కడానికి అనలే పనికి రావంటాడు ఆగమయ్య.

అతని పూర్వీకులది కర్నూలు మండలం. అక్కడ కొంత భూవసతికూడా వుండేది. కానీ ఆ పొలం తొండలు గుడ్లు పెట్టడానికి తప్ప మరెందుకూ పనికిరాదుట.

"బనగానిపల్లె నవాబుకు మా నాన్న రాతితో మంచం చేసియిచ్చాడు. అంతా మామూలుగా మంచంగానే వుంటుందండీ. నాలుగు కోళ్ళు, రెండు నిలువుపట్టెలు, రెండు అడ్డపట్టెలు పైకి కనపడేలాగా కూసాలు– అంతా మామూలువేనంటీ. కొయ్య కోళ్ళనుకూడా ఆ విధంగా తరణిపట్టాలంటే ఇప్పుడు కుదరదు. నులక తప్ప అంతా రాతితో చేసిందే. మళ్ళా ఇదంతా ఒక్క రాయితోనే చేయాలండీ" అన్నాడు ఆగమయ్య. పాత జ్ఞాపకాలను కళ్ళముందుకు తెచ్చుకుంటూ.

అసలు అలా మంచాన్ని చేయడానికి పూనుకోవడమే ఆశ్చర్యం. ముందుగా అందుకు పనికొచ్చే రాతిని ఎన్నుకోవాలి. అదో గొప్ప యజ్ఞం చేసినంత పని. ఆ తరువాత దాన్ని పట్టెలుగా మంచం కోళ్ళుగా మలచాలి. ఆ మలచడంలో కాస్త పొరపాటు జరిగి ఇంత కద్దుపెచ్చిక రాలి పడినా అంతదాకా పడినశ్రమ యావత్తూ, మూడిద పాలయిపోతుంది. ఒక సందర్భంలో అలా జరిగిందట కూడా.

"అమ్మవారి విగ్రహం చేస్తున్నాను. నాలుగడుగులకు పైగా వుంటుంది ఎత్తు. అంతా శాస్త్రప్రకారం, సంప్రదాయ ప్రకారంగా వుండాలి గదా! కాలివేళ్ళ మట్టెలు చెక్కుతున్నాను. ఏ దోషం తగిలిందో, ఏ దిష్టి తగిలిందో, తెలియదు. సగావికిసగం పాదం విరిగి ముందుపడింది. నా ఆవజీవాలు కుంగిపోయాయి. సాటివాళ్ళముందు తల నేలపడినంత పన యింది. రెండురోజులు గంగ ముట్టలేదంటే నమ్మండి. మా పెద్దన్నయ్య సముదాయించాడు. ఇది పనికాదనుకుని ఈసారి దేవాలయం ముందే కూర్చున్నాను. చుట్టూ గోనెపట్టాలు కట్టించుకొన్నా. ఎవర్నీ లోపలకు రానివ్వలా. నేలమీద ఆకోర్కిజులకల్లా 'అమ్మవిగ్రహం' తయారయింది. అన్నిరోజులూ పొంటిపూట భోజనంతప్ప సాయంకాలాలు ఫలహారం కూడా ఎరుగనండీ" అన్నాడు ఆగమయ్య.

ఇదెప్పుడో జరిగిన సంగతి. ఒక విశ్వాసంతో, నమ్మకంతో, దీక్షతో, తినడానికి వుండికూడా ఒక్కపూటనే భోజనం చేశాడు ఆగమయ్య. అప్పుడు అతని నమ్మకాలతో, విశ్వాసాలతో మనకు పనిలేదు. ఇప్పుడు మాత్రం తరచుగా పొక్కపూటే నాలుగు మెతుకులు నంజుతున్నాడు ఆగమయ్య. ఇందుక్కారణం దీక్ష, విశ్వాసంకాదు. అక్షరాలా దరిద్రం కారణం.

శాస్త్రాలనూ, సంప్రదాయాలను గురించి, ఇంతగా మాట్లాడే ఆగమయ్య ఏమీ చదువుకోలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. ఈ శాస్త్ర రహస్యాలన్నీ వంశపారంపర్యంగా వారికి వస్తున్నాయట. ఈ వివరాలన్నీ తనతోనే మరించిపోతుందనుకు అతను చాలా బాధపడ్డాడు.

''లాభంలేదండీ. ఈ వృత్తిని నమ్ముకుంటే పొట్టగడవదు. జనంలో దేవుడిమీద నమ్మకం తగ్గిపోతున్నది. ఉన్న గుళ్ళూ గోపురాలే మూగుడేసి పోతుంటే, కొత్తవి కట్టించేదెవరు చెప్పండి? అలా కట్టించే పుణ్యాత్ములు ఉన్నప్పుడుగదా నాలాంటివాళ్ళ అవసరం'' అన్నాడు ఆగమయ్య బాధతో నిండిన ముఖాన్ని చురుగ్గా రెచ్చిపోతున్న అరచేతులతో రుద్దుకుంటూ.

శిల్పాలు చెక్కించేవారు లేక, అటుపా ఎడపా, ఎక్కడో మూటకి, కోటికొకరున్నా, వారిచ్చేది గిట్టుబాటు కాక ఆగమయ్య, ఆ వృత్తిని దాదాపుగా మానేశాడు. శతాబ్దాల తరబడిగా శిలలతో కలసిమెలసి కల గలిసిపోయిన అతని విద్య, తరాల నుండీ రమణీలలామలను ఆవిష్కరిం చిన అతని ప్రతిభ ఈనాడు పిడికెడు మెతుకుల్ని అతనికి అందించలేక పోతున్నది. అందుకే అతనిప్పుడు, రాళ్ళూ, సుందిలతో 'కక్కు' కొడు తున్నాడు. పొత్రాలు తయారు చేస్తున్నాడు. నగ్నెకళ్ళు తయారు చేస్తున్నాడు.

''ఇదీ లాభంలేదు బాబుగారూ! ఒక లోలు కొంటే రెండుతరాలు గడుస్తుంది. ఒక పొత్రంతో పది కుటుంబాలు గడుపుకొంటాయి. ఇందు లోనూ బోలెడంత పోటీ. ఇప్పుడు వీటిని అందరూ తయారు చేస్తున్నారు. కారు చవగ్గా అమ్ముతున్నారు. ఒక్కోసారి తూలిగూడా గిట్టదండీ' అన్నాడు ఆగమయ్య బొంగురుపోయిన గొంతుతో.

అది నిజమేగాని, అంతమాత్రాన కుటుంబపు ఖర్చులేమి తగ్గవు గదా. బతికున్నంత కాలమూ, ఈ జాడెడు పొట్టకూ గంజో గుటకో, ఇంత పొయ్యాల్సించేగదా. ఎందుకోసం అతను రాళ్లుకొట్టే పనిమొదలు తయారయ్యాడు. ఏ అయ్యినో కాళ్ళూ కడుపూ పట్టుకొని నాలుగొందలు తెచ్చుకున్నాడు. ఆ నాలుగొందలూ, నాలుగుముఖాలకు అడ్వాన్సుగా యిచ్చి; కంకర కొట్టించాడు. తయారయిన కంకరను రోడ్లు కంట్రాక్టరుకు అమ్ము దామని, కూలీలకివ్వాల్సింది ముద్దర ముద్దిగా యిచ్చేసి మిగిలిందానితో ముడుచుకుందామని అనుకొన్నాడు. రెండు విడతలదాకా బాగానే జరిగిం దట. పెద్దగా మిగిలి చచ్చిందేమీ లేకపోయినా కటిక పస్తులు మాత్రం చేయవలసిన పెడద తప్పిపోయిందను కొన్నాడు.

''అంతా నాశనమయి పోయిందండీ. అడ్వాన్సు తీసుకొన్నవాళ్ళు బాకీ తీర్చకుండానే ముకాం ఎత్తేశారు. ఎక్కడికెళ్ళారోకూడా తెలియదు. నేను పెతకనుకూడా లేదు. పెతికితే కనిపించారే అనుకోండి. ఏం లాభం చెప్పండి? వాళ్ళదగ్గరైనా ఏముంటుంది గనక వసూలు చేయడానికి'' అన్నాడు ఆగమయ్య. మొక్కబోయిన దుత్తకేసి చూస్తూ.

అది కూడా ఆగమయ్య బతుకులాగే బండబారిపోయి వుంది. ఆగమయ్యకు ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయిని మేనల్లుడికే యిచ్చి పెళ్ళి చేశాడు. అతనికి కడపలో ఓ చిన్న సైకిల్ షాపు వున్నదట. ''నాకోసం ఎదురు చూడకుండా, వాళ్ళ గంజి వాళ్ళు తాగుతున్నారు'' అన్నాడు ఆగమయ్య. బహుశా అదొక్కటేనేమో అతనికి కాస్త తృప్తినిచ్చింది.

తన ఉక్కుపులితో, శాంతో, పొగరుతో, పాత పొడుపు కత్తెతో రాలలో నిద్రించే కమనీయతను మేల్కొలిపి అందరిమిందా పుంచిన ఆగమయ్య

యుగయుగాల భారతీయ సంస్కృతికి ఆలవాలంగా నిలిచిన దేవతా విగ్రహాలను అలవోకగా మలిచే ఆగమయ్య శిలా స్తంభాలనుండి సంగీత ధ్వనులను ఉరుకులెత్తించగల ఆగమయ్య పిడికెడు మెతుకులకోసం, రోడ్డువారనున్న చింతచెట్టుక్రింద టూచాని, రాళ్ళను కంకరకింద కొడు తున్నాడిప్పుడు.

ప్రతివారూ తమశ్రమకు తగిన ప్రతిఫలం తమకు లభించడం లేదనడం నాకు తెలుసు. ఇలా అంటున్నవారు మిటమిటలాడే ఎండలో, చెమటలు కక్కుకొంటూ, బండరాళ్ళను బద్దలు కొట్టేవారి గురించి మాట్లా డరు. కనీసం ఆలోచించనన్నా ఆలోచించరు. నిజానికి ఇలాంటి పని చేస్తున్న వారి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తున్నదా అంటాడు మాక్సింగోర్కి మొక సందర్భంలో.

దీనికి మీరేం సమాధానం చెబుతారు?

చిత్రపాణి

పాల సముద్రంలో శేషుడిమీద పడుకొన్న శ్రీమన్మహావిష్ణువుల వారికి ఆ శేషుడుగారే, తన పడగలు విప్పి, గొడుగు పట్టిన బొమ్మను, మీరంతా చూసే వుంటారు. ఆ విష్ణువుగారే వామనావతారమెత్తి, బలి చక్రవర్తిని మూడడుగుల నేల దానమడిగినప్పుడు, ఓ చేత బుద్ధిచెంబు, మరోచేత ఆతపత్రమూ ధరించిన ఆవటువును చూచిన బలిచక్రవర్తిగారు- ఆ వచ్చినవాడు సాక్షాత్తూ, విష్ణుమూర్తి అవతారమేనని గ్రహించినవెంటి వాడియి, వెంటనే దాప్పుకొని, పాతాళలోకానికి వెళ్ళిపోయాడు.

ఇటు ప్రాచ్యదేశాలనూ, అటు పాశ్చాత్యదేశాలనూ పరిపాలించిన పూకనాటి చక్రవర్తులు, మహాప్రభువులు, మహారాజులు, ఇంట్లోవున్నా, వీధిలో కాచ్చినా, గొడుగుల్ని వదలలేదు. వదల్లేదంకే, వారే పట్టుకొనే వారని కాదు. ప్రభువులకు, ఎండా వానలు తగలకుండా, భృత్యకోటి ఛత్రాలను పడుతూ వుండేవారు. అలా పట్టించుకోవడం రానురాను అపసరం స్థాయినిమించి, అదోగౌరవం కిందికి మారిపోయింది. మారిపోయిం



దనడానికి గుర్తు ఈ నాటికీ రాజ్యాధినేతలకు, మనం గొడుగులు పడుతూ వుండడమే : ఆయనగారు ఆ దేశానికి అధ్యక్షుడో ప్రధానమంత్రిగారో ననుకోండి: వారి వెనకనే కూచుని వారికి గొడుగు పట్టేవారుంటారు.

ఈ అలవాటు మంచిచెడ్డల మాటనలా వుంచితే, ఇది మనకు దేవ తలనుంచి సంక్రమించిందని చెప్పుకోవచ్చు. మన గర్భగుళ్ళలోని దేవతా విగ్రహాలను వోసారి చూడండి. వివిధాలంకారాలతోపాటు చిన్న గొడుగు కూడా వారి నెత్తిమీద మెరుస్తూ వుంటుంది.

స్వదేశ సంస్థానాలు రద్దుకాకముందు ప్రతి మహాప్రభువు దగ్గరా, కొందరు ఛత్రపాణులుండేవారు. వారి పని ప్రభువులకు గొడుగులు పట్టడం. ఈ పని చేసినందుగ్గాను వారికి భారీగా వేతనాలు, కానుకలు చెల్లించేవారు ప్రభువులు. కొందరు కొందరయితే మాన్యాలే యిచ్చే వారు – ఈపని చేస్తున్నవారికి:

కటిక పేదలు, ఎండా వానల నుండి రక్షణకోసం ఏ తాటి యాకునో నెత్తిన వేసుకుంటే, కాస్త కలిగినవారు తాటాకు గొడుగును వేసుకొనే వారు. అదే మహారాజులయితే, ముత్యాల గొడుగులు పట్టించు కొనే వారు.

అయితే-

ఈ చరిత్రకూ, మన శంకరయ్యకూ, ఏమి సంబంధం లేదు. అత నికిన్ని నంగతులు - గొడుగుల్ని గురించిన సంగతులు - తెలుసునో లేదో మనకు తెలీదు.

శంకరయ్యది అసలీ వృత్తి కాదు. అతని నాన్నగారూ, ఆ నాన్న గారి నాన్నగారూ ఓ 'చిన్న' రాజావారి దగ్గర పనిచేస్తుండేవారు. ఏంపనో, విశదంగా చెప్పడానికి శంకరయ్య నిరాకరించాడు. ఆ పనిలో వున్నంత కాలం, సంసారం బాగానే గడిచిందట.

"రాజాగారు, నాకూ బాగా గుర్తేనండీ : ఎర్రగా బొద్ద బొద్ద లాడుతూ ఉండేవారు. బొడ్డుకిందికి లాగు కట్టుకొనేవారు. అన్ని వేళ్ళకూ మెరిసే వుంగరాలు. లంకంత లోగిలి. ఇంటినిండా పనివాళ్ళు. రాజాగారు ఎప్పుడూ మద్రాసులో ఉండేవారు. ఎప్పుడన్నా ఇక్కడికొచ్చేవారు. అయి దారు గుర్రపు సార్టులు, నాలుగు కార్లు, వాటిల్లో బొరసానులు, బుల్లు –" అని నవ్వాడు శంకరయ్య.

మరకలతో, మసకేసి పోయిన ఫొటోను చూపించాడు శంకరయ్య. రాజాగారికి వెనగ్గా రెండో వరుసలో ఉన్న నాలుగో మనిషి, మన శంక రయ్యగారి తండ్రి. రాజాగారికి, అటూ, ఇటూ బొరసానులూ, వారికి పక్కగా బొరలూ, వారి ముందు చచ్చిపడివున్న పెద్దపులి, ఆ పులిమీదుగా వో బొడవైన తుపాకి-

"ఇప్పుడు రాజాగారు లేరండి. ఈ మధ్యనే చచ్చిపొయ్యారు. అయన బతికుండగానే రాజరికం పోయిందండి. రెండేళ్ళ కిందటి దాకా, దివాణం దివాణంగానే వుందండి. తరువాత, రాజాగారు దాన్ని పడగొట్టి అక్కడ వోటేలు కట్టిస్తున్నారండి. అదింకా పూర్తికాక ముందే అయ్యగారు వెళ్లిపోయ్యారండీ."

సారాంశ మేమిటంటే రాజాగారు వున్నంతకాలం—ఆయన దివాణంలోనే, 'రాజా' లాగా వెలిగిపోయిన సత్తిరాజుగారి కుటుంబం, ఆ తరువాత కూటికీ, గుడ్డకూ, నానా యాతనలూ అనుభవించింది. కొంత కాలం పాటు 'ఔటు హవుస్'లో వున్నా, దాన్నీ హోటల్ కోసం పడ గొట్టేశారు. దాంతో వీధిన పడక తప్పిందికాదు.

"చిన్నప్పుడు అయ్యా సంపాదించి పెడుతుంటే తెలిసేది కాదు. ఇప్పుడా సుకమంతా 'కల' లాగా ఉన్నది బాబుగారూ!" అన్నాడు శంకరయ్య. ఆ రోజుల్ని జ్ఞాపకం చేసుకొంటూ.

తండ్రి చనిపోయాక, అంతా అయోమయంగా ఉన్న శంకరయ్య, కొంతకాలం పాటు ఇంట్లో వున్న పాత్ర సామాను అమ్ముకుతిన్నాడు. చదువు లేకా, చేతిలో ఏ పనీ లేకా అతను దిన పస్తులు చేసిన సందర్భాలు కూడా చాలా వున్నాయి.

"మా అయ్యా చాలా పాడుపన్లు చేశాళ్ళండి. అందులో నాకు పెళ్ళి చేయడం ఒకటి. ఈ పెటాకులు యేగక పోయినట్లయితే నాకీగొడవలన్నీ ఉండేవి కాదండి. బతికినా చచ్చినా ఒక్కణ్ణి. తిన్నా, తినకపోయినా, దర్జాగా కాలం గడిచిపోయేది. ఈ లంపటం, ఉండడంతో నా పని ఉరేసు కున్నట్లయిందండి. పెళ్లాం, అన్నది ఉన్న తరవాత పిల్లలు పుట్టుకురారా దొరగారూ! ముగ్గురు పిల్లలున్నారండి. వీళ్ళ పొట్టలు నింపలేక ఛస్తున్నా నండీ." అన్నాడు శంకరయ్య.

కొంతకాలంపాటు గాలికి తిరిగిన శంకరయ్య ఆఖరుకు ఓ హోటల్లో క్లీనరుగా కుదిరాడు. రెండు పూటలా భోజనం, రెండుసార్లు కాఫీ టిఫెనూ యిచ్చి, నెలకు పదిహేను యిచ్చేవారుట. ఓ ఏడాదిపాటు అక్కడే పని చేశాడు. జీతాలు పెంచమనీ, పనిగంటలు తగ్గించమనీ, పనివాళ్ళంతా సమ్మెచేసినప్పుడు శంకరయ్య కూడా వాళ్ళతో చేరాడు. వారం రోజులో, పది రోజులో సమ్మె జరిగింది. జీతాలు పెరిగినా, పెరక్కపోయినా, చేస్తున్న వుద్యోగం కాస్తా వూడిపోయింది. యింకెక్కడికెళ్లినా పని దొరకలేదు. "యూనియన్" వాళ్ళనడిగితే "ఇదిగో అదిగో" అంటూ తిప్పి తిప్పి చంపారే తప్ప – యింకో చోట పని చూపించలేదు.

"నాకసలు గొడుగులు బాగు చేయడం చాతకానేకాదండి. ఆకలి– నాకీ పని నేర్పింది. యిందులో పెద్దగా నేర్చుకోవలసింది కూడా ఏమీ లేదనుకోండి. కాస్త బుర్రను వుపయోగిస్తే, ఎక్కడ చెడిపోయిందో, దాన్నెలా బాగుచేస్తే సరిపోతుందో తెలిసిపోతుందండి. మొదట మొదట నాకూ తెలియలేదు. క్రమంగా అన్నీ నేర్చుకొన్నాను." అన్నాడు శంకరయ్య.

ఇప్పుడతని దగ్గర పాత గొడుగు చువ్వలు, గుబ్బలు, కుప్పెలు, వుక్కుతీగలు, కట్లు, అవర్లు, పొన్నులు, రింగులు చాలా వున్నాయి. రక రకాల గొడుగుల్ని చూస్తూనే వాటి జబ్బేమిటో సులభంగా గ్రహించగలడు. కొత్త అవరు వేస్తే, దానికి రీదు కాక అర్ధరూపాయి తీసుకొంటాడు. చువ్వలకు గుడ్డకూ కూడా రూపాయి తీసుకుంటాడు. గొడుగు చివర

కొత్త పొన్ను బిగిస్తే ముప్పావలా, పాతదయితే, 30, 40 పైసలూ తీసుకుంటాడు.

"పెట్టు చెడిపోయిందనుకోండి, పాతది బాగుచెయ్యమని ప్రాణం తీస్తారు. దానికేమో పెంపరు వుండదు. కొత్తది వేసుకోమని సలహా యిస్తా. కొంతమంది వినరు. ఇహ చేసేదిలేక, జవగారుతో పాతదాన్నే పొంచి, అప్పటికప్పుడు పనిచేసేలాగా అమర్చుతా. కాని—అలాంటి పన్లుచేసి, పాడు పేరు తెచ్చుకోవడం నాకు యిష్టం వుండదండి. చువ్వలు 'కామ' చుట్టూ నర్ది ఉక్కు-తీగ బిగించి జవ జవలాడే జాయింట్ల దగ్గర రివిట్లు బిగించి, తుప్పుపోయేలా మెరుక్కాగితం రుద్ది అంతా అవల్ పైట్‌గా చేస్తాననుకోండి. మూడు రూపాయలవుతుంది. 'ఈ ముండ మోపి గొడుక్కి మూడా'? అంటారు. పనిచూడరు, బాబుగారూ 'చవక' చూస్తున్నారు జనం." అన్నాడు శంకరయ్య.

ఎండా కాలంలో, కాస్త గిరాకీ వుంటుందిట. వానాకాలంలోనే మంచి సీజను వుంటుందన్నాడు శంకరయ్య. అదీ—రెండు మూడు జల్లులు పడిన తరువాత గానీ పాత గొడుగులన్నీ మూలల్నుంచి తియ్యరని చెప్పాడు శంకరయ్య.

ఒక్కచోటనే కూచువి పని చేస్తాడు. అలా కూచున్న చోటికి, ఖాతాదార్లు రాకపోతే తనే వీధి వీధీ, ఇల్లిల్లూ తిరుగుతానన్నాడు. మైలు, రెండుమైళ్ళ లోపలయితే, నడిచే వెడతాడు. మరీ దూరప్రాంతాలకు వెళ్ళాలనుకున్నప్పుడు, అద్దెసైకిల్ మీద పోతాడు.

"రోజుకు, ఎంత సలీసుగా చూసుకొన్నా, ఏడెనిమిది చాకా కళ్ళు చూస్తానండి. ఈ సీజను కాస్తా దాటితే, మళ్ళా దిన పస్తులేనండి".

శంకరయ్య భార్య, మరీ రోగిష్టిమనిషి. అయినా అయిదిళ్ళు వొప్పుకొని పాచిపనీ, అంట్లపనీ చేస్తున్నది. చద్దీబొద్దీ మిగిలితే ఇంటికి తెస్తుంది. వాటితోబాటు తన సంపాదనను కూడా కలిపి నీళ్లా మంటాకాలం గడుపుతున్నాడు శంకరయ్య.

అతన్ని మీరు చూడాలనుకొంటున్నారా? విశాఖపట్నంలో మహారాణి పేటలో గాని, దూడావారి వీధిలో గానీ, మార్కెట్ దగ్గర గానీ, యూనివర్శిటీరోడ్డు వారగానీ, ఇన్ని పాతగొడుగుల్ని ముందేసుకొని, వాటిని బాగుచేస్తూ కనపడతాడు.

ఎన్నో వేలమందికి, ఎండా వానల బాధ లేకుండా, గొడుగుల్ని బాగుచేసి యిస్తున్న శంకరయ్య, మిట మిటలాడే ఎండకూ: జోరున కురిసే వానకూ: ఏ చూరు చాటునో తలదాచుకోవడం, మన సమసమాజ స్థాపనకొక మచ్చు తునక.

కేశోపనిషత్తు

ఏ ప్రాచీన సాహిత్యంలో సర్వాంగ వర్ణనలున్న సంగతి మనకు తెలిసిందే : ఒక్కో అంగం పరంగా, ఒక్కో పేరుతో ఆడవాళ్ళను వర్ణించడమూ మనకు తెలిసిందే. ఈ సర్వాంగ వర్ణనల్లో అరికాలు మొదలు కొని, నడిశిరస్సు దాకా ఉన్న దేన్నీ మన కవులు విడిచిపుచ్చారు గాదు. అయినప్పుడు, శిరస్సునూ, వెంట్రుకలనూ వదులుతారా ? ఆ వ్యక్తి, పార్వతిగానీండి, లక్ష్మీదేవి గానీండి, సరస్వతిగానీండి జుట్టును గురించి, అధమపక్షం అరడజను పద్యాలైనా రాయందే, తెలుగు కవికి కుతి తీరదు. అప్పుడప్పుడు మగవారి జుట్టును గురించి కూడా రాశారు గానీ— ఆ మగవారు— మరీ గొప్పవారో, అవతార పురుషులో అయితేతప్ప— జుట్టుదాకా పోయేవారుకాదు. జుట్టుకు, సాహిత్యంలోనే కాదు— నిత్యజీవితంలో కూడా మంచి స్థానమే ఉంది. బట్టతల వారివేపు వింతగా చూసినట్లే వంకుల జుట్టున్న వారినేసి, ఆసక్తిగా చూస్తాం. జుట్టు పెరగడానికి, నిగనిగలాడడానికి, నల్లగా వొంకులు తిరగడానికి తోడుపడే తలనూనెల ప్రకటనలు, మనం, రోజూ పత్రికల్లో ఎన్ని చూస్తున్నాం గాదు ?



సరిపోయినంత జుట్టు లేనివారు, ఆ లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి సవరాలు వాడడం - చాలా కాలంగా వాడకంలో ఉన్నదే !

అసలు 'సవరము' అంటే, 'చమరీమృగం తోక' అని కొందరూ, 'చమరీమృగం ఒంటిమీది వెంట్రుకలు' అని మరికొందరు నిఘంటుకారులు రాశారు. మరి కవి ప్రయోగాలూ బోలెడున్నాయి.

"సవరాలు దొడిగెను సవరణతోడ" అనీ—
"సవరాల జమని కెసరగ బన్నించి" అనీ—

ఇంకా ఇంకానూ ఉన్నాయి.

కృత్రిమ కేశాలద్వారా ఉన్న లోపాలను సవరించుకో వచ్చునని తెలిసినప్పటినుండి, సవరాలకూ వాటిని కట్టేవారికి మాంచి గిరాకీ ఉన్నదని చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఎవరంతట వారే ఈ సవరాలను తయారు చేసుకొనేవారేమోగానీ, రాను రానూ, ఈ పని చేసేవారంతా ఒక ప్రత్యేక శాఖగా విడిపోయారు. మన పూసల రాములు ఈ శాఖకు చెందిన వాడే :

అసలు అతనింటిపేరు 'పూసల' కాదుట. కానీ తాత ముత్తాతల కాలంనుండి రంగు పూసలు, కర్పూరపు దండలు, సవరాలు, అద్దాలు, రక రకాల కుంకుమలు, పసుపులు, పట్టుదారాలు, సబ్బులు, కాటుకలు, దాసె నలు, దువ్వెనలు, మొలతాళ్ళు, లక్కపిడతలు, గవ్వలు, పునుగుపూసలు, సూదులు, పిన్నీసులు వగైరా వగైరాలు అమ్ముతూఉండడంవల్ల 'పూసల' అన్నది ఇంటిపేరయి పోయిందట.

ఇప్పుడు మన రాములు, ఆ సరుకుల్ని తీసుకొని ఇల్లిల్లూ తిర గడంలేదు. "తిరిగినా లాభంలేదండి బాబయ్యా : బజారుకో పాతిక పాన్సీ షాపులొచ్చాక మా యాపారం పూర్తిగా పడిపోయిందండి : ఇంక మాకు మిగిలిందల్లా ఇదొక్కటే" అన్నాడు రాములు, తనముందు కుప్పగా ఉన్న వెంట్రుకలను చూపిస్తూ.

దీనివల్లకూడా అతనేవో నాలుగు చేసుకుంటున్నాడనుకోవడానికీ లేదు. ఊరికి దూరంగా మురికి గూడెంలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గుడిసె, ప్రక్కనే తల తిరిగిపోయేంత దుర్వాసనలు చిమ్ముతున్న మురు క్కాలవ, నడవడానిక్కూడా వీలులేనంతటి నన్నని ఇరుకు సందులమధ్య రాములు బతుకుతున్నాడు.

వారానికో. పదిరోజులకో పోసారి, బజారుకెళ్ళి కావలసిన వెంట్రుకల్ని కొనితెచ్చుకుంటాడు. వాటినన్నింటినీ, మళ్ళా చిక్కు దీస్తాడు. తెల్లవెంట్రుకలూ, పొట్టి వెంట్రుకలూ లేకుండా చూస్తాడు. తరువాత, వాటిమొదళ్ళు పట్టుదారంతో బిగగట్టి కుంకుడు నీళ్ళతో కడుగు తాడు. ఆరపెడతాడు. జుట్టు ఫెళఫెళలాడేలాగా, నిగనిగలాడేలాగా చేస్తాడు. ఆ తరువాత, సన్న ఇనప తీగతో బిగించి, దానిమీద పట్టుదారం చుట్టి, సవరం నెత్తిమీద నల్లలక్కతో టోపీలాగా అమర్చుతాడు. ఇప్పటికి సవరం పూర్తయినట్టు. ఇదొక రకం :

మరో రకం సవరం—పాయలుపాయలుగా ఉంటుంది. కానిని కానివి వెంట్రుకలు తీసుకొని సుతారంగా కొంతమేరకు జడనల్లి - అది మళ్ళా విడిపోకుండా, ముడివేస్తాడు. ఒక్కపాయలో 3, 4, 5 జడలుదాకా ఉండొచ్చు. దీన్నొక 'కుచ్చు' అంటారు. ఇలాంటి కుచ్చులు, 5, 6, కలిపి ఓ సవరం చేస్తాడు.

"సవరం ధరలు ఒకలాగా ఉండనే ఉండవండి. సవరం పొడుగును బట్టి, లావునుబట్టి కొనేవాళ్ళ అవసరాన్నిబట్టి, ధరలు చెబుతుంటాను. ఒక్కసారి నా కక్కుర్తికొద్దీ నగానికి నగం ధరకే అమ్ముతుంటానండి: అంతికాదికై తే తప్ప, ఆ తల్లి కొననని అంటుంది. ఏదో కాడికి అమ్ము

కుంటె తప్ప-నా పొట్టగడవదు. ఇంకేం చావమంటారు ?'' అన్నాడు రాములు గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటూ.

తను కొనే పెంట్రుకల ధరలుకూడా స్థిరంగా ఉండవన్నాడు. నెలలో 16 రూపాయలు మొదలు, 40, 50, 60 రూపాయలదాకా కూడా చెల్లించి తను కొంటూ ఉంటాట్ట. వారం కిందట, పాతిక రూపాయలిచ్చి కొన్న పెంట్రుకలకే, వారం తరువాత, నలభై చెల్లించాల్సి వచ్చేసరికి, కడుపు తరుక్కు పోతుందంటాడు రాములు.

"నేనేమో, పాత ధరప్రకారం సవరాలిస్తానని, అవతలి వాళ్ళకు మాటిస్తానండీ ! అన్న తరువాత, సరోసురోపడి, ఆ ధరకే ఇవ్వాలిగానీ, ధరపెంచితే, మాటకు మాటా పోతుంది, మనిషిమీది నమ్మకమూపోతుంది. అందుకనే ఒక్కోసారి నష్టానికూడా సరుకు అమ్మేస్తుంటాను బాబయ్యా !'' అన్నాడు రాములు.

ఈ ధరలయినా తుక్కు పెంట్రుకలవేనట. మూసిన పెంట్రుకల ధర కిలో, అరపై నుండి పందదాకా ఉంటుందిట. ఒక కిలో పెంట్రుకలతో, పెద్ద పెద్ద సవరాలు అయిదుగాని, లేకపోతే ఆరుగాని అవుతాయన్నాడు.

ఈ పని రాములొక్కడే చేయడు. అతని భార్య, పిల్లలుకూడా, అతనికి సాయపడుతూ ఉంటారు. పిల్లలేమో చిన్న చిన్న పెంట్రుకల్ని, వరసబెట్టి ఇస్తారు. పాయలు సవరాలల్లేటప్పుడు ఆ జడల్లో ఈ నన్న పెంట్రుకల్ని పొడిపి, నొమ్ము చేసుకుంటానన్నాడు రాములు.

"మా తాత తండ్రుల్నించి ఇదే బతుకు బాబయ్యా ! మా నాయనమ్మ, మా అమ్మా, రకరకాల సరుకులూ, ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగి అమ్మడం, నాకు గుర్తున్నది. ఇప్పుడాపని పెద్ద పెద్దోళ్ళు చాపలు పెట్టి చేస్తున్నారు. మా పొట్ట కూడు పడిపోయింది''.

ఇంకెవరన్నా పెంట్రుకల్ని దాచిఉంచి వాటితో సవరం కట్టివ్వమన్నా రాములు కట్టిస్తూ ఉంటాడు. పెంట్రుకల్నిబట్టి సవరాన్ని బట్టి 4,5 రూపాయిల్నుంచి 10, 12 రూపాయలదాకా కూలి తీసుకొంటానన్నాడు రాములు. సొంతంగాగాని, ఇతరులకుగానీ రోజుకు 5, 6 సవరాల దాకా కట్టడం పెద్ద కష్టమేమీ కాదన్నాడు రాములు.

''కష్టంగానీండి, సుఖంగానీండి, చేయడానికేం అభ్యంతరం లేదు. ఒళ్ళుదాచుకోవడం నాకు చాతకాదు. కాని ఎంత విరగబడ్డా మాపటి పూటకు బువ్వ కరువయితే యింకెందుకు చెప్పండి- ఈ ముదనష్టప్పని :'' అని విసుక్కున్నాడు రాములు.

అలాగని, అతను ఈ వృత్తిని విడిచిపెట్టలేదు. పొత్తిగా చదువు సంధ్యల్లేని రాములుకు వంశపారంపర్యంగా వస్తున్న ఈ పని తప్ప మరే వృత్తి చేతకాదు.

"అందుకే దీన్ని బట్టుకుని వేళ్ళాడతా ఉన్నానండీ : ఉదయం 9-30 కల్లా ఇంత నోట్లోసుకొని ఊరిమీద పడతా. గొంది గొందీ సందుసందూ తిరుగుతా. కేకలు పెడతా. ఆ పట్టుపట్టు 4–5 గంటలదాకా తిరిగీ, తిరిగీ కొంపకొస్తా. మళ్ళా పొద్దుపోయేదాకా సవరాలపని. ఇక నా జన్మంతా ఇంతేననుకోండి :" అన్నాడు రాములు, తన అసహ్యాన్నంతా దూరంగా ఉన్న కోడిపుంజు మీదికి పెద్ద విసరడంలో చూపుతూ. రాములు భార్య, బక్క–చిక్కి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని, ఊగిసలాడుతున్నది. అతని పిల్లలు, కాళ్ళు బారజాపి, ఆమధ్య జాగాలో వెంట్రుకల కుప్పల నుంచుకొని, హస్తార్పతంగా, వొక్కో వెంట్రుకనూ ఎడంచేతి వ్రేళ్ళ మధ్యకు చేరుస్తున్నారు. చిన్నవీ, చిదకవీ, నెరిసినవీ, చుట్టుకుపోయినవీ– గుడిసెనిండా వెంట్రుకల తుంపులే :

రాములు పిల్లల్లో ఆఖరివాడి పేరు "నరసిమ్మ". వాడిపొట్ట బూద రించి ముందుకు పొడుచుకొచ్చింది. గుండెమీద ఎముకలు వాతల్లాగా కనబడుతున్నాయి. మురికిలాగు జారిపోకుండా ఎర్రరంగు మొలతాడు దానిమీదికి లాక్కు–ని ముక్కు ఎగబీలుస్తూ మధ్య మధ్య చేత్తో చీమిడిని బుగ్గమీదికి తోస్తూ రెండో అన్నకు, వెంట్రుకల్ని అందిస్తున్నాడు నర సింహం. వాడేదో అంటుంటే–తల్లి మెల్లగా గసురుకొని, వాడినోరు మూయిస్తున్నది.

ఎన్నో వందలమంది కేశ సౌందర్యానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా సాయంచేసిన రాములు, తన పెళ్లాం జట్టు చిందర వందరగా, జీబురు జీబురుగా, ఉన్నా సహించాడుగాని, తిరపతమ్మకు ఒక్క–సవరం – కనీసం పనికిరాని వెంట్రుకలతో తయారు చేసిందన్నయినా సరే – ఇవ్వలేక పోయాడు పాపం :

పప్పులోన ఉప్పు కలిపి కుప్పలు పోస్తాడు



రోజూ వెళ్ళినట్టే ఆ రోజునా, నరసమ్మ పొలం వెళ్ళింది. కాసే రోజూ వస్తున్నట్టు నంజెపోకల్లా ఇంటికి రాలేదు. 'ఇదిగో వస్తుంది-అదుగో వస్తుంది' అంటూ బసవయ్య జాముపొద్దు పోయిందాకా చూశాడు. అయినా ఆంతూ పొంతూలేదు.

బసవయ్య కేమీ పాలు పోలేదు. తన భార్యతోబాటు పొలం వెళ్ళిన ఇరుగుపొరుగు వాళ్ళను అడిగాడు. సాయంత్రందాకా పిట్టకావలి కాయడం తాము చూశామన్నారు వారు. అంతకు మించి తమ కేమీ తెలియదన్నారు.

బసవయ్య చిరాకుపడి పోయాడు. శేషగిరిని ఇంట్లో వుండమన్నాడు. కాని తనూ వస్తానన్నాడు శేషగిరి. ఇద్దరూ కలిసి పొలం వచ్చారు, పిల్లిపెనర చేను వాడున నరసమ్మ చచ్చినడివుంది.

"చచ్చిపోవడమంటే నాకేమీ తెలియదండీ! మా అమ్మ నీద్రి పోతున్నట్లుగా వుంది. ఎవక్కరూ కోసిన పిల్లిపెనర, యింకో చేతిలో కొడవలి, నోటిపెంట నురుగు...."

అని ఆగిపోయాడు శేషగిరి. నరసమ్మ పాము కరిచి చచ్చిపోయిన. ఏడాది తిరిక్కముందే బసవయ్య మళ్ళీ పెళ్లి చేసుకొన్నాడు.

"ఆమె మా పింతల్లేనండి" అన్నాడు శేషగిరి. అప్పట్నించీ శేషగిరికి దుర్దినాలు ప్రారంభమయ్యాయి. అయిదారేళ్లపాటు అతనా కష్టాలన్నీ నిశ్శబ్దంగా భరించాడు. తండ్రి ఉన్నప్పుడు, మామూలుగా ఉండే పింకల్లి ఆయన లేనప్పుడు కాల్చుకు తినేది. ఈసంగతి ఇరుగు పొరుగువారు చెప్పినా బనవయ్య వినిపించుకోలేదు. వినిపించుకొని కూడా చేసేదేమీ లేక ఊరుకొన్నాడేమో మనకు తెలీదు.

"నేను ఆ వూళ్ళోనే టీ అంగట్లోవుండేవాణ్ని, కప్పులు కడగడం, బల్లలు తుడవడం, బాయిలర్‌లో బొగ్గులువేయడం, పాలు తేవడం, టీపొడి, పంచదార తెనుక్కురావడం చేస్తుండేవాణ్ని. మా దుకాణం రోడ్డుమీద వుండేదండీ. బస్సులు అక్కడే ఆగుతాయి. ఎదురు బొదురుగా రెండు పెద్ద పెద్ద చింతచెట్లున్నాయి. వాటి కింద చాపలు పడేసేవాళ్లం. వచ్చిన జన మంతా ఆ చాపలమీద కూచునేవారు. వారిక్కావలసిన టీ నేనిస్తుండే వాణ్ని.

ఆ టీ దుకాణం వో మళయాళిది. అతను మాంచి దక్షత వున్న వాడు. క్రమంగా, రొట్టెలు, బిస్కట్లు, సిగరెట్లు, బీడీలు, కూడా అమ్మడం ప్రారంభించాడు. బస్సుడ్రైవర్లను, కండక్టర్లను మంచి చేసుకొన్నాడు. వారికి టిఫిన్లు, టీలు, సిగరెట్లు ఫ్రీగా ఇచ్చేవాడు. బస్సులు మరో పది నిముషాలు ఆగేవి. మరో పదిరూపాయల బేరం సాగేది.

శేషగిరికి చేతినిండా పనే. తెల్లవారుజామున లేస్తే. రాత్రి పదకొండు గంటల దాకా, బేరంసాగుతూనే వుంటుంది. అప్పుడయినా శేషగిరి ఇంటికి వెళ్ళేవాడుకాదు. రెండు బల్లల్ని దగ్గరగా జరిపి అక్కడే నడుం వాల్చేవాడు. "మా నాన్న చాలా చిత్రమయిన మనిషండీ. నన్ను రమ్మన మని వొక్కసారికూడా పిలవలా. నేను పోలా. కాకపోతే, అప్పుడప్పుడూ కనిపించేవాడు. ఆయన్ను చూసినప్పుడల్లా, మా అమ్మ గుర్తుకొచ్చేది." అన్నాడు శేషగిరి.

మూడున్నర సంవత్సరాలపాటు శేషగిరి ఆ దుకాణంలో చింత చెట్టు కింద గడిపాడు. నాయర్‌కూ, అతనికి మంచి అనుబంధం ఏర్పడింది.

ఈలోగా ఊరి పరిస్థితి కూడా మారిపోయింది. ఇంకా 'రెండు' టీ దుకాణాలు వెలిశాయి. దాంతో అమ్మకాలు తగ్గిపోయాయి. నాయర్ మలయాళదేశం నుండి వచ్చినవాడు. మిగిలిన దుకాణాల వాళ్ళు స్థానికులు. ఇంకా ఆ దుకాణాన్నే కనిపెట్టుకొని వుంచే మిట్టగొట్టుకు పోయేవాడు.

అతనా షాపును సామానుతోసహా నాలుగువేల చిల్లరకు అమ్మేసి పట్నం చేరుతున్నాడు. నాయర్‌తోపాటు శేషగిరి కూడా పట్నం చేరుకొన్నాడు.

"పదివేల రూపాయలు సినిమా హాలు వాళ్ళకు వడ్డీలేకుండా ఇచ్చి, వీధివేపున టీ దుకాణం తెరిచాడు నాయరు. ఈలోగా అతని తమ్ముళ్ళు

కూడా వచ్చాయి. బేరం అందుకొంది, అందరూ కష్టపడి పని చేసేవారే. అందువల్ల నా అవసరం వారికి లేకపోయింది'' అన్నాడు శేషగిరి.

అయినా శేషగిరిని వారు పొమ్మనలేదు. వారే బండి చేయించారు. లైసెన్సు తీసుకొచ్చారు. సరుకులు కొనడానికి రెండుమూడొందలు మదుపు పెట్టారు. ఈకొత్త వ్యాపారం ప్రారంభించారు.

ఈ వ్యాపారం శేషగిరికి కొత్తగానీ నాయర్ రెండోతమ్ముడికి కొత్తకాదు. అతను చాలా కాలంగా గుంటూరులో ఈ బేరం చేస్తున్న వాడే.

''మనం వొక్కచోటనే పాతుకుపోతే కుదరదు. జనం జాస్తిగా వున్న చోటుకల్లా వెడుతుండాలి. ఉదయంపూట మధ్యాహ్నంపూట స్కూళ్ళదగ్గర గిరాకి వుంటుంది. సాయంకాలం బస్సుస్టాండులోగాని సినిమాహాల్స్ దగ్గరగాని ఉండాలి'' అని సలహా యిచ్చాడు శంకరన్.

అనడమేకాదు. వో నెల రోజులపాటు శంకరన్ దగ్గర వుండి అమ్మకాలు కూడా చేశాడు. సరుకుకొనడం, ఆ కొనడంలో వున్న మెలకువలు, సరుకునాణ్యత, వాటిని బాగు చేయించడం, వేయించడం, రుచికోసం ఉప్పుకలపడం ''చట్నీ'' తయారు చేయడం వగైరా వ్యాపార రహస్యాలన్ని శేషగిరికి బోధించాడు శంకరన్.

''మూడేళ్ళ నుండి నేనొక్కణ్నే ఈ పనులన్నీ చేసుకొంటున్నానండీ! గిరాకీ అంతగా వుండనప్పుడు సరుకు కొంటాను. వేయించడానికి కిలోకు అర్ధరూపాయి తీసుకొంటారు. బటానీలు ముందుగా నానేసికానీ ఉడకబెట్టకూడదండీ! అవి తొందరగా పాచిపోతాయి. అందుకని దోరగా వేడి చేసి, నూనె, మసాలా కలుపుతాను, పల్లీలు కూడా వేయించి ఉప్పు, కారం, నూనె కలుపుతాను. కొన్నింటిలో ఉప్పు మాత్రమే కలుపుతాను. చట్నీ చేయడం కూడా నాకు తెలుసు. పచ్చిమిర్చి, పెద్దఉల్లి, కచ్చా పచ్చాగా నూరి, చింత పులుసులో కలుపుతాను. తాలింపు వేస్తాను. కొత్తిమీరి, కరివేపాకు, పొదినాఆకు, తుంపులు చేసి వేస్తాను. దాంతో పచ్చడికి యమరుచి వస్తుంది'' అన్నాడు శేషగిరి.

అలా వస్తున్నది గనుకనే అతని వ్యాపారం రూమ్మని సాగిపోతున్నది. శంకరన్ చెప్పినట్లుగా ఉదయం - మధ్యాహ్నం స్కూళ్ళదగ్గర ఉంటాడు. సాయంకాలంపూట కొత్తగా కట్టిన సినిమాహాలు దగ్గర ఉంటాడు.

అమ్మకాలను గురించి అడిగినప్పుడు శేషగిరి వోక్షణం తటపటాయించాడు. "ఉదయం, మధ్యాహ్నం కలిపి 80, 90 రూపాయల అమ్మకం వుంటుందండీ. సినిమా కొత్తదయితే, మంచిదయితే, అక్కడో 60, 70 దాక అమ్మితాను. రెండో ఆట ఇంటర్‌వెల్ అయ్యాక ఇంటికిపోతాను''.

అన్నాడతను. ఇల్లంటే అతనికి వేరేఇల్లు లేదు. నాయర్ కుటుంబంలోనే ఉంటున్నాడు. అక్కడే వారితోపాటే తింటాడు. అక్కడే పడుకుంటాడు. అందుగ్గాను నెలకు నూటపాతిక రూపాయలిస్తున్నాడు. ఇప్పటిదాకా అమ్మిన అమ్మకాలన్నీ నాయర్‌కే ఇస్తున్నాడు శేషగిరి, తన పేరున నాయర్ కొంత బ్యాంకులో వేస్తున్నాడట. కొంత మొత్తం తన పెట్టుబడి కింద తీసుకుంటున్నాడు.


"ఆ లెక్కలూ, పాడూ, నాకు సరిగ్గా తెలియవండి. అన్నీ ఆయనగారే చూస్తున్నాడు. లేదండీ ఆయన నాకు అన్యాయం చేస్తాడన్న ఆలోచన రానేలేదు. చేసేవాడయితే ఎప్పుడో చేసేవాడు తన బాకీ తీరాక ఈ బండిని నాకే ఇస్తానన్నాడు. బాంకులో రొమ్ము పెట్టి నన్నో ఇంటి వాణ్ణి చేస్తానన్నాడు కన్నతండ్రి చూడకపోయినా, అంతకన్నా మించిన తండ్రి–చేపుడిచ్చిన తండ్రి–నాయర్ నాకున్నాడు. దిగుల్లేదు." అన్నాడు శేషగిరి, బండిని ముందుకుతోస్తూ.

భ్రమణ : పరిభ్రమణ

సన్నగా తుప్పర ప్రారంభమయింది. అంత వాకా మైదానంలో ఉన్న పిల్లలందరూ 'హోయ్' మంటూ చెదిరిపోయారు. జాఫర్ ఓసారి ఆకాశంకేసి చూసి నిట్టూర్చాడు. కారుమబ్బులు కమ్ముకొని ముంచుకొస్తున్నాయి. చూస్తూ చూస్తూ ఉండగానే చినుకులు పెద్దవైనాయి. జాఫర్ ఇక, చేసేదేం లేదు కనక, ఓచూరు కింద చేరాడు.

"ఈ వర్షాకాలం అంతా ఇంతేనండీ ! మాగ్గిరాకే సర్గ్గా ఉండి చావదు" అన్నాడు జాఫర్. చినుకులు మరీ పెద్దవి కావడంతో చూరు కిందినించి వరండాలో కొచ్చాడు జాఫర్ నెత్తిమీద పడిన వర్షపు నీటిని జేబురుమాలుతో తుడుచుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు. మెల్లిగా తన గోడును ప్రారంభించాడు.

"నా చదువుకి, నేనుచేసే పనికి సంబంధం లేదండి !" అంటూ ప్రారంభించాడు జాఫర్. "నేను బి. కాం. చదువుతున్నాను. ఇంకో



ఏడాది చదివినట్లయితే గ్రాడ్యుయేట్ నయ్యేవాణ్ని, కానీ ఈ లోగానే మా కర్మ కాలిపోయింది. మా నాన్న హఠాత్తుగా చనిపోయాడు. ఇంటికి నేనే పెద్ద. నా తరువాత ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు వున్నారు. మా ఆఖరి చెల్లికి పోలియో కారణంగా కాళ్ళు పడిపోయాయి.

జాఫర్ తండ్రి వస్తాదు. చాలా కుస్తీపోటీల్లో పాల్గొన్నాడు. ఏవో మెడల్సులూ అవీ కూడా సంపాదించాడు. కర్రసాములోనూ, బస్కీలు తీయడంలోనూ ఆరితేరాడు. కుస్తీపోటీల మీద మోజుతగ్గాక వడ్డీ వ్యాపారం చేసే మార్వాడీల వద్ద 'దాదా'గా పనిచేశాడు. రోజంతా

ఊరిమీద తిరగడం, వడ్డీలు, వాయిదాలు వసూలు చేయటం అతని పని. వెల జీతంకాక, చేసిన వసూళ్ళను బట్టి, కొంత కమీషన్ కూడా అతనికి వుండేవాళ్ళు.

"జీతమన్నమాటేగాని, చాలా తక్కువండీ : అది వారం పది రోజులక్కూడా సరిపోదు. మిగిలిన రోజులు గడవాలంటే, కమీషన్ బాగా రావాలి. కమీషన్ బాగా రావాలంటే ఎక్కువ వసూళ్ళు చేయాలి. అందుకోసం యమతిరుగుడు తిరగాలి. అవతలివాళ్ళు బాకీ తీర్చగలిగిన స్థితిలో ఉన్నా, లేకపోయినా, అదిరించో, బెదిరించో వసూలు చేయాలి. మానాన్న అలా వసూలు చేసేవాడండీ : ఒక్కోసారి చెంబూ, గిన్నె, కంచం, మంచం పట్టుకొచ్చేవాడు. చాలాసార్లు కొట్టికూడా వసూలు చేసేవాడు" అన్నాడు జాఫర్.

ఈ ఉద్యోగంలో 'సలీందాదా' దాదాపుగా పదిసంవత్సరాలు పని చేశాడు. ఈ పదేళ్ళలో అతని జీతంలోగాని, కమీషన్‌లోగాని పెద్దపెరుగుదల ఏమీ లేదుగాని, సంసారం మాత్రం బాగా పెరిగింది.

ఆదాయం చాలదు. ఖర్చు పెరిగింది. చూస్తూ చూస్తూ పిల్లల్ని వస్తులించలేకపోయేవాడు సలీందాదా. అందుకని వసూళ్ళనించి కొంత వాడుకునేవాడు. సేట్‌లు అడిగినప్పుడు వసూలు కాలేదనేవాడు. చేసిన తప్పును కిప్పిపుచ్చుకోవడానికి ఇంకో తప్పు, మరో తప్పు చేయడం– వాటిని మాఫీ చేసుకోవడంకోసం అద్భుతకల్పనలనల్లి చెప్పడం సలీందాదాకు మామూలయింది.

ఆవలించకపోయినా పేగులు లెక్కపెట్టగల సేట్‌లు కొద్దిరోజుల్లోనే జరుగుతున్న మోసాన్ని కనుక్కున్నారు. సలీందాదాను నిలదీసి అడిగారు. అతగాడు కాదుకూడదని బుకాయించినా లాభంలేకపోయింది. ముగ్గురు గుండాలకు తాగబోయించి, సలీందాదాను కుమల బొడిపించారు సేట్‌లు.

"ఆలా జరగడం మంచిదయిందండీ : సేట్‌లు మెహర్బానీకోసమనండి, పొట్ట జరక్కనే అనండి. మానాన్న చాలామంది ఉసురుపోసుకున్నాడు. ఆపాపం ఊరికే పోతుందా మరి ?" అన్నాడు జాఫర్.

సలీందాదా కోలుకొనడానికి రెండువారాలు పట్టింది. ఆ తరువాత నెలరోజులకే "నుమాయిష్" ప్రారంభమయింది. ఆ ఎగ్జిబిషనులో రంగులరాట్నం తిప్పడానికి రోజుకు ఐదురూపాయల కూలికి కుదిరాడు సలీందాదా.

"నెల తరవాత ఆపని పోయింది. కానీ మానాన్న మాత్రం ఈ వృత్తిని వొదల్లేదు. రంగులరాట్నంతోబాటు ఊరూరా తిరిగాడు. అలా తిరుగుతూ తిరుగుతూ కూడబెట్టిన డబ్బుతో ఈరాట్నం కొన్నాడు. ఆ ఉద్యోగం మానేసి, సొంతగా నడుపుకోవడం ప్రారంభించాడు" అన్నాడు జాఫర్.

గడచిన పదిసంవత్సరాలుగా సలీందాదా తెలుగు దేశమంతా తిరిగాడు. ఇప్పుడు మూడు రంగుల రాట్నాలున్నాయి. ఒకటి మరీ చిన్న

పిల్లల్ని కూచోబెట్టి తిప్పేది. మరోకటి, కొయ్య గుర్రాలు తగిలించి తిప్పేది. మూడవది నిలువుగా తిప్పే చక్రంలాంటిది.

"తక్కువలో తక్కువ ఐదు పైసలు. ఒక్కో ట్రిప్పుకు 60, 70 పైసలు గిడుతుంది. తిరిగే పిల్లలుంటే రోజుకు పంద, రెండువందల ట్రిప్పులయినా వేయొచ్చు. కాని, పండగలహా, జాతర్లకూ తిరనాళ్ళకూ తప్ప-అంత బిజినెస్ ఉండదు. ఒక్కోసారి మూడింటికిరష్ వుంటుంది. అందుకని, ఇద్దరు కూలిమనుషుల్ని పెట్టుకున్నా, రోజుకు ఒక్కోడికి పదేసి రూపాయలిస్తా. ఏడుగంటల కొస్తారు. ఏనిమిది కల్లా పిల్లలు బడిలోకెడతారు. మళ్ళీ మధ్యాహ్నం కాస్సేపు గిరాకీ. సాయంకాలం-బాగా ఉంటుందండీ : అప్పుడే కాస్త ఎక్కువ వసూళ్ళుంటాయి" అన్నాడు జాఫర్.

జంటనగర్లాల్లో ఇలాంటివాళ్ళు పాతికమంది దాకా ఉన్నారని, వీరిందరూ కూడపలుక్కుని వొకరి ఏరియాలోకి మరొకరు పోకుండా సర్దుకుంటూంటారని జాఫర్ అన్నాడు.

"నా దగ్గరున్నవి పాతవండీ : కొత్తగా చేయించాలంటే, రెండు వేలనుంది, నాలుగువేలదాకా అవుతుంది .... అవునండీ బాల్ బేరింగ్ల మీదనే తిరుగుతాయి. వచ్చిందంతా మిగిలితే ఇంకేం సార్ : పోలీసులు మా ప్రాణాలు తీస్తుంటారు. 'రోజుకింత' అని వారి ముఖాన పడేస్తా. మున్సిపాలిటీ స్థలాల్లో వేసినందుకు వాళ్లూ మమ్మల్ని చంపుకు తింటుంటారు. ఇంతపడేసి వాళ్ళనోర్లు మూయిస్తా. అన్ని ఖర్చులు పోను, రోజుకు 20, 30 దాకా మిగుల్తాయండీ :" అన్నాడు జాఫర్.

తనకీపనే బాగా వుందన్నాడు. ఉద్యోగం వస్తుందనే ఆశ తనకు లేదని, వొకవేళ వచ్చినా తను చేయడానికి సిద్ధంగా లేనని అన్నాడు.

"ఇంకా గిరాకీ పెరగాలండీ : పెరగాలంటే జనాన్ని పోగెయ్యాలి. నేనో జేవ్ రికార్డరూ, రికార్డుప్లేయరూ కొందామనుకుంటున్నా, నా తమ్ముళ్ళచేత - చాక్లెట్లు, బిస్కెట్లు అమ్మించుదామనుకుంటున్నా .... లేదండీ : ఇక నేను చదవను. ఇంతవరకూ చదివిందే నాకు పనికిరాకపోయింది. ఇప్పుడు ఇంకో ఏడాది ఈ ముష్టి చదువుకోసం నేను వృధా చేయనండీ:" అన్నాడు జాఫర్.

మన విద్యావిధానం మీద ఇంతకన్నా మంచి వ్యాఖ్యానం లేదేమో :

వెలుగులజడి విరిసేదెప్పుడు ?

చాలాకాలంనాటి సంగతి. ఆ రోజుల్లో మధ్య ప్రాచీనదేశాల్లో ఒకనవాబుగారు విచిత్రమైన వినోద ప్రదర్శన నొకదాన్ని ఏర్పాటుచేశారు. దానికి రాజబంధువులు, ముఖ్యమైన రాజోద్యోగులు, నవాబుగారి అంతఃపురాంగనలు మాత్రమే ఆహ్వానింపబడ్డారు. తన కూతురును కూడా ఆ ప్రదర్శనానికి అనుమతించారు ప్రభువులు.

మరొక్క నిముషంలో ప్రదర్శన ప్రారంభం కాబోతున్నదనగా నవాబుగారు కూతురువైపు చూసారు. చూస్తూనే ఆశ్చర్యపోయారు. అవమానంతో కోపంతో కుతకుతలాడిపోయారు. వారి కళ్ళు చింత నిప్పులను రాల్చాయి. తమ స్త్రీలను ఈ ప్రదర్శనానికి పిలవడమే తప్పు. పిలిచిన వేరానికి నలుగురిలో ఎన్నిలా సిగ్గుపడేలాగా చేయడం మరింత తప్పు. తనిచ్చిన ఈ అవకాశాన్ని వారు ముఖ్యంగా తన కూతురు దుర్వినియోగం చేయడం మహానేరం. తను నవాబు కూతురునన్న జ్ఞానంకూడా లేకుండా ఇంతమందిలోకి ఇలా నగ్నంగా రావడమేమిటి ?

నవాబుగారు కూతురుకు కబురుపంపి సరిగ్గా వస్త్రధారణ చేసి రమ్మన్నారు. ఆవిడ నవ్వింది. నవ్వి తను ధరించిన చీర కేసి చూసుకొన్నది. తను నాన్నగారను కొన్నట్లుగా లేననీ, భారతదేశం నుండి తన కోసం ప్రత్యేకంగా తెప్పించిన చీరను, తను ధరించే వున్నాననీ, ఈ చీర సెనగదొక్కులో వచ్చిన సంగతిని నాన్నగారికి గుర్తు చేయమని ఆవిడన్నది.

ఆ తరువాత నవాబుగారేమన్నారన్నది మనకు ముఖ్యంకాదు. మనకు కావలసిందల్లా అనాటి మన చేనేత పారిశ్రామికులు ఎంత పసందైన వస్త్రాలను నేసేవారోనని చైనాయాత్రీకుడు హాహియాన్ మాటల్లో చెప్పాలంటె "గాలితో వస్త్రాలను నేయడం భారతీయ చేనేత కళాకారులకు బాగా తెలుసు".


మన వీరాస్వామి సరిగ్గా ఈ కోవకు చెందినవాడే. ఈ సంప్రదాయానికి వారసుడే. పరంపరాలుగా ఈ వృత్తిలో పుట్టి, ఇంటిలోనే పెరిగి కండెల మధ్యనే కన్నుమూసారు. వారెవరూ సుఖపడి వుంటారన్న అనుమానం లేశం కూడా తనకు లేదన్నాడు వీరాస్వామి బాధగా.

"నా మట్టుకు నేను మూడు తరాల నుండి చూస్తున్నా. మూతాత, పదహారుమూళ్ల ముతక రోకలు, ముతక ధోవతులు నేసేవాడు. ఉత్తరీయాలా, చుప్పట్లు కూడా నేసేవాడు అలా నేసి నేసి నాడెను అడిగ్గానే తాయన కన్నుమూసాడు. మానాన్నకు పెదనాన్నకు చిన్నాన్నకు

ఆయనగారు. మిగిల్చిందల్లా రెండే రెండు పాత మగ్గాలు. పెంకులు జారి కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఓ పెంకుటిల్లు''అన్నాడు వీరాస్వామి. దరిద్రంతో చెక్కుగట్టిన తన జ్ఞాపకాలమీది బెచ్చికలను మెల్లిగా తొలగ దీసికొంటూ, ఆ ముగ్గురన్నదమ్ములకూ వాటాలు కుదరక ఆ ఇంటిని అమ్ముకొన్నారట. తన తండ్రి తననూ తన తమ్మున్ని పెంచేసుకొని బీడీకొట్టు వెనగ్గా వున్న పూరింట్లోకి రావడం తనకింకా జ్ఞాపకం వున్న దన్నాడు వీరాస్వామి.

''ఆ స్థలంకూడా మాదికాదండీ, సర్కారుది. మా పూరి కరణం గారికి జతపంచెల చాపులిచ్చి అక్కడ పూరిలు వేసుకున్నాడు మా నాన్న. మునసబు పెంకటనారాయణగారు బాగా చాలా మంచివారండీ. నాకు రీలగా గుర్తు. ఆయన కావి ధోవతులను కట్టేవాడు. జరీతలగుడ్డ నడుముకు కణికెడు లావన పెండి గోవతాడు, బొబ్బెమనవేలు పెడల్పున బంగారం మురుగులు, పంగనామాలు, కిర్రు చెప్పులు, పొన్నుకర్ర, బజార్న నడుస్తుంటే జనం అల్లాడి చచ్చేవారండి. తాసీల్దారుతో చెప్పి మా నాన్నకి స్థలం మంజూరు చేయించాడాయన. ఆ పక్కనే అప్పుడో పెద్ద చెరువుం డేది, మేము బ్రొద్దుగూకుబా ఆ చెరువులో ఈతకొడుతుండే వాళ్ళం'' అన్నాడు వీరాస్వామి. కళ్ళు మిల మిల లాడుతుండగా.

వీరాస్వామి బొత్తిగా చదువుకోలేదు. చిన్నతనం నుండి తండ్రితో బాటే పని చేసేవాడు. అతనికి దారం తీయడం మొదలుకొని రంగు లద్దడం దాకా అన్ని పనులూ వచ్చు. తన జీవిత కాలంలో కొన్నివేల జరీ



చీరలు నేశాడట. కానీ తన భార్యకు మాత్రం మచ్చుకు ఒక్క జరీచీరన్నా నేసిపెట్టలేకపోయానన్నాడు.

'ఏం చెయ్యమంటావు చెప్పండి బాబూ? వచ్చే నాలుగు డబ్బులూ పొట్టకే అంతంత మాత్రమయితే ఇంక జరీచీరెలు, సన్న చీరెలు మాకెలా వస్తాయండీ ' అన్నాడు వీరాస్వామి.

అతనూ, అతని భార్య, ఇద్దరు కూతుళ్ళూ, కొడుకూ కూడా రోజూ గూడలు పడిపోయేలాగా చాకరీ చేసే వారట. పెళ్లిలు ఆసుపొస్తే భార్య

మగ్గంమీద కూచుంటే, కొడుకు కండెలకు దారంపోస్తే తనే, మోనేసిన పంచెల చాపుల్నీ, తువ్వాళ్ళనూ, చీరెల్నీ భుజాన వేసుకొని ఊళ్ళోకెళ్ళి అయినకాడికి అమ్ముకొచ్చేవాడుట.

"ఒక్కోసారి కిట్టింపు ధరకన్నా తక్కువగా అమ్మేవాణ్ణి. ఏం చేస్తాను చెప్పండీ, కొట్లో నాలుగు డబ్బులివ్వాలి. పొయిలో పిల్లిలేవాలి. ఇద్దరు పిల్లలకూ పెళ్ళి చేసి పంపడానికి చావు దగ్గర కొచ్చింది, అన్నాడు వీరాస్వామి. ఎలాగోలా కొడుకును నాలుగోతరగతి దాకా చదివించాడుట. వాడేమో చిన్నప్పుడు బుద్ధిగా ఉన్నా తరువాత ముదనష్టపు సావాసాలు మరిగి చెడిపోయాడట. తనేమో కోపమొచ్చి కొట్టాడుట. చెప్పాపెట్టకుండా పాఠపోయాడనీ, ఇప్పుడెక్కడున్నాడో కూడా తెలియదని కన్నీళ్లు పెట్టుకొన్నాడు వీరాస్వామి.

మంచోడు కానివ్వండి, చెడ్డోడు కానివ్వండి. ఓ కొడుకు వున్నవారి వేరు బాబూ. కూతుళ్లున్నారనుకోండి. వాళ్ళు మంచోళ్ళే. అయినా అల్లుళ్ళు దగ్గరకు రానివ్వాలిగా బాబూ" అన్నాడు వీరాస్వామి దిగులుగా.

అతను మగ్గం కడిగేసి అయిదారేళ్లయింది. ఉన్నపూరుకూడా అచ్చిరాలేదు. మకాం ఎత్తేసి ఇక్కడికొచ్చాడు. ఏదో కొపెర్లకు ఎక్కడా మని కాదు గాని, ఏదో రకంగా బతకలేక పోతామా అన్న ధీమా, ఆత్మ విశ్వాసం.

కొంతకాలం ఇంకో మాస్టర్ వీవర్ దగ్గర కూలి పనిచేశాడు. అదీ లాభం లేక పోయింది. ఇంటి స్థలం అమ్మగా వచ్చిన నాలుగుడబ్బుల్తో మూరు బేరానికి చీరెలు, జాకెట్ గుడ్డలు, పాంటు గుడ్డలు, సుజనీలు అమ్ముతున్నారు.

"కొట్టువాళ్ళ దగ్గర నేను సరుకు కొనుక్కోనండీ. డబ్బును హామీ వుంచి కావలసిన సరుకును పట్టుకొస్తా. కాస్త సరీసు రేట్లు కిస్తారనుకోండి. సైకిల్ మీద తిరిగి మారుబేరానికిస్తా. చీరకు 5, 10 మిగుల్తాయి. ఒక్కోరు వాకేసారి కొక్కమిచ్చి కొనుక్కోలేరండి. వాయిదాలమీద యిస్తామంటారు. అలాంటి చోట్ల కాస్త ఎక్కువ మిగుల్తుందనుకోండి. కానీ బాబూ అప్పుడప్పుడూ మొత్తం గుణ్ణమయిపోతుందంటే. వాళ్ళకేమో ఎక్కడికో బదిలీ అయిందనుకోండి. ఆ పద్దుకాస్తా మునిగిందన్నమాటే. అలాంటిదీ అప్పుడప్పుడూ తగుల్తానే వుంటాయండి" అన్నాడు వీరాస్వామి.

క్రిందటేడుదాకా భార్య కూడా చిల్లర మల్లర పనులు చేస్తుండేదట. ఆరోగ్యం దిగనాసిల్లడంవల్ల తనే యింటిదగ్గర ఉండమన్నాట్ట.

"ఇది గొడవగానే తయారయింది బాబుగారూ. పొద్దుగూకులూ ఆ దేశాలమీద పోయినవాణ్ని తలుచుకొని బెంగపెట్టుకుంటుంది. ఇకనేనైనా వాడుబాగుపడాలని చేయి చేసుకున్నానుగాని వాడి మీద నాకు కోపం ఎందుకుంటుందండీ?"

అరవై రూపాయలిచ్చి ఓ చిన్న ముఠికిగదిలో వుంటున్న వీరా స్వామి, ఇంకా ఈ పట్టణవాతావరణానికి ఇమడలేదు. ఇక్కడి నాగరిక తతో సరిపెట్టులేకోక పోతున్నాడు. ఇంకొద్దిరోజుల్లో షష్టిపూర్తి చేసుకో బోతున్నా, వీరాస్వామికి బతుకుమీద ఇంకా పట్టుచిక్కలేదు. దినబత్తెం కోసం ఇంకా పాకులాడకా తప్పడం లేదు. ఒక రోజున ఒకరూపాయి డబ్బులు సంపాదించి,ఇంకో రోజున అదే రూపాయికోసం మండుటెండల్లో మంచు బజారుల్లో కారుచీకట్లలో మసగ వెలుగుల్లో అద్దె సైకిలు అదేపనిగా తొక్కుకుంటూ కేకలు పెట్టుకొంటూ తిరిగే వీరాస్వామి జీవితంలో వెలుగు రవ్వలు విరిసే దెప్పుడు ? అతని ముఖాన సంతృప్తి రేఖలు విప్పారేదెప్పుడు ?

'గాజు పెంకుల నడుము బూజు బతుకును చూడు'

'ఆ పిల్లకు 'సుభాషిణి' అన్న పేరు పెడుతున్నప్పుడు ఉత్తరోత్తరా ఆ అమ్మాయి మూగదవుతుందని ఆమె తల్లిదండ్రులకు తెలియదు.'' అంటూ రవీంద్రుడొక కథను ప్రారంభించాడు.

సరిగ్గా ఈ వాక్యాలు మన 'ముత్యాలు' కూడా వర్తిస్తాయి. పదమూడేళ్ళ కిందట, అతనిపేరు పెడుతున్నప్పుడు, నాగయ్యగానీ, ఆచెమ్మగానీ తమకొడుకు బతుకింత అధ్వాన్నంగా వుంటుందని ఊహించి వుండరు.

నాగయ్యది గుంటూరుజిల్లాలోని గురజాల దగ్గరున్న చిన్న పల్లెటూరు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కడుతున్నప్పుడు నాగయ్య రాళ్ళు మోసే కూలీగా చేరాడు. రోజుకు నాలుగు, ఐదు సంపాదించుకునేవాడు. కుడిగట్టున చిన్నపాక వేసుకుని అక్కడే నాలుగేళ్ళు కాలక్షేపం చేశాడు. ఆ ప్రాజెక్టుతో అక్కడి రాళ్ళతో, ఆ మట్టితో, ఆ గాలితో, ఆ రొదలతో నాగయ్య కలిసిపోయాడు.

''అప్పుడే వీడు నా కడుపున పడ్డాడయ్యా !'' అన్నది ఆచెమ్మ.

ఆమె మాటల్లో చెప్పాలంటే నాగయ్య మంచివాడు. కష్టజీవి. భార్యను అప్యాయంగా చూసుకునేవాడు. పెళ్ళాం పనిచేస్తానన్న వద్దనేవాడు. కాని ఆచెమ్మ ఊరికే కూచునేదికాదు. సున్నం గానుగల దగ్గర పనిచేసేది. గులకరాళ్ళు, సిమెంటు, ఇసక మిక్చర్‌లో పోసేది. తనూ, అంతో ఇంతో సంపాదించేది. అప్పుడప్పుడు ఇద్దరూ 'ఓటి' చేసేవారు. అలా చేసినందుకు మరో నాలుగు డబ్బులొచ్చేవి. వారానికో పదిరోజులకో మాచెల్లదాకా వెళ్ళి సినిమా చూసొచ్చేవారు.

''ఆయన తాగడు. నీచూ ముట్టుకోడు. ఎప్పుడన్నా 'పులి జూదం' మాత్రం ఆడేవాడు'' అన్నది ఆచెమ్మ కళ్ళొత్తుకుంటూ.

ఎండ సెగలెగసి పోతున్నది. రేపో ఎల్లుండో మంత్రిగారెవరో ప్రాజెక్టు చూడ్డానికొస్తున్నారట. గబాగబా పనులు పూర్తి చేయాలిట. బస వయ్యగారు హడావుడిగా వున్నారు. ఆయనగారి పని – ఇంకా కూరదలా పడిపోయింది. అందుకని రాత్రింబవళ్ళు దగ్గర నిలబడి పనిచేయిస్తున్నాడు. తనకూడా, మిక్చర్ దగ్గర ఊపిరాడనంతగా వుంది. సిమెంటు ఇసకా, కలిసిందో లేదో చూడకుండానే బొచ్చెల్లోకి పంపేయమంటున్నారు బసవయ్యగారు. ఓ నిమిషం ఊపిరితీసుకునే వ్యవధి కూడా కాదు.

అప్పుడే ఆదరాబాదరా జంగయ్య వచ్చాడు. వచ్చి-అసలు సంగతిని కాస్తా చెప్పలేక చెప్పేశాడు. బసవయ్య ధర్మరాజు లాంటివాడు గనక వంద రూపాయలిచ్చి చప్పున పంపించేశాడు ఆచెమ్మను.


జరిగిందేమిటంటే -

రాత్రి పొద్దుపోయిందాకా, రాళ్ళు మోసిన నాగయ్యను మళ్ళీ తెల్ల వారుజామునే మేస్త్రి పనిలోకి తీసుకుపోయాడు. నాగయ్య - అక్కడికి రాలేననే అన్నాడు. కాని, మంత్రిగారు వస్తున్నారని, గుత్తదారు పనిని పూర్తిచేయాలనుకుంటున్నారని, ఇప్పుడు గనక పనిలోకి రాకపోతే చర్మం వలిచేస్తానని, మేస్త్రీ అన్నాడు. 'రూపాయికి రూపాయి ఎక్స్ట్రా' అని ఆశ చూపించాడు. నాగయ్య లేచి, తలగుడ్డ చుట్టుకొని వెళ్ళాడు.

"అదే ఆఖరు చూపవుద్దని అనుకోలేదు దేవుడా !" అని ఏడ్చింది ఆచెమ్మ.

అసులసులుగావున్న అడితీలమీదుగా రాళ్ళు తీసుకెడుతున్నప్పుడు సర్వికడ్డీ విరిగి అడితి కూలిపోయింది. అడితిమీద అప్పటికున్న ఆరుగురు కూలీలూ కిందికి రాలిపోయారు. అంతెత్తునుండి పడుతున్నప్పుడు వారు చేసిన ఆర్తనాదాలు, యంత్రాల రణగొణ ధ్వనుల్లో కలిసిపోయాయి.

"ఇక్కడ బతుకుదామని వచ్చానయ్యాం నాలుగిళ్ళలో అంట్లు తోము తా....మా ఆత్త మాకాడనే ఉంటున్నది బిడ్డ చేతికి అక్కరకొచ్చాడు" అన్నది ఆచెమ్మ కొడుకు తలను అప్యాయంగా నిమురుతూ.



ముత్యాలుకు మొదటమొదట ఈ పట్నం వాసన పడలేదట. అందరూ "గమార్" అనేవారట. తల్లి కొంగు పట్టుకొని ఇల్లిల్లూ తిరుగుతుండేవాడట. తనకు 'బాస' కూడా సరిగా వచ్చేది కాదట. ఇప్పుడయితే జమాయించిమాట్లాడతానన్నాడు ముత్యాలు.

"నాకు సదువు రాదు. మరేమో అమ్మో-నన్నో-బల్లోకి పంపియ్యాదుగా" అన్నాడు ముత్యాలు.

తన ఈడు వాళ్లతో గాలి తిరుగుడు తిరుగుతున్నప్పుడే–వాడికీ గాజు పెంకులేరుకోవడం అలవాటయింది. ఎవ్వరికీపనికి రాక పారేసిన తుక్కు–లోంచి ముత్యాలు తన బతుకును పోగుచేసుకుంటున్నాడు.

పగిలిన సీసాపెంకులు, ప్లాస్టిక్ తుంపులు, ఇనపబందులు, మేకులు, పుస్తకాల అట్టలు, వాడేసిన బ్లేళ్ళు, టీలుముక్కలు, రిబ్బసుతుంపులు, కలం గొట్టాలు, కళ్లజోడుఫ్రేములు, తుక్కు కాగితాలు, పాలసీసాలమీది మూతలు, ముత్యాలుకు పనికొస్తాయి. ఇవన్నీవాడు ఏరతాడు. ఇంటికి తెస్తాడు. వాళ్ల నాయనమ్మ వాటిని శుభ్రంచేస్తుంది. బాగా పోగయ్యాక వాటిని అమ్ముకుంటారు.

అయితే ఈ తుక్కు సరుకైనా అన్ని చెత్తకుప్పల్లోనూ దొరకవన్నాడు ముత్యాలు. ఒక్కోసారి పైపైనే దొరకుతాయట. కొన్నిసార్లు 'వొగ్గె' పెట్టి కెలికి కెలికి చూస్తేగాని దొరకవుట.

"ఒక్కోపాలి-ఎంత కెలికినా దొరకవుగా !" అన్నాడు ముత్యాలు.

వీటన్నిటికంటే సీసా పెంకుల బిజినెస్ బాగా వున్నదన్నాడు ముత్యాలు. ఈ పెంకులోనూ మళ్ళీ అన్నిరకాలూ పనికిరావుట. తెల్లసీసాలకూ, కాఫీరంగుసీసాలకూ, మంచి గిరాకి ఉంటుందిట. తెల్లసీసాపెంకులు కిలో 15 పైసలకు కొంటారట. కాఫీరంగు సీసాపెంకులకయితే ఇంకో 5 పైసలు అదనంగా ఇస్తారట. ప్లాస్టిక్ బూరలు. దువ్వెనలు. మూతలు. నాలికబద్దలు, పర్సెలు. డబ్బాలు, బరిజెలు, సంచులకయితే కిలో రూపాయి దాకా పలుకుతుందిట.

"పొద్దున్నే సద్దన్నంతింటానూ. మరే తిన్న తరువాతనేమో వొగ్గి తీసుకొని, సంచిబుజానికేసుకుని బజార్లంబడి పడతా - మధ్యాన్నందాక తిరుగుతూ-కాసేపు కూసుంటా. మల్లా మాపిటాలదాకా తిరుగుతా... మా అమ్మే రోజు 10 పైసలిస్తందిగా అదిబెట్టి తిమ్మిరిబిళ్ళ కొనుక్కు తింటా" అన్నాడు ముత్యాలు.


అంతర్జాతీయ బాలల సంవత్సరాన్ని గురించిగాని, ఐక్యరాజ్య సమితి బాలలకు ప్రసాదించిన హక్కుల్ని గురించిగాని, ముత్యాలుకు తెలియదు. మన పార్లమెంటు, మన శాసనసభ, వివిధన్యాయస్థానాల బాలల సంక్షేమాన్ని గురించి చెప్పినవేవీ ముత్యాలు దాకా యింకా రాలేదు

తిరకాసు ఎక్కడుందో ఏమిటో తెలీదంలేదుగానీ, మనకెప్పుడో సోషలిజం తెస్తామన్నారు ఏలినవారు. అదేదో అప్పుడే తెచ్చినట్లయితే, ముత్యాలు సామ్యవాద దేశంలో పుట్టివుండే వాడు. హాయిగా, కలిగిన వారి బిడ్డలు చదువుకుంటున్నట్లు వాడూ చదువుకునేవాడు. మరి–మనవారేమో దాంతుంప తెగిన సోషలిజం - దాన్ని తీసుకురాలేక పోతున్నారు. మన వాళ్ళ చిత్తశుద్ధిని శంకించి మనల్ని మనమే అవహేళన చేసుకోవడం భావ్యంకాని మాటానిజమే: ఒకవేళ మనవారు చిత్తశుద్ధిగా కృషిచేసిన మన మీద కోపంకొద్ది ఆ సోషలిజమే, మనదాకా రానంటున్నదేమో కూడా మనకు తెలీదు. ఆ సమసమాజమో, చట్టుబండలో తొందరగా రావాలి. ఆలావస్తే తప్ప—ముత్యాల్లాంటి లక్షలాది పసిబిడ్డలబతుకులు, ఈ గాజుముక్కల్లోంచి బూజగుడిసెల్లోంచి బయటపడవు. ***

ఒకటికి 15 లక్షలు

ఐదేళ్ళ కిందట నాయర్ వయస్సు ఇరవయ్యేళ్ళు. ఆ వయస్సులో అతన్ని మీరెవ్వరూ చూసి ఉండరు. అప్పుడతను ట్రివేండ్రంలో ఉండేవాడు. అతని తండ్రి అంతకు ముందెప్పుడో తెలుగు దేశం వచ్చేశాడు. వచ్చి, ఏదో హోటల్లో వంటవాడుగా కుదిరాడు. రెండు మూడు మాసాలదాకా నాయర్ కుటుంబానికి తండ్రినుంచీ ఏ ఉత్తరమూ రాలేదు. నాలుగో మాసంలో 30 రూపాయల మనియార్డరు వచ్చింది. అది లగాయతు, ప్రతి నెలా, పాతికో, పరకో, తండ్రి పంపుతూనే ఉండేవాడు. అన్ని ధరలూ ఆకాశంలోనే ఉండిపోయిన ఈ రోజుల్లో, ఈ పాతికతోనూ, పరకతోనూ ఏమవుతుంది గనక :

"ఈ బాధలు పడలేకపోయామండీ : మా అన్నయ్య – బాగా చదువుకొన్నవాడేననుకోండి : కాని ఉద్యోగాలేవీ చేయడానికి : ఆఖరికి తెగించి, దుబాయ్ వెళ్ళిపోయాడు....మీకు తెలియదేమో సార్ : మాది పెద్ద సంసారం : ఎంత హీనంగా చూసుకున్నా రోజుకు మూడు కిలోల



బియ్యం కావాలి : అందులోకి కూరా, నారా, గుడ్డా, గుడ్డూ – ఇక ఆలోచించండి మీరే :" అన్నాడు నాయర్.

ఆతని పూర్తి పేరు శంకరన్‌నాయర్. ఊరివాళ్ళందరూ. 'శంకు' అని పిలిచేవారట. ఇక్కడికొచ్చాక, పేరులోని తొలిభాగం లుప్తమయి, 'నాయర్' మాత్రం మిగిలిపోయిందిట:

నాయర్ ఈ ప్రాంతానికి రావడం, చాల చిత్రంగా జరిగింది. అన్న తోబాటు తనుకూడా, మధ్య ప్రాచ్యదేశాలు వెడదామనుకొన్నాట్ట. కానీ తల్లి ఇద్దరు అక్కయ్యాలూ వొప్పుకోలేదట. తను అరబ్ దేశాలకు పోతాడేమోనన్న అనుమానం కొద్దీ, వారు పస్తులుండి, తనకు కడుపునిండా పెడుతూ ఉండేవారుట. ఈ సంగతి తనకు తెలియదని రీరా తెలిశాక చాలా బాధపడ్డాననీ చెప్పుకొచ్చాడు నాయర్.

"మావాళ్ళను చూడ్డానికి సిగ్గుపడ్డానంటే మీరు నమ్మరు. సిగ్గుపడి, తెగించి ఇక్కడికొచ్చాను. వచ్చేనాటికి నాదగ్గర రూపాయి చిల్లరటుంది. టీ నీళ్ళు తాగి నాలుగు రోజులు గడిపాను. ఆ తరవాత హోటల్లో చేరాను. అక్కడ మూడు మాసాలపాటు పొట్టకూటి కోసం పనిచేశాను. నాకీ ప్రాంతం కొత్త, భాష కొత్త నాభాష ఇక్కడి వారికి రాదు.. నేను స్కూల్ ఫైనల్ పాసయ్యానండీ! ఇంగ్లీషుమీడియంలో చదివాను. ఓసారి టీ ఇస్తున్నప్పుడు, ఇద్దరు తెలుగు యువకులు ఇంగ్లీషులో మాట్లాడుకుం టున్నారు. వారి భాషలోని వ్యాకరణదోషాన్ని సరిదిద్దాను. నిజానికి నేనాపని చేయకూడదు. కాని ఆ తప్పును వింటూ భరించలేక అనేశాను" అన్నాడు నాయర్.

ఆలా చేయడం అతనికి చాల ఉపయోగపడింది. అందులో ఒక తనికి ఫ్యాన్సీదుకాణం ఉంది! ఆ దుకాణంలో పనికి కుదిరాడు నాయర్. ఆ దుకాణంవాళ్ళు, ఫ్యాన్సీవస్తువులతోబాటు లాటరీటిక్కెట్లు కూడా అమ్మి తారు ఆ టిక్కెట్లను అమ్మేపనిని, నాయర్‌కు అప్పగించారు. అంతకు ముందు, కునుకునులాడుతున్న లాటరీటిక్కెట్ల అమ్మకం క్రమంగా పెరగసాగింది.

"నేను చేసింది కూడా ఏమీ లేదండీ! టిక్కెట్లు కొనడంవల్ల వచ్చే లాభాలను, ఖాతాదారులకు నచ్చేలాగా చెప్పేవాణ్ణి. ఒకవేళ లాభం రాక పోయినా, మిరిచ్చే రూపాయి, ఒక సంక్షేమ కార్యానికి తోడుపడుతుందనే వాణ్ణి! మా దగ్గర కొన్నవాళ్ళకు, ఏయే బహుమతులొచ్చాయో, చెప్పే వాణ్ణి!" అన్నాడు నాయర్, సన్నగా నవ్వుతూ. "నిజంగా వచ్చాయా— అని, అడక్కండి. ఇంతవరకూ రాలేదు. కానీ ఎచ్చే అవకాశం లేక పోలేదుగదా! నా సరుకును గురించి నా ఖాతాదార్లకు నచ్చచెప్పడం మీదనే నా అమ్మకాలు ఆధారపడి ఉన్నాయి. ఖాతాదార్ల స్వభావాన్ని కనుక్కో వడం రోలిరోజుల్లో చాలా ఇబ్బందిగా ఉండేది రానురాను అలవాటయి పోయింది" అన్నాడు నాయర్.

ఇప్పుచితను, మనదేశంలోని అన్నిరాష్ట్రాల టిక్కెట్లూ అమ్ము తున్నాడు—ఒక్క ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కాశ్మీర్ రాష్ట్రాలవి తప్ప. ఈ రాష్ట్రాలు లాటరీలను నిర్వహించడం లేదన్నాడు.

యాభయ్‌పైసల లాటరీ టిక్కెట్లూ, రూపాయివీ, రెండురూపాలవీ అమ్ముచున్నాను కొన్ని లాటరీలు వారానికొకసారీ, మరికొన్ని 10 రోజుల కొకసారి, ఇంకొన్ని 15 రోజులకూ, మిగిలినవి నెలకూ, లాటరీ తీస్తా రండీ! లాటరీ తీయడానికి, ఒకటి రెండు రోజులు ముందుగా అమ్మకాలు

'గా ఉంటాయి. నెలలో మొదటి వారమంతా అమ్మకాలు, మరీ జా స్తీగా ంటాయండీ అన్నాడు నాయర్.

ఈ లాటరీ టిక్కెట్లను, స్టాకిస్టుల దగ్గరనుంచీ, తనే తెస్తుంటా నన్నాడు. ఒక్కో రాష్ట్రం, ఒక్కో విధంగా కమీషన్ ఇస్తూ ఉంటుందనీ, ఈ డిస్కౌంటు 10 శాతంనుండి 25 శాతందాకా ఉంటుందని అన్నాడు.

"ఒక లాటరీ టిక్కెట్టు రూపాయి ఉన్నదనుకోండి. ఆ టిక్కెట్టు మీద మాకు 25 శాతం కమీషను వస్తే, మేము 10 టిక్కెట్లు కొన్నవారికి వొకదాన్ని ఫ్రీగా ఇస్తాం. అదే-10 శాతం కమీషను ఇచ్చే రాష్ట్రం ఉన్నదనుకోండి-20 టిక్కెట్లు కొంటే, ఒక్క టిక్కెట్టు మాత్రమే ఇస్తాం. మాకు కమీషను ఎక్కువగా ఇచ్చే రాష్ట్రాల లాటరీ టిక్కెట్లను, చిన్న చిన్న అమ్మకం దార్లకు, కొద్దిగా మార్జిన్ చూసుకొని అమ్మేస్తాం" అన్నాడు నాయర్.

తాము స్టాకిస్టుల నుండి తెచ్చుకొన్న టిక్కెట్లు, అమ్ముడు పోక పోతే, ఆ నష్టాన్ని తామే భరిస్తామనీ, అందుకునే కమీషను కాస్త తగ్గినా, టిక్కెట్లు తమ దగ్గర నిలవ ఉంతకుండా చూసుకొంటామనీ, నాయర్ చెప్పాడు.

"ఇప్పుడు నేను నెలకు 10, 12 వేలరూపాయల టిక్కెట్లు అమ్ము తున్నానండీ! ముహా అయితే, మూడువందల రూపాయల టిక్కెట్లు మిగిలి పోతాయి .. ఒకప్పుడు, నాకు జీతం ఇచ్చేవారు. ఇప్పుడు జీతంకాక అమ్మ కాలమీద, 1 శాతం కమీషను కూడా ఇస్తున్నారు. జీతం, నా తిండికి బట్టకూ సరిపోతుంది! కమీషను, మా ఇంటికి పంపురానండీ" అన్నాడు నాయర్.

ఉదయమే, తనే వండుకొని, టిఫిన్ కారియర్‌లో తెచ్చుకుంటాట్ట. షాపు మూసిందాకా అమ్ముకొని యజమానికి లెక్క అప్పగించి, రాత్రి ఏ పదిగంటలకో సైకిల్‌మీద గదికి చేరుకొంటాట్ట.

హఠాత్తుగా లక్షలు సంపాదించాలన్న ఆశ జనంలో ఉన్నంత కాలం, తన వ్యాపారానికి ఢోకాలేదంటున్న నాయర్, తనకోసమని ఒక్కటిక్కెట్టు కూడా కొనుక్కోలేదు.

"ఉట్టపుడియంగా, లక్షలు సంపాదించాలని నాకు లేదండీ!" అన్నాడు నాయర్ పకపకా నవ్వుతూ. "నాముఖం చూస్తే-నిజం చెప్పండి సార్! నాది లాటరిలో లక్షలొచ్చే ముఖమేనా? అలాంటిబాటమీద నాకు ఆశలేదు నమ్మకం అంతకన్నాలేదు."

ఇలా అంటున్నా పాతికేళ్ళ శంకరన్ నాయర్ నుంచి, మనం నేర్చు కోవలసింది ఏదీలేదా?

ఇంతేలే పేదల బతుకులు

'లియొనార్డో డావిన్సీ' గొప్ప భవిష్యద్దృష్టి ఉన్నవాడంటారు. ఎన్నో శతాబ్దాల క్రిందట ఆయన ఊహించినవన్నీ ఆధునిక శాస్త్రం 'నిజం' చేసింది. అలాగే జూల్స్ వెర్న్ రాసిన చాలా కాల్పనిక గాథలను, నేటి సాంకేతిక వైజ్ఞానిక శాస్త్రజ్ఞులు 'నిజం' చేసుకొచ్చున్నారు. అంటే– ఒకనాటి లియొనార్డో డావిన్సీ, మొన్న మొన్నటి జూల్స్ వెర్న్‌ల ఆలోచనాసరళీ దూర దృష్టి, ఎంత నిశితమైనవో మనం సులభంగా ఊహించవచ్చు. అప్పటికున్న పరిస్థితులను, బాగా అవగాహన చేసుకొని, ఆ సంస్కార బలంతో, ముందు ముందు ఎలాంటి పరిణామాలు రావచ్చునో, రావడానికి అవకాశమున్నదో వారు దశాబ్దాల ముందుగా ఊహించారు. వారి ఊహలు, కాస్త అటూ ఇటూగా నిజమయ్యాయి. వారి కాలంనాటివీ, అంతకు ముందున్నవీ కూడా, ఎన్నోమార్పులు చెందాయి. ఈ మార్పులు ఎంతదాకా పోయాయంటే, అసలు వస్తువు, తాలూకు స్వతసిద్ధమైన రూపం ఎలాఉంటుందో మనం చెప్పుకోలేకుండా ఉన్నాం. అప్పటికీ, ఇప్పటికీ, ఎలాంటి మార్పూ లేకుండా ఉన్నది 'ఇటుక'.

మరీ ఆనాది కాలంలో పచ్చి ఇటుక లుండేవేమోగానీ– నిప్పు మనిషికిమచ్చిక ఏర్పడిన తరువాత. ఆ నిప్పును రకరకాల పనులకు ఉపయోగించడం మనిషినేర్చుకొన్నాడు. ఆ ఉపయోగాల్లో మట్టిపాత్రలను ఇటుకలను కాల్చడంకూడా వొకటి. "ఆల్ఫానోన్సో" వర్ణచిత్రాలలోనూ, శిఖాధ ఎనర్జీ రేఖా చిత్రాలలోనూ, ఇటుకలు రమణీయంగా కనపడవచ్చు గాక. వాస్తవానికి ఇటుకలను తయారుచేయడంలో, సౌందర్యం లేదు. శారీరకశ్రమ మాత్రమే ఉన్నది. ఈ శ్రమ అతనికి కడుపునిండా తిండి పెట్టదు. ఒంటినిండా గుడ్డనూ ఇవ్వదు. 'కాదన్నవారు, రాములన్ని చూడడం మంచిది'. రాములు వయస్సు 34 దాటదంటే మనం నమ్మలేం: మనిషి లేగలా ఉన్నా, వొంటిమీద కణికెడు మాంసం దొరకదు. ఉన్న శక్తినంతా చేతికండల్లోకి పుంజుకొని, హుమ్మంటూ గడ్డపారను నేలలోకి దించి తాను వెనక్కు వాలుతూ, తనతోబాటుగా గడ్డపలుగునుకూడా గుంజుకుంటూ, రెండు పల్లికలసరిపడే నుంద్రుపెళ్ళను పెకలిస్తున్నప్పుడు, అతని నరాలు చర్మాన్ని తొలుచుకొని, బయటికొస్తాయేమో ననిపిస్తుంది. ఉన్నకండలన్నీ, నడుంమీంచి భుజాల మీదకి జరిగి, ఆ పెళ్ళను విరవడంలో, అతనికి సాయపడుతున్నా యేమోననిపిస్తుంది.

ఒక్కో గునపం పోటు కస్సుమని, భూమిలోకి దిగుతుంటే, రాములు శరీరంమీద చెమట, ఎండకు తళతళ మంటుంది. పెళ్ళ, మరీ పెద్దదయినప్పుడూ, మామూలు ఊపుకు, గడ్డపార వెనక్కు వంగనప్పుడూ రాములు పళ్ళు బిగబట్టి, తన బరువంతా గడపారమీదకు కేంద్రీకరించి,


న్నికిందకి దిగలాగుతున్నప్పుడు, అతని కంఠనాళాలు దారుణంగా బుకు తా యి. త ల గు డ్డ జా రి పో తే, మె డ వి ది లి ం చి, న్ని కిందికి తోసేస్తాడే తప్ప - అనుకొన్న గుర్తుదాకా, గడ్డ విరగ యడంమాత్రం మానదు. అలా మానేస్తే అతని నోరూ. తిండిని మానేయాలిసొస్తుంది పాపం!

భూదేవి గుండెలతో ఆడుకోవటం, అతని వంశంలోనే ఉంది. అతని తండ్రి, తాత, ముత్తాత, ఆయన ముత్తాత మాడా ఈ 'ఉద్దేగ' లోనే ఉండేవారు. వాళ్ళ తాతకు, నడుముకు బిళ్ళలతాడు, కాలికి వెండి కడియం ఉండేవిట. రాములు ముత్తాత, తాతగారు అంతకన్నా ముందాయనో మరి, నిజాం నవాబు 'మిద్దెల్కి' ఇటుకలు సరఫరా చేసిన సంగతిని గర్వంగా చెప్పుకొంటాడు రాములు.

రాములు అయ్యా - పేటలో ఉండే దొరగారి 'గది'కి ఇటుకలు కాల్చాడంట : ఒకసారి, సమయానికి సరుకు అందివ్వనందుకు ఉడుకు నీళ్ళు మీద దిమ్మరించాడట దొర. (అబద్ధం. దొర దిమ్మరించి ఉండడు. ఇంకొకనిచేత ఆ పని చేయించి ఉంటాడు.)

అప్పుడెప్పుడో మహబూబ్‌నగర్‌లో ఉండే రాములు అయిదారేళ్ళ కిందట కూకట్‌పల్లి ప్రాంతాల కొచ్చాడు.

"అక్కడేమున్నయ్యండీ ఏడవ్‌టానికి : నా రెక్కలు నాకాడే ఉండె. నా దరిందరం నా యే న కే ఉండే" అ న్నా డు రా ము లు కాస్తంత దిగులుగా.



అతను చేసిన ఇటుకలు, దొరల బంగళాల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో ఉన్నయ్. హౌసింగ్‌బోర్డు కాంట్రాక్టర్లకు, అతను ఇటుకలు సప్లయ్ చేస్తూ ఉంటాడు.

"అదికూడా గిట్టద్దొరా! సవ్వగా అడుగుతరు. ఇయ్యకపోతే బువ్వెట్టి ఇచ్చి నామనుకోరి కూలిపడదు." అంటాడు రాములు.

ఊరికేఉంటే పొట్టగడవదు. అందుకోసం, భార్యనూ ఇద్దరుబిడ్డల్నూకూడా పనిలో పడేశాడు రాములు. అతను గడ్డ ఇరుస్తూంటే పిల్లలు దాన్ని నలగ్గొడుతుంటారు. చిన్నచిన్న రాళ్ళురప్పలు ఏరిపారేస్తుంటారు.

పెళ్ళాం నీళ్ళుపోసి పుట్టి నా న పె డు తు ం ది. ఆవిడ మట్టి సుద్దలు చేస్తుంటే–పిల్లలు వాటిని రేకులమీద పెట్టుకొని, ఆ రేకులకు తాళ్ళు కట్టి తండ్రి దగ్గరకులాక్కొస్తుంటారు. ఆ మట్టితో అతను ఇటుకలు కోస్తుంటాడు.

'సినుకు పడితే పానం ఎగిరిపోద్ది దొర: అంతా మట్టిపాలవుద్ది.... ఒక్కోసారి ఆవమీదున్నప్పుడు, ఆనపడితే సేతికేమీరాదు. అరపచ్చియి, చిట్టెం కట్టినయి, వోరూ కొనరు'' అన్నాడు, రాములు చుట్టకాలుస్తూ.

నిరుడు బాగానే దిగుబడి వచ్చిందిట. కానీ - తను తాగి పడుకొన్నప్పుడు లా కీ మీ దొ చ్చి సరుకంతా పట్టుకెళ్ళారు. ఏదోకాఁ అమ్ముకోక పోతే రోజు గడవదు.

కొన్ని వేల ఇళ్ళకు ఇటుకల్ని సరఫరా చేసిన రాములు, చిన్న పూరిగుడిసెలో ఉంటున్నాడు.


భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్ముడన్నట్లు– అతను శ్ర మ ప డ తున్నాడు, ఫలితాన్ని....

ఇలాంటి రాములు, కూకట్‌పల్లి దగ్గర్లోనే కాదు. దేశంలో ఏ మూలకెళ్ళినా, కుసుకుసులాడుతూ క న ప డు తూ నే ఉంటారు.



భయం ... భయం ... బత్తుకు భయం !

ఒక మహా సామ్రాజ్యం పతనమవడానికీ, నామరూపాలు లేకుండా పోవడానికీ, ఒక 'నాడా' కారణమంటే, కాదు–'నాడామేకు' కారణమంటే మనకు నమ్మబుద్ధి కాదు కానీ ఇది నిజం! ఒక మహాసామ్రాజ్యానికి చెందిన సర్వ సైన్యాధ్యక్షుడు తన బలాలు యుద్ధరంగంలో ఎలా పోరాడుతున్నాయో తెలుసుకోవడానికి గుర్రంమీద పర్యవేక్షిస్తున్నాడు. తనవారిని ఉత్సాహ పరుస్తున్నాడు, కొందరినిహెచ్చరిస్తున్నాడు, ఇంకొందరిని ముందుకు చొచ్చుకు పోవలసిందిగా ప్రోత్సహిస్తున్నాడు. పోరు జోరుగాసాగు తున్నది. అవతలవారు కూడా చావుకుతెగించి యుద్ధం చేస్తున్నారు. యుద్ధరంగమంతా కత్తులఖణఖణలతో, సైనికులహాహాకారాలతో, హయ హేషలతో, ఫీంకారాలతో, నెత్తురుమడుగులతో నిండిపోయింది. రెండు పక్షాలవారూ వీరావేశంతో యుద్ధం చేస్తున్నారు.



హఠాత్తుగా మన యోధుని గుర్రం కుంటడం ప్రారంభించింది. అయినా అతను చలించలేదు. అన్నిచోట్లా తిరుగుతూ, హెచ్చరిస్తూ ప్రోత్సహిస్తూ, శతసహస్ర రూపాలతోకనబడుతున్నాడు. కుంటుతున్న గుర్రం-నడవలేక ఒరిగిపోయింది. ఇది చూసిన స్వపక్ష సైనికులు ధైర్యాన్ని కోల్పోయారు. ప్రతిఘటన సన్నగిల్లింది. ఎదరి-విజృంభించడంతో, ఈ సైన్యంవెనకడుగువేసి, కొసకు పిక్క-బలం చూపించారు. దాంతో ప్రతిపక్షులు చెలరేగిపోయారు. రాజ్యాన్ని ఆక్రమించుకొన్నారు.

కొద్దిరోజుల్లోనే పూర్వాచరిక చిహ్నాలు అన్నింటినీ సమూలంగా తొలగించివేశారు.

ఇన్నిటికీ, మన సర్వసైన్యాధ్యక్షుడు అలా కావడానికికారణమేమిటి? అతనెక్కిన గుర్రం చాలా మంచిది కానీ, దాని కాలిగిట్టలక్కొట్టిన నాడా అంత సజావయింది కాదు. ముందుగా నాడా మేకు ఊడింది. తరువాత నాడా తిరగబడి పాదంలోకి గుచ్చుకుపోయింది. ఆ బాధని ఓర్చుకొంటూనే గుర్రం, విశ్వాసపాత్రంగాపరుగెత్తింది. నెత్తురంతా పోయ్చుకుపోవడంతో నీరసపడి యుద్ధరంగం మధ్యన కుప్పకూలి పోవడంవల్ల, ఆ సామ్రాజ్యం శత్రువుల చేతికి చిక్కింది!

ఆ గుర్రానికినాడా కొట్టిన వాడెవడో మనకుతెలియదు. తెలిసిందల్లా. అతగాడికి మన కాశయ్యకున్నంత నిజాయితీలేదని మాత్రమే.

కాశయ్యది ఈ ప్రాంతమే. ఇక్కడివాడే. తనముత్తాతల ముత్తలు నేతులు తాగారో లేదో అతనికి పట్టదు. వారి పేరున తన మీసాలను మెలితిప్పుకోవలసిన అవసరంగానీ, అసలంతటి వ్యవధానంగానీ అతనికి లేవు.

తరతరాలుగా-అంటే-కనీసం మూడుతరాలుగా వారి వంశం ఈవృత్తి లోనే ఉండి ఆ ఇంతకాలంలోనూ, ఈ రంగంలో వచ్చినమార్పులేమీ లేవండాడు కాశయ్య. రావలసిన అవసరంకూడా లేదన్నది అతని అభిప్రాయం. ఎద్దులు, గుర్రాలు, దున్నపోతులు- ముఖ్యంగా వీటికి నాడాలు వేయడం అతని వృత్తి. అప్పుడప్పుడు గేదెలకుకూడా వేస్తూ టాడుట!

"బర్రెలకు ఎవరోగానీ వేయించరండీ! పల్లెటూళ్ళలో అసలే ఈ అలవాటు లేదనుకోండి! ఇక్కడయినా బాబూ, ఈ సిమెంటు రోడ్లమీద అదే పనిగా తిరగడంవల్ల గిట్టలు అరిగిపోతాయి. చిగురు అంటుతుంది. అందుకనే వేయిస్తారు." అన్నాడు కాశయ్య.

ఎడ్లకు, గుర్రాలకూ నాడాలు వేయించడం చాలా అవసరమనీ, లేకపోతే కొద్ది కాలంలోనే అవి పనికి ముల్లబడతాయని కాశయ్య అన్నాడు.

"మనం చెప్పులకు నాడాలు ఎందుకేసుకొంటున్నాం చెప్పండి? ఇదీ అంతే? నాడాలు వేయిస్తే గిట్టలు అరగవు. గొడ్డుకు కాళ్లతీపులు ఉండవు. రేట్లుకూడా ఇదివరకన్నానయమే గానండీ లెక్క చూసుకొంటే, మిగిలి చచ్చేదేమీ కనబడదు. ఎడ్ల కయితే- నాలుగు జతలకూ కలిపి మూడు నుండి ఆరు రూపాయలదాకా తీసుకొంటా. గుర్రాన్నిబట్టి ఆరు, ఆరున్నర మొదలుకొని పదిరూపాయలదాకాతీసుకొంటాం" అన్నాడు కాశయ్య.

ఈ ధరల తేడాకు కారణం, వాటిల్లోని సైజు భేదం అని చెప్పాడు.

తనక్కావలసిన నాడాలు, నాడామేకులు షాపుల్లో కొనితెచ్చుకుంటానని, తను కూడా తయారు చేసుకుంటానని, అతనన్నాడు.

గీసి గీసి బేరమాడతారు కొంతమంది. వారికి చే తయారీని వాడతాను. కొంతమంది అడిగినంతా ఇస్తారు. వారికి కంపెనీ సరుకు వాడతా. యీ సంగతికూడ వారికి ముందుగానే చెబుతా. ఎవరు ఏది కోరుకుంటే అదే సరకు వుపయోగిస్తా అన్నాడు కాశయ్య. తన దగ్గరున్న రెండు రకాల సంచుల్లోని సరుకునూ చూపెడుతూ.

ఎవరు బేరమాడతారో, ఎవరు గొణుక్కుంటారో, ఎవరు అడిగిందాని కన్నా ఎక్కువ ఇస్తారో తను సులువుగా అంచనా వేయగలనన్నాడు కాశయ్య.

"ఇందులో చిత్రమేమి లేదండీ! చాలా సంవత్సరాలుగా మనుషులతో మెలగడంవల్ల ఇది తెలుస్తుంది. ఎలా తెలుసుందంటే మాత్రం నేను చెప్పలేను" అన్నాడు కాశయ్య నవ్వుతూ.

ఆ మధ్య సన్నకారు జనానికి, వృత్తి పనిహారికీ బ్యాంకులు అప్పులిస్తున్నాయని ఎవరో అంటే, కాశయ్యకూడా ప్రయత్నించాడు. రెండు మాసాల తిరుగుడు కనిపించింది గానీ 'రశ్మి' మాత్రం కనబళ్ళా. వాడెవడో, తను ప్రయత్నం చేసిపెడతానని కాశయ్య నుండి ఏభై రూపాయలు తీసుకొన్నట్ట. అప్పురాలేదు సరేసరి, ఉన్నదికూడా చేయిదాటిపోయింది.

"ఓ ఏడుపేడిచి ఊరుకున్నా" అన్నాడు కాశయ్య చిరచిరలాడుతూ.

అతని పనిక్కావలసిన సామాన్లుకూడా చాలా కొద్దిగానే ఉన్నాయి. రెండు మూడు సుత్తెలు. ఒక పెద్దపట్టకారు. ఇంకో కటింగ్ ప్లయర్, కన్నాలు వేయడానికో 'బదమ' ఉక్కు పోగరు, శానం, బలుసాకురాయి. పెద్ద మేకు - ఇవి చాలు.

సొంతంగా నాడాలు తయారు చేయడానికి కావలసిన సరంజామా అంతా ఉన్నది. ఓ తాగలి, చచ్చవకంగా ఉన్న ఉక్కు దిమ్మ. చిన్న మలాటా, అడ్డగాళ్ళ సుత్తి, రెండు మూడు శానాలు, జవగారు, పట్టకార్లు, మొద్దు ఆకురాయి కటింగ్ చేసే మిషను – ఇది మరీ అంత ముఖ్యం కాదు - ఈ సరుకంతా ఉన్నది. వీటి పక్కనే 'సాన' – 'సానరాయి' కూడా ఉన్నాయి.

"మందంగా ఉండే ఇనుప బద్దెలు, చెడిపోయిన బండి పట్టాలు, పనికిరాని ఇనప గంటికాడలు ...వీటితోనే నాడాలు, నాడా మేకులు తయారు చేస్తానండీ ! ఇవి టోకుగా కొనిపడేస్తా" అన్నాడు కాశయ్య. బద్దెల్ని, బండిపట్టాముక్కల్ని, శాయిమేకుల్ని చూపిస్తూ.

నాడాలు వేసేప్పుడు ప్రమాదాలు జరిగే సందర్భాలుకూడా ఉన్నాయన్నాడాయన.

"కోడెదూడలు, గిత్తలు-మా పొగరుమీద ఉంటాయండి! ఉచ్చు వేసి కిందపడేసినా, తన్నుకొంటూనే ఉంటాయి. ఒక్కోసారి జాడించి తంతూ ఉంటాయి కూడా. అలాంటప్పుడు చెబ్బలు తగుల్తాయి. అప్పుడ

ప్పుడు కోర కొమ్ములతో కుమ్ముతాయి- ఇవన్నీ చూసుకుంటూ ఉండాలి!" అన్నాడు కాశయ్య తనతోడమీద అప్పుడెప్పుడో తగిలిన గాయం మచ్చను చూపిస్తూ.

"ఎంత జాగ్రత్తగా చేసినా మావల్ల కూడా పొరబాట్లు జరుగుతుంటాయండీ : ఎప్పుడన్నా నాడా మేకు చిగురంటి, కాలికి దెబ్బతగులుతుంది, నెత్తురుకారుతుంది, వెంటనే మందిస్తాను....మందంటే జీడి, గుగ్గిలం,దూది కలిపి తయారుచేసి దాన్ని గాయానికేసి కడతా, తెల్లారేటప్పటికి నయమవుతుంది .. ఒక్కొక్కప్పుడు మేకులు పైకి వెళ్లుకొస్తాయి. నాడాను దాటి గిట్ట వెలుపలికి పొడుచుకొని ఉంటుంది. అప్పుడేం చేస్తానంటే, మేకును పక్కకు వొంగకొడతా. గిట్టను ఉలితో చిప్పేసి, బలుసాకురాయితో సునుపుచేస్తా. నడిచేటప్పుడు కొన్ని ఎట్లకు గిట్టలు రాసుకుంటాయి. అలాంటప్పుడు గిట్టలకు లోవరసగా ఉండేటట్టుగా నాడాలు కొడతా!" ఇవన్నీ కాశయ్య అభినయిస్తూ సులువుగా తెలియడానికి మధ్యమధ్య బొగ్గుతో నేలమీద గీస్తూ చెప్పుకొచ్చాడు.

అతనిది పెద్ద సంసారం. నలుగురు పిల్లలు. పెద్దాడు అయిదో తరగతివరకూ చదివి మానేశాడు. రెండు, మూడు ఆడపిల్లలు. ఆఖరు వాడికి ఎనిమిదేళ్ళు. పెద్దబ్బాయికి ఈ మధ్యనే కలప అడితిలో పనికి కుదిర్చాడు. భార్య– ఇంటిదగ్గరే మేకులు తయారుచేస్తుంటుంది.

"ఏం పెనుక్కుంటే ఏముందిబాబూ ? పొట్ట గడవడం కష్టం. అందరం ఒళ్ళు పులిసిపోయేలాగా విరగబడతాం ...అయినా అంతేనండీ: దీనికి తోడు, ఈ పోలీసుల పీడాకారం ఒకటి- వారానికోసారి, పదిరోజులకోసారి వచ్చి, రెండో మూడో లాక్కుపోతారు. ఇవ్వకపోతే కేసు పెడతారు....లేదు బాబూ, సొంతకొంప లేదు. అప్పుడెప్పుడో పేదోళ్ళకు స్థలాలు ఇస్తామన్నారు, దరఖాస్తు చేశా. మా బస్తీ లీడరు మా దగ్గర పదేసిపదేసి వసూలు చేశాడు. ఇంకా 'ఇదిగో' 'అదిగో' అంటూనే ఉన్నారు. గట్టిగా అడగలేం. అడిగిన వాళ్ళను ఆయన కొట్టించాడు" అన్నాడు కాశయ్య తాగుతూన్న సిగరెట్టును కొలిమిలోకి విసిరేస్తూ.

సంవత్సరంలో ఏడెనిమిది మాసాల పాటే ఈ పని ఉంటుందట.

"మిగతా రోజుల్లో గడ్డపారలు చీరుస్తా. కొడవళ్ళు సానపడతా. గొడ్డళ్ళు తయారుచేస్తా. మేమిచేస్తే ఏముంది లెండి ? పొద్దున లేస్తే ఎట్లా గడుస్తుందా అన్న భయంతోనే చస్తుంటాం !"

నిజమే !

ఆ భయం – బతుకంటే భయం అతని నిలువునా కనిపిస్తూనే ఉంటుంది.

ఆతని భయం తీరేదెప్పుడు ?

అందరిలా అతనూ తృప్తిగా, నిర్భయంగా జీవించేదెప్పుడు ??

రిండి . చూపించుతాను అదే ! ఏదో ఒకనాటికి నేనూ ఇందులో చోటు చేసుకోవచ్చని ఏమ్తుందని, నేను అనుకోలేదు సుమండీ !" అన్నాడు శామ్యూల్.

రూపాయిస్తే, మెరుపు మెరిస్తే

"నా చదువుకూ, నేను చేస్తున్న పనికీ ఏమీ సంబంధంలేదని మీరు అంటున్నారు. ఉన్నదని నేనంటున్నాను". అన్నాడు శామ్యూలు ఆనంద రావు హాయిగా నవ్వుతూ.

అప్పటికే ఎండ మిటమిటలాడి పోతున్నది. మురుగు కాలువ మీది దోమలు జుమ్మని తుగిడీలు తుగిడీలుగాలేచి, కాసేపు అటూ ఇటూ తచ్చాడి మళ్లా కాలవమీదనే వాలి విశ్రాంతి తీసుకుంటున్నాయి.

చేతి వేళ్ళను ఒకసారి విరుచుకొని, పెటపెటలాడించి కుమురుగా కూర్చున్నాడు శామ్యూలు ఆనందరావు.

"నేను 'జీవన సమరం' చూస్తున్నాను. చదవడం లేదనుకోకండి. చదువుతున్నాను. బతుకులో ఎంత వైవిధ్యం ఉన్నదీ, బతకడం కోసం మనిషి ఎన్నిపాట్లు పడుతున్నదీ చెబుతున్నారు. వాటినన్నింటిని నేను ఆపాఠ్యంగా దాచుకున్నానంటే మీరు నమ్ముతారా ? ఓసారి మా ఇంటికి



అతని పూర్వీకులు హిందువులేనట. ముత్తాతగారో, ఆయన నాన్నగారోగాని, 'మతం' పుచ్చుకున్నారట. అంతదాకా, తమకు చదువన్నదే లేదట.

"మా తాతగారు రైల్వేలో పనిచేశారు. అట్టే పెద్ద ఉద్యోగమేమీ కాదు. ఓ గేటు దగ్గర కాపలాదారు. రైలు రావడానికి ముందు గేటు వేసేవారు. పచ్చజెండా చూపించేవారు. రైలు పోగానే గేటు తీసేవారు. ఆయనకు ఆరుగురు పిల్లలు. మానాన్న పెద్దవారు. అందరూ అంతో ఇంతో చదువుకున్నవారు! ముగ్గురు చిన్నాన్నలు స్కూల్లు మాస్టర్లుగా పనిచేశారు. ఇద్దరు చిన్నాన్నలు మత ప్రచారకులుగా పని చేశారు. మా నాన్న పోలీసు డిపార్టుమెంట్‌లో చేరాడు. మానాన్న—ఆరోజుల్లోనే స్కూల్లు ఫైనలు ప్యాసయాడండి! అప్పట్లో దొరలదే కదండి రాజ్యం. జిల్లా కలెక్టరుగా ఒక దొరగారుండేవారు. ఆ దొరగారికి మా నాన్నగారంటే చాలా ఇష్టం. ఆ ఇష్టానికి కారణం కూడా చెప్పనా? మా నాన్నది చక్కని గొంతు. క్రైస్తవ భక్తి గీతాలను చాలా బాగా పాడేవారు, ఆ పాట కోసం ఎంతోమంది మా యింటికి వస్తూండేవారట. దొరగారికి ఈ సంగతి తెలిసి మానాన్నను పిలిపించుకొని పాడించుకున్నారట. అప్పటినుంచి మా నాన్నగారు తీరిక దొరికినప్పుడల్లా కలెక్టరుగారి బంగళాకు వెళ్ళి పాటలు పాడుతూ ఉండేవాడట. ఇలా కొంత కాలం గడిచింది. ఆ దొరగారికి మద్రాసుకు బదిలీఅయింది. ఆయన పోతూపోతూ మానాన్నకు పోలీసుశాఖలో ఉద్యోగమిచ్చి వెళ్ళాడు." అన్నాడు శామ్యూలు ఆనందరావు.

"మానాన్న పోలీసు ఉద్యోగానికి పనికొచ్చే మనిషి కాదండి!" అని వ్యాఖ్యానించాడు శామ్యూల్ ఆనందరావు.

"ఆయన పరమ భక్తుడు. ఉద్యోగంనుంచి వచ్చాక ప్రార్థనలు, భజనలు చేస్తూఉండేవారు. దిక్కూమొక్కూలేని వారిని చేరదీసి చదువు చెబుతుండేవాడు. అప్పుడప్పుడూ, అనాథ బాలలను ఇంటికి తీసుకొని వస్తూ ఉండేవాడు. మరియమ్మకూడా ఏమీ అనేదికాదు. పైగా, ఈ అనాథ బాలల్ని కడుపులో పెట్టుకొని సాకేది. పావలా, బేడా, అణా ఎంతవుంటే అంత వారికిచ్చి పంపుతుండేది."

"ఇవన్నీ చెడ్డపనులనీ, నేను అననుగానండీ! కాస్త వెనకా ముందూ చూసుకోవాలంటాను. మానాన్న ఆ పని చేయలేదు. ఆయనతో పాటు ఉద్యోగాల్లోచేరిన వాళ్ళు బాగా సంపాదించుకున్నారు. ఆయనకు ఆ పెన్షన్‌తప్ప మిగిలిందేమీలేదు.... మీరు నన్ను క్షమించాలి. మానాన్నను విమర్శించడంలేదు, నా సంగతికొస్తున్నాను. మేము అన్నదమ్ములం, అక్కచెల్లెళ్ళం కలిసి, ఎనమండుగురం. మా పెద్దన్నయ్య టీచర్. రెండోవాడు, మూడోవాడు మతప్రచారం చేస్తున్నారు. మగవాళ్ళలో నేనే ఆఖరు వాణ్ణి. మా అక్కయ్య ఇద్దరు పిల్లల్ని కని చనిపోయింది. ముగ్గురు చెల్లెళ్లు. అందులో ఇద్దరు నర్సులుగా పనిచేస్తున్నారు. ఆఖరు

ల్లెలు ఇంకా చదువుకుంటున్నది. మా చదువులకు మానాన్న చెల్లిం
ంది దాదాపుగా ఏమీలేదండీ. నామట్టుకు నాచదువు అంతా స్కాలర్‌షిప్
ుదనే లాగించేశాను. మిగిలినవారికి మా మత సంస్థలు సహాయంచేశాయి
గాకూ అలాంటి సహాయం దొరికిందనుకోండి నేను యమ్మేకూడా
చదువుదామనుకున్నాను. కాని బియ్యే పూర్తిచేసేసరికి పెటపెటలాడి
పోయింది. ఉద్యోగం చేసుకుంటూ చదువుకుందామని సరిపెట్టుకున్నాను.
ఉద్యోగంకోసం నేనెన్ని ప్రయత్నాలు చేశానో చెబితే మీరు ఆశ్చర్య
పోతారు. చాలా వాటికి దరఖాస్తు చేశాను. రిటెన్ ఎగ్జామినేషన్‌లో
పాసయ్యేవాడిని. ఇంటర్వ్యూలో తప్పాననేవాళ్లు. ఇదంతా పెద్ద ఫార్సు
సార్! ఇంటర్వ్యూలో వాళ్లు అడిగిన ప్రశ్నలన్నింటికి తంచనుగా సమా
ధానం చెప్పేవాడిని. అయినా తప్పిపోయావంటారు. ఇదెలా సాధ్యమో
నాకు చచ్చినా అర్థం కావడంలేదు. ఓ చిన్న ఉదాహరణ చెబుతాను.
1977 జూన్‌లో ఒక బ్యాంకువారు, ఫలానా ఫలానా ఉద్యోగాలకు దర
ఖాస్తులు కావాలన్నారు. రాదని తెలిసికూడా అప్లయిచేశాను. అంతా
మామూలుగానే రిటెన్ ఎగ్జామినేషన్‌లో మంచి మార్కులతో పాసు
అయ్యాను. ఇంటర్వ్యూకు ముందో ''పెద్దమనిషి'' నా దగ్గరకొచ్చాడు.
ఐదువేలు ఖర్చుచేస్తే ఆ ఉద్యోగం ఖచ్చితంగా ఇప్పిస్తానన్నాడు. నా
దగ్గర అంతడబ్బులేదు. నాతోబాటు ఆ తరహా ఉద్యోగాలకు దరఖాస్తు
చేసిన ఇద్దరు అతనడిగినదంతా యిచ్చి, ఆ ఉద్యోగాల్లో చేరిపోయారు.
నేనేమో ఆ ఉద్యోగుల వాచీలకు మెరుగు పెడుతూ బతుకుతున్నాను."
అన్నాడు ఆనందరావు దిగులుగా.

"నేను చదివిన చదువుకూ, నేను చేస్తున్నపనికీ సంబంధంలేదని
మీరు అనకండి. సంబంధం ఉన్నదని నా అభిప్రాయం. ఈ దేశంలో
చదువుకున్న వాడికి బతుకుతెరువు లేదు. ఈపాటి గడియారాల మెరుగు
పని కోసం అన్ని సంవత్సరాలు చదవడం శుద్దదండగ. మీరు సంస్కారం
అబ్బిండగదా అంటున్నారు. కాలేకడుపుకి పిడికెడు అన్నం పెట్టలేని
సంస్కారాన్ని తగలెయ్యాలిగాని మెచ్చుకుంటారేమిటి?'' అన్నాడు ఆనంద
రావు.

ఈపని చేస్తున్నందుకు ముందుగా కాస్త అభిమానపడిన మాట
నిజమేనన్నాడు. ఇప్పుడు ఎనకా అభిమానం గిభిమానం లేదన్నాడు.
తననుచూసి మిగిలినవాళ్లు సిగ్గుపడాలిగాని తనుగా సిగ్గుపడవలసిందేమీ
లేదన్నాడు.

"వాచీకి పైసా మెరుగుపెడితే ఒక్కరూపాయి తీసుకుంటాను. అద్దం
మాత్రం మెరుగు పెట్టాలంటే 75పైసలు తీసుకుంటాను. అంటే అద్దం
ఊడదీసి, పైనా లోతట్టునా 'బఫ్' చేస్తానండి. అద్దమూ వాచీకి అడు
గునా చుట్టూరా మెరుగు పెట్టాలంటే, రూపాయిన్నరా, రెండు రూపా
యిలూ తీసుకుంటాను. రోజుకు పదీ, పన్నెండు రూపాయిలు దొరుకు
తాయి. ఒక్కోసారి 15 కూడా దొరుకుతాయి. రెండు మూడుదొరకని
రోజులూ ఉన్నాయి. సామానంతా ఈ పెట్టెలో సర్దుకుని మడతబల్లను
భుజానికి తగిలించుకొని ఎక్కడికి కావాలంటె అక్కడికే వెళతాను. కానీ,
పూరంతా తిరగవలసిన అవసరం ఎప్పుడోకాని రాదు. నాకు ఈ పనే

హాయిగా వుంది. కష్టంకొద్దీ ఆదాయం.'' అన్నాడు శామ్యూలు ఆనందరావు.

అతనికింకా పెళ్ళికాలేదు. ఇప్పుడే చేసుకోవాలనికూడా లేదట. తన చెల్లెళ్ళకు సంబంధాలు చూస్తున్నానని, కుదిరితే ఈ నెలాఖరులోగా చేసేస్తానని అన్నాడు.

మా గొడవలు మాకు ఉన్నాయండీ, మాది పెద్దీ చెర్చి. ఈ చెర్చికి చెందినవాళ్ళే దొరకాలి. వారికి మా చెల్లెళ్లు నచ్చాలి. అంతకన్నా ముఖ్యం మా చెల్లెళ్ళకు వాళ్ళు నచ్చాలి. ఇవిగాక డబ్బుదస్కం ఇతర ఖర్చులు ఇవిగో ఇన్ని ఉన్నాయి. అన్నాడు శామ్యూల్ ఆనందరావు తన చింపిరి జుట్టును చూపుతూ.



బోడి పెత్తనం బొమ్మలాట

"నేను చాలా మొండి ముండాకొడుకును. ఏదన్నాసరి మొదలు పెట్టకుండానే వుండాలి – మొదలు పెట్టానంటే ముగించేదాకా వదలను. దానచావో, నాచావో తేలాల్సిందే. ఇప్పటికి ముప్పయి పన్లుచేశాను. ఇది ముప్పయిరెండోపని. దీన్ని కూడా ఎప్పుడు మానేస్తానో చెప్పలేను. దీన్నే ఇంకో పదికాలాలపాటు అంటిపెట్టుకొని వుంటానేమో అంతకన్నా చెప్పలేను." అన్నాడు కేశవులు సిగరెట్టుకాలుస్తూ.

అతని వేషంచూస్తే, అలా అనిపించదుగాని మాట ధోరణిచూస్తే రవంత గట్టివాడేననిపించింది.

పుట్టినపూరూ, చిన్నప్పటి సంగతులు, అమ్మానాన్నల వివరాలూ అడిగినప్పుడు కేశవులు చిరాకుపడ్డాడు. "మీరు పోలీసులు కాదుగదా! ఈ గొడవలన్నీ ఎందుకండీ మీకు? ఈసుండమోపి దేశంలో ఏపూరయితేనేమండీ బాబూ అన్ని ఊళ్ళావల్లకాడుల్లాగే ఉన్నాయి. మనిషన్న తరువాత, ఏదో ఒక వూళ్ళో, ఎప్పుడో ఒకప్పుడు పుట్టక తప్పదుగదా? మరింక ఆ సంగతులు ఎత్తకండి, ఆ వూరన్నా, అక్కడి మనుషులన్నా నాకు పరమ అసహ్యం. అమ్మానాన్నల సంగతి అడిగారు, వాళ్లు బతికేవున్నారు. రెండేళ్ళకో మూడేళ్ళకోవెళ్ళి చూసొస్తుంటా. వాళ్ళ పేర్లు మీరు అడగనూ కూడదు. నేను చెప్పనూకూడదు. మీరు మరీ బలవంతంచేస్తే, అసలు చేప్పడమే మానేస్తా. అమ్మానాన్నల పేర్లు అబద్ధం చెప్పటం నాకిష్టంలేదు.



నిజంచేప్పి వాళ్ళ పరువును నట్టేట్లోముంచడం, అంతకన్నా ఇష్టంలేదు. కనుక బాబూగారూ, నన్ను పదేపదే గీమారబాకండి" అన్నాడు కేశవులు. చిన్నదయిపోయిన సిగరెట్టుకు మరో సిగరెట్టు అంటిస్తూ.

అతను ఎనిమిద్దాకానో, తొమ్మిద్దాకానో చదువుకొన్నాడట. పరీక్ష పాసుకాలేదుట. "ఎందుకవుతానో ఎలా అవుతానో చెప్పండి? చీకటితో లేవాలి. గొడ్ల దగ్గర పేడదీయాలి, కొట్టం వూడవాలి. గుళ్ళో బావి నుండి పాతిక్కావిళ్ళ నీళ్ళు మొయ్యాలి. పచ్చడో, గిచ్చడో వేసుకొని ఇంత సద్దోగిద్దో ఆదరా బాదరా నోట కుక్కుకుని బడికిపోవాలి. అక్కణ్ణుంచి స్కూలుకురాని పిల్లల్ని పిలవడానికి ఊరట తిరగాలి. అయ్యోవారు రోజూ నన్నే పంపేవారు. చదువు పీడా తప్పుతుందని నేను కూడా బలాదూరు తిరుగొచ్చేవాణ్ణి. పంతులుగారు నన్నే ఎందుకు పంపేవారో, నాకప్పుడు తెలిసింది కాదు. ఇప్పుడు గ్రహించాననుకోండి. లాభం లేదు గదా మళ్ళా సాయంత్రం నీళ్ళమోత. గొడ్లకు మేత వేయడం, చొప్ప అయిపోతే, వామిదగ్గరకు నేనే వెళ్ళి తీసుకురావాలి, దాన్ని నేనే నరకాలి, నేనే వేయాలి, ఇంత చండాలం మధ్య, చదువెలా సాగుతుందో చెప్పండి. ఇంతకన్నా బాధలుపడి, చదువుకొన్న మహానుభావులూ వున్నారనుకోండి. నేను మహానుభావుణ్ణి కాదు బాబోయ్, చాలా మామూలు వాణ్ణి, ఈ దేశంలోవున్న లక్షమంది బోడి సన్నాసుల్లో నేనొక సన్నాసిని. అందుకనే ఇలా సన్నాసిగా బతుకుతున్నా" అన్నాడు కేశవులు.

అతను చాలా పనులు చేశాడు. సోడా అమ్మడం, ఐస్‌క్రీం అమ్మడం, రిక్షా తొక్కడం, రేస్ పుస్తకాలు అమ్మడం, ప్లాస్టిక్ ఫాక్టరీలో పని చేయడం, సినిమాహాల్లో సైకిళ్ళకు కాపలా ఉండడం, వడ్డీవ్యాపారస్తుని వద్ద 'దాదా'గా పనిచేయడం, కలప అడితీలో కోతపని చేయడం ఇంకా సవాలక్ష పనులు చేశాడు.

"నేను సోమరిపోతును కానండీ. కానీ కావాలనే నేను సోమతనాన్ని అలవాటు చేసుకొన్నాను. పది రూపాయలున్నాయనుకోండి పనిచేయ బుద్ధిగాదు. ఆ పదీ అయిపోవాలి ఆ తరవాత అప్పుచేస్తాను. నాకూ ఐదూ పదీ అప్పులిచ్చే వాళ్ళున్నారెండి. అప్పు కూడా పుట్టనప్పుడు పస్తులుంటాను, ఇక పస్తులుండలేనని తోచినప్పుడు మళ్ళా ఏదో పని లంకించుకొంటాను. చేస్తాను.

నాలుగు పిచ్చికలు సంపాదించు కొంటాను. ఇదీ తంతు. ఈ పని మాత్రమే చెయ్యాలని నాకుపట్టింపులేదు. ఏదయినా చేస్తా. నాకభ్యంతరం లేదు" అన్నాడు కేశవులు.

ఒకచోట కుదురుగా వుండాలనిగానీ, జీవితంలో సిరపడాలని గానీ, తనకు లేనేలేదన్నాడు? అప్పుడప్పుడు పేకాట ఆడతాననన్నాడు. 'పులి జూదం' ఆటలో తను వోడిపోవడమంటూ ఇంతవరకూ జరగలేదన్నాడు. తాగుతాననీ తందనాలాడతాననీ అన్నాడు.

"గజమొంచిని గనకా మీరంటే నాకు భయంలేదు గనకా, కత్తితో కోసినట్లు చెబుతున్నానండీ మీరుమాత్రం తాగరా?" అన్నాడు కేశవులు. సమాధానం విని అతనూ ఫకాలుమని నవ్వాడు.

"మీలాంటి వాళ్ళసంగతి పోనీండి నేను తాగుతా. మీలాంటి వాళ్లు నాకన్నా చెడతాగుతారు. ముండా ముతకతో తిరుగుతారు. మీ యిష్ట మొచ్చిన క్లబ్బుకో, బారుకో వెళ్ళి చూడండి. మీ వంటి వాళ్ళక్కడ

లేడు మంది కనపడతారు. వాళ్లకు లేని బిడియం, తప్పు నాకెందుకండీ ? ఒకసారి మీరేమి అనుకోకండి సార్ — నెలరోజులపాటు 'వి డి వార్డులో ఉన్నాను" అన్నాడు కేశవులు.

తనచుట్టూ ముసిరిన సమాజంమీద గల ద్వేషాన్ని తీర్చుకునే మార్గంలేక, ఆ కసిని తనమీద తనే తీర్చుకుంటున్నాడేమోనని పించింది. "ఈ బిజినెస్ వాటంగానే ఉందండీ! ఈ పాత్రలైనా నావి కాదండీ. ఒక సేట్ కొనిచ్చాడు. నేను పాత గుడ్డలకు వీటిని అమ్ముతాను. ఈరోజుల్లో చినిగినవాటని నలిగినవాటిని కట్టుకునేవారేలేరండి. కాస్త చినిగిందనుకోండి, కొర్రుపట్టిందనుకోండి, ఏ మడతదగ్గరో పీచురేగిందనుకోండి, అవతల పారేస్తారు. అదిగో—అలాపారేసేవారే నాకు కావాలి. ఓపల్చటి స్టీల్‌గిన్నెకు రెండుపాంట్లు పడేసి పుచ్చుకుంటుంటా. గిన్నె ఖరీదు 10, 15 కు మించి ఉండదు. పాంట్లు ఖరీదు.... అయ్యో! అలా బతుకును ఈడ్చుకొస్తున్నా. నాకు పెళ్ళాంలేదు. పెళ్ళికాలేదుసార్ ! ఉన్నదంతా ఖర్చుచేస్తా. అయిపోతే, మళ్ళీ సంపాదిస్తా. సంపాదించడం చాతకానివాడికి భయం. సక్రమంగా బతకలేననుకోండి. మాయచేసి బతుకుతా....అదిగో! మళ్ళీ మీరా ప్రశ్నలడక్కూడదు. నేను చెప్పుకూడదు ... నేనెక్కడుంటానని మీరొస్తారండీ!" అన్నాడు కేశవులు. ఈమధ్యనే విడుదలైన ఓ తెలుగు సినిమాలోని బూతుపాటను ఈలమీదపాడుతూ.

ఆర్చేదెవరు ? తీర్చేదెవరు ?

ఇప్పుడంటే మనకు, కాగితాలూ, అచ్చుయంత్రాలూ, వచ్చాయి గనుక, పుస్తకాలూ, పత్రికలూ అచ్చయి, అన్ని సమాచారాలూ, అందరికీ అందుబాటులోకొస్తున్నాయి. అచ్చుయంత్రం రాకముందు సంగతేమిటి?

అప్పుడేమో, కాగితం ఉండేది. దానిమీద కరక్కాయ రసంతో పక్షి ఈకలతో రాస్తూవుండేవారు. ఇంతకన్నా ముందు, ఆకులమీద—ముఖ్యంగా తాటి ఆకులమీద మొనగలిగిన ఉక్కు గంటంతో రాసేవారు. ఈ దశకన్నా ముందిదశలో—మెత్తని మట్టిని పలుచని బిళ్ళలుగా మలిచి, అవి కరపచ్చిగా ఉన్నప్పుడే, కోసుగావుండే ఏ పుడకతోనో తాము చెప్పదలుచుకొన్నదాన్ని వాటిమీద రాసి, ఆరబెట్టి, దోరగాల్చి భద్రపరచుకొనే వారు.

మరి ఇంతకు పూర్వం మాటేమిటి? అప్పటివారికి మాట లేదా? పాటలేదా? ఆట లేదా? మానవుడు కొండగుహల్లో నివసించే రోజుల్లోనూ సామూహికంగా పాడుకొనేవారనీ, ఆడుకొనేవారనీ చెబుతారే? ఒకో తెగకు సంబంధించిన సాహస కృత్యాలు, వీరగాధలు, అలా అలా పైపైకి, ఒక సమూహంనుండి మరో సమూహానికి చేరుకొంటూ ఉండేవి అంటారే! నిజమే!

వీరగాధలను గానంచేస్తూ, ప్రచారంచేస్తూ, అదే వృత్తిగా బతికే తెగలు, కొన్ని అనాదికాలంనుండి ఉన్నాయి. ఆసిరస్ దేవుని అద్భుత గాధలను గొంతెత్తి పాడుతూ, ఊరూరా, ఇల్లిల్లూ తిరిగే చారణులు ఆనాడు గ్రీకు దేశమంతటా ఉండేవారని చరిత్ర చెబుతున్నది. ఇదేదో ఆ దేశానికే పరిమితం కాదు. ఇటువంటి దశను ప్రపంచ దేశాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవించనే అనుభవించాయి.

క్రొస్తు అటూ యిటూగా మనదేశంలోనూ యిటువంటి చారణులు వున్నారు. మధ్యయుగాల్లో ఈ జాతులవారిని రాజులూ మహారాజులూ పోషిస్తూ ఉండేవారు. ప్రభువులు బలపరాక్రమాదుల్ని కమ్మని కథలుగా మలిచి, విరాడ్భుత రసాల్ని చోడించి పాడవాడా ప్రచారంచేయడమే వీరి పని. ఇంచుమించు అంతో యింతో ప్రతిఫలం, ప్రభువులనుండి వీరికి ముడుతూ ఉండేదేమో! రానురాను—యిదొక వృత్తిగా మారిపోయింది. ఈ వంశీయులకు, యిదితప్ప మరేమీ చేతకాని దశ సంభవించింది.

'పంట, పిచ్చిగుంట,' 'వీరముష్టి' మొదలయిన తెగలవారు ఈ కోవలోకే వస్తారు

ఇదంతా ఈ భాషలోనే రాంకిష్టయ్య చెప్పలేదు గానీ, అతను చ్పిందాని సారాంశం మాత్రం యిదే!


"మా ముత్తాత, మాతాత, మాఅయ్య ఈపని చేశారు. ఇదిగో– ఈ హయాంలోనే ఇది నాశనమయిపోయింది" అన్నాడు రాంకిష్టయ్య బాధగా.

రాంకిష్టయ్యకు, తన తాతగారి కథల సంగతి అంతగా గుర్తులేదు గాని, తండ్రి సంగతి మాత్రం బాగా జ్ఞాపకముంది. తాతగారు, బాగా కథలు చేప్పేనాటికి, రాంకిష్టయ్య చిన్నవాడు. అతనికి కాస్త ఊహవచ్చే నాటికే సింగయ్య ఉసిలిపోయాడు. అప్పటికి, అప్పుడప్పుడూ, గొంతు కలుపుతూనే వుండేవాడుట.

"నీరుకావి పంచ, మోకాళ్ళదాకా తలగుడ్డ చుట్టేవాడు. పట్టెనామాలు పెట్టుకొనేవాడు. మెళ్ళో పూసల పేరూ ఉండేది. ఏకతార మీటుకొంటూ రామాయణం చెప్పేవాడు. భారతం చెప్పేవాడు. మాలక్ష్మిమ్మ కథ చెప్పేవాడు ..."

రాంకిష్టయ్య ఓ నిమిషం ఆగాడు. అతని కళ్ళు తళుక్కుమన్నాయి. ఒక్కసారి ఏకతారను మీటి, ఖాళీగావున్న జూవెను అటూ యిటూ కదిపాడు.

"ఆ కాలమే వేరు. ఆ రోజులే వేరు. ఇప్పుడంతా మిడి మూలపు సరుకు బాబుగారూ. ఓ భయంలేదు, భక్తిలేదు. చూస్తూ



చూస్తూ ఉండగానే నా కళ్ళముందే, లోకం పాతయిపోయిందండి." ఇట్టి మారుతున్న సమాజంపై అతని వ్యాఖ్య.

తమకో ఊరంటూ లేదన్నాడు. తమ పూర్వీకులది కర్నూలు జిల్లా అన్నాడు. కొంతమంది మాచెర్ల దగ్గరా, ఇంకొంత మంది కనిగిరి ప్రాంతంలోనూ ఉన్నారన్నాడు. వాళ్ళయినా ఇప్పుడే వృత్తిలోలేరనీ, చదువుకొని, ఏవో పనిపాట్లు చేసుకొంటున్నారనీ అన్నాడు. ఇంకొంత మంది కూలీ నాలీ చేసుకొని బతుకుతున్నారట.

''నేనే ఇంకా దీన్ని వదల్లేకుండా ఉన్నానండీ!... కారణం నాకే తెలియదు. ఈ వృత్తిమీది గౌరవం అలాంటిది. తరతరాలనుంచీ నమ్ముకొన్న వృత్తి. పిడికెడు అన్నం పెట్టకపోదన్న నమ్మకం నాకింకావుంది'' అన్నాడు రాంకిష్టయ్య, ''ఇదే మావాడితో వచ్చిన సావండీ !'' అన్నాడు బలేరాముడు.

అసలు పేరు బలరాముడు అయివుండాలి. అప్పుడప్పుడు 'బలే రాముడినీ బాలిరాముడని' రాంకిష్టయ్య సంబోధించాడు. ఆమాటకొస్తే తనపేరుకూడా 'రామకృష్ణయ్య' అయివుండాలి.

''ఊరి నడిమధ్య ఏ గంటలమ్మ చెట్టుకిందో, పోలేరమ్మ గుడి ముందో, రచ్చబండ దగ్గరో, బొడ్రాయి దగ్గరో, రాత్రి తెల్లవార్లూ కథలు చెప్పేవాళ్ళం. అటూ, యిటూ రెండు కాగడాలు, కథ సందర్భాన్నిబట్టి. ఈ దివిటీలమీద అప్పుడప్పుడు గుగ్గిలంపొడి చల్లుతుండేవాళ్ళం. ఒక్కో-ఊళ్ళోనండీ వారమేసి రోజులూ పదేసిరోజులూ కథలు చెప్పేవాళ్ళమండీ'' అన్నాడు రాంకిష్టయ్య.

''ఆ కథలకు ఊళ్ళోవున్న పిల్లా జెల్లా, ముసలీ ముతకా అందరూ హాజరయ్యేవారు. కథలకు ఊరి వాళ్ళు పోటీలుపడి, మరీ భోజనాలు పిలిచేవాళ్లు. ఆఖరు రోజున తలా పావలా, బేడా, గుడ్డ గుడుసూ ఇచ్చి పంపేవారు.

ఒక్కో-సారి ఏదో ఒక ఊళ్ళో కాకుండా మూడునాలుగు గ్రామాల, పొలిమేర దగ్గర కథచెప్పేవారు. తెల్లవారుజాముదాకా జరిగే ఈ కథా కాలక్షేపం తరువాత-అటునుంచి అటే పొలాలకూ పన్లకూ పోయేవారు.

ఇప్పుడలా కథలు చెప్పించుకొనేవాళ్ళూ లేరు. చెప్పినా వినే వాళ్ళూ లేరు'' అన్నాడు బలరాముడు.

''వయస్సులో సగభాగం, ఊరూరాతిరగడంతో గడిసింది. ఇప్పుడూ తిరుగుతున్నామనుకోండి. కథలూ-గిథలూ జాంతానై. ఏవో నాలుగు తత్వాలు పాడతాం. దయగలతల్లి గుప్పెడు గింజలు పిడిలిస్తుంది. లేకపోతే అదీ లేదు.

.... ఆడవాళ్లు మా కథల్లోకిరారండీ: చిన్నపిల్లలుగా వున్నప్పుడు గొంతు కలిపితే కలుపుతారేమోకాని ఈడేరినవాళ్ళను కాగడాముందుకు రానివ్వం....ఎందుకో నాకూ తెలియదు. మాఅమ్మ రాలేదు. నా పెళ్ళాం రాలేదు'' అన్నాడు బలరాముడు రుసరుసలాడుతూ.

రాంకిష్టయ్యకు ఆరుగురు పిల్లలు. బలరామునికి ముగ్గురు పిల్లలు వున్నారిప్పుడు. ఆకలంటే, దరిద్రమంటే ఎరగని తమ చిన్నతనానికి ఇన్నాదేదో బిడ్డలకింత పెట్టి, చెంబెడు నీళ్లు త్రాగి కరకరలాడే పేగులతో ముడుచుకు పడుకొనే ఈ ముదనష్టపు కాలానికి సాపత్యమే లేదని రాంకిష్టయ్య అభిప్రాయం.

"పుణ్యం పుచ్చిపోయింది, పాపం తెగ పెరిగిపోతున్నది, దేవుడు గుళ్ళకే దీపంపెట్టే దిక్కులేదు. అనగూడదుకానీ అక్కడే తాగుతున్నారు అక్కడే జూదమాడుతున్నారు. నానా అంకభండాలం పనులూ చేస్తున్నారు. ఈ ప్రపంచం యింకా ఎక్కువకాలం ఇట్లావుండదు. బ్రహ్మంగారు చెప్పినట్టు ఎప్పుడో పుటిక్కున మునిగిపోతుంది" అని జోస్యం చెప్పాడు రాంకిష్టయ్య.

తన గొంతు జోడించి శపించాడు బలరాముడు.

గంగిగోవు పాలు...

వ్యసం వంద సంవత్సరాలదాకా పోనవసరంలేదు. పాతికేళ్ళ కిందటి జీవితానికీ, ఇప్పటి జీవితానికీ, పోలికలు అసలే లేవని కాదుగానీ— మార్పులు కూడా చాలా ఉన్నాయి. చలపతిరావు భాషలో చెప్పాలంటే, అప్పటి మనుషుల్లో ఉన్న నిజాయితి ఇప్పుడు కలికాని కూడాలేదు.

చలపతిరావు తండ్రిపేరు బసవయ్యగారు. ఆయన మోతుబరి రైతుకాదు. కానీ, తిన కుడవా ఇంత ఉన్నవారు. కాడెద్దుల వ్యవసాయం ఉన్నది. ఆయనకు రోజు గడిచే సమస్యలేదు కనుక తీరిగ్గా రాజకీయాల్లో దిగాడు. ముందుగా, ఊళ్ళో ఉన్న పాతకక్షల కారణంగా ఆయన ఈ ఊబిలోకి దిగాడు. తీరా దిగినాక ఇంక కాలు తీసుకోవడానికి లేకపోయింది. నిండా మునిగినవాడికి చలిఉండదన్న సామెత పట్ల బసవయ్యగారికి పరిపూర్ణ విశ్వాసం ఉండి వుండాలి. ఆయన కాంగ్రెసు రాజకీయాల్లో పీకలమొయ్యా దిగాడు. సభలు జరిపాడు. సమావేశాలు జరిపాడు. ఇద్దరు అమ్మాడు. కల్లుపాకల దగ్గర పికెటింగ్ చేశాడు. అయ్యదేవర కాశేశ్వర రావుగారి తోనూ, గొట్టిపాటి బ్రహ్మయ్యగారితోనూ మన బసవయ్యగార దగ్గరి సంబంధాలుండేవి. ఈ రాజకీయాలవల్ల బసవయ్యగారు ఆర్జించి దేమీ లేదుగానీ, ఉన్న పొలం కాస్తా ఊడ్చిపెట్టుకుపోయింది. ఆయన ఇద్దరు కూతుళ్ళ పెళ్ళికీ, పెద్దమొత్తాలు ఖర్చు చేయవలసి వచ్చింది. ఆయన దేశభక్తిగాని, ప్రభుత్వ వర్గాల్లో ఆయనకున్న పలుకుబడి గానీ, ఆయన కూతుళ్లకు కట్నాలు ఇవ్వకుండా అడ్డు పడలేక పోయాయి.

"మానాన్నతో పని చేసినవారు చాలామంది, చాలా మంచి పదవుల్లోకి వచ్చారండీ! దేశానికి ఏం చేశారో నాకయితే తెలియదు గానీ, వారికి వారు చాలా చేసుకున్నారు. మా నాన్న మరీ నిజాయితీకిపోయాడు. ఎవర్నీ ఏదీ అడిగేవాడు కాదు. ఆయన సంపాదించలేదని నాకు బాధలేదు గానండీ — పూర్వులిచ్చిన ఆస్తినికూడా పాడు చేసినందుకే వాక్కోసారి మనస్సు చివుక్కు మంటుందండీ!" అన్నాడు చలపతిరావు.

"మానాన్న చనిపోయాక మా పరిస్థితి తీకతేరా అయిపోయిందండీ! నాచిన్నప్పుడు మా ఇంట్లో రోజుల తరబడి ఉన్నవాళ్ళు చాలామంది ఇప్పుడు బాగా పైకొచ్చారు. వాళ్ళెవరూ, మా జోలి పట్టించుకోలేదు. మానాన్న అడగడనుకోండి. అభిమానం చంపుకొని నేను కొందర్ని అడిగిచూశాను. ఇదిగో అదిగో అని తిప్పితిప్పి చంపేశారుగాని, పని మాత్రం కాలేదండి. ఆఖరుకు విసుగెత్తి వోటల్లో పనిక్కుదిరాను" అన్నాడు చలపతిరావు.

ఈ పనిలో కుదరడానికి ముందు, అతను చాలా ఆలోచించాడు. ఈ పాటి పని విజయవాడలో దొరక్కపోదు. కాని అతనికక్కడ ఉండ

ఖద్దికాలేదు. తన తండ్రితోపాటు చలపతిరావు కూడా విజయవాడ వీధుల్లో నినాదాలు చేస్తూ తిరిగాడు. అన్ని పార్టీల నాయకులతోనూ అతనికిపరిచయాలున్నాయి. వారందరూ ఇంకా రాజకీయాల్లోనే ఉండి సేవ చేస్తున్నారు. చూస్తూచూస్తూ అతనువారి కళ్ళముందే హోటల్లో పని చేయలేకపోయాడు.

అందుకే అతను వేలికున్న ఉంగరం కాస్తా అమ్మేసి ఆ డబ్బుతో హైదరాబాదు వచ్చాడు. హైదరాబాదు చలపతిరావుకు మరీ కొత్తకాదు. లోగడ తండ్రితోబాటు రెండు మూడుసార్లు వచ్చాడు. వచ్చినప్పుడల్లా హోటల్లో దిగేవారు. సరిగ్గా అదే హోటల్లో చలపతికూడా దిగాడు. ఇది వరకున్న మేనేజిమెంటు మారి, కొత్తవారొచ్చారు.

"ఇదీ మంచిదే అయిందండీ ! తెలిసినవారి దగ్గర పనిచేసే బాధ తప్పింది. రెండు రోజుల తరువాత అదే హోటల్లో కుదిరాను" అన్నాడు చలపతిరావు బిక్కచచ్చిపోయిన ముఖంతో.

అతనికి హోటలు పనితో బొత్తిగా పరిచయంలేదు. అయినా నేర్చుకొన్నాడు. ఒక వరసలో ఉన్న ఆరు గదులకూ అతను సప్లయర్. వారిక్కావలసిన టిఫిన్లు, కాఫీలు, భోజనాలు, సిగరెట్లు ఖాతాదారులు కోరినప్పుడు 'మందు' సరఫరా చేయడం అతని డ్యూటీలు. పేరుకు 8 గంటలన్న మాటేగానీ, 10, 12 గంటలు కూడా చేసేవాడు. మెల్లెక్కి, మెట్లు దిగీ, వాళ్ళు హలానంహలానమయిపోయేది. అయినా అతను ఆ



ఉద్యోగాన్ని వదులుకోలేకపోయాడు. రెండు పూటలా భోజనం, టిఫిను,

ఉండడానికి–మరో ముగ్గురితో కలసి, ఓగదీ–ఇంతకన్నా కావలసిందేమీ లేదనిపించింది చలపతిరావుకు.

"నా చేతుల మీదగా కొన్నివందల మందికి సీసాలందించాను. అప్పుడెప్పుడూ నేను బాధపడలేదు. ఏడాదికిందట ఓ సంఘటన జరిగింది. రాజమండ్రినుండి ఇద్దరు కంట్రాక్టర్లు వచ్చారు. వాళ్ళు గోదావరి బారేజీ పనిచేస్తున్నారనుకుంటా. వాళ్ళ బిల్లులేవో పాస్ కావాల్సిఉంది. వచ్చారు. ఆరాత్రి 11 గంటలదాకా తాగారు. తప్పతాగారు. ఏం చండాలం మాట్లాడుతున్నారో వారికే తెలీనిదశ. అందులో ఒకడు నన్ను 'ఒరేయ్' అని పిలిచాడు. పిలిచి 'అమ్మాయికావాల' న్నాడు. అయ్యా! చెబితే మీరు నమ్మకపోవచ్చు. నన్ను నిలువునా కిరోసిన్ పోసి కాల్చినా అంత బాధ పడకపోదును. కిక్కురుమనకుండా, నా గదిలో కొచ్చి ఏడ్చేశాను. మరింక ఈ ఉద్యోగం చేయకూడదనుకొన్నాను. ఆ ఉదయమే మానేశాను" అన్నాడు చలపతిరావు చిన్నబోయిన ముఖంతో.

తరువాత అతను ఉస్మాన్‌ఖాన్ దగ్గర పనిక్కుదిరాడు. ఉస్మాన్ చిన్నరకం వ్యాపారి. హోటళ్లతోనూ, బార్‌లతోనూ, చాలాకాలంగా అతనికి సంబంధాలున్నాయి. ఇక్కడ వాడి పారేసిన సీసాలను అతను చిల్లరగానూ, టోకుగానూ కొని, బొంబాయికి ఎగుమతిచేస్తూ ఉంటాడు. ఉస్మాన్ దగ్గర ఇలా సీసాలు సేకరించేవారు పాతికమందిదాకా ఉంటారు.

"ఈ పాతిక మందిలో నేను ఒకడ్ని. నాకో సైకిలిచ్చాడు. దాని మీద ఊరంతా తిరుగుతా. ఒకటి ఆరా దొరికినాకొంటా. దజన్లలెక్కన దొరికినా కొంటా. విస్కీ, బ్రాంది, రమ్, జీన్, బీరు, వగైరా సీసా కొంటానండి. సీసామీద లేబిల్ పోకుండా ఉంటే, 5, 10 పైసలు ఎక్కువిస్తా. పై కార్కు కూడా సీసాకే వేళ్ళాడుతూ ఉంటే ఇంకో 50 పైసలు ఎక్కువిస్తా. ఎండాకాలం బీర్ సీసాలు బాగా దొరుకుతాయి. వాన రోజుల్లోనూ, చలి రోజుల్లోనూ బ్రాంది, రమ్, సీసాలు బాగా స్తిగా దొరుకుతాయి నాకు వందరూపాయలిస్తున్నాడు జీతం. నేను సేకరించిన సీసాల మీద నూటికి రెండు మూడు రూపాయలు కమీషన్ కూడా ఇస్తున్నాడు. నాకు తెలియదండి! ఈ సీసాలన్నీ బొంబాయి వాళ్ళు ఏం చేసుకుంటారో నాకు తెలియదు. అధవా తెలిసినా చెప్పను. అలా చెప్పడం నాకు ధర్మం కూడా కాదు" అన్నాడు చలపతిరావు నవ్వుతూ.

అతనికింకా పెళ్ళికాలేదు. చేసుకోవాలన్న ఆలోచన కూడా లేదని అన్నాడు. ఈలైన్లో బాగా నిలదొక్కుకోవాలని, నాలుగు రాళ్ళు నిలవ చేసుకొన్న తరువాత గానీ, పెళ్ళి మాట తలపెట్టుకోనని అన్నాడు.

"ఈ రేకుల గదికి నెలకు ముప్ఫయి ఇస్తున్నాను. సొంతంగా వొండుకు తింటాను. ఎప్పుడో గానీ సినిమాలు చూడను. పత్రికలు చదువుతాను. డబ్బు నాకు చేదుకాదు. కాని దానికోసం అంత చండాలం పనులు మాత్రం చేయలేను. ఇంతవరకూ నిజాయితీగా బతుక్కొస్తున్నాను. చూద్దాం ఇక ముందుకూడా, ఇలానే జరుగుతుందో లేదో!" అన్నాడు చలపతిరావు తన ముందున్న సీసాల గుట్టమీదికి చూపుల్ని తిప్పుతూ.

ఈ నిజాయితీతో, ఈ దగాకోరు సమాజంలో, చలపతిరావు ఏం సాధించగలడన్నది ముందు ముందుగానీ మనకు తెలీదు. * *

తాజ్‌మహల్ నిర్మాణానికి...

గన్నవరం విమానాశ్రయం, తెనాల్లోని రైల్వే ఓవర్ బ్రిడ్జి, రాజమండ్రి దగ్గర బారేజి, హైదరాబాదులోని-హోటల్, అనంతపురంలోని-సినిమా హాలు చూసిన వారికి, శేషయ్యపేరు తెలిసే అవకాశంలేదు. వీటి నిర్మాణంలో పాల్గొన్న వందలాది కూలీల్లో శేషయ్య ఒకడు. అందుకే అతనికో ఊరంటూలేదు.

"పుట్టిందేఊరని మీరన్నారనుకోండి నేను, తెనాల్లో గంగానమ్మ గుళ్ళో పుట్టా. నేను పుట్టిన వారంరోజులకల్లా మా అయ్య బెజవాడ వచ్చాడు. అక్కడ నాలుగైదేళ్ళు ఉన్నామంట. ఇదంతా మానాన్న చెబితే నాకు తెలిసిందిగానీ, నాచిన్నతనం నాకు బొత్తిగా గుర్తులేదండీ!" అన్నాడు శేషయ్య, తాపీకి అంటుకున్న సిమెంటును, రాయికేసిరాస్తూ.

తన తండ్రిమీదా, అతని పనివాడి తనంమీదా శేషయ్యకు, చాలా గౌరవముంది. తన తండ్రి, ఇంతెత్తున ఉండేవాడుట. జెవులకు కర్ర



పోగులుండేవిట. ఎడంకాలికి వీర్రాఘవుల కడియం వుండేదిట. బిళ్ళల మొలతాడు వుండేదిట. నొట్టపోయిన పెండి మురుగులుండేవిట. అన్నం తినేప్పుడు, నిద్రపోయేప్పుడు తప్ప, ఎప్పుడూ చుట్ట కాలుస్తూనే ఉండేవాడట.

"అలాంటి పనివాణ్ణి మళ్ళీ నేను చూడలేదండీ! చిన్న మలాటాతో నరుకుడురాయి అంచుకొట్టి, మూలమీదనుంచోబెట్టాడంటే, మూల మట్టానికి సరిపోయేది. నాకు తెలిసినంతలో కొన్నివందల బిల్డింగులు ఆయన కట్టాడు. మూడేసి నిలువుల రాతిగోడలూ, ఇటికగోడలూ కట్టడం నాకు తెలుసు. మళ్ళీ నూలువేసి చూసుకోనవసరంలేదు. జవరంగా, గజం బద్దకు సరిపోతుందేతప్ప నూలువాసికూడా తేడా ఉండడానికే వీల్లేదండి!" అన్నాడు శేషయ్య, పొగాక్కాడను, సాయతీస్తూ.

ఈ చుట్ట కాల్చే అలవాటు తనకు చిన్నతనంనుంచి ఉన్నదన్నాడు. చిన్నప్పుడు తనకు ఉబ్బసం ఉండేదిట. చుట్టతాగితే పోతుందని వైద్యుడు చెబితే, అప్పణ్ణించి అలవాటయిపోయిందన్నాడు శేషయ్య.

"ఆ రోజుల్లోనండీ! రూపాయికి 3మూనికల బియ్యం ఇచ్చేవాళ్ళు. మీరు నమ్మరు. నాకు తెలుసు. నేనే తెచ్చాను. ఒకసారి గుంటూర్లో, ఏదో పనిచేస్తున్నామండీ! నంబూరు దగ్గర, రూపాయికి 3 మూనికల గిద్దెడు బియ్యం యిస్తున్నారని ఎవరో అన్నారు. నేనూ, మా అయ్యా, వంబూరు దాకా నడిచి వెళ్ళి. మూడు రూపాయల బియ్యం తెచ్చాం.... ఇప్పుటంటే రూపాయికి ఏమీ రావడంలేదు గానండీ ఆరోజుల్లో కంటికి రూపాయి కనబడేదేకాదండీ! కానీకి-కాన్లు మీకు గుర్తేగదండీ-మామిడికాయ మార్కు చిన్న అగ్గిపెట్టెలు తెండిచ్చే వాళ్లు. నేను కొన్నా" అన్నాడు శేషయ్య అప్పటిసంగతులు గుర్తుచేసుకొంటూ.

ఒక ఊళ్లో స్థిరంగావుండే అవకాశం లేకపోవడంవల్ల శేషయ్య అసలే బళ్లోకి వెళ్ళలేదు. వెళ్ళటం ఇష్టంగాకూడా ఉండేది కాదన్నాడు 'ఎప్పుడన్నా అనిపిస్తుందండి-'అయ్యో చదువుకోలేదే'-అని. కానీ చదువ కొన్న మీబోటి దొరలు, ఉద్యోగాలకోసం పడే బాధలు చూస్తుంటే, చదువులేక పోవడమే మంచిదనిపిస్తుంది. మా ఆఖరు తమ్ముణ్ణి చదవేశాం. వాడికి ఉద్యోగంలేదు. చదువుకొన్న వాడినన్న అహంమాత్రం మాలావు ఉందిబాబూ! అందుకని వాడు ఇక్కడపుల్లతీసి, అక్కడపెట్టడు. కట్టినబట్ట నీగనేయడు. తింటానికి బువ్వ ఉంటేనేం, లేకపోతేనేం, డాబుసరిగా తిరిగితేసరి" అని విసుక్కొన్నాడు శేషయ్య.

చిన్నతనంనుండి, అతను కష్టపడి పనిచేసేవాడు. మరీ చిన్నతనంలో ఒక్కో ఇటిక తీసుకొచ్చి, అయ్యకు ఇచ్చేవాడు, ఆ తరువాత, రెండేసి, మూడేసి ఇచ్చేవాడు. ఇసిక, సిమెంటూ, ఏ పాళ్ళల్లో కలపాలో, ఎలా కలపాలో, ఎలా గోడకడితే పడి కాలాలపాటు గట్టిగా ఉంటుందో శేషయ్య అనుభవపూర్వకంగా నేర్చుకొన్నాడు.

"ఇదేం గొప్ప విద్యకాదండీ! శ్రద్ధవుండాలి, గురి ఉండాలి. మోట రాకుండా చూసుకోవాలి నాచేతిమీదుగా, మూడు హైస్కూళ్ళు కట్టా. ఓ కాలేజీలో సగం నేనేకట్టా. ఇకఇళ్ళు, దాబాలు, మేడలు లెక్కేలేదు. రోజుకు ఆరణాల కూలి దగ్గర్నుంచీ నేను పనిచేస్తూనే ఉన్నానండి!" అన్నాడతను.

కంట్రాక్టర్ల దగ్గర పనిచేయడంలోఉన్న సాధకబాధకాలను అతను త్రంగా చెప్పుకొచ్చాడు. రోజు కూలీ చొప్పున, పనికొప్పుకుంటే చేసే పద్ధతి వేరుగా ఉంటుందని, అదే గుత్తకిస్తే పనిచేసే పద్ధతి వేరుగా ంటుందనీ అన్నాడు.

"నేను చేస్తానని కాదండీ ; గుత్తదారు చేయనియ్యడు. రోజుకూలీ చొప్పున గోడకట్టించామనుకోండి వాం రోజులు పడుతుందనుకోండి. అదే కాంట్రాక్టులిచ్చారనుకోండి మూడోరోజుకు లేచిపోతుంది. ఎందుకని అడక్కండి. అదంతే ; నేనెప్పుడూ కాంట్రాక్టు తీసుకోలేదు. నా రెక్కల కష్టం నాకుంటే అంతేచాలు....ఒకటికి ఐదు, ఆయిబొచ్చెల ఇసుక కలిపితే ఫర్వాలేదుగానండీ—10, 12 కలిపి కట్టినగోడలు, పెళ్ళలు ఊడి పడ్డాయంటే – ఎందుకు పడవండీ ; తప్పకుండా పడతాయి. పనిచేసే వాళ్ళం ఇట్టానే ఛస్తుంటిమి. పనిచేయించే గుత్తదారు కార్లమీద తిరుగుతుండే. ఏ మోసమూ చేయకుండా, ఏ కల్తీ కలపకుండా ఇంత డబ్బెలా, పంపాదిస్తారండీ" ; అన్నాడు శేషయ్య.

ఇప్పుడు శేషయ్య రోజుకు పదిహేను రూపాయలు సంపాదిస్తాడు. ఈ లెక్కన నెలకు 450 మొరుకుతాయనుకోవద్దంటాడు. అన్ని కాలాల్లోనూ పనులుండవనీ, ముఖ్యంగా వర్షాకాలం నాలుగుమాసాలూ, ఊరికే చేతులు ముందుబెట్టుకూర్చోవాలనీ అంటాడు.

అతనికిప్పుడు నలుగురు పిల్లలు. అందరూ మగపిల్లలే ; "వాళ్ళకన్నా చదువు చెప్పించమంటది మా ఇంటిది. చదువుకొంటే పని వంట పట్టదేమోనని నా భయం :" అన్నాడతను

తనేమి నిలవలో లేననీ, ఒక్కడి సంపాదనతో ఇంతమందినీ సాకడమే కష్టమని, అప్పులు మాత్రం లేవనీ చెప్పాడు.

"పండక్కి పబ్బానికీకూడా లాగను. నేను లాగేదల్లా చుట్ట మాత్రమే :"

తన చేతులమీదుగా ఎందలకొద్దీ ఇళ్లుకట్టిన శేషయ్య, ఇన్నేళ్ళ తరువాతకూడా తనకో సొంతఇల్లంటూ ఏర్పాటు చేసుకోలేకపోయాడు.

బతుకు పూలబాట కాదు

అనుకొన్నవన్నీ అనుకొన్నట్లుగా జరిగితే, ఈ పాటికి మనకో కొత్త హీరో, తెలుగు తెరమీద దర్శనం ఇచ్చియుండవలసింది. ఇప్పుడున్న హీరోలకు అదనంగా. మరో సంఖ్యలో కలపవలసి వచ్చేది. కాలం ఖర్మం కలిసిరాలేదు. నాగరాజు హీరో కాలేకపోయాడు.

చిత్ర మేమిటంటే, హీరోకు కావలసిన లక్షణాలన్నీ తన కున్నాయని ఇప్పటికీ నాగరాజు నమ్ముతూ వుండడం.

"నాకు చిన్నతనంనుండి నాటకాలంటే చెడ్డపిచ్చి. నా పదోయేట "ధ్రువ" నాటకంలో చిన్న ధ్రువుడు వేషం వేశా. పదిహేనో ఏట "హరిశ్చంద్ర" లోహితాస్యుడు వేషంవేసి, మొదటి ప్రయిజు సంపాదించా. ఈ నాటకాల పిచ్చిలో పడి నా చదువు గుంటపూలు పూసింది" అన్నాడు నాగరాజు.

ఇప్పటి సంగత తెలియదుగానీ ఒకప్పుడు నాగరాజు బాగా పాడే పాటట. అతనికిష్టమైన రాగాలు అరభజనుగాకా వున్నాయి. శంకరాభరణం, ఆనందభైరవి, నాదనామక్రియ శ్రీరాగం, మాండ్, బిళహరి రాగాలు తనకు చాలా ఇష్టమైనవన్నాడు నాగరాజు. తనకంటూ ప్రకంగా ఒక నాటక సమాజం లేదని, కానీ రకరకాల సమూజాలవాళ్లు తనపిల్చి వేషాలిచ్చేవాళ్ళని చెప్పుకొచ్చాడు.

"మేరు నమ్మరేమోకాని, ఈ నాటకాలాడడం, ఆడించడం, పెట్టిపిచ్చిలాంటిది బాబుగారూ! రెండామతల దూరంలో ఎక్కడ నాటకమున్నా పోయేవాడిని. ఎప్పుడూ టిక్కెట్టు అడిగేవారుకాదు. అంతా తెలిసిన జనమేనాయె. ఈ తిక్క వొదిలించడానికి మానాన్న నన్ను చాలా చితక బాదాడు. కూడూ, నీళ్ళు పెట్టకుండా, కొట్టంలో కట్టి పడేశాడు. అయినా పడిలేండికాదు" అన్నాడు నాగరాజు. అతని నాటకాలు చాలా ఊళ్ళలో ప్రదర్శితాలైనాయి. నెల్లూరు, గూడూరు, సూళ్ళూరుపేట, కదిరి, అనంతపురం, పెనుగొండ, కర్నూలు, నిజామాబాద్, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, అనకాపల్లి, తుని, కాకినాడ....తిరగని పూరు లేదు.

అలా తిరుగుతున్నప్పుడే అతనికి సినిమాల మీదికి దృష్టిపోయింది. రెండుసార్లు మెడ్రాసుకు కూడా వెళ్ళొచ్చాడు. చిత్తూరు నాగయ్య, బి.యన్. రెడ్డి, కె. వి. రెడ్డి, చక్రపాణి గార్లను చూసాడు. కొంతమంది అతన్ని పూర్తిగా నిరుత్సాహపరిచారు. మిగిలిన ఇద్దరూ (ఆ ఇద్దరెవరో నాగరాజు చెప్పలేదు).

"అడ్రసు ఇచ్చివెళ్ళు. అవసరమయినప్పుడు ఖబురుపెడతాం" న్నారు. నాగరాజు అడ్రసు ఇచ్చివచ్చాడు. ఏ క్షణాన్నయినా తనకు పిలుపు రావచ్చునని మాసాల కొద్దీ ఎదురుచూసాడు. ఆఖరికి ఉండబట్ట క రెండవసారి మద్రాసు వెళ్ళాడు. అడ్రసుఇచ్చి వెళ్ళమన్న పెద్ద మనుషుల్నీ, నానాశ్రమలు పడి కలుసుకున్నాడు. ఇతనెవరో తెలియనట్లు నే వాళ్ళు మాట్లాడారు.

"నాకు చాలా ఆశ్చర్యమేసింది. సిగ్గుపడ్డాను. ఉన్నడబ్బు పూ ర్తి యిపోకముందే రైలెక్కాను" అన్నాడు నాగరాజు.

కాని సంపాదన లేకపోగా వేయిన్నరదాకా ఖర్చుపెట్టిన కొడుకును మాసి రామకోటయ్యగారు లబ్బుమని గోలకెత్తారు. పని చేయకపోతే పీడ పోయింది. కనీసం ఖర్చులన్నా తగ్గించుకుంటే చాలు నన్న దశలో వచ్చాడు రామకోటయ్య.

నాగరాజుకు తన టాలెంట్స్ మీద అపారమైన విశ్వాసాలున్నాయి. ఏదో ఒకనాటికి తన ప్రతిభను తెలుగుదేశం గుర్తించి తీరుతుందన్న. ఆత్మవిశ్వాసం అతనికి ప్రగాఢంగా ఉన్నది. అవకాశంకోసం ఎదురు చూడ సాగాడు. చివరికి అటువంటి ఛాన్సు రానే వచ్చింది.

ఒకసారి ప్రకాశం బ్యారేజి వద్ద నిలబడి ఏదో సినిమా ప్రతిక చూస్తు న్నాడు. " ...." చిత్రవారి నూతన చిత్రంలో నటించడానికి నూతన నటీనటులు కావాలి. వివరాలకు ఈ దిగువవారికి సంప్రదించండి" అన్న



ప్రకటన, చిరునామాకనిపించిచాయి. నాగరాజుకు కళ్ళు మెరిసాయి. ఆ

అడ్రసు విజయవాడదే, ఇంకేం ఆ మరునాడే ఆ అడ్రసు ప్రకారం వెళ్ళి అక్కడున్నవారిదర్శనం చేసుకొన్నాడు.

"నా సంగతంతా చెప్పానండీ, చెప్పకముందే వారికి నా గురించి తెలుసునట, నన్ను తప్పకుండా తీసుకొంటానన్నారు. సెకండ్ హీరో వేషమిస్తామన్నారు. కథకూడ చెప్పారు. చాలమంచికథ. అయితే ఒక్కటే షరతు. తనకంపెనీలో 10 వేల రూపాయల షేర్లు కొనమన్నారు." అన్నాడు నాగరాజు.

ఈ వాటా ధనం కోసం, నాగరాజు తండ్రితో భాగాలుపంచుకొన్నాడు. తన ఇస్సాకు వచ్చిన నాలుక్కుంటల భూమిని అమ్మేశాడు. ఇలాంటి భాగస్తులు మరోముగ్గురు చేరారు. అందరూకలిసి మద్రాసులో మకాం పెట్టారు. కథ గురించి చర్చించారు. టాక్సీలమీద తిరిగారు. హోటళ్ళకు, సీసాలకు, అమ్మాయిలకు తగలేశారు.

"ఒకరోజు ఉదయం మేం నలుగురం తప్ప ప్రొడ్యూసర్ కనబడలేదండి. చాల చోట్ల వెతికాం. వాడు బొంబాయి పారిపోయాడని అన్నారు. ట్రైల్లో టిక్కెట్టు లేకుండానే బెజవాడ వరకు వచ్చా" అన్నాడు నాగరాజు.

ఈ అనుభవంతో అతని నసళం అదిరింది. సినిమాపిచ్చి వదిలింది. నాటకాల మోజు కూడా తీరిపోయింది. తండ్రి ఇంటికి రావద్దన్నాడు. కాని తల్లిపేగు ఉండలేదు కదా! తన తమ్ముని చాటుగా పిలిచి గోల కెత్తింది. ఆయన అక్కగారి మాటను కాదనలేక మేనల్లున్ని దగ్గరకు తీశాడు.

"ఇది మా మేనమామగారి షాపేనండి! ఇక్కడే ఉంటున్నా మొదట్లో పువ్వులు అమ్మడమంటే చచ్చిన చావుగా ఉండేది. కాని కడుపు మండుతుంటే ఏం చేస్తాం చెప్పండి. రెండేళ్ళ నుంచి ఇక్కడే ఉంటున్నా ఇప్పుడీ వ్యాపారంలోనిల జ్జగుజ్జులన్నీ, నాకుతెలుసు" అన్నాడు నాగరాజు

వాళ్ళు క్రిందటేడాది ఓ మల్లెతోటను గుత్తకు తీసుకొన్నారు గాలివానకు తోటయావత్తు కూలిపోయి బోలెడన్ని నష్టాలొచ్చాయి. అందుకని మారుబేరానికి పూలుతెచ్చి అమ్ముతుంటారిప్పుడు.

ఇందులో నష్టం ఉండదండీ! కొన్నధరమీద, నాలుగయిదు రెట్లు ఎక్కువ రేట్లువేసుకొని అమ్ముతాం. నగానికిసగం పూలు చెడిపోయినా లాభం ఉంటుంది. లెక్కపెట్టి పూలుకొన్న, తూకానికి కొన్న, మా "చేవాటు" మాకుంటుంది. చెప్పినధరకే కొంటే తూకాలు సరిగ్గా ఉంటాయి. గీసిగీసి బేరమాడితే, పూల మీద నీళ్లు చల్లుతా. మూగరాళ్లతో తూస్తా. కొంలాభం తగ్గించుకోజేనే తప్ప అసలులో నష్టపోలేనుగదా!" అన్నాడు నాగరాజు.

"సినిమాల శతదినోత్సవాలప్పుడూ, పెళ్ళిళ్ళప్పుడూ, ఎన్నికలప్పుడూ, ఎవరన్నా మంత్రులు వచ్చినప్పుడూ గిరాకీ బాగా ఉంటుందన్నాడు నాగరాజు.

"ఆయిదు రూపాయల నుంచి, అయిదొందల రూపాయల దండ దాకా కడతామండీ. మల్లెలు, గులాబీలు, చామంతులు, దవనం, మరువం సంపెంగ చెమికి, పన్నీరు బుడ్లు అన్ని ఉంటాయి. నేను కట్టిన పూల దండల్ని ఎన్. టి. ఆర్., ఏ.ఎన్.ఆర్. కూడా వేసుకున్నారండి." అంటూ వాళ్ళ ఫొటోలను చూపించాడు నాగరాజు.

ఇంతచేసినా పెద్దగా మిగిలిచ్చేదేమీ ఉండదని, పొట్టకూ—బట్టకూ వెదుకులాట లేకుండా గడిచిపోతుందని అన్నాడు.

ఈ యేడే పెళ్ళయింది. మా మేనమామకూతురే లెండి. వేరే ఉంటున్నా. కృష్ణలంకలో అద్దె యిల్లె అని చప్పరించేశాడు నాగరాజు.

తనకో స్వంతకొంప యేర్పాటు చేసుకోవాలనే ఉన్నదని తనకు మేనల్లుళ్ళకు పడకపోవటంవల్లనే వేరే ఉంటున్నానని ఇక జన్మలో సిని మాల జోలికి పోనని నాగరాజు అన్నాడు.

అతని మాటమీద ఎంత కాలం నిలబడి ఉండేది ఇప్పుడప్పుడే చెప్పలేం.

ముందుగతి కానవే చిలకా !

భారతేతిహాసంలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన పుటలను, అధికాధికంగా చేర్చిన ఘనత మహారాష్ట్రులకే దక్కుతుందంటారు. చరిత్రకారులు. మహమ్మదీయ ప్రభువుల ధాటికీ, భారతదేశం క్రక్కదలి పోతున్నప్పుడు, ఆ ఉధృతాన్ని కొంతకు కొంతైనా ఆపినవారు మహారాష్ట్రులే. ఈస్టిండియా కంపెనీ రోజుల్లోనూ ఆ తరువాత కూడా మహారాష్ట్రులు అక్షరాలా చరిత్రనే సృష్టించారు.

"ఈనాడు" యశ్వంతరావునుచూస్తే, అతని స్థితిగతులు గమనిస్తే, మనకు సందేహం కలుగుతుందేమోగానీ, అతని పూర్వాల్ని చూస్తే మాత్రం కలగదు- కలగదని యశ్వంతరావు అంటాడు. అతని పూర్తిపేరు నానాజీ యశ్వంతరావు పలూస్కర్. చిన్నప్పుడు నానాజీ అనేవారుట. కొంత యశ్వంతరావుగా చెలమణీ అయ్యాడు.

తన పందొమ్మిదో ఏట వో సర్కస్ కంపెనీ పూనా వచ్చిందట. అప్పుడు తను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. నాన్న జేబులోంచి రెండణాలు కాజేసి మొదటి రోజున మొదటి ఆట చూశాడు. అదే అతను చూసిన మొదటి సర్కస్. గుమ్మెత్తి పోయాడు. జేబు ఖర్చుకోసం మిగిల్చిన రెండో అణాతో రెండో ఆట కూడా చూశాడు. ఇంటికి రాబుద్ధి కాలేదు. వచ్చినా నిద్రపోబుద్ధి కాలేదు. కళ్ళు మూసినా తెరచినా, ఆ సర్కస్‌లోని ఫీట్లే కళ్ళముందు తారట్లాడ సాగాయి.


"అదే నా జీవితంలో వో పెద్ద మలుపు. పూనాకు ఆ సర్కస్ కంపెనీ రాకపోయినా మా నాన్న జేబులో ఆవేళ రెండణాలు లేకపోయినా, నా బతుకు యింకోలా వుండేది. మా నాన్న ప్లీడరు గుమాస్తా. నెలకు అయిదురూపాయల జీతం, పైపైన మరో పదిదాకా పిండుకొనేవారు. నన్ను 'లా' చదిపించి ప్లీడరీ బోర్డు కట్టించాలని ఆయన తపన కాని అది నా ద్వారా తీరింది కాదు. మా రెండో తమ్ముడు ప్లీడరీ చదివాడు. బోర్డు కట్టాడు. ప్రాక్టీసు లేదు. ఇంకేదోపని చూసుకొన్నాడు...." అన్నాడు పండిట్ యశ్వంత్‌జీ.

అల్లానాడు పూనా వచ్చిన సర్కస్ కంపెనీ, ఆరువారాల పాటు పూనాలో వున్నది. ఆ కంపెనీలో ఇద్దరు జర్మనీ దొరలు, దొరసానులు కూడా ఉండేవారు. చెడ్డీలు బింగించుకుని హారిజాంటల్ బార్ మీద ఫీట్లు చేస్తున్న ఆ దొరసానుల్ని, తన్మయుడై చూసేవాడు నానాజీ. స్కూలుకు ఎగనామం పెట్టి అన్ని రోజులూ, అన్ని ఆటలూ చూశాడు. రాను రాను ఆ కంపెనీ వారితో అతనికి స్నేహం కుదిరింది. పగలంతా, పులులు, సింహాలు, ఏనుగులు ఒంపెల దగ్గర గడిపేవాడు. వాటికి మేత వేయడం

లోనూ, బోనుల్ని 'ఎరీనా' లోకి తోసుకు రావడంలోనూ సాయంపట్టే వాడు. మేకులు పాతడం, మేకులు బిగించడం, వల్లలు పట్టడం వంటి పనుల్లో జోక్యం చేసుకొనేవాడు. ఆఖరికి ఆ కంపెనీ బొంబాయి బయలు దేరినపుడు దాంతోబాటు నానాజీకూడా బొంబాయి 'కొచ్చేశాడు.

"ఆ పట్టు పట్టు 36 సంవత్సరాల పాటు నేను సర్కస్ కంపెనీల్లో పని చేశాను. కంపెనీలంటే ఎన్నో కావు. కేవలం మూడు కంపెనీల్లోనే పని చేసాను. హారిజంటల్ బార్ మీద ఫీట్స్ చేయడం, ఊక్కుతీగమీద వాంటిగాను సైకిల్ తొక్కడం, నేను స్పెషలైజ్ చేశాను. నేనీ విద్యను జర్మనీ దొరలదగ్గర నేర్చుకొన్నాను" అన్నాడు పండిట్ యశ్వంత్‌జీ.

సర్కస్ కంపెనీలో చేరిన అయిదేళ్ళ తర్వాతగానీ, తన సొంత వూరురాలేదు. అప్పటికే అతని శరీరము ఉక్కుముక్కలాగా తయారయింది. తొడ, మెడ, వీపు, పిక్కలు ఇవన్నీ బలిసి చిట్టెంకట్టుకు పోయినట్లుగా ఉండేవి. తల్లీ తండ్రీ తమ్ముళ్ళూ అతనినిచూసి భావుకమని ఏడ్చారు. "అయినా నేను వినలా. వినబుద్ధి గాలేదు. అసలు నేను చచ్చిపోయాననుకున్నారుట. పలాస్కర్ పేరు విన్నారుటగాని అదినా పేరేనని అనుమానం కూడా రాలేదుట. సర్కస్‌లో పూర్తిగా చేరిపోయాక నా పేరు పలాస్కర్ శాండోగా మార్చుకున్నాను. ఒకసారి ఆ సర్కస్ మేనేజర్‌కూ నాకూ మాటమీద పట్టింపు వచ్చింది. నన్ను డిస్మిస్ చేస్తానన్నాడు. నేనే రాజీనామాచేసి బయటకొచ్చాను. అప్పుడు మా కంపెనీ ఢిల్లీలో వుంది. ఇంకో కంపెనీ కూడా ఢిల్లీలో ప్రదర్శన లిస్తున్నది. నా పేరు ముందుగా



మంచి పబ్లిసిటీ యిచ్చి బాగా డబ్బు సంపాదించింది కంపెనీ. నన్నంత సులువుగా విడిచి పెడతారనుకోలేదు. కానీ, రాజీనామా కాగితం కూడా లేదు. మాట వింటూనే కంపెనీ యజమాని వెళ్ళమని, నావైపు చూశాడు. మీరో కంపెనీలో చేరడం నా కిష్టంలేదు, రెండు మూడు రోజులు ఖాళీగానే వున్నాను. నా ప్రదర్శన లేకపోవటానికి కారణమేమిటో రెండో కంపెనీవారు కూపీ తీసారు. నన్ను పట్టుకొని తమ కంపెనీకి లాక్కుపోయారు. అపుడే నేను పండిట్‌జీతో ఫోటోదిగాను" అంటూ తన పాత సంచీలోంచి ఓ ఫోటోను తీసి చూపించాడతను. ఆ రోజుల్లో ఎంత

బలంగా వుండేవాడో, ఆ ఫోటో చూసిందాకా మనం ఊహించలేం. అప్పుడింత కద్దు గడ్డమూ మీసాలూ లేవు. కోర మీసంతో, ఏనుగ్గున్నలా వుండేవాడు.

"అప్పుడే నేను ఇండియా అంతా తిరిగాను. శ్రీనగర్ నుండి త్రివేండ్రం దాకా బొంబాయి నుండి గౌహతి దాకా ముఖ్యమైన మహానగ రాలూ, పట్నాలూ, చూశాను. అక్కడివాళ్ళతో కలిసి మెలసి తిరిగాను. రకరకాల భోజనాలూ రుచి చూశాను. సర్కస్ కంపెనీ అంటేనే నానా జాతి సమితికి నకలుగా ఉంటుందనుకోండి. అన్ని భాషల వాళ్లూ అన్ని కులాల వాళ్ళూ, మాలో వున్నారు. దీనికితోడు దేశాలు తిరగడ మొకటి. అందువల్ల నాకు చాలా భాషలు తెలుసు. పండితుణ్ణి కాదుగాని అవతలి వారు మాటాడుతుంటే అటూ ఇటూగా అరం చేసుకొంటాను. నేను, ఇక్కడ కూడా చాలా ప్రదర్శన లిచ్చానండి. విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, భీమవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరపతి చాలాచోట్ల తిరిగాను. గుంటూర్లో మా కంపెనీ మూడు సంవత్సరాలు వసగా ఆడింది....ఆ అదే చెప్పబోతున్నాను. నేను మద్రాసులో వుండగా మూడో కంపెనీలో కొచ్చేశాను. ఈ కంపెనీవారు విదేశాలకు పోతామన్నారు. అక్కడికక్కడా పెడదామన్న ఉద్దేశ్యంతో, ఆశతో చేరాను. వారు పోలేదు. ఈ కంపెనీలో వున్నప్పుడే, నేను పట్టుజారి రెండు తాడిచెట్ల ఎత్తునుండి కిందపడ్డాను. ఏడంకాలు చిదికిపోయింది. నేనిక సర్కస్ కంపెనీకి పనికి రానుగనక తీసేసాం" అన్నాడు పండిత్ యశ్వంత్‌జీ.

బతుకొక సమస్యగా పరిణమించింది. తను పలూస్కర్ శాండోనని చెప్పుకొని ఎంతోకాలం బతకలేకపోయాడు. సర్కస్ కంపెనీల్లో పని చేసినప్పుడు తను అట్టే కూడబెట్టిందికూడా ఏమీలేదు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో తన జేబులో వున్న అణాకాసునిచ్చి మౌంట్ రోడ్‌లో పుట్‌పాత్ మీదున్న చిలుక జోస్యునిచేత భవిష్యత్తు చెప్పించు కొన్నాడు. అణాను అటూయిటూ తిప్పి చూసుకొని దాన్ని రొండిన దోపుకొని పంజరం తలుపు తెరచాడు అయ్యగారు. చిలుక వచ్చి ముక్కుతో వో కార్డును వెలికితీసి అయ్యగారిచ్చిన వడ్లగింజను గుటు క్కున మింగి లోపలికి పోయింది. కార్డు విప్పిచూస్తే, 'త్వరలోనే నీకు మంచికాలం వస్తుంది, కొద్దిశ్రమతో, నీవనుకొన్నవన్నీ సాధిస్తావు" అని వుంది దానిమీద.

"పొంగిపోయానండీ. కానీ నాకెలా మంచికాలం వస్తుందన్న ఆలో చనే నాకు రాలేదు. ఆ మద్రాసులోనే దినపత్రికలు చేశాను. ఆఖరికి అదే అయ్యగారిని మళ్ళా కలిసి అడిగాను. సరే అతనేం చెప్పాడని కాదుగానీ వేలికున్న ఉంగరంఅమ్మి, మూర్ మార్కెట్‌దగ్గర నేనూ చిలకల్నీ కార్డుల్నీ కొని బిజినెస్ ప్రారంభించాను. పది పన్నెండేళ్ళయింది. వందలు సంపా దించ లేకపోయినా, పొట్టగూటికి మాత్రం ధోకా లేదు.

చిలక జోస్యం ప్రారంభించినపుడే తనపేరు పండిట్ యశ్వంత్‌జీగా మార్చుకొన్నానన్నాడు. ఆ పూరు ఈ పూరా అన్న నిబంధన లేదనీ, అన్నిచోట్లకూ తిరుగుతూ వుంటాననీ రైళ్ళల్లో టిక్కెట్లు లేకుండానే ప్రయాణం చేస్తుంటాననీ పండిట్‌జీ అన్నాడు.

''నీజోస్యం నిజమవుతుందా ? అనీ–అవుతుందని గ్యారంటీ యిస్తావా అనీ నన్నడక్కండి. నిజమైనా కాకపోయినా నా చిలక చెడు మాత్రం చెప్పదు'' అన్నాడు పండిట్‌జీ నవ్వుతూ.

అవునూ ఎలా చెబుతుందీ ?

చిలక తీసే కార్డులన్నింటిలోనూ అందరికీ అన్ని కాలాలకూ సరి పోయే వాక్యాలు మూడు నాలుగు భాషల్లో వుంటాయాయె.

''ఒరు కోరుకొంటున్నది లభించకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డు కొంటున్నాయి.''

''మీరు ప్రేమించుతున్నవారు, మిమ్మల్ని ప్రేమించకపోయే ప్రమాదమున్నది.''

''మీరు మరీ మంచివారు. ఈ మంచితనమే మిమ్మల్ని యిబ్బందుల పాలు చేస్తుంది.'' ఈ వాక్యాలు వర్తించని వారు ఎవరు గనక ?

ప్రజా జీవితం రోజు రోజుకూ దిగనాసిల్లి పోతున్నది. భవిష్యత్తు అయోమయంగా తయారవుతున్నది. ఆ అంధకారంలో, ఎక్కడన్నా ఆశా రేఖలు గోచరమవుతాయేమోనన్న వెదుకులాట మనలో వున్నంత కాలం పండిట్ యశ్వంత్‌జీ వ్యాపారానికి ఢోకా వుండదు. రోజుకు మూడు నాలుగు సంపాదించుకోనూ గలడు. బ్రహ్మచారి గనక ఏ బాదరబందీ లేకుండా, ఎచ్చిన దానితో సరిపెట్టుకోనూ గలడు.

మిలమిల మెరిసే గాజుల గలగల

"చేతులకు తొడవుదానము "అన్నాడొకవి. అతనలా అన్నాడని, చేతులకు దానం మాత్రమే మిగిల్చి, ఏ అలంకారాలూ లేకుండా మనం చేసుకోవడంలేదు.

ప్రఖ్యాత పంగపరిశోధకుడు శరదిందు బెనర్జీగారి అంచనాప్రకారం మానవోదయ కాలంనుండి, ఆహారాన్వేషణతో బాటుగా అందచందాల కోసం కూడా అన్వేషణ ప్రారంభమయింది. సంచారదశనుండి, మానవుడు సంఘజీవిగా మనడం నేర్చుకొన్న నాటి చిత్రాలను, గుహచిత్రాలను చూసిన మనకీ విషయం స్పష్టమవుతుంది. అనాది మానవులు, కొండ గుహల్లోను, రాతిపలకలమీద చిత్రించిన బొమ్మలనుచూస్తే, ఆ చిత్రాలలోని స్త్రీలముంజేతులకు, కంకణాలుండడాన్ని మనం గమనించగలం.

ఒకప్పుడు మట్టితోనో, ఎముకలతోనూ, ఆ తరువాత లోహాలతోనూ తయారించిన కంకణాలను స్త్రీలు ధరించేవారు. రాళ్ళను ఆయుధాలుగా వాడిన దశలో, ఆ రాళ్ళతోనే ఆభరణాలను కూడా యాపొందించుకొన్నారు. రకరకాల లోహాలతో ఆభరణాలను ధరించడం, ఎప్పుడూ గౌరవ చిహ్నంగానే ఉండేది. అయితే కంకణాలను ధరించడం, అచ్చంగా ఆడవారి హక్కేకాదు. మొన్న మొన్నటిదాకా మగవారుకూడా ఈ కంకణాలను వేసుకునేవారు.

చండ కడియం, మురుగులు, సింహతలాటం, రత్నకంకణం లాంటివి ఈ కోవకు చెందినవే.

భిక్షపతికి, ఈ సంగతులన్నీ తెలుసునో లేదో మనకు తెలీదు. ఆతని వంశంవారు మాత్రం, తరతరాలుగా ఈ గాజులు తయారుచేయడంలో నైపుణ్యాన్ని సంపాదించారు.

భిక్షపతి తాతగారి పేరుకూడా భిక్షపతిగారే! ఆయనకు ఆ రోజుల్లోని రాజులతోనూ, నవాబులతోనూ దగ్గర సంబంధాలుండేవి. ఆయా ప్రభువుల 'అంతఃపురాంగన' లకు కావలసిన రకరకాల గాజులను, ఆ భిక్షపతిగారు తయారుచేస్తూ ఉండేవారట.

"నేను మా తాతను చూడలేదండి! మా అయ్యా చెబుతూ ఉంటే విన్నా. సంస్థానం ఏ మారుమూలనున్నా, సాబ్‌లందరూ హైదరాబాదులోనే ఉండేవారు. మా తాతగారికేమో, ఈ పనిలో మాంచిపేరున్నది. ఆయన్ను గుర్రపు సారట్‌మీద తీసుకుపోయేవారట. 'మేమ్‌సాబ్' లు తెరచెనుక ఉండి చేతులుమాత్రం ముందుకుచాపేవారట. ఆచేతుల్ని చూస్తేనే వారికి ఏ రకం గాజులు బాగా నప్పుతాయో ఆ చేతుల 'ఆది' ఎంతో మా

తాతగారు తెలుసుకునేవారుట. గాజుల తయారీనిబట్టి, ప్రభువుల స్థాయిని బట్టి వారి 'సరదా'లను బట్టి మజూరీ తీసుకునేవారట మాతాతగారు. ఆయన తయారుచేసిన కొన్నివందల జతల గాజుల్లో ఏ రెండు జతలకూ, "పోతి కనే ఉండేవికావని మా నాన్న చెబుతుండేవారండి!" అన్నాడు భిక్షపతి.

మహా ఘనత వహించిన నిజాం ప్రభువుల జనాలకు కావలసిన అందచందాల గాజులను సరఫరా చేసేవారిలో, భిక్షలు తాతగారు ప్రముఖులు. ఒకసారి బరోడా గాయక్వాడ్ గారి కోరికమేరకే, నిజాం ప్రభువులు వందల జతల గాజుల్ని వెండి పెట్టెల్లో అమర్చి ప్రత్యేక దూతద్వారా బరోడా మహారాజుగారికి కానుకగా పంపించారు. ఆ వందల జతల గాజుల్లోనూ రవ్వలు పొదిగినవి రెండు జతలున్నాయట. ఆ రెండు జతల్ని, పెద్ద భిక్షలు తయారుచేశాడని మన భిక్షలు చెప్పాడు.

"దక్షిణ భారతదేశంలో, రకరకాల గాజులి , రంగురంగుల గాజుల్ని తయారుచేయడానికి, హైదరాబాదును మించింది లేదండి. వంశ పారంపర్యంగా ఈ వృత్తినే నమ్ముకున్న కుటుంబాలు ఇక్కడ చాలాఉన్నాయి. ఒకప్పుడు ఎంతో హాయిగా వీళ్ళందరూ ఉండేవారు. ఇప్పటి సంగతి అడక్కండి" అన్నాడు భిక్షలు.

తయారుచేసేవారి సంఖ్య పెరిగింది. డిజైన్లుపెరిగాయి. ఉత్పత్తులు పెరిగాయి. అయినా పనివారిపరిస్థితులు బొత్తిగా బాగాలేవు. దానిక్కారణం భిక్షపతి చెప్పిందే కావచ్చు. ఇదివరకు రోజుల్లో తయారు చేసినవాడే,



నేరుగా కొనుగోలుదార్లకు అమ్ముతుండేవారు. ఇప్పుడేమో మధ్యవర్తులు వచ్చారు. ఈ దళారీలు పనివారికి పెట్టుబడి పెడతారు. ఖాతాదారులక్కావలసిన విధంగా గాజుల్ని తయారుచేయిస్తారు. పనివారికి కూలీడబ్బులిచ్చి మిగిలిన లాభాలన్నీ తామే మింగేస్తారు.

"కూలికూడా బాబు!" అని ప్రారంభించాడు భిక్షపతి. "ఒక రకంగా ఉండదండి, గాజు డిజైన్నుబట్టి, దానిమీద పొదిపే రాళ్ళ సంఖ్యను బట్టి ఉంటుంది. ఒక్కొజతకు ఐదు రూపాయల్నుంచి, యాభై రూపాయల దాకా ఛార్జిచేస్తాను. ఐదురూపాయల జతలు రోజుకు రెండు మూడు

జతలుచేస్తే యాభై రూపాయలు జతచేయడానికి, కనీసం మూడు రోజు లన్నా పడుతుంది" అన్నాడు భిక్షపతి.

అతని భార్య లక్కను మెత్తబరచి, తీగెలుగా సాగదీస్తున్నది. పెద్ద కొడుకు అచ్చులో దాన్నుంచి, రూళ్ళకర్రలాంటి దానితో, ఆ లక్క తీగెను, అచ్చులోకి నొక్కుతున్నాడు.

"దాన్నితీశాక, అదికి మడుస్తాం. లక్క చిట్లిపోకుండా అల్యూమినం రింగులుగాని, రాగిరింగులుగానీ అమర్చుతాం. రకరకాల రాళ్ళను, అద్దం పలుకుల్ని జాగ్రత్తగా అదుకుతాం" అన్నాడు భిక్షపతి.

ఇక్కడ తయారైన గాజులు, దేశం మొత్తానికి రవాణా అవుతా తాయట విదేశీయులు ఇక్కడి కొచ్చినప్పుడు, తప్పకుండా వీటిని కొంటారట.

"వాళ్ళను ఈ వ్యాపారస్తులు మరీ ఘోరంగా మోసంచేస్తున్నారండి మామూలుగా పది పదిహేను రూపాయలుండే జత గాజుల్ని, తెల్లముఖం కనిపించగానే యాభయ్‌లు, అరవయ్ చెప్పి వారికి అంటగడుతుంటారు" అని విచారించాడు భిక్షపతి.

ఈ గాజులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నదీ లేనిది తనకు తెలియదన్నాడు భిక్షపతి.

అతనికి ముగ్గురు పిల్లలు. భార్య. పెద్ద పిల్లలిద్దరూ అతనికి పనిలో సాయపడుతుంటారు. ఇంతవరకూ, సొంత భూమిగానీ, చారెడు ఇల్లుగానీలేని భిక్షపతి "పిట్టనుకొట్టి-పోయ్‌లో పెట్ట"గా బతుకుతున్నా నన్నాడు.

చిత్రమేమిటంటే పాతికేళ్ళుగా పేలకొద్దీ గాజుల జతల్ని తయారు చేసిన భిక్షపతి భార్య చేతికి, రంగుల గాజులు లేవు సరిగదా, మామూలు గాజులుకూడా లేవు. చేతికి కాశితోరం కట్టుకుని ఉంది. తయారైన గాజు లమ్మికొని, ఆ డబ్బుతో నూకల్ తెచ్చుకోవలసిన కర్మం, భిక్షపతికి తప్పినదాకా, అతని భార్య చేతికి ఏ గాజులూ వచ్చే అవకాశంలేదు.

చచ్చులూ, పుచ్చులూ ...

వుంగళగిరిలో ఉన్న నరసింహస్వామిని పానకాల నరసింహస్వామివారని అంటారు. మిగిలిన నరసింహయ్యలకు, ఈనరసింహయ్యకూ, చాలా తేడాలున్నాయి. మిగిలినవారు - ఇచ్చిందంతా తీసుకుంటారు. ఈ స్వామివారు, తమకు వచ్చిందాంట్లో నగం తీసుకొని, మిగిలిన నగం బయటికి కక్కేస్తుంటారు. ఇది అన్ని విషయాల్లోనూ కాకపోవచ్చుగానీ - పానకం విషయంలో మాత్రం నిజం: మనం గిన్నెడు పానకం పోస్తే నగం తాగి, మిగతా నగం కక్కేస్తారు. మనం వంద బిందెలు పోస్తే 50 బిందెలు తాగి మిగిలిన 50 బిందెల్నా కక్కేస్తారు స్వామివారు.



దీన్నే ఇంకోరకంగా చెప్పాలంటే, స్వామి వారి దాహం ఎప్పుడూ నగమే తీర్చగలుగుతాం గానీ, పూర్తిగాకాదూ-అని ; అంటే స్వామి వారు ఎప్పుడూ దాహంతో మక మకలాడుతూ ఉంటారు-అని ; ఈ దాహం తీరేది కాదు, మరొకరూ, మరొకరూ తీర్చగలిగిందీ కాదు. ఎన్ని శతాబ్దాల నుండో ఈ కార్యక్రమం అవిచ్ఛిన్నంగా జరిగిపోతూ ఉంది. ఇక ముందెన్ని శతాబ్దాలు జరుగుతుందో మనం చెప్పుకోలేము.

"వెంకటేశర్రావు కూడా యిసుమంటి వాడేనండీ !" అన్నాడు యాదగిరి, బిరబిరలాడిపోతూ.

అతని బిరబిరలకు చాలా కారణాలున్నాయి. యాదగిరి పూర్వీకులది ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి దగ్గరున్న వో చిన్న గ్రామం. అప్పుడెప్పుడో వారికి కొంత భూమికూడా ఉంది. యాదగిరి తండ్రి, ఆ భూమిని సాగు చేదామనుకున్నాడు. అప్పుచేసి దున్నపోతుల్ని కొన్నాడు. జతపోతులూ, ఆ రోజుల్లో నలభయి ఎనిమిది రూపాయలు. అదేం దురదృష్టమోగానీ, పోశయ్య అరక కట్టిన మూడేళ్ళూ, చిట్టుమని వానలేదు. అధవా అడపా దడపా వానలుపడినా, గరపనేల కనుక, చినుకులన్నీ ఇంకిపోయాయి. విత్తనాలకూ, గొడ్లమేతకూ, పొట్టకూ, బట్టకూ అప్పులు చేశాడు పోశయ్య. దున్నపోతుకోసం చేసిందీ, ఈ అవసరాలకోసం చేసిందీ, కలిపితే బాకీలు పోశయ్య పీకదాకా వచ్చాయి. అడిగీ, అడక్కముందే, అప్పులిచ్చిన 'దొర' ఇంక అప్పులివ్వడం మానేయడమే కాకుండా, పోశయ్య మళ్ళీ అప్పుచేసి, వ్యవసాయం చేసి, నష్టపోతాడేమోనన్న జాలికొద్దీ, ఆ పొలాన్ని అతన్నుంచి తీసేసుకున్నాడు. అలా తీసుకొని, చూసినా ఇంకా బోలెడంత బాకీ మిగిలిపోయింది.

వెంకటేశ్వరరావు తండ్రి-వెంకటేశ్వరరావు కన్నా మంచివాడు గనుక, ఆ బాకీని చాకిరి చేసి తీర్చుకోమని చెప్పాడు. పోశయ్య డా 'నరే' నన్నాడు. ఆ బాకీని రద్దు చేయడం కోసం పోశయ్య చచ్చిందాకా వెట్టి చేస్తూనే ఉన్నాడు. పోశయ్య చనిపోయాడు. ఆ పిత్రార్జితం యాదగిరికి లభించింది. యాదగిరికూడా చాలా సంవత్సరాలు, దాదాపుగా యాభయ్ సంవత్సరాలు కిక్కురుమనకుండా చేశాడు.

ఈ లోగా వెంకటేశ్వరరావు తండ్రి చచ్చిపోయాడు. అయినా యాదగిరి తండ్రి చేసిన బాకీ చావలేదు.

"అదేం అప్పో అదేంపాడో, నాకెరికలేద్దొరా! మేం సచ్చినం! సస్తున్నం. అడిగేటోడికి కాలం మూడె అసలు ముచ్చపెత్తడానికి దమ్ము లెవడికున్నయ్యండి!" అన్నాడు యాదగిరి ఆ రోజుల్ని తలుచుకొంటూ.

అతను పొద్దున్నే దొరగారింటికి పోయేవాడు. నీళ్ళుతోడిపోసేవాడు. జొన్నలు తొక్కేవాడు. దొం తిరిగిన చోటికల్లా వెనకెనక తిరిగేవాడు. ఎవర్ని పిలవమంటే వారిని పిలుచుకొచ్చేవాడు ఎవర్ని కొట్టమంటే వారిని చావ బాదే వాడు. మళ్ళీ సాయంకాలం, లాంతర్లు, దీపాలు తుడవడం. గాస్‌నూనె పోయడం, దీపాలు ముట్టించడం, కంచాలు కడగడం పక్క వేయడం దొరకు నిద్రపట్టిందాకా కాళ్ళు వొత్తడం ఈలోగా దొరకు, వొకసారో రెండుసార్లో స్నానం చేయించడం. ఈ పనులన్ని యాదగిరి చేసేవాడు. ఈ పనులు చేసి నందుగ్గాను తిట్లు, బూతులు, తన్నులు దెబ్బలు అవమానాలు గాక కుండెడు గింజలు ఇచ్చేవాడు దొర. అదయినా తాలూ తప్పా పొల్లూ నెల్లూను.

'ఇంత తక్కువా?' అనడానికి లేదు. అసలు ఎంతో కొంత ఇస్తున్నందుకు సంతోషించాలి. పాత బాకీ గాక, తన పెళ్ళికి మరికొంత బాకి చేశాడు యాదగిరి. దాంతో యాదగిరి భార్య కూడా వెట్టి చేయాల్సి వొచ్చింది.

"ఇక మా జనమలు ఇంతేననుకున్నమండీ : మేం ఇందుకోసమే పుట్టినోళ్ళ మనుకున్నాం. యెంగలరావు దొర సీటు మీన కొచ్చిండు ... మా బాధ ఇరగడయింది !" అన్నాడు యాదగిరి.

అంతకుముందు స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయవాదులు, ఇక్కడి కట్టుబానిసల విముక్తి కోసం ఆందోళనలు జరిపారు. కాని వెంకటేశ్వరరావు తెలివైనవాడు. బలం, ధనం ఉన్నవాడు. తన డబ్బుతో అధికారుల్నీ, రాజకీయవాదుల్నీ ఆకట్టుకొన్నాడు. ఏ గ్రూపు అధికారంలో ఉంటే, ఆ గ్రూపులో కలిసిపోయేవాడు వెంకటేశ్వరరావు ! ఇక ఎవరు మాత్రం చేయగలిగిందేముంది ?

వెట్టిచాకిరి నిర్మూలనమన్నది, నినాదదశను దాటి, ఆచరణలో పెట్టక తప్పనిదశ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, తీవ్రంగా కృషి చేసింది. కలెక్టు, ఇతర అధికార్లకు విశేషాధికారాల నిచ్చింది. ఫలితంగా విముక్తి పొందిన వందలాది 'బాండెడ్ లేబర్స్'లో యాదగిరి, అతని భార్య సత్తెమ్మ కూడా ఉన్నారు.

"బానిసత్వం" నుండి బయటపడ్డా బతికే మార్గం కనిపించలేదు. అప్పట్లో ఖమ్మం జిల్లా కలెక్టరుగా పనిచేసిన పి. వి. ఆర్. కె. ప్రసాద్ వీరి పునరావాసానికి విశేషంగా పాటుపడ్డారు. నాగార్జున గ్రామీణ బ్యాంకు వారు, యాదగిరికి మూడు వందల రూపాయల రుణ సదుపాయం కల్పించారు. "దాంతో కూరగాయల బండిపెట్టిన....కొనటం, అమ్మటం తెలవదు. మాయతూకం తూసి నాకిచ్చేటోల్లు. నాకేమో ఆ రాల్లు, దలాలు తెలియదాయే, నష్టమొచ్చింది. సద్దామనుకొంటే ముసిల్ది ధైర్యం చెప్పె. అట్టనే బండి నెట్టుకొత్తుంటి చొరా!"

యాదగిరి కూరగాయలుతూచి, తట్టలోపోస్తే సత్తెమ్మ ఇళ్ల దాకా తీసుకొచ్చి ఇచ్చిపోతుంది. కరెక్టుగా తూస్తాడు. ఎదటి వారికన్నా వోపైసా తక్కువకే ఇస్తాడు. యాదగిరికి పిల్లలేరు.

"ఈ దరిద్దరం, మాతోనే ఆఖరు కానియ్యండి చొరా ! ఇంకా పిల్లపిల్లతరాలు ఎందుకులెండి ?" అన్నాడు యాదగిరి బాధగా.

అన్నాడుగానీ, పిల్లలు లేరన్న బాధ అతన్ని లోలోపలే తొలిచి వేస్తూనే ఉండి ఉండాలి. ఈ మాటలంటున్నప్పుడే, అటుగా స్కూలుకు పోతున్న ఎనిమిదేళ్ళ అమ్మాయికి, ముగ్గ పండిన టొమాటో పండునిచ్చి, బుగ్గలు నిమిరాడు యాదగిరి.

"మంచియన్నీ మందికమ్ముతా. చచ్చులూ పుచ్చులూ మాకుం టయ్" అన్నాడు యాదగిరి. కూరలు తూచి, భార్య పట్టుకున్న పల్లికలో వేస్తూ.

* *
* *

పదివేళ్ళూ పనిచేస్తాయి...

ఉత్సాహానికీ, వాస్తవానికీ మధ్య, బతుకుకూ భావనకూ మధ్య, ఎక్కడా పొంతన ఉండదన్న నగ్నసత్యాన్ని బాలయ్య జీవితం మరోసారి రుజువుచేసింది.

బాలయ్య బాల్యం, రంగరంగ వైభవంగా లేకపోవచ్చుగానీ, అష్ట కష్టాల మయం కూడా కాదు. బాలయ్య తండ్రి పేరు నాగయ్య. అతను తన జీవితాన్ని పొలాల్లో ప్రారంభించాడు. పశువుల కాపరిగా కొంతకాలం పనిచేశాడు. నాగలిచేత పట్టి, వందలసార్లు, బీడు భూములు సాగుకు లాయకీగా మర్చాడు. కొంతకాలం వ్యవసాయ కూలీల సంఘంలో పని చేశాడు. ఆ సంఘానికి నాగయ్యవల్ల ఏం ఒరిగిందో తెలీదు గానీ, నాగయ్యకు మాత్రం, ఆ ఊళ్ళో ఏ రైతుదగ్గరా పనిదొరకలా.

ఎంతకాలమని పస్తులుంటాడు గనుక, పాడిగేదెనూ, పూరిపాకనూ అయినకాడికి అమ్మేవాడు. అచట్నుంచు పెళ్ళాం కిచ్చి సత్తెనపల్లి పంపించాడు. సత్తెనపల్లిలో లక్ష్మమ్మ అన్నకు కిల్లీకొట్టు ఉంది. లక్ష్మమ్మ వదినె అదేదో పొగాకక్కంపెనీలో గ్రేడింగ్ మేస్త్రీగా వుంటున్నది. కొంతకాలంపాటు – తను కాస్తా కాలుకుదురుకొన్నదాకా – అన్న దగ్గరుంచే, తరవాత చూసుకోవచ్చుననుకొన్నాడు నాగయ్య.

అతను మెల్లిగా ముఠాకూలీల్లో చేరాడు. తరువాత, తనే కూలీల్ని గుత్తకు తీసుకోవడం ప్రారంభించాడు. లారీల మీద సరుకుల్ని ఎత్తడంలోనూ, వాటిని సురక్షితంగా చేర్చడంలోనూ, నాగయ్య ముఠాకు మంచి పేరు వచ్చింది.

నాగయ్య కష్టపడి పనిచేయడానికి ఎప్పుడూ వెనక్కుతీయదు. అనేకసార్లు అతను రాత్రింబవళ్ళు లారీలమీద పనిచేశాడు. ప్రయాణాలూ చేశాడు. అలా చేస్తున్నప్పుడే అతను లారీని నడపడం కుడా నేర్చుకొన్నాడు అతను లైసెన్సు లేకుండానే చాలసార్లు లారీని నడిపాడు. చిన్న చిన్న రిపేర్లు చేయడం కూడా నాగయ్యకు తెలిసింది !

ఇలాగానే అతను, భార్యను తెచ్చుకొన్నాడు. ఓ చిన్న పెంకుటిల్లును అద్దెకు తీసుకున్నాడు. లక్ష్మమ్మ సలహామీద, కూలిపనిమానేశాడు. నానాఅవస్థాపడి, మూడు నాలుగేళ్ళ తరువాత, లారీ డ్రైవర్‌గా లైసెన్స్ సంపాదించుకొన్నాడు.

నాగయ్య నమ్మకస్తుడు. కష్టపడి పనిచేయడం అతని స్వభావంలానే ఉంది. దొంగబాడిగలు తోలడం, ఎక్కువకు వప్పుకొని


తక్కువకు లెక్క చెప్పడం, మధ్యలో పాసింజెర్లను ఎక్కించుకొని, ఆ కిరాయిని కొట్టేయడం, అతనికి చాతగాని పనులు.

రమారమిగా 14 సంవత్సరాలుపాటు అతను లారీని నిర్విచారంగా నడిపాడు. అతను బొంబాయి, పూనా, కాన్పూరు, నాగపూరు, మద్రాసు, బెంగుళూరు, భువనేశ్వర్‌ల దాకా బండిని తోలుకెళ్ళేవాడు. ఎక్కువ బరువు వేయడం, దొంగ సరుకుల్ని చేరవేయడం-లారీ యజమాని వొత్తిడి చేసినా-నాగయ్య చేయలేదు.

అప్పుడప్పుడు, దగ్గరదగ్గర ట్రిప్పులప్పుడు, కొడుకును కూడా వెంట తీసుకుపోయేవాడు. తిరిగి సాయంకాలానికి కొంపకొచ్చేవాడు.

ఈ తిరుగుళ్ళవల్ల బాలయ్యకు చదువు అబ్బలేదు. ఇంట్లోవుంటే బళ్ళోకిపోవాల్సివస్తుంది. గనుక, తండ్రితో పోవటానికే బాలయ్య సరదా పడేవాడు. ఆలాగా, ఏడెనిమిదేళ్లు గడిచాయి. కొడుకును కూడా లారీ డ్రైవరును చేయాలని, నాగయ్య కలలు గన్నాడు. బండిని నడపడంలోని మెలుకువలన్నీ కొడుక్కి నేర్పాడు. రోడ్డు తిన్నగాఉన్నప్పుడూ, ఎదురుగా బళ్ళేమీ లేనప్పుడూ, కొడుక్కు స్టీరింగునిచ్చేవాడు నాగయ్య. క్రమంగా బాలయ్యకూడా దోవనపడ్డాడు.

ఒకసారి లారీనిండుగా దోపకాయలు ఎత్తుకుని, బెజవాడనుండి హైదరాబాదుకు ప్రయాణమయ్యాడు నాగయ్య. రాత్రి 9 గంటలు దాటింది. అడ్డ రోడ్డు దగ్గర ఇద్దరూ టీలు తాగారు. తండ్రిని పక్కకు తప్పుకోమనితాను



స్టీరింగు అందుకున్నాడు బాలయ్య. కొడుకు పక్కనే కూర్చుని సిగెరెట్టు దమ్ము లాగుతున్నాడు నాగయ్య.

ఓచిన్న మూలుగుతో లారీ బయలుదేరింది. ఎక్కుతూ, దిగుతూ మెలికలు తిరుగుతూ, లారీ రివ్వునముందుకుదూసుకుపోతున్నది. పరిటాల దగ్గర సన్నగా ప్రారంభమయినవాన, తంచికచర్ల దగ్గర కొచ్చేసరికి ధారాపాతంగా కురవడం సాగించింది. అక్కడే ఆగుదామనుకొన్నారు. కానీ, నందిగామలో అయితే తమకు తెలిసిన, లారీ బ్రోకర్ను ఆఫీసు ఉంది.

అక్కడ బండినాపుకొని ఆఫీసులో ఓ కునుకుతీసి, వానవెలిశాక, బయలు దేరవచ్చు ననుకున్నారు.

కంచికచర్ల చెరువు దాటారు. పదినిమిషాలకల్లా మున్నేరు వంతెన వచ్చింది. అప్పటికి వానకూడా హెచ్చింది. వైపర్లు ఎంత తుడిచినా, వాన నీరు, ముందున్న అద్దాన్ని ముసురుకొని, ముందేమున్నదో కనిపించడం లేదు.

బాలయ్య నెమ్మదిగా బండిని నెడుపుతున్నాడు. వంతెన దాటింది. రోడ్డు కుడివేపుకు తిరిగింది. బాలయ్య బండిని కుడివేపుకు తిప్పాడు. ఎదురుగా మరోబండి .. క్షణంలో ఏం జరిగిందో తెలియదు. లారీ జారి, కిందపల్లంలోకి బోల్తాపడింది.

నాగయ్య అక్కడి కక్కడే చనిపోయాడు. బాలయ్య మోకాలు విరిగిపోయింది.

"మరిక నేను లారీడ్రైవర్‌గా పనికిరానండీ! ఈ దెబ్బనుండి కోలుకోడానికి ఆరుమాసాలు పట్టింది. ఈ ఆరుమాసాలపాటూ, మా అయ్యగారే మమ్మల్ని పోషించారండీ!" అన్నాడు బాలయ్య.

ఆ అయ్యగారే, తనకు తెలిసినవారితో చెప్పి, బాలయ్యకు, ఈ కుర్చీల అల్లకంపని నేర్పించారు. ఓ ఏడాదిపాటు అక్కడే ఉండి ఈ పని నేర్చుకొన్నాడు బాలయ్య.

"అయ్యగారు వేయిరూపాయలిచ్చారండీ! దాంతోనే—ఇదిగో-ఈ యాపారం నడుపుతున్నాను" అన్నాడు బాలయ్య.

అతను ప్లాస్టిక్‌కేన్‌తో కుర్చీలు, టీపాయ్‌లూ, బల్లలూ, మంచాలూ అల్లుతాడు.

"ప్లాస్టిక్ సరుకులో, మూడు నాలుగు రకాలున్నాయండీ! బొంబాయి రకం మంచిది. హైదరాబాదు రకం రెండోది. రామనగర్, ఢిల్లీ రకాలు మరీ నాసివండీ! గోల్డుకలర్ ప్లాస్టిక్, మిగిలిన రంగులయితే 20,21 వొక్కొక్కసారి 22 కూడా అమ్ముతుంది. ఇనప ఫ్రేములు, 14,15 రూపాయలదాకా ఉంటాయి. మంచి రకం కేన్ అయితే 7,8 రూపాయల సరుకు పడుతుంది. అల్లకం, కూలి 5 రూపాయలు. కుర్చీకి రంగు వేయడానికి, రబ్బరుబుష్‌లు పెట్టడానికి రూపాయిదాకా అవుతుంది." అన్నాడు బాలయ్య.

తను కుర్చీ ఖరీదు 35 చెబుతాననీ, 30 కయినా ఇస్తాననీ, అంతకు తక్కువయితే గిట్టుబాటుకాదనీ అన్నాడు. పాతకుర్చీలు కూడా బాలయ్య బాగుచేస్తాడు. కేన్ వారే తెచ్చుకొంటే, మజూరి 6 తీసుకొంటాడు. మొత్తం తనదే అయితే 12, 13 దాకా ఛార్జీ చేస్తాడు.

"రోజుకు రెండు కుర్చీలకన్నా అల్లకం సాగదండీ! బుచ్చికం పనులు చేయడం నా వల్లకాదు. మిగిలినవాళ్ళు, నాలుగు రూపాయలకూడా అల్లుతారు. ఆ సరుకూ, ఆ పనీకూడా, అడవాగానే ఉంటుందండీ"! అన్నాడు బాలయ్య.

అలవీసులవలుగా చేస్తే, రోజుకు మూడు కుర్చీలను కూడా అల్ల వచ్చుననీ, కానీ పనిమాత్రం తిన్నాగా ఉండదని అన్నాడు బాలయ్య.

తను సంపాదించిన పదిరూపాయల్లోనూ, కొట్టు అద్దెకింద మూడు, మిగిలిన ఆర్రూపాయలూ ముద్దరసుద్దిగాతల్లికిస్తున్నానంటున్న బాలయ్య ఎప్పుడోగానీ సినీమాలు చూడడు.

"పదివేళ్ళతో పనిచేసినా, ఐదువేళ్లూ నోటికి చేరని, నాబోటివాడికి సినిమా లెందుకండీ బాబూ?" అని ప్రశ్నించాడు బాలయ్య.

పూటబత్తెం పుల్లవెలుగ్గా ఉండే అతని బతుకు, ఇంతకన్నా మెరుగు పడేదెప్పుడో మరి!

కాయకల్ప చికిత్స

చెట్లకు ప్రాణం ఉన్నదని జగదీశ చంద్ర బోసు ప్రకటించినప్పుడూ, లోహాలు కూడా అలసిపోతాయని హెర్బర్ట్‌మిల్లర్ రుజువు చేసినప్పుడూ, చాలామంది నమ్మలేదు. ఇప్పటికీ నమ్మనివారున్నారనుకోండి. ఆనాడు ఈ రెండు సిద్ధాంతాలను 'నిజం' అన్నవారిని మూర్ఖులంటే, ఈనాడు అలా అననివారిని మూర్ఖులంటున్నాం.

'ప్రాణం' స్వభావం మార్పుచెందడం, అలసిపోవడం ప్రాణికున్న లక్షణాల్లో వొకటి. లోహాలు అలసిపోతున్నాయంటే అవీ ప్రాణులే అనుకోవాలి. కానీ ఈ ప్రాణం మనకు తెలిసిందీ, మనకు పరిచయమయిందీ కాకపోవచ్చు.

వైద్యశాస్త్రంలో వొక విచిత్రమైన ప్రక్రియ ఉన్నది. అదే వృద్ధాప్యాన్ని వివిధ మార్గాలద్వారా తగ్గించడం. దీన్ని ఆ శాస్త్ర పరిభాషలో 'కాయకల్పచికిత్స' అంటారు. కాళ్లు, చేతులు జవసత్వాలను కోల్పోయి, ఓపిక ఉడిగి, కూచునిలేవలేని వారుకూడా, ఈచికిత్స ద్వారా పునర్ యవ్వనం పొందుతారట. పూర్వకాలం మహారాజులు, చక్రవర్తులు, రాజులు, నవాబులు, కోటీశ్వరులు, ఇలాంటి కాయకల్ప చికిత్స కోసం ధనరాసుల్ని వెచ్చించారని చెబుతారు. ఇప్పటికీ ఇందుకోసం తపన పడుతున్న వారూ ఉన్నారు. దిగజారి పోతున్న యవ్వనానికి కళ్లాలువేసి, నిలిపి ఉంచాలన్నదే ఈ చికిత్స వెనుక గల రహస్యం!

మీకూ ఇలాంటి చికిత్స కావాలంటే రజాక్‌ను సంప్రదించండి. అతను చేసే కాయకల్ప చికిత్సకు లక్షలూ, వేలూ, వందలూ అవసరం లేదు. అర్ధరూపాయి వైద్యమూ ఉంది, ఐదారు వందల వైద్యమూ ఉంది. అయితే ఈ చికిత్స అతను మీకు చేయడు. మీ పాత్రసామానుకు చేస్తాడు.

"నేనీ విద్య ఎక్కడో నేర్చుకోలేదు....అదంతా వో తమాషా లెండి!" అన్నాడు రజాక్ కొలిమిలో గుప్పెడు బొగ్గులు వేస్తూ.

రజాక్ చిన్నతనమంతా గుంటూర్లో గడిచిపోయింది. వాళ్ళు ఆరు గురు అన్నదమ్ములు. నలుగురు అప్పచెల్లెళ్ళు. మగపిల్లల్లో ఇతను నాలుగోవాడు. రజాక్ నాన్నపేరు సత్తార్. ఆ రోజుల్లో వారు నల్ల చెరువు పక్కన వుండేవారట.

"మా నాన్నకో గుర్రబ్బండీ ఉండేదండీ! అదే మాకు జీవనాధారం. రోజుకు అయిదారు రూపాయలదాకా మా నాన్న బాడిగ తోలేవాడు. గుర్రానికి గడ్డికయితేనేం, దాణాకయితేనేం, ఓ రూపాయి,

రూపాయి పావలా ఖర్చయ్యేది. మిగిలింది మా కుటుంబానికి అస్తుబిస్తుగా వుండేది" అన్నాడు రజాక్.

రజాక్ పెద్ద అన్నయ్య కూరల మార్కెట్టులో పనిచేసేవాడట. రెండోవాడు ఓ మెరుగు కొట్టులో కుర్రాడుగా ఉండేవాట్ట. తయారైన బంగారు వస్తువులకు మెరుగుపెట్టడం, ఆ కొట్టువారి పని. పటికనార్చిన వస్తువును ఈ కొట్లో ఇస్తే, ముందుగా మెరుగు ఇసికతో రుద్దడం, తరువాత బ్రష్‌తో కుంకుడు నురుగువేసి కొట్టడం, ఆ తరువాత కడ్డీమెరుగు, ఆపైన పౌడరు మెరుగు....ఇలా సాగేది ఆ ప్రోసెస్. మూడోవాడు తీగెలమిషను దగ్గర పనిచేస్తే, రోజుకు పావలా ఇచ్చేవారు.

చిన్నతనంలో రజాక్ చస్తే పనిచేసే వాడుకాడు. వేళకింత తిని బలాదూర్ తిరుగుతుండేవాడు. అలా తిరగడంలోనే వొకసారి గాంధీ–పార్కు దగ్గర గారడీ ఆట కంటపడింది. ఆ గారడీ చేస్తున్నవాడు కూడా సాయిబే. కొయ్యబొమ్మల్ని ఆడించడం, ముక్కు–లోనుంచి రూపాయల్ని పిండడం, గ్లాసులోఉన్న ఎర్రనీళ్ళను ఇంకోగ్లాసులోకి పంపుతూనే వాటిని నీలం రంగుగా మార్చడం చూసి, రజాక్ చిత్తుచిత్తయిపోయాడు.

అంతే సంగతులు !

ఆ గారడీ వాడివెంట పడ్డాడు తను. అప్పటికతని వయస్సు 14 15 దాకా ఉంటాయేమో.



"ఆ పట్టు పట్టు, మూడు నాలుగేళ్ళపాటు అతనితోనే తిరిగాను. అతని మూటలు మోశాను. సంచులు మోశాను. పిల్లల్ని మోశాను. వంట వండాను. కాళ్ళు పిసికాను. అడ్డమైన చాకిరీ చేశాను. ఏవో చిన్న చిన్న ట్రిక్కులు చెప్పాడుగానీ, 'ముఖ్యమైనవి చెప్పలేదండీ. ఎప్పటికైనా చెబుతాడని నా ఆశ !" అన్నాడు రజాక్.

ఆ ఆశ తీరలేదు. రాజమండ్రిలో కోటగుమ్మం దగ్గర గారడీ చేస్తున్నప్పుడు – ఏదో చిన్న పొరపాటు జరిగింది. అంతే ! చావబాది వదిలిపెట్టాడతను. ముక్కువెంట నెత్తురు కారింది. వొళ్ళంతా కదుములు

కట్టింది. సరాసరి గోదావరి దగ్గరకెళ్ళి వాళ్ళు కడుక్కున్నాడు. చచ్చి పోదామనుకున్నాడు. సుడులతో, నురుగులతో తెక్కెళ్ళాడుతూ, పారుతున్న ఆ ప్రవాహాన్ని చూసి రజాక్ హృదయం బేంబేలెత్తిపోయింది. భయం వేసింది. కాళ్ళీడ్చుకుంటూ, ఊరిముఖం పట్టాడు.

"అదేదో హోటల్ పక్కన, తిత్తిఊదుతూ, బొగ్గులువేస్తూ, చుట్టూ పాత్ర సామాను పెట్టుకూర్చున్న ముసలాయన కనిపించాడు. అతనూ మా వాడేనండీ" అన్నాడు రజాక్.

అక్కడ అతుక్కుపోయాడు రజాక్. ఎన్నడూ తిత్తులూదనివాడు, ఎప్పుడు తిత్తినోరు మూయాలో, ఎప్పుడు దాన్ని కిందికి నొక్కాలో తెలియనివాడు, అలాగే తంటాలు పడ్డాడు. తిత్తులూదడం నేర్చుకున్నాడు.

"వాళ్ళు దానవాయిపేటలో ఉండేవారండి. మా గురువుగారి పేరు జహంగీర్, చాలా మంచివాడు. తిత్తులూదడం, నవాసాగరం పొడుం చేయడం, తగరం కరిగించి బిళ్ళలుపోయడం, చిన్న చిన్న సొట్టలు తీయడం నేర్చుకొన్నాను. ఆయన నేర్పాడు. చాలా మంచివాడు లెండి. ఆయన భార్యకూడా నన్ను బిడ్డను చూసినట్లు చూసుకునేది" అన్నాడు రజాక్.

క్రమంగా రజాక్ ఈ పనిలో వున్న మెలుకువలన్నీ తెలుసుకున్నాడు.

"పాత్రలకు సొట్టలు తీయడం వో ఆర్టు, అడుగున మోపు పెట్టి, పొడసుత్తితో మెల్లిగా తీయాలి. రేకు బిరుసెక్కి సొట్టతీసేటప్పుడు చీరుకు పోతుంది. అప్పుడు దాన్ని కచ్చాపచ్చాగా కాల్చాలి. చిన్నచిన్న చిల్లుల్ని ఇత్తడి టంకంతో అతుకుతా. పెద్ద కన్నాలుంటే ఆ కన్నానికి సరిపడే మరోరేకును మాటువేసి, టంకంతో అతుకుతా" అన్నాడు రజాక్.

కళాయి పెట్టాలంటే పాత్రల్నిబాగా తోమాలన్నాడు. కిలుం పట్టిన పాత్రలకు కళాయి అంటదన్నాడు. గంద్ర ఇసుకతోనూ, చింతపండుతోనూ రుద్దాలన్నాడు.

"అలా రుద్దినతరువాత, కొలిమిమీద పెట్టికాలుస్తా. కాస్త వేడెక్కాక నవాసాగరం పొడి చల్లుతా. చల్లి, ఓ పాత గుడ్డతో ఆ పొడిని వేడిగా వున్న ప్రాంతంలో రుద్దుతా. తరువాత తగరం పలుకులు వేస్తా. అది కరిగాక, గుడ్డముక్కతో ఆ తగరాన్ని వేడిగా ఉన్న పాత్ర లోతట్టుకు పాముతాను" అన్నాడు రజాక్.

ఇదివరకు ఒక్కమాటు వేస్తే పావలా తీసుకునేవాడని, ఇప్పుడు గిట్టుబాటు కావడంలేదని అంటున్నాడు రజాక్.

"బొగ్గులు, నవాసాగరం, తగరం ధరలు మండిపోతున్నాయండి. రేటు పెంచకపోతే గిట్టదు. పెంచితే గిరాకి ఉండదు. ఇందులోనూ పోటీ ఉన్నదనుకోండి. అదీగాక మా పనితో ప్రతి కుటుంబానికి అవసరం ఉంటుంది. కాని, ఏ రెండు మూడేళ్ళకోగానీ, ఆ అవసరం రాదు. అందుకో

వేను చేసిన పని అయితే–మూడు నాలుగేళ్ళదాకా డోకా ఉండదు" అన్నాడు రజాక్.

అతను జహంగీర్ తమ్ముడు కూతుర్నే పెళ్లి చేసుకున్నాడు. ఓ కొడుకు. వాడికి 'జహంగీర్' అన్న పేరే పెట్టుకున్నానన్నాడు.

"అన్నం పెట్టినవాడిని మర్చిపోతానా సార్" అన్నాడు రజాక్.

ఓ మూలగా సొట్టలుపోయీ, లొట్టలపోయీ ఉన్న సామాను, చిందర వందరగా పడివుంది. ఒక్కోదాన్ని తీసుకుని కాయకల్ప చికిత్స చేసి, కొత్తరూపం ఇచ్చి మరోపక్కన పెడుతున్నాడు రజాక్.

"రోజుకేపాటి సంపాదిస్తావ్?"

రజాక్ నవ్వాడు.

"ఒక్కోరోజున నాలుగ్గూడా దొరకవు. ఏ హోటల్ కన్నా కాంట్రాక్టు తీసుకున్నాననుకోండి. మూడు నాలుగు వందల రూపాయల పని దొరుకుతుంది. వారం రోజులకల్లా పూర్తి చేస్తాను....పస్తులుండడం లేదుగానీ సార్, డొక్కలేగిసేటట్లు తినడానికిక్కూడా ఉండదండి;" అన్నాడు రజాక్ నవాసాగరం పొడిని పాత్ర మీద చిమ్ముతూ.

గుప్పుమని మాటుగా వుండే పొగసుడులు లేచాయి,

చేదు విషం... జీవఫలం !

సుమారు 140 సంవత్సరాల క్రిందట స్కాట్లండ్ దేశానికి చెందిన వొక కమ్మరి "బైసికల్" అన్న రెండు చక్రాల బండిని తయారుచేశాడు. ఆ కమ్మరి పేరు కిర్క్‌పాట్రిక్ మాక్మిలన్.ఆనాడాబండిని మాక్మిలన్ తయారు చేస్తున్నప్పుడు ఉత్తరోత్తరా, ఈయన సాధనంలో చాలా మార్పులొస్తాయనిగాని ఈ సైకిళ్ళను తయారుచేసే బ్రహ్మాండమైన పరిశ్రమలు, అనేక దేశాల్లో తల ఎత్తుతాయని గానీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కొన్ని లక్షల మందికి ఇది జీవనోపాధి కల్గిస్తుందనిగానీ ఊహించి వుండదు.


ఆ మాటకొస్తే నూటనలభై సంవత్సరాల క్రిందనే అబ్దుల్ ఖాన్ తన ముగిమనవడి సైకిల్ బాగుచేసుకొని, పొట్టగడుపుకోవలసి వస్తుందని గూడా ఊహించి ఉండడు. అబ్దుల్‌ఖాన్‌గారి పూర్తిపేరు యింకా చాలా చాలా పొడుగ్గా వుంది. సాలార్‌జంగ్ నవాబు పూర్వీకులకు ఈ అబ్దుల్‌గారు చాలా దగ్గర బంధువులు కూడా. ఆస్తిపాస్తుల పంపకాల దగ్గర ఏవో మోసాలు, కుట్రలూ జరగడంవల్ల తన తాతగారికి చాలా అన్యాయం జరిగిందంటాడు మస్తాన్. రాజాకిషన్‌ప్రసాద్ హయాంలోనే బోలెడంత పోగొట్టుకున్నామంటాడు మస్తాను. ఆమధ్య చనిపోయిన ఆఖరినైజాం నవాబును తనుకూడా చాలాసార్లు చూశాడట. అప్పుడప్పుడు పిందులకూ వాటికీ తను కూడా తండ్రితోపాటు హాజరవుతూ వుండేవాడట. వెళ్ళిన ప్రతిసారి అష్రఫీలు నజరానాగా ఇస్తూ వుండేవాడట. అప్పట్లో తీసిన ఒక తస్వీర్ ఇంకా తనదగ్గర వున్నదన్నాడు. ఇంటికి తీసుకెళ్ళి దాన్ని చూపించాడు కూడా.

ఆ ఫోటోలో వున్న మస్తాన్ 'బొంబాయి' లాగా వున్నాడు. మోక్కాళ్ళ దిగువదాకా షేర్వాన్, నెత్తిమీద కుచ్చుటోపి, చేతిలో చిన్నకర్ర, వీటన్నింటితోనూ, నైజాం నవాబుకు వెనగ్గా రెండవవరసలో చిట్టచివరగా వున్నది తనేనన్నాడు మస్తాను. కాస్త పరకాయించి చూస్తే తప్ప ఆ ఫోటోలోని మస్తానూ మన మస్తానూ వొక్కరే అని మనంపోల్చుకోలేము. ఆ ఫోటోలో ఉన్నవారందర్ని గురించి చెప్పుకొచ్చాడతను. నిజాం నవాబుకు మరిదగ్గరివాళ్లు తప్ప మిగిలిన వాళ్ళంతా తిండికీ, గుడ్డకూ యమచెరపడుతున్నారన్నాడు. నిజానికయితే తనట్కూడా ఏ లోటూ వుండకూడదట, కాని, తన తండ్రి చనిపోయాక ఆయన ఆస్తినంతా ఇంకెవరో కాజేశారని తనూ, తన తమ్ములూ, ఆ ఆస్తికి వారసులు కారని కోర్టు వారు తీర్పు చెప్పారనీ మస్తాను చెప్పాడు.

"మా అయ్యకు ఇద్దరు ముగ్గురు భార్యలున్నారు. మా అమ్మ మూడవ భార్య, అసలు మా నాన్నకు ముగ్గురు పెళ్లాల్లేరనీ అవతలి వారన్నారు, అని, రుజువు కూడా చేశారు" అన్నాడు మస్తాను. తమ తరపున దావా నడపడానికూడా ఎవరూలేకపోయారట. తన తల్లి న్యాయమైన భార్య కాదని కోర్టు వారు నమ్మడంతో తామంతా వీధిపాలు కావలసి వచ్చిందన్నాడు మస్తాను.

"ఆ చిన్నప్పటి సంగతులు తలచుకొంటుంటే గుండె పగిలి పోతుందండి. ఈ చేతుల మీదుగా నవాబుగారికి 'అఫ్రషి' లుంచిన పెండి గిన్నెలందించాను. యిదే చేతులతో 5 పైసలూ 10 పైసలూ అందు కొంటున్నాను. ఈ సంగతులెపుడన్నా మా పిల్లలకు చెబితే నమ్మరండి. ఈ ఫోటో మీకు చూపించకపోతే మీరుమాత్రం నమ్ముతారా బాబూ" అన్నాడు మస్తాను.

కొంతకాలంపాటు సనత్‌నగర్‌లోఉన్న ఓ వర్క్‌షాపులో చిల్లర మల్లర పనులుచేస్తూ వుండేవాడు మస్తాను. తయారయిన వస్తువుల్ని ఖాతా దారులకు ఇచ్చిరావడం, బిల్లుల్ని వసూలుచేసుకురావడం, వర్క్‌షాపుకు కావలసిన సరుకుల్ని తీసుకురావడం ఇదంతా సైకిల్‌మీదనే చేస్తుండేవాడు. అప్పుడప్పుడూ సైకిల్ చెడిపోతుంటే ఒక్క చోటే బాగుచేయిస్తూ వుండే వాడు. వయస్సు మళ్ళడంవల్లా, ఉన్న వయసులోనైనా కడుపునిండా తిండిలేకపోవడంవల్లా మైళ్ళకుమైళ్ళు సైకిల్‌మీద తిరగలేక ఆ ఉద్యోగాన్ని మానేశాడు. ఓ నెల రోజులపాటు తను సైకిల్ బాగుచేయించుకొంటూ వుండే రాజయ్య దగ్గర కూచుని పనులన్నీ నేర్చుకొన్నాడు.



"ఆ తరవాతనే సొంతంగా ఈ దుకాణం ప్రారంభించాను. మొదట్లో నాకంతగా గిరాకీ వుండేదికాదు. క్రమంగా యాపారం పెరిగింది. ఇప్పటికీ పెద్దపెద్ద పనులేమన్నావస్తే మోటారుసైకిళ్ళపనులు రాజయ్య దగ్గరకు తీసుకుపోతా. ఇద్దరంకలిసి చేసుకుంటాం. చెరికాస్తాతీసుకొంటాం" అన్నాడు మస్తాను.

మామూలు పంచర్ వేస్తే 25పైసలు, బరస్ట్‌అయితే, వల్కనైజింగ్ చేయడానికి 40పైసలనుండి రూపాయిదాకానూ వసూలు చేస్తానన్నాడు మస్తాను. "చక్రాల తెటుకు తీయడానికి 10నుండి 15పైసలుదాకా తీసు

కుంటానండీ. గాలికొడితే "పయ్యా"కు 3పైసలుండేది. ఇప్పుడు 5పైసలు చేసినా. సైకిల్‌రిక్షా 3పయ్యాలకూ గాలికొట్టినా 10పైసలే తీసుకుంటానండీ. వాళ్ళే గొడ్డుచాకిరీచేస్తుంటే వాళ్ళను పిండుకొని బాగుపడేదేంటిబాబూ ? చువ్వలేస్తే ఒక్కొదానికి 10పైసలు, వాల్‌ట్యూబ్ బిగించి గాలికొడితే 10పైసలూ, బ్రేకులు సరిచేస్తే రూపాయి రూపాయిన్నర తీసుకొంటాను. మొత్తం సైకిల్ విప్పదీసి కిరసనాయిల్లో నానేసి మళ్ళీబిగిస్తే 8రూపాయల నుండి 10,12దాకా తీసుకొంటా" అన్నాడు మస్తాను. చక్రం బెండింగు తీయడం, చైన్ కొక్కెం వూడదీసి మళ్ళీ రివైట్‌చేయడం, హాండల్‌బార్ సొట్టలుతీయడం, విరిగిపోయినచోట అతకడం ఇలాంటి పనులన్నీ తను స్వయంగానే చేస్తానన్నాడు మస్తాను.

"ఏంచేస్తే ఏముందిలెండి ఒక్కొపాలి, పస్తులే వుండాలిసొస్తుంది. ఎండాకాలం మిటమిటలాడే అగ్గిలో వుండాల్సిందేనండీ. పంచర్లు వేసే పని అప్పుడే కాస్త ఎక్కువగా వుంటుంది. వానాకాలంలో బ్రేకుల్ని బాగు చేయడం ఎక్కువగా వుంటుందండి. ఏంచేసినా ఆరు ఏడు కన్నా ఎక్కువ రాదండి. ఒక్కో రోజున రెండు మూడు దొరకడంకూడా కష్టమేనండి" అన్నాడు మస్తాను. ఇది వరకు కొడుకుచేత కూడా చిన్న వ్యాపారం చేయించేవాడు మస్తాను. చిన్నచిన్న సీసాలనిండా నూనె నింపుకొని సైకిల్ దీపాలకు పోస్తూవుంటే రోజుకు ఓ అర్ధరూపాయి డబ్బులు ధోకా లేకుండా దొరుకుతుండేవి. డైనమోలు, బ్యాటరీలైట్లు పెరగడంవల్లా కార్పొరేషన్ వాళ్ళు దీపాలు వుండవలసిన అవసరం లేదని రూల్సు చేయడంవల్లా ఆ బిజినెస్ కాస్తా మూలబడిపోయింది. ఆ రోజుల్లో కూడా పోలీసువాళ్ళ బాధ మస్తానయ్యకు తప్పలేదట. ఫ్రీగా నూనె పొయ్యకపోయినా, రిపేరు చేయకపోయినా న్యూసెన్సు కేసుపెట్టి చంపుతుండేవారట. ఇప్పుడంతబాధ లేదన్నాడు. ఎందుకనో, కారణం తను చెప్పలేనన్నాడు, మస్తాను.

ఇదివరకు ఏ.జి. ఆఫీసుదగ్గరే వుండేవాడట. ఈమధ్యనే నాంపల్లికి మారాడట, "ఈ మారడానిదేముందిగానీ అసలురాత మారాలండీ. ఇన్నేళ్ళ నుండి చూస్తున్నా. అదిచేస్తాం ఇదిచేస్తాం అంటారేగాని చేసినవాడెవ్వడూ లేడు. ఇకముందుకూడా ఎవ్వడూ ఏదీచెయ్యడు. ఓట్లప్పుడు ఏందేందో చెబుతారు. మళ్ళా కన్పించరు" అని నిట్టూర్చాడు మస్తాను.

అతనికి ఆరుగురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళుచేశాడు. ఒక అల్లుడు చెప్పులదుకాణంలో పనిచేస్తున్నాడని, ఇంకో అల్లుడు రిక్షా తొక్కుతున్నాడనీ చెప్పాడు. పెద్ద కొడుకును మౌలాలి దగ్గరున్న ఓ బిస్కెట్ల ఫ్యాక్టరిలో ఉంచాడట. వాడు తిన్నగా పనిచేసినా జీతంమాత్రం ఇంట్లో ఇవ్వడట. "సోకులు ముదిరినయ్యండి పాంట్లు తొడుగుతాడు. సలవ కళ్ళజోడు పెడతాడు. సినిమాలు చూస్తాడు. అప్పుడప్పుడూ చెడతాగి ఇంటికొస్తాడండి" అని కస్సిళ్ళుపెట్టుకున్నాడు మస్తాను. "ఆ పండగ ఈ ఎండగా లేదుబాబూ ఆరుగాలమూ ఈణ్ణే పడిసస్తా. పొద్దున్నుంచి రాత్రి 8,9 గంటలదాకా ఉంటా. ఇదివరకయితే సామానంతా ఆపెట్టెలోకిసర్ది ఇంటికి తీసుకుపోతుండేవాణ్ణి. అప్పుడు పాతసైకిలుండేది లేండి.

రెన్నెల్లకింద దాన్ని 'గిరీ' పెట్టి పదిరూపాయిలు తెచ్చిన - మా ఆడాళ్ళకు జబ్బుచేస్తే. ఇంకా యిడిపించలేదండి. దొరికింది దొరికినట్టుగా పొట్టకే చాలకపోతుంటే ఇంకా తాకట్టు ఏంబెట్టి ఇడిపించుకుంటానండీ. అదట్లా 'ఖతం' కావలసిందేనండీ" అన్నాడు మస్తాను దిగులుగా.

తన చిన్నతనంలో వెండిపాత్రలో "అష్రఫీలు" అందించిన మస్తాను ఇప్పుడు అరకొరతిండితో అసులుసులుగా కాలం వెళ్ళదీస్తున్నాడు. అతనికి గతం తప్ప వర్తమానంలో ఆశలేదు. భవిష్యత్తులోనైనా అతని బతుకులో ఇంత ఆశారేఖను చూపగలవారెవరన్నా వున్నారా ?



బతుకు కోసం బహుకృత వేషాలు

ప్రాగైతిహాసిక మానవ జాతి సంచార దశను దాటి, స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్నప్పటి చిత్రాలు కొన్నింటిని ఆధునిక శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పగలంతా వేటాడడం, రాత్రివేళల్లో గుహల్లో తలదాచుకోవడం, ఎండలకు వానలకు చలిగాడ్పులకు ఆ గుహలే శరణ్యం కావడం, అప్పుడప్పుడే నిప్పుతో మచ్చిక ఏర్పడడం, నిప్పును పతనానికీ, వెలుతురుకూ కూడా ఉపయోగించుకోవడం ఈ దశలోనే మనిషికి తెలిశాయని మనుష శాస్త్రవేత్తల అభిప్రాయం.

మన పూర్వీకులు గీసిన చిత్రాలు కొన్ని ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. లేడిని రాతి ఈటెతో పొడవనున్న వేటకాడు, ఐదువేళ్ళను చూపెడుతూ ఎదుటివారికి తన భావాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తున్న విలుకాడు, తను అక్కడెక్కడో చూసిన ఒక భయంకరమైన ఏనుగును పోలిన జంతువు, కావడితో నీరు తెస్తున్న సంసారి, ఇలాంటి చిత్రాలు ఐరోపా దేశాలలోని పర్వత గుహల్లో ఈ నాటికీ వున్నాయి.

ఈ చిత్రాలను ఎవరు గీశారో తెలీదు. ఎందుకు గీసి వుంటారన్నది ఈనాడు మనం ఊహించుతున్నాం. తొలి చిత్రం లేడిని వేటాడవలసిన విధానాన్ని తెలియజేస్తున్నది. అలాంటి లేళ్ళు ఐదువందలో, ఐదువేలో, వున్నాయనో లేదా ఐదుపాయలుగా చీలి తనకు చిక్కకుండా పోయాయనో చెప్పడం కావచ్చు. తాము నివసిస్తున్న అరణ్యంలో ప్రాణాపాయకరమైన జంతువులున్నాయని చెప్పడం రెండవ చిత్రం వుద్దేశ్యం కావచ్చు. పుష్కలంగా నీరు లభించే ప్రాంతాన్ని సూచించడంతోపాటు నీరు తెచ్చుకొనే పద్ధతిని తెలియజేయడం బహుశా మూడవచిత్రం ఉద్దేశ్యమయి వుంటుంది.

ఇప్పుడు మన భావాలను, అభిప్రాయాలను, ఉద్దేశాలను తెలియజేయడానికి మాటలను వాడుతున్నట్టే-ఒకప్పుడు బొమ్మలనుకూడా వాడేవారని శాస్త్రజ్ఞులంటున్నారు. ఇది నిజంకూడా, కాని నటరాజన్ బొమ్మలు గీయడం తన అభిప్రాయాన్ని తెలియజేయడానికి మాత్రం కాదు. కేవలమూ పొట్ట నింపుకోవటానికే.

అతనిది తంజావూర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం. చిన్నప్పుడెపుడో చెప్పపెట్టాకుండా ఉన్న వూరునుండి వచ్చేశాడు. కొంతకాలం పాటు మద్రాసులో వున్నాడు.


అక్కడతను చాలా పనులు చేశాడు.

"ముందుగా తిండికి మాడాను. అరవం తప్ప ఇంకో భాష రాదు. పానగల్ పార్కు ముందున్న పేవ్‌మెంట్లమీద కాలక్షేపం చేసేవాణ్ణి. ఉన్న డబ్బులు అయిపోయినయి. నీళ్ళు త్రాగి రెండు మూడు రోజులు గడిపాను. ఒక ధర్మాత్ముడు గీతాకేఫ్‌లో పని ఇప్పించాడు. కొంతకాలం చేశా" అన్నాడు నటరాజన్. తెలుగును పట్టిపట్టి మాట్లాడుతూ.

ఆ హోటలుకు చాలామంది సినిమావాళ్ళు వచ్చేవారట. వారందరితోను అతనికి క్రమక్రమంగా స్నేహం అయింది. ఈ స్నేహం కారణంగానే అతను అప్పుడప్పుడూ సినిమా షూటింగులకూ్కడా వెడుతూ వుండేవాడు. అక్కడున్న వారందరికీ అతను కాఫీలూ, టీలు, ఫలహారాలు ఇంకా ఇంకా ఆ పైపీ కూడా అందిస్తూ వుండేవాడు.

ముందుగా ఆ సెట్టింగులూ, లైట్లూ, స్టార్స్, అక్కడి జనాన్ని చూసి నటరాజన్ ఆశ్చర్యపోయాడు. రూపాయలు నీళ్ళులాగా ఖర్చు కావడం చూసి అతను దిమ్మెరపోయాడు. అదేదో ఏ అరవ సినిమాలో చిన్న వేషం కూడా వేశాడట నటరాజన్.

"ఇలా క్రమంగా పైకి పోవచ్చు" అని నచ్చచెప్పినవారూ ఉన్నారు. ఓ స్టార్ ఇంట్లో పనిక్కుదిరాడు. తరవాత మరో ఆర్టు డైరక్టరు గారింటిలో చేరాడు. ఆక్కడే మూడేళ్ళపాటు అణిగి, మణిగి పడి



వున్నాడు. ఆ సమయంలోనే అతను బొమ్మలు గీయడం కూడా నేర్చుకున్నాడు.

"అంటే మా అయ్యగారు పనిమాలా నాకు నేర్పలేదండీ. నేర్పమనికూడా నేను అడగలేదు, అయనగారే చేస్తుంటే నేను చూస్తుండేవాణ్ణి. తీరిక దొరికినప్పుడల్లా నేను గీస్తుండేవాణ్ణి" అన్నాడు నటరాజన్— ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ.

ఒకసారి అతను వేసిన బొమ్మను అయ్యగారు చూసారు. చూసి మెచ్చుకున్నారు. అతనికి యింటిపని తగ్గించి తనకు సహాయకుడిగా అట్టే

పెట్టుకున్నారు. అయ్యగారితో బాటు ఉండటం వారికి కావలసిన అన్ని పనులు చేసిపెట్టడం నటరాజన్ వంతు.

"నేను అక్కడే వుంటే ఏం జరిగేదో చెప్పలేను. ఉండలేక పోయానండీ. దానిక్కారణాలు అడగొద్దు. ఒకసారి అయ్యగారి బంగారు గడియారం, మెళ్ళో గొలుసు పోయాయి. అన్నీ వెదికారు. ఎక్కడా దొరకలేదు. ఆఖరికి మా అమ్మగారు నా పెట్టెను వెతికితే అందులో కని పించాయండీ'' అన్నాడు నటరాజన్ కన్నీళ్ళు పెట్టుకొంటూ,

అలా వుండటం అతనికే ఆశ్చర్యంగా వున్నది. "అయ్యగారు మాత్రం ఇంకేమీ మాట్లాడకుండా ఐదువందలు చేతికిచ్చి యింకెక్కడన్నా పని చూసుకోమన్నాడు. ఆయన మాత్రం నాకోసం సంసారాన్ని పాడు చేసుకుంటారా చెప్పండి. మరింక జీవితంలో ఎవరిదగ్గరా పనిచేయగూడ దనుకున్నాను. ఆ డబ్బు అయిపోయిందాకా పుణ్యక్షేత్రాలన్నీ తిరిగాను.''

"చాలాకాలందాకా నేను పెళ్ళిచేసుకోలేదు. పెళ్ళంటే అసహ్యం వేసింది. కానీ పాట్నాలోవున్నప్పుడు నాకన్నా దరిద్రంలోవున్న ఓ అమ్మాయి కన్పించింది. నాకెందుకనో ఆమెనుచూస్తే జాలివేసింది. అక్కడి వసూలయిన డబ్బు ఆమెకిచ్చాను. తీసుకోవడానికి ముందు ఒప్పు కోలా. ఒద్దంటే ఒద్దన్నది. తరువాత మాటలు కలిశాయి. ఆమెకూ దిక్కూ మొక్కూ లేదు. నాతో వుంటానన్నది. సరేనన్నా. నాలుగేళ్ళ క్రింద తిరుపతిలో పెళ్ళిచేసుకున్నాం. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు" అన్నాడు నటరాజన్. దూరంగా చెట్టుకింద కూచున్న భార్యా పిల్లలను చూపెడుతూ.

దేశం తిరగడంవల్లా, హిందీమాత్రమేతెలిసిన భార్య వుండడంవల్లా నటరాజన్ హిందీమాట్లాడడం నేర్చుకున్నాడు. అతను ఇంగ్లీషు మాట్లాడ లేడు. కానీ ఓమాదిరి ఇంగ్లీషును అర్థంచేసుకోగలడు, తెలుగును కాస్తంత అరవయాసతో మాట్లాడే నటరాజన్ తనిక తెలుగుదేశంలోనే ఉండిపోవా లనుకుంటున్నట్ట.

''నాకు కావలసిన పెట్టుబడికూడా ఏంలేదండీ. మెత్తటి బొగ్గు ముక్కలు, సుద్దముక్కలు రంగు రంగుల చాక్‌పీసులు చాలు. వీటితో ఏ బొమ్మనయినా అవలీలగా వేస్తాను. విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, శివ తాండవం, వినాయకుడు, వెంకటేశ్వరస్వామి, నటరాజు ఏదైనా సరే''.

ప్రముఖ నటులు నటించిన సినిమాలు ఆడేటప్పుడు, వారిబొమ్మల్ని కూడా గీచి చూశానని అందువల్లతనకు అభివందనలు లభించాయేతప్ప పైసలు రాలేదని నటరాజన్ అన్నాడు.

"దేవాలయాల ముందు ఆయా దేవుళ్ళ బొమ్మలు గీస్తా. భక్తితో కాకపోయినా భయంతోనయినా. నాలుగు డబ్బులు పడతాయి. శివరాత్రి నాడు శివుడి బొమ్మలు చవితికి, వినాయకుడి బొమ్మలూ గీస్తా. వెంకటేశ్వర స్వామి వారికి ఇలా సీజను లేదండీ ఎప్పుడు బొమ్మ గీసినా పది పదిహేనుకు తక్కువ రావు అన్నాడు'' నటరాజన్.

తన భార్యకు ఈ పనిలో బొత్తిగా శ్రద్ధ లేదన్నాడు నటరాజన్. ఆవిడా తనూ హిందీలో మాట్లాడుకొంటారట.

"ఇదంతా గాలిపాటు. రోజూ నిక్కచ్చిగా ఉండే పనికాదు. ఒకే చోట వుంటే రాబడికూడా తగ్గిపోతుంది. ఒకచోట గిరాకీ తగ్గంగానే ఇంకోచోటికి మకాం ఎత్తేస్తే తప్ప లాభం లేదు. ఇప్పుడు యిలా బొమ్మలు గీసేవాళ్ళుకూడా అక్కడక్కడా పెరుగుతున్నారు. నాకూ తగిలారు అనుకోండి. మిగతా వృత్తులకన్నా ఇందులో పోటీ తక్కువగానే వుంది" అన్నాడతను.

నటరాజన్ చాలా సాదా మనిషి, చేతులో వున్నదంతా అయిపోయిందాకా కదలడు. ఉన్నప్పుడే నాలుగు సంపాదించుకోడం అవసరమంటుంది అతని భార్య. ఆ పద్ధతేమో అతనికి నచ్చదు.

"భగవంతుడి మీద జనంలో నమ్మకం వున్నంతవరకూ నా ఆదాయానికి ఢోకా ఉండదు. ఇన్నివేల సంవత్సరాల నుండి పాతుకు పోయిన ఈ నమ్మకం ఇంతలో సడలనూ సడలదు. లేదు, నాకు ఉద్యోగం చేయాలని లేదు" అని ఖచ్చితంగా చెప్పాడు నటరాజన్.

వర్షాకాలంలో తనకు బొత్తిగా రాబడి వుండదన్నాడు. ఆ సమయంలో తను పస్తులు చేసిన సమయాలుకూడా వున్నాయన్నాడు. ఇన్నేళ్ళ నుండి రకరకాల బొమ్మలు వేస్తూ పదిమందిని ఆకర్షిస్తున్న నటరాజన్ జీవితంలో స్థిరపడలేక పోయాడు. అతని కళ ఆదరించి ప్రోత్సహించేవారూ కరువయ్యారు.

తలకుండు విషము ఫణికిని...

"దేనికన్నా అంతం ఉంటుందేమోగానీ, నా పాడుబతుక్కి మాత్రం అంతం కనిపించడంలేదు బాబయ్యా. ఏ నిమిషాన ఈ భూమిమీద పడ్డానో నాకు తెలియదు. అప్పణ్ణించీ నాకు సుఖమంటే ఏమిటో తెలియదంటే మీరు నమ్మరు." అన్నాడు ఖాజామియా, పామును బుట్టలోకి సరుకుంటూ.

ఏ సంవత్సరం, ఏ నెల, ఏ తేదీన, ఎన్ని గంటలు, ఎన్నినిమిషాల, ఎన్ని సెంకడ్లకు ఖాజామియా పుట్టాడో మనకు తెలియదు, అతనికీ తెలియదు. కానీ, ఎండాకాలంలో సాయంకాలంపూట, జంగిలిగొడ్లు ఇళ్ళ కొచ్చేవేళప్పుడు పుట్టాననిమాత్రం ఖాజా చెబుతాడు. అదిగూడా, వాళ్ళమ్మ తన చిన్నప్పుడు ఎవరితోనో చెబితే ఆ ఎవరో తను పెద్దయ్యాక తనతో చెబితే, అది గుర్తుంచుకొని చెప్పాడు ఖాజామియా.

ఖాజామియా మాతామహుడు కటిక దరిద్రుడు. ఓ చిన్న నుదురు పాక ఉండేదాయనకు, పైన రెల్లుగడ్డి కప్పాడు. దాని అడుగున చింత కొమ్మలు పరిచాడు. ఆ కొమ్మలకూ వాసాలకూ కలిపి చింతబరికెలతో మళ్ళువేశాడు. ఆయన చాలా కాలం జీవించాడు. అయితే ఖాజామియాకు కాస్తంత ఊహ తెలిసేదాకా, తన తల్లి తనకు బొత్తిగా గుర్తులేదన్నాడు ఖాజామియా.

"మా నాయనమ్మ చాలా గద్దరి ముండని చెబుతారు. మా నాన్న అన్నదమ్ములు నలుగురు. మా నాన్న పెద్దవాడు. మెత్తని వాడు. అమాయకుడు. మా నాయనమ్మ అస్తమానమూ తన కోడల్ని రాచి రంపాన పెడుతుండేది. తిన్నగా తిండిపెట్టేది కాదు. తిట్టేది, కొట్టేది. నేను మూడేళ్ళ వాణ్ణయి వుండగా ఆ బాధలు భరించలేక మఠం దగ్గర బావిలో దూకి చచ్చిపోయింది. బావిలో దూకినప్పుడు, పైకి తేలుతానేమో నన్న అనుమానంతో వొడినిండా రాళ్ళునింపుకొని, మరీ దూకింది. రెండవరోజున గానీ, ఆ సంగతి తెలియలేదు." అన్నాడు ఖాజామియా, తల్లిని తలచుకొని బావురుమని ఏడుస్తూ !

ఏడాది తిరక్కముందే నసీరుద్దీన్ మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఖాజామియా తన మాతామహుల ఇంటి కొచ్చేశాడు. అక్కడ ఏడెనిమిది సంవత్సరాలు ఎచ్చేదాకా వున్నాడు. అంతలోనే అమ్మమ్మ చచ్చిపోయింది. మేన మామలు, వేరుపడిపోయారు. తండ్రిని ఎవరు పోషించాలన్న తగాదాలతోనే వారు తలలు బద్దలుకొట్టుకు చస్తుంటే, తనను పట్టించుకొనే వారెవరు గనక ?

అందుకే ఖాజామియా తిరిగి తండ్రి దగ్గరికి వచ్చాడు. "మానాన్న మంచివాడే! కానీ, మాపిన్ని మాటలకు ఎదురు చెప్పలేడు. మాపిన్నికి అప్పటికే నలుగురు పిల్లలు. వాళ్ళందరూ నన్ను పనిమనిషిగా చూసేవారు. వాళ్ళకు అడ్డమైన పనులు చేసేవాణ్ణి. చేయడానికి ఓపిక లేక మానుకొంటే, చావచావేవారు." అన్నాడు ఖాజామియా. నసీరుద్దీన్‌కు పదకొండెకరాల బాడవ పోలం వుండేది. కాడెక్లవ్యవసాయం. రెండు పాడిబర్రెలు. ఖాజామియా తమ్ముళ్ళు దర్జాగా తిరుగుతుంటే, ఖాజామియా గొడ్లపని, పొలంపని చేసేవాడు.

"అదేనాకు కాస్త అన్నం పెట్టింది బాబయ్యా!" అన్నాడు ఖాజామియా.

జరిగిన మోసమంతా ఆస్తి పంపకాల దగ్గర జరిగింది. ఖాజామియా పోషణకోసం వెయ్యిరూపాయలు, ఆ రోజుల్లో వెయ్యిరూపాయలు నసీరుద్దీన్ తనమామ గారికిచ్చాడు. అంటే అప్పుడే ఆస్తి పంపకాలు జరిగిపోయాయని అర్థం. ఆ ముసలి పీనుగు ఆ వేయిరూపాయల్ని దిగమింగి ఖాజామియాను మళ్ళాపుట్టింటికి తరిమేశాడు. కన్నతండ్రి గనుక కొడుకును వొమలుకోలేక దగ్గర అట్టెపెట్టుకొన్నాడు. ఇంట్లో ఉంటున్నాడు గనుక ఇంత చాకిరి చేస్తున్నాడు, పొట్టపగిలేలా తింటున్నాడు అంత మాత్రాన, ఆస్తిలో మళ్ళా భాగమంటే ఎలాకుదురుతుందీ?

ఇరవయ్యేళ్ళపాటు, అప్పెశంగా పెదరామయ్యగారింట్లోనే ఉన్నాడు. ఆయన పొలమే తన పొలం, అయన గొడ్లే తన గొడ్లు. ఆయన క్షేమమే



తన క్షేమం, ఆ పెదరామయ్యగారే తన సర్వస్వం. ఆయనే అన్నదాత, ఆయనే అల్లా.

ఖాజామియావెళ్ళాక, పెదరామయ్యగారికి బాగా కలిసొచ్చింది. ఈలోగా ఖాజామియాకూడా పెళ్ళయింది. పెదరామయ్యకు సంతానం కలిగింది. ఖాజామియాకు, ఆ అదృష్టంలేదు. ఆయన పిల్లల్నే తన పిల్లలుగా సాకాడు ఖాజామియా.

ఒకసారి కంద దుంపలు బండినిండా వేసుకొని చీకటి పాటున వొస్తున్నాడు ఖాజామియా బండి పూటిగుంటలో పడి ఆకులు విరిగి,

బండి రోజీపక్కకు కూలిపోయింది. దుంపలన్నీ దొంకవిండా పడ్డాయి. కుడికాలు విరిగింది. ఎదుర్రొమ్ముపక్కటి ఎముకలు విరిగాయి.

ఖాజామియా కోలుకోడానికి నాలుగునెల్లుపట్టింది. గాజుల సోమయ్య కుప్పెలు, మాత్రలూ నూరిపోసాడు.

'మాడుజీవు' పట్టుకూడావేశాడు ఆఖరుకు 'సంధి' పుట్టింది, ఇకదానికి మందులేదు. 'గరళం' పోయాలి. ఆ దెబ్బతో రోగంతిరిగితే తిరగాలి. లేదా చావన్నారావాలి. అయితే అప్పటికప్పుడు విషంకావాలంటే ఎక్కడ దొరుకుతుంది ?

ఆ రోజు సాయంత్రమే కోటప్పుడు పాములాడించుకొంటూ ఆ వూరొచ్చాడు. పెద్దరామయ్యగారు కోటప్పుణ్ణి బతిమిలాడి నీరుకాని ఉత్తరీయం వాడికిచ్చి పదిచుక్కల ఏషం పట్టుకొచ్చాడు. ఆ విషంతో కూప్పెమందునూరి, ఖాజామియాకిచ్చాడు గాజుల సోమయ్య. ఆ విషంలో ఏమాయ ఉందో ఏమోగానీ ఖాజామియా రోగం తిరుగుముఖం పట్టింది పోతాడనుకొన్న మనిషి, బతికి బయట పడ్డాడు.

"పెదరామయ్యగారి మనసులో ఏమున్నా బాబుగారూ ఆయన బొమ్మరిది మాటకే ఆఖంట్లో చెల్లుబడి. ఆయనదీ పెత్తనమంతా. ఆయన బొత్తిడివి కాదనలేక పెదరామయ్యగారు నన్ను పనినుంచి మానిపించారు." అన్నాడు ఖాజామియా.

అప్పటికే ఎండ మిటమిటలాడుతోంది. ఉండి ఉండి బుట్టలోంచి పాము, 'ఉస్సు' అంటూ బుసలుకొడుతోంది లోపలికి పీక్కుపోయిన బుగ్గల్ని మరోసారి చప్పుడయ్యేలా, లొట్టలేశాడు ఖాజామియా.

"ఆ తర్వాత ఆ పనీ ఈ పనీ కొంతకాలం చేశా, బతికున్నప్పుడు చంపే మనుషులకన్నా చావబోయే వాణ్ణి బతికించిన పాములే నయమని పించిందండీ, అప్పుడు నేర్చుకొన్నా ఈ పాములాడించడం".

ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం ఇషం లేదేమోమరి ఖాజామియా సమాధానాలు చెప్పకుండా దాటేశాడు.


"ఒకప్పుడు ఈ పాములాడించడం, ఎప్పుడన్నా చేస్తుండేవాణ్ణి, ఇప్పుడిదే నాకింత బువ్వా పెడుతున్నది. నాకొక ఊరేంటి బాబుగారూ ఈ అన్నివూళ్లూనావే ! రోజుకు రెండుమూడు చోట్ల మోళీలు వేస్తా. ఒక్కొసారి 7,8 రూపాయల దాకా దొరుకుతాయి. వానాకాలంలో ఆట సాగదండీ. ఈ పాము పేరు 'సికిందర్' చాలా మంచి ముండ. చెప్పి నట్లు వింటుంది. మేత వేసిందాకా, మెదలకుండా వుంటుందేగానీ, మూరాంచేయదు" అన్నాడు ఖాజామియా.

ఇంతకు ముందొక నల్లతాచు ఉండేదనీ దానికి వల్లమాలిన కోపమనీ, అది బుస్సు, బుస్సుమంటూ జనంమీదకి ఎగిరెగిరి దూకుతుండేదనీ, దాని భయంవల్ల జనం తన అటకు వచ్చేవారు కాదనీ, అందుకనే దాన్ని అమ్మేశాననీ చెప్పాడు ఖాజామియా.

తాను చాలా రకాల పాములిన్ని ఆడించానన్నాడు. వాటిని పట్టుకొనే పద్ధతీ వాటిని ఆటకు అలవడే పద్ధతీ, అతను దాటవేస్తూ చెప్పాడు.

"ఇప్పుడు మేమిద్దరమే ఉన్నాం. ఇంకెవ్వరూలేరు. నాముందు అది దాటిపోతే అదృష్టవంతు రాలేననుకోండి, నేనే ముందయితే మాత్రం, దాని బతుకు బుగ్గి పాలయి పోతుందని బాధ పడుతున్నా, నన్ను చేసుకొని, అది సుఖ పడిందేమీ లేదండీ." అన్నాడు ఖాజామియా. 'సికందర్, ఇంకోసారి బుస్సు' మంటూ బుట్టమూతను తొలగదీసుకొని, ఖాజామియా పైపు పడగ చాపింది, నాలుకలు కోరుతూ, మెల్లగా బయట కొచ్చి, ఖాజామియా ఒళ్ళో చుట్టవేసుకు పడుకొంది.

"ఆకలయింది బాబు పిచ్చి ముండకు, లేకపోతే ఇలా బయటకు రాదు" అని ఆప్యాయంగా ఆపామును నిమరసాగాడు ఖాజామియా.



సారె సారె కున్ ...

మానవేతిహాసంలో మట్టికున్న ప్రాధాన్యం మరొక దానికి లేదేమోననిపిస్తుంది. ప్రాణి జన్మించింది, మట్టిలో కలిసిపోతున్నది. ఈ మట్టికోసం గతంలో మహాయుద్ధాలు జరిగాయి. కోట్లాది మానవులు ఈ మట్టికోసం పోరాటాలు జరిపి నెత్తుటితో మట్టిని పంకిలం చేసి చివరకి ఆ మట్టిలోనే కలిసిపోయారు. చారెడు మట్టికోసం బారెడు నేలకోసం మనమింకా మారణకాండను నడపడానికి సిద్ధంగా వున్నాం. ఈ మట్టిలోంచే మనక్కావలసినవన్నీ పిండుకొంటున్నాం. ఈ మట్టిలోనే తిరిగి చేర్చుతున్నాం. మనం నమ్ముకొన్నదీ, మనం తన్నుకొన్నదీ ఈ మట్టికోసమే.

మనిషికి లోహాలతో పరిచయం ఏర్పడడానికి అనేక వేల సంవత్సరాల ముందే, మట్టితో పరిచయముంది. మట్టితో రకరకాల పాత్రలను చేయడం నేర్చుకొన్నాడు. అనాటి మృణ్మయ పాత్రల శిధిలాలు ఈనాటికీ భూగర్భ త్రవ్వకాలలో లభిస్తున్నాయి. ఆ శిధిలాల ఆధారంగా అప్పటి వారి జీవన విధానాన్ని కనుగొనడానికి మనం ప్రయత్నిస్తున్నాం.

బంకమట్టితో పాత్రలను చేయడం మనిషికి తెలిసి వేలాది సంవత్సరాలయిందనుకొన్నాం గదా. ఈ లెక్కన గురవయ్య చేసే పని వయస్సుకూడా వేల సంవత్సరాలే అయివుంటుంది. చిత్రమేమిటంటే, ఇన్నివందల శతాబ్దాల కాలంలో అన్ని వృత్తుల రూపురేఖలూ అంతో యింతో మారిపోయాయి. అట్టే ఎదుగూ బొదుగూ లేకుండా అనాది మానవ సమాజం అవలంబించిన పద్ధతుల్లోనే నడుస్తున్న వృత్తి ఇదొక్కటేనేమో ననిపిస్తుంది.

గురవయ్యకి వృత్తి ఒకరు నేర్పితే వచ్చిందికాదు. అతని రక్తంలోనే ఈ పనికి కావలసిన నైపుణ్యమంతా నిండి వుంది. అతని ముత్తాతల, ముత్తాతల దగ్గరనుండీ ఈ పనే చేస్తున్నారు. అతనూ ఇప్పుడదే చేస్తున్నాడు.

యింకా ఎక్కువ కాలం ఈ పని చేసుకొని బతకలేం బాబూ కూలీ గిట్టదు. అన్నాడు గురవయ్య చుట్ట కొస కొరికి దూరంగా వుమ్ముతూ.

గురవయ్య చదువుకోలేదు. చదువుకొంటే ఆయుస్సు తగ్గుతుంది అని ఎవరో తన తండ్రికి చెప్పారుట. అదీగాక గురవయ్య వున్నవూళ్ళో సర్కారు బడిలేదు. ఆ చుట్టుపక్కల రెండుమూడు కోసులదాకా కూడా లేదు. ఉన్న వూళ్ళో రామానుజాచార్ల వారు పీధి అరుగుమీద పదిమంది పిల్లలకు పాఠాలు చెప్పేవారు. అయితే ఆ పదిమందీ కలిగినవారి పిల్లలు. వారి సరసన కూచోడానికి ఎన్ని గుండెలు కావాలి? తనకు కూచోవాలని వున్నా తన అయ్య అందుకు వొప్పుకోవాలి గదా.

"మా నాన్న నంగతి మీకు తెలియదుగానండీ, అదుగో ఆ చూరు ఎత్తున వుండేవాడు. చెవలకి బంగారు పోగులు, వెండి మొలతాడు, చేతికి రాగికడియం, మెడలో ఆంజనేయుల వారి బిళ్ళా, బుగ్గ మీసాలు జుట్టు ముడి ముగ్గురి తరువాత నేనే ఒతిశానంటండి అందుకనే మా నాన్నకు నేనంటే చచ్చే ప్రేమ. నేనూ దక్కకుండా పోతానేమోనని నాకు చదువు చెప్పించలేదు అన్నాడు గురవయ్య.

తన చిన్నప్పటికీ ఇప్పటికీ ఊరు పరిస్థితి బాగా మారిపోయిం దన్నాడు గురవయ్య.

"ఆ రోజుల్లో గాబులు, బానలు, కుండలు. కడవలు, మూకుళ్ళు, ముంతలు, చట్టిపిడతలు, ప్రమిదలు, గురుగులు ఇంకా నన్ను కట్టుకుపోయి నన్ని సామాన్లు తయారు చేసేవారు. మా నాన్న మట్టసానికి 'గరిసెలు' కూడా తయారు చేసేవాడండి. ఆయన చేసిన గరిసెలింకా బెచ్చిక రాల కుండా రాంకోటయ్య గారింట్లోనూ పెద సాంబయ్యగారింట్లోనూ ఉన్నాయి. దాన్నిండా గింజలు పోసుకొని దాచుకొనేవారు. అసలీ మాయ వెండి - అదే జర్మన్ సిల్వర్ రావడంతో మా కూట్లో దుమ్ము పడ్డది. పట్నాల్లో మా మట్టిసామాన్లు వాడేవాళ్ళే లేరుగా బాబయ్యా. ముద్ద వున్నా లేకపో యినా డాబుసరికోసమైనా అల్యూమినియంవీ, స్టీలువీ వాడుతారాయె ఇంకేం బతుకుతాం చెప్పండి" అన్నాడు గురవయ్య.

తన తండ్రి కుండలు చేసినా, బానలు చేసినా, పిడతలు చేసినా, ఎర్రయేగాణీ తీసుకొనేవాడు కాదుట. తమకు ప్రత్యేకంగా కొన్ని యిళ్ళు



వుండేవనీ; ఆ ఇళ్ళవాళ్ళక్కావలసిన కుండా చట్టీతామిస్తే, తమక్కావల సిన గింజా, గిటకా వారు కొలిచేవారనీ చెప్పుకొచ్చాడు గురవయ్య.

అసలు కరువనేదే ఎరుగమండీ. ఏ అయ్య కళ్ళందగ్గర కెళ్ళినా గూడకుంగిపోయేది – మూటమొయ్యలేక. దుత్త తీసుకొని బజార్నపడితే మూడిళ్ళన్నా తిరక్కముందే మజ్జిగతో దుత్త నిండిపోయేది. శనగలు, కందులు, అలసందలు, ఉలవలు-సరే. ఇక జొన్నలన్నా, సజ్జలన్నా, మొక్కజొన్నలన్నా కరువేలేడనుకోండి. ఇన్ని కుండలిచ్చామన్న లెక్క మాకు వుండేదికాదు. సుబ్బన్న ఇన్నిసార్లు మనింటికొచ్చి, అవీయివీ

తీసుకెళ్ళాడన్న ఆలోచన వారికీ వచ్చేదికాదు. పెళ్ళిళ్ళయితేనండి ఖర్చంతా ఊరే పెట్టుకొనేది ఆవం కాల్చాలనుకొన్నామంటే - వారం రోజులు ముందుగా, ఓఅయ్యాటిల్లో వోనాలుగుతుమ్మలు పేళ్ళేసుకుంటే సరిపోయేది. ఇప్పుడంతా డబ్బుతో ముడిపెట్టుకొని చచ్చిపోతున్నాం" అని విసుక్కున్నాడు గురవయ్య.

గురవయ్య యిల్లు వూరికి చివరగా వుంది. ఆ యింటిపక్కనే చిన్న 'ఆవం' వుంది. దానికి అటూ యిటూ పిచ్చికుసమ, కసింద మొక్కలూ మొలిచాయి. గురవయ్య భార్య దారపోగులా వూగిసలాడుతూ చింతచెట్టు అవతల్నించీ నీళ్ళుతెచ్చి, మొర్రి బోయిన గాబును నింపుతున్నది.

"ఈ పనిని వదలలేను. ఇంకోపని చేతకాదు. నిరుటి వానలకు చేసిన కుండలన్నీ కుప్పబడిపోయాయండీ. మళ్ళీ మొదలెత్తుకోవలసి వచ్చింది. ఈ ఏడు ఫర్వాలేదనుకోండి. బస్తీలకా ? అక్కడికెళ్ళినోళ్ళ బతుకు చూస్తూనే వున్నాంగదండీ. మట్టి కుండలకి బస్తీలో గిరాకీ వుండదని మీకు తెలియందా బాబూ" అన్నాడు గురవయ్య.

మూడేళ్ళ కిందటికన్నా, ఇప్పుడు తనబతుకు మరీ బరువుగా తయారయిందంటూ దానికి కారణాలు కూడా చెప్పుకొచ్చాడు గురవయ్య.

"ఆ మధ్య మా పక్కవూరికి కరెంటు ఇచ్చారండి. పదిహేను, ఇరవయి బావులకు మోటార్లు పెట్టారు. పంటలు బాగా పండినయ్. నాలుగు పిక్కలు చేతిలో ఆడటం మొదలయ్యేసరికి కుండా చట్టీ పనికి రాకుండా పోయాయి" అన్నాడు గురవయ్య. సారెమీద మట్టి ముద్దను పెడుతూ.

చూస్తూ చూస్తూ వుండగానే, అతనివేళ్ళు ఆ మట్టి ముద్దలోంచి పిడతను వెలికితీసాయి. అలా వొకదాని తరువాత మరొక వస్తువు రూపం దిద్దుకొంటూ ఆవరణంతా నిండిపోతున్నది.

"ఇవి తేమ ఆరాలి అడుగులు ముయ్యాలి చరవాలి. కాల్చాలి కొన్ని పారు బోతాయి. మిగిలిన వాటిలో సొట్టలు పోయినవీ చిల్లులు పడినవీ పగిలినవీ కాక, మిగిలిన వాటిని అమ్మితే వచ్చేడబ్బుల్తో పొట్ట నింపుకోవాలి. సముద్రాలన్నా నిండుతాయోమోగాని ఈ జానెడు పొట్టా నిండడం లేదు బాబూ" అన్నాడు గురవయ్య. గిడకర్రతో సారెను ఉడాయించి తిప్పుతూ.

నిజమే -

గురవయ్య జానెడు పొట్టా దిగుల్లేకుండా నిండే రోజు ఎప్పుడొస్తుంది ?

మనిషికన్న మృగం నయం !

మనిషిని గురించిన నిర్వచనాలు బోలెడన్ని ఉన్నాయి. అందులో వొకటి "రెండు కాళ్ళ జంతువు" అనేది ఆకస్మికంగా విన్నప్పుడు ఈ నిర్వచనం అమానుషంగా కనిపిస్తుంది. మానవద్వేషంతో కుతకుతలాడి పోతున్న మందభాగ్యుడెవడో కసికొద్దీ ఈ మాట అని ఉంటాడని మనకు తోస్తుంది. కానీ, రామస్వామి గాధవింటే ఈ నిర్వచనం కూడా "సబబే సుమా" అనిపించక మానదు.

రామస్వామి పూర్వీకులది కనిగిరి తాలూకాలోని ఓ చిన్న పల్లెటూరు అంతా ఇంతో కొంద్ర ఉంది. దాన్నే నమ్ముకొని కాలక్షేపం చేస్తున్నారు. రామస్వామి తండ్రి పెద్ద వ్యవహార్త, 'కిష్టయ్యగారి తీర్పు' అంటే మరింక దానికి తిరుగు ఉండేదికాదు. వేలెత్తి చూపించుకోకుండా బతికాడాయన.



"అందరిలోకీ నేనే పెద్దోణ్ణి బాబూ !" అన్నాడు రామస్వామి. ఎలుగుబంటి సిగమోర ముడిని గట్టిగా బిగించుతూ "నేనూ అలాగే బతుకు దామనుకున్నా. కానీ భగవంతుడు నాకాఱాత లేకుండా చేశాడు." అని వాపోయాడు రామస్వామి.

రామస్వామి తండ్రికి రెండు సంబంధాలు. ఇతన్ని, తమ్ముణ్ణి కన్నతరవాత పెంచలమ్మ చచ్చిపోయింది. కిష్టయ్య బిడ్డల్ని చూసుకొంటూ బతుకుదామనుకున్నాడు. కానీ ఇరుగు పొరుగువాళ్ళు అలా ఉండనివ్వ లేదు. రెండు తులాల బంగారమూ, 15 గొర్రెల్నీ ఓలిగా ఇచ్చి లచ్చు వమ్మను పెళ్ళాడాడు కిష్టయ్య. అప్పణ్ణించే ఆ సంసారంలో రవరవలు ప్రారంభమయినై.

"మా పిన్నమ్మ కూడా మంచిదే లేరా ! ఆమె తమ్ముడితోనే పచ్చినెచావుగా ఉంది. వాడు పరమ వొంగనాకొడుకు. కుప్పలు దోస్తాడు. మందలో పడి జీవాల్ని కాజేస్తాడు. తాగుతాడు, మనుషుల్ని సంపుతాడు. కర్ర, కత్తి లేకుండా తిరగనే తిరగడండీ ! అంతకుముందు మా అయ్య తాగి ఎరగడండీ బాబయ్యా ! ఏదన్నా పండక్కో, పబ్బానికో, ఓ రెండు మూడు ముంతలు తాగేవాడు. ఈ నాకొడుకు మా పాలపడ్డప్పణ్ణించీ– కల్లు పాకలోనే కాపరం పెట్టాడు" అన్నాడు రామస్వామి.

అలా అంటున్నప్పుడు రామస్వామి కళ్ళు నీటితో నిండిపోయాయి.

"మా నాన్న ధర్మరాజేననుకోండి బాబూ ! పల్లెత్తి పరుషంగా మాట్లాడి ఎరుగడు. నన్నూ, మా తమ్ముణ్నీ పొట్టమీద కూచోబెట్టుకుని, పాడేవాడు. మా ఇంటిముందే పెద్ద చింతచెట్టు ఉండేదండీ. దానికిఉయ్యాల వేసి, ఊపేవాడు. నేను పొలం వస్తానని మారాం చేస్తే, భుజంమీద కూచోబెట్టుకొని పొలందాకా తీసుకుపోయేవాడు. నాకు అన్నం చాలదేమో నని, నేను అన్నంతిన్న తరవాతే తను తినేవాడండీ !" అన్నాడు రామస్వామి తండ్రిని తలచుకొంటూ.

అలాంటి కిష్టయ్య, ఏడాది తిరక్కముందే కల్లుముంతకు కట్టు బానిసయిపోయాడు. చీటికీ మాటికి తమను కోప్పడుతూ ఉండేవాడు. ఆ కోపం ముదిరి నప్పుడు చెయ్యి కూడా చేసుకొనేవాడు ఇరుగు పొరుగు వాళ్ళు అడ్డం వచ్చినా ఆగేవాడు కాడు. చావచితకబాదిన తర్వాత తిక్క కాస్తా దిగిపోయిన తరవాతా, పిల్లల్ని చాటుకు తీసుకుపోయి బావురుమని ఏడిచేవాడు.

"రెండు మూడేళ్ళకే మా నాన్న అన్ని విధాలా గుల్లయి పోయాడండీ ! మా పినతల్లి మా నాన్న కేదో పసరు పోసిందని అనే వాళ్ళు మా పిన్నమ్మ మమ్మల్ని చచ్చేటట్లుకొట్టినా మా నాన్న అదిలించేవాడు కాదండీ ! ఇంకా బాధలు చూడలేక సాంబయ్యగారు నన్నూ, నాతమ్ముణ్ణీ మా అమ్మ చెల్లెలి దగ్గర వొదిలి పెట్టాడండీ ! మా చుక్కమ్మ పిన్ని మంచిది. దేవత ! మా బాబాయి కూడా మంచోడే ! ఆయన జీవాల్ని ఆడిస్తూ ఊరూరూ తిరుగుతుండేవాడు. ఆయనతో బాటు నేనూ, తమ్ముడూ కూడా తిరిగే వాళ్ళం."

ఎలుగు బంటితో, అప్పుడే రామస్వామికి పరిచయమయింది. చిన్నాన్న చేసేపనులన్నీ రామస్వామి, గమనిస్తూ ఉండేవాడు. తెలియని కిటుకుల్ని చిన్నాన్న కూడా రామస్వామికి చెబుతుండేవాడు.

రామస్వామికి ఎలుగుబంట్లతో బాగా దోస్తీ ఏర్పడింది. దాని అవసరాలేమిటో అతను సులువుగా తెలుసుకోగలడు. పసి బిడ్డలతో ఆడుకొన్నంత సులభంగా అతను ఎలుగు బంట్లతో ఆడుకోగలడు.

"పెద్దయ్యాక ఎలుగుకు ఏది నేర్పాలన్నా సాధ్యంకాదండీ. చిన్నప్ప ట్నించీ సాధనం చేయాలి ఏదోవొక గుర్తుచెప్పి ఒక పని దానిచేత చేయించాలి. అలా రోజుల కొద్దీ సాధనం చేశాక, ఆ గుర్తు ఎవరు చేసినా జీవం ఆపని చేస్తుందండీ ! ఈ ఎలుగ్గొడ్డు పేరు 'సింగన్న'. చాలా మంచోడండీ! ఒక చేత్తో సలాంచేస్తుంది. రెండు చేతులతో దణ్ణం పెడుతుంది. ముందు కాళ్ళను నేల కానించి వెనక్కాళ్ళను పైకెత్తి నడుస్తుంది. అచ్చంగా వెనక్కాళ్ళతోనూ నడుస్తుంది. ఆ మధ్య వో సర్కసు కంపెనీ వాళ్ళు రెండువేలు ఇస్తామనీ, అమ్మమనీ అడిగారండీ. మా ఆవిడ అమ్మమని శత పోరింది. నేనే వొప్పుకోలేదు. పదేళ్ళుగా ఇది నన్నూ, నాపిల్లల్నీ పోషిసున్నది బాబయ్యా! అన్నం పెట్టిందాన్ని అమ్ముకోడానికి, ప్రాణంవొప్పలేదండీ!" అన్నాడు రామస్వామి; సింగన్న గాడి ముట్టెనిమురుతూ.

తన బేరానికి ఇంత వరకూ ధోకా లేదన్నాడు రామస్వామి. పల్లెల కెళ్ళినా పట్నాని కెళ్ళినా, తన చుట్టూ జనం మూగుతారన్నాడు. వగానికి సగంమంది ఆట చూసి పోయినా మిగిలిన సగంమందీ ఐదేసి పైసల్నాపదేసిపైసలూ, వేసినా జేబునిండు తుందన్నాడు. పల్లెటూళ్ళయితే గింజలు, అన్నం దొరుకుతాయనీ, బస్తీల్లో డబ్బులు దొరుకుతాయనీ అన్నాడు.

రామస్వామి కిప్పుడు ముగ్గురు పిల్లలు. ముగ్గుర్నీ తన బావమరది దగ్గరుంచాడు. తన బావమరది బిట్రగుంటలో రైల్వేలో పనిచేసున్నాడనీ, పిల్లలు అక్కడ చదువుకొంటున్నారనీ చెప్పాడు రామస్వామి.

"మా అయితే ఇంకో రెండుమూడేళ్ళ కన్నా ఎక్కువ తిరగలేను బాబయ్యా! ఈలోగా మా పెద్దాడు పదో తరగతి కొస్తాడు. ఏ అయ్య కాళ్ళో పట్టుకొని వాడికింత పని ఇప్పిస్తే-నాకిక దిగులుండదు."

రామస్వామి తన భార్యను చూపించాడు. ఆవిడ లేవలేకుండా ఉంది.

చేతిలో ఉన్న తాడును సన్నగా కదిపాడు. ఎలుగుబంటి వో కాలెత్తి సలాం చేసింది. ఇంకో రకంగా తాడును కదిలించాడు. రెండు కాళ్ళూ ఎత్తి 'నమస్కారం' చేస్తున్నట్లుగా కదిపి, ముట్టె ఆ కాళ్ళమీద ఆనించింది.

"మనిషికీ జంతువుకూ అదే తేడా: మనిషి చెప్పేదొకటీ చేసే దొకటీ బాబయ్యా. ఇదుందే, ధర్మరాజు ఏంచెపితే అదే చేస్తుంది. ఏం కావాలో అదే చేస్తుంది విశ్వాసం దీనిసొత్తు" అన్నాడు రామస్వామి.

విశ్వాస ఘాతకులూ, నమ్మకద్రోహులూ, క్షణక్షణానికీ పెరిగి పోతున్న ఈ కాలంలో రామస్వామి అన్న మాటలు, అక్షరాలా నిజమే అనిపిస్తుందికదూ !




కంతి తలగడ కాదు, కల నిజం కాదు !

"అయ్యగారూ ! నన్ను క్షమించాలి. మీతో కబుర్లాడుతూ కూచుంటే నాకు గడవదు. అంతగా మాట్లాడాలనుకుంటే, బెల్ కొట్టిన తర్వాత రండి. అప్పటికి పిల్లలంతా వెళ్ళిపోతారు". అన్నాడు. మునికన్నయ్య, అంతకోపమూ, మరీ అంత విసుగూ కాకుండా.

అప్పటికే వో డజనుమంది పిల్లలు అతనిచుట్టూ గుమిగూడి ఉన్నారు. వాళ్ళందరూ మునికన్నయ్యను పీక్కు-తింటున్నారు. వాళ్ళను కసురుకోలేడు. వాళ్ళతొందరకు తట్టుకోలేడు. బేరాన్ని పోగొట్టుకోనూ లేడు. ఆ పదినిముషాలసేపూ, అతని చేతులు, యంత్రాల్లా పనిచేస్తాయి. మళ్ళీ గంటదాకా తీరుబడి.

నరిగ్గా - ఆ తీరుబడి సమయంలోనే మునికన్నయ్య తన్నుగురించి చెప్పుకొచ్చాడు, "మాది బుక్కపట్నం" అన్నాడు మునికన్నయ్య.



అంతలోకే బొంబాయ్ మిఠాయిమీద వాలిన ఈగల్ని తోలడంలో మునిగి పోయాడు. కాస్సేపయ్యాక-

"ఏదో పొలం ఉండేది... ఇప్పుడదీ లేదులెండి. మీ పొలాలకుమల్లే మావి బాగా పండవు అయ్యగారూ ! మీవి నల్లభూములు. మీకు వానలు పడతాయ్. పైగా కాలవలు, మీ వూళ్ళ మధ్యగా, మీ ఇళ్ళముందు నుంచి పోతాయ్. మాకు నీళ్ళకు మాలావు కరువు అయ్యగారూ ! ఎండా కాలం వస్తేనే మీకు నీళ్ళకు కటకట. మాకు అన్ని కాలాలూ ఎండా కాలాలే ! ఎప్పుడూ, నీళ్ళకు కరువే. ఏ రెండేళ్ళకో, మూడేళ్ళకోగాని బాగా వానపడదు. ఆవురావురు మంటున్న పొలాలు - ఎంత నీరన్నా అయిపూ ఆనమాలూ లేకుండా కాగుతాయి. మీరీ ప్రాంతం ఎవ్వుడూ రాలేదనుకుంటా తిరుపతి సరేలెండి - రాయలసీమ అంటే ఒక్క తిరుపతే కాదుగదా. తాగడానికే మాకు నీళ్ళుండవు. ఇక గొడ్డూ గోదా - పొలమూ పుట్రా ఉండిమాత్రం ఏ లాభం అయ్యగారూ !" అన్నాడు మునికన్నయ్య.

వందెకరాలున్న రైతుకూడా, వరసాగ్గా రెండేళ్ళు బెట్టతీస్తే, కూలిచేయడం, ఆ ప్రాంతంలో సర్వసాధారణమన్నాడు మునికన్నయ్య.

"అదెందుకో నాకు తెలియదండీ. భగవంతుడు ఈ ప్రాంతంమీద పగ పట్టినట్లున్నాడు. ఏవో కాలువలనీ, చెరువులనీ, లోతుచేయడమనీ, నా బొందనీ, బొక్కా-సాయనీ అంటుంటారు. నాకు ఊహ తెలిసినప్పణ్ణించీ వింటున్నా, ఒకటీ జరగలా." అన్నాడు మునికన్నయ్య కోపాన్ని లోలోపలే దిగమింగుతూ.

వానలు బాగా కురిస్తే, అతనికున్న నాలుగెకరాల పొలంలోనూ, పేరుశనగ విరగపండుతుంది. కనీసం నాలుగుతడులు నీరు పెట్టుకునే అవకాశం ఉన్నా, తనిలా బండితోసుకు బతకవలసిన అవసరం వుండేది కాదు. కాలవలా లేవు. వానలా కురవవు. విత్తనాల ఖర్చుకూడా గిట్టని వ్యవసాయం, ఎంత కాలం చేయగలడు గనక ?

పొలం అమ్మేశాడు. ఉన్న బాకీలు తీర్చేశాడు. చెల్లెలి పెళ్ళి చేశాడు. ఉన్న నాలుగు రూపాయలూ జేబులో వేసుకొని పదిహేనేళ్ళ కిందట తిరుపతి వచ్చాడు.

"అది రెండోసారి రావటమండీ, మొట్టమొదటిసారి.. అంతకు మూడు నాలుగేళ్ళ కిందట వచ్చాను. అప్పుడు మా కిష్టప్ప మరీ చిన్న వాడు. వాడికేదో జబ్బుచేసింది. మా అమ్మ వెంకన్నకు మొక్కుకొంది. జబ్బునయమయింది. మొక్కు చెల్లించాడానికొచ్చాం. అప్పటికే బస్సు లున్నయ్. కానీ మేమంతా నడిచే కొండమీదికెళ్ళాం. మా కిష్టప్ప మా నాన్న భుజంమీద కూచున్నాడు. మా అమ్మ ఆపసోపాలు పడుతోంది. నా నెత్తిన 'ఇంత' మూట పెట్టారు ... లేకేం అయ్యగారూ మా కిష్టప్ప ఇప్పుడు, అదేదో, అచ్చాఫీసులో పనిచేస్తున్నాడు. అరవయ్యో, డెబ్భయ్యో ఇస్తారమకొంటా." అన్నాడు మునికన్నయ్య. మునికన్నయ్య చిన్నతనమంతా

కలలు కనడంతోనే సరిపోయింది. అతనికి సిల్కు చొక్కా తొడుక్కుందామనీ, జులపాలు పెంచుకుందామనీ, మెళ్ళో సన్నని బంగారు గొలుసు వేసుకొందామనీ, మల్లెపూవులాంటి తెల్లని లాగు వేసుకొందామనీ — సరదా ఉండేది.

"మాకు రెండుబజార్ల అవతల సుబ్బరామిరెడ్డి గారుండేవారు అయ్యగారూ ; చాలా పెద్ద దొర. భోలెడన్ని పొలాలూ, నిమ్మతోటలు జామతోటలూ వారికుండేవి. వారబ్బాయి రామచంద్రారెడ్డిది — నా ఈడే. నాలుగురోజుల తేడాతో మేం పుట్టామట రామచంద్రారెడ్డి చిన్నప్పణ్ణుంచీ సిల్కుచొక్కాలే వేసుకునేవాడు. భుజాలమీద పడుతుండే జులపాలు పెంచుకునేవాడు. మెళ్ళో సన్నని గొలుసు, ఆ గొలుసు మధ్యలో ఆంజనేయుల బిళ్ళ — అదీ బంగారందే ననుకోండి - వేసుకునేవాడు. పాలరంగులో వుండే వొదులు వొదులు లాగులు వేసుకునేవాడు. చెవలకు కమ్మలుండేవి. నాకు కమ్మలమీద బుద్ధిపోలేదు గానండీ, మిగిలినవన్నీ కావాలనిపించేది. చెబితే మీరు విడ్డూరమనుకొంటారేమో అయ్యగారూ ఆ సరదాలు నాకిప్పటికీ తీరలేదండి" అన్నాడు మునికన్నయ్య బాధగా.

ఆ బాధ ఆతని గొంతులోకన్నా, కనుల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

మరింక చదువు గురించి అడగవద్దన్నాడు. కలిగినవాళ్ళకు తప్ప, లేనివాళ్ళకు ఈ దేశంలో చదువుకూడా దొరకదన్నాడు. వానాకాలం చదువేదోచదివినా అది ఎందుకూ పనికిరానిదేనన్నాడు.

"కొంతకాలం వో మోటారు వర్కుషాపులో పనిచేశా. ఇంకొంతకాలం రైళ్ళదగ్గర మూటలు మోశా... ఏం పాడుబతుకులో అయ్యగారూ చచ్చేంత బరువు నెత్తి పావలా దగ్గర్నించీ బేరమాడతారు. బోలెడన్ని ఖర్చులు చేస్తారండీ. మా దగ్గర కొచ్చేసరికి లబ్బున ఏడుస్తారు...ఒకసారి హడావిడిగా బరువెత్తుకొన్నా అయ్యగారూ - బొంబాయి సేట్ బండిలో కెక్కాడు. బండి కదిలింది. సామాను లోపలికి విసిరేశా. పేటు నాకు డబ్బు లివ్వలా ; కూలికోసం, బండితోపాటే పరిగెత్తుతున్నా, అయినా వాడు డబ్బులిచ్చే ధోరణిలోలేడు. బండి వేగం పుంజుకొంటున్నది అయ్యగారు ; ఆ పూటకదే ఆఖరు బండి. ఈ డబ్బులు తీసికెళితే తప్ప, ఇంటి దగ్గర పొయ్యి వెలగదు. నేను అరిచా. చువ్వ పట్టుకొని బండిలోకి దూకుదామనుకొని చువ్వను వొడిసి పట్టుకొన్నా. స్పీడు పెరిగింది. కాలు మెట్టుమీద పడడానికి బదులు జారింది. చేతిపట్టు విడిపోయింది...." అని కన్నయ్య ముగించాడు.

ఆలా విడిపోయిన దాని ఫలితంగా, అతని కాలు తొడదాకా నరుక్కుపోయింది ఆ తరువాత బండి ఆగిందనుకోండి. వాడిచ్చింది ఎంతయినా, మునికన్నయ్య కాలుమాత్రం మళ్ళా రాదుగదా. పూర్తిగా నయమయి, ఆసుపత్రినుండి బయటపడేలోగా, ఆ కుటుంబం నరకయాతనలూ అనుభవించింది.

"మా అమ్మ ఇళ్ళలో పనిచేసింది. కొండమీదికి మూటలు మోసింది. తను పస్తులుండి నాకు పెట్టింది. నాలుగు డబ్బులు పోగయ్యాక ఇంకా స్థ

అప్పుచేసి ఈ బండిని కొన్నది .... అదా ! చాలా గమ్మత్తుగా జరిగింది అయ్యగారూ. నేను ఆసుపత్రిలో వుండగా 'సుందర్ సింగ్' అవి, వో బొందిలీ తాత – రోజూ ఈ మిఠాయి అమ్మడానికొచ్చేవాడు. ఉన్నప్పుడు కొనుక్కొనే వాణ్ని. లేనప్పుడు ..... అతను చాలా మంచివాడు. నేనంటే పిచ్చి అభిమానం అయ్యగారూ. నేను ఆసుపత్రిలో ఉన్నంత కాలమూ ఫ్రీగా యిచ్చాడు మిఠాయిల. తరువాత చేయడమూ నేర్పాడు. అదే నాకిప్పుడు బతుకుతెరువయింది. ఆ..నాపాడె లాభాలు, నా పిచ్చబద్ద లాభాలు..ఐదు పైసల దగ్గర్నుంచి అర్ధరూపాయి దాకా మిఠాయికొంటారు. పెట్టుబడి కూడా పెద్దగా అక్కరలేదు. రెండు కిలోల పంచాదార, ఓ దబ్బాడు రంగు, వెదురు వూచలు, ఇదిగో ఈ దబ్బా అడుగున ఈ 'స్టవ్' బస్ అంతే" !

మునికన్నయ్య అటూ ఇటూ కదల్లేడు. బండిమీద కూచోబెట్టుకొని, ఈ స్కూల్‌దాకా తోసుకొచ్చి, తల్లి వెళ్ళిపోతుంది. మునికన్నయ్య సాయంత్రందాకా అక్కడే ఉండి బేరం చూసుకుంటాడు. వస్తే తల్లి వస్తుంది, లేదా-ఎవరికన్నా వో పావలా దబ్బులిచ్చి, బండిని ఇంటిదాకా లోయించుకెడతాడు.

"ఊళ్ళో తిరిగినా బేరం వుండదు అయ్యగారూ ! ఇది చిన్నపిల్లలు తినే మిఠాయిగాని, పెద్దవాళ్ళు తినేది కాదు. అంటే పనికిరాదని కాదండీ - అందరూ చూస్తుండగా పెద్దవాళ్ళు తినరు .... అందుకే ఈ స్కూల్ను నమ్ముకున్నా. ఈపిల్లలు కూడా నాదగ్గిరే కొంటారు. పావలా, అర్ధా, అప్పు కూడా పెడుతుంటా. చాలామంది ఇస్తారు. పారుబోయే ఖాతాలు కూడా ఉంటాయండీ !" అన్నాడు మునికన్నయ్య.

"ఏం బతుకులే అయ్యగారూ ! ఈ మిఠాయిలాగానే ఉంటుందండీ! చూస్తే ఇంత లావుగా బుజబుజలాడుతూ ఉంటుందా – నొక్కితే చింత గింజంత కూడా "నరుకు" ఉండదు".

ఈ వ్యాఖ్య మొత్తం మన సమాజానికే వర్తిస్తుందేమో !

మాయ తివాచి



మనది చాలా చిత్రమైన సమాజం. ఈ చిత్రమైన సమాజంలో విచిత్రమైన సాంఘిక విలువలు కనబడతాయి. మన సమాజంలో, కొందరు ఎక్కువ కులంలో పుడతారు. మరి కొందరు ఓ మాదిరి కులంలో పుడతారు. ఇంకొందరు అంటరాని కులంలో పుడతారు. ఈ ఆఖరికులంలో పుట్టినవారు శతాబ్దాలుగా, ఊరికి దూరంగా ఉంటున్నారు. వారు గ్రామాల్లోకి రావడానికి లేదు. కానీ గ్రామాలకు కావలసిన అడ్డమైనచాకిరీ వీరేచేయాలి. వీరికి తాగడానికి నీళ్ళుండవు కానీ గ్రామస్థులక్కావలసిన నీటి బావుల్ని, చెరువుల్ని వీళ్ళే తవ్వుతారు. వీరికి సొంత పొలాల్లేవు. కానీ ఊరివాళ్ళ పొలాల్లో వీరే పనిపాట్లు చేయాలి.

వీరిని ఉద్ధరించే ప్రయత్నాలు, గతంలో అక్కడక్కడా కనపడతాయి. కానీ, ఈ ప్రయత్నాల కొక విర్దిష్టమైన రూపంవొచ్చింది గాంధీగారి కాలంలోనే! అంత క్రితం ఈ అంటరాని వారికున్న పేర్లను తొలగించి 'హరిజను'లను పేరును గాంధీగారే వ్యాప్తి చేశారు.

చెప్పొచ్చేదేమిటంటే, అబ్బులు ఈ అంటరాని కులంలో పుట్టాడు. అతనికి పొలాల్లో పనిచెయ్యడం, పశువుల్ని కాయడం, గొడ్డుచాకిరీ చేయడం, ఉన్నప్పుడు తినడం, లేనప్పుడు పస్తు పడుకోవడం తప్ప మరోటి చేతకాదు.

"నా చిన్నతనమంతా పల్లెల్లోనే గడిచిందండీ! మా అయ్యతో బాటు నేను కూడా పొలం పోతుండేవాణ్ణి. అయ్య అరకదున్నుతుంటే, నేను కూడా అయ్యతో బాటు, అరకవెంట తిరుగుతుండేవాణ్ణి! రామవయ్యగారి పొలం, తిప్పగుళ్ళ పక్కగావుండేది పొలానికి

వోవేపుగా "ఉబ్బలివాగు" ఉండేది. ఆ వాగంటే పెద్దవాళ్ళకు చచ్చేంత భయం. కానీ కుర్రకారుకు బోలెడంత సరదా. నేనూ, రోశయ్యగారి నకిలేసుగాడూ కలిసి, తిప్పగుళ్ళ నుంచి, రాళ్ళు, బండలు తెచ్చి. ఆ ఉబ్బలిలో వేస్తుండేవాళ్ళం. పైకి చెక్కు గట్టి, నెర్రెలిచ్చి, మామూలు నేల లాగా కనిపిస్తూంది గానండి-అడుగు వేశామంటే పాతాళానికి పోవలసిందే. చూస్తూ చూస్తూ ఉండగానే మేం వేసిన రాళ్ళన్నీ ఆ ఉబ్బలిలో మునిగి పోయేవి. ఎక్కడికి పోయేవో, ఎంతదాకా పోయేవో మాకు తెలియదు." అన్నాడు సత్యారావు కింది పెదవిని సుతారంగా కొరుక్కుంటూ.

అబ్బులు (గాడి) మూడో కొడుకు సత్యారావు. అసలు పెద్దవాణ్ణి. రెండోవాణ్ణి కూడా అబ్బులు చదివించుదామనుకొన్నాడు. ఊళ్ళో బడి కూడా వుంది. కానీ వీలుపడింది కాదు. బడి-రాఘవయ్యగారి కొట్టం పక్కగా వుంది. ఆ బళ్ళో రాఘవయ్యగారి పిల్లలు, వారి చుట్టాల పిల్లలు చదువుకొంటున్నారు. పైగా రాఘవయ్యగారే గ్రామపంచాయతీ ప్రెసిడెంటు కూడా. అబ్బులు పెద్దజీతగాడుగా పనిచేస్తున్నది ఇక్కడే. గ్రామ పంచాయితీ ప్రెసిడెంటుగారి కొడుకూ, ఆ ప్రసిడెంటుగారి జీతగాడి కొడుకూ, పక్కపక్కనే కూచొని చదువుకోవడానికి ఇదేం దేశం గనక?

రాఘవయ్యగారు 'వొద్దురా' అని ఏనాడూ అనలేదుగాని; అబ్బులుకే భయంవేసింది. దిక్కుమాలిన చదువుకోసం, కొడుకును పొగొట్టు కోవడానికి అబ్బులు సిద్ధంగా లేడు. రాఘవయ్యగారి ఆఖరి తమ్ముడు బాలకోదేశ్వరరావుగారు ఏడాది కిందట; తిప్పగుళ్ళ దగ్గర మోడెం ఆడదాన్ని అఘాయిత్యం చేసినప్పుడు రాఘవయ్యగారు, ఊరు మొత్తాన్ని కట్టడిచేసి గూడెంవాళ్ళను పనుల్లోకి పిలవడం మానేశాడు. గూడెం అల్లాడిపోయింది. నెల రోజుల తరువాత గూడెం కట్టుగట్టుకొని, రాఘవయ్యగారి పాదాక్రాంతమయింది. ఇది జరిగిన రెండునెల్లకే పుల్లమ్మ అఘాయిత్యానికి గురయిన ఆడది దొంగ ఉబ్బలిలో "పొరబాటుగా" కూరుకుపోయింది.

"అప్పుడు నాకు ఎనిమిదేళ్ళుంటాయండీ : అన్నాడు సత్యారావు. నాకీ సంగతులన్నీ బాగా తెలుసు. కానీ మా వాళ్ళెవరూ కిక్కురుమనలేదు అసలు. అక్కడ బతకలేరు కూడా. మా పెద్దన్నయ నన్ను చదివించాలని వుండేది. అయన నన్ను బస్తీకి తీసుకొచ్చి, హాస్టల్లోచేర్పించాడు. అక్కడ నాతోబాటు ఇంకో వందమంది పిల్లలుండేవారు".

హాస్టలు పర్గతులడిగినప్పుడు సత్యారావు కళ్ళు ఎర్రబడ్డాయి, అవి హాస్టలు కాదు. నరకకూపం. గొడ్లసావిడికన్నా కనాకష్టం. చదువు కోవడానికిలేదు. తినడానికిలేదు. పడుకోవడానికిలేదు. గ్రామంలో వుండే దోపిడీ ఒకరకం, ఇక్కడ జరిగే దోపిడీ మరో రకం. నాకు అసహ్యం వేసింది. హాస్టల్ వార్డెన్‌తో పోట్లాడి వాణ్ణికొట్టి పారిపోయివచ్చాను" అన్నాడు సత్యారావు.

చాలా రోజుల పాటు సత్యారావు గాలికి తిరిగాడు. కొంతకాలం పాటు ఇటికలు; రాళ్ళు మోసాడు.

"నన్ను చూసి జనం భయపడతారు. బహుశా ఆకారమే కారణమను కొంటాను. అన్నాడు సత్యారావు నవ్వి.

గడచిన ఆరేళ్ళుగా ఈ పనిలో వున్నాడు. ముందుగా రోజుకూలీకి పనిచేశాడు. రోజుకు మూడోనాలుగో ఇచ్చేవారు. ఆ తరువాత పెద్ద పెద్ద గుత్తాదార్ల దగ్గర పనిచేశాడు. ఓ మొత్తం ఇంటికి రంగు వేయడానికో, సున్నం వేయడానికో గుత్తాదారు కాంట్రాక్టు తీసుకొనేవాడు. రంగులు, సున్నం, అతనే ఇచ్చేవాడు. తను, మరొక ఇద్దర్ని చేతికింద వేసుకొని ఆ పని పూర్తిచేసి, ఆ ఇద్దరికి రోజుకూలి యిచ్చి మిగిలింది తను ఉంచుకొంటూన్నాడిప్పుడు.

"అయ్యా ! నా అసలు పేరు సత్యారావు కాదు. 'సత్తెయ్య'. హాస్టల్లో చేరినప్పుడు, మిగతా పిల్లల్ని చూసి, నేనే మార్చుకొన్నాను. చిన్నప్పుడు చాలా దరిద్ర మనుభవించానండీ. ఒక్కడే బొందులాగు వుండేది. గూడెం ముందు, మర్రిచెట్టు కింద నిలబడి, పాంట్లు, షర్టులు తొడుక్కున్న పిల్లల్ని చూసి, అలాంటివి నాకూ లేనందుకు ఏడ్చేవాణ్ణి. ఏడిస్తే వస్తాయని కాదండీ. ఏడవడం తప్ప ఇంకేమీ చెయ్యలేను గనక ఏడిచేవాణ్ణి. ఆ సరదాలన్నీ ఇప్పుడు తీర్చుకొంటున్నాను. ఒక్క సంగతి చెప్పండి. ఈ కుంచె నా చేతిలోలేకపోతే, నా వొంటిమీద ఈ సున్నం మరకలు లేకపోతే, నేను సున్నం కొడతానని, మీరు కలలో కూడా అనుకోలేరు. అవునా?" అన్నాడు సత్యారావు.

"మీరు పెద్దవారు. అనుభవం వున్నవారు. నిజం చెప్పండి. తియ్యని కబుర్లతో కడుపునిండుతుందా? నీతికి. నిజాయితీకి స్థానంవుందా? మా కేదో వొరగబెడుతున్నామంటున్నారు. పెడుతున్నారేమో నాకు తెలియదు. మీలాంటి వాళ్ళకు, మాకోసం కాగితాలమీద కేటాయించిన కోట్ల రూపాయలు కనబడతాయేగానీ, మాకు ముట్టే పైసలు, గవ్వలు కనబడవు. అమ్మ బాబోయ్ ! అభ్యుదయం అంటారు మీరు. అసలు సంగతి మాకు తెలుసు. నా చదువా? ఏదో ఏడిశాను. ఇప్పుడు ప్రయివేటుగా చదువు కొంటున్నాను. నన్నుకాస్త కాళ్ళు నిలదొక్కుకోనీండి. నేను తిన్నగా నిలబడితే నాలాంటి మరో నలుగురికి, నా సాయం తప్పకుండా ఉంటుంది". అన్నాడు సత్యారావు, కుంచెను సున్నం బాల్చీలో ముంచుతూ.

ఎరుకోయమ్మ ఎరుక !

గతం మనకు తెలుసు. వర్తమానం తెలుస్తూనే ఉంది. ఇక మనకు తెలియందల్లా భవిష్యత్తు మాత్రమే ! రాబోయేకాలంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న కుతూహలం, మానవజాతిలో అనాదికాలం నుంచీ వున్నది. భవిష్యత్కాలంలో జరుగబోయే సంఘటనలు ఫలానా ఫలానా విధంగా వుంటాయనీ, వుండవచ్చుననీ, తెలుసుకోవడంఎలా ? ఇందుగ్గాను మానవుడు అనేకమార్గాలను అవలంబించాడు. ప్రత్యేకంగా ఒక శాస్త్రాన్నే అభివృద్ధి చేశాడు. అదే జ్యోతిషశాస్త్రం.

గ్రహాలకూ, నక్షత్రరాసులకూ, భవిష్యత్కాలానికీ లంకెలు వేసుకున్నారు. ఒక వ్యక్తి జన్మ కాలాన్నిబట్టి అతని జాతకచక్రం వేసి, ఫలానాగ్రహం ఫలానా స్థానంలో ఉందిగనక, ఫలానా రకమైన ఫలితం కలగవచ్చునని ఈ శాస్త్రం చెబుతుంది. ఇలాగే హస్తసాముద్రికం కూడా చేతిలోవున్న రేఖలను అనుసరించి ఆ వ్యక్తి భవిష్యత్తును చెబుతారు కొందరు. సంఖ్యాశాస్త్రం, ప్రశ్నశాస్త్రం, గవ్వలాట, నాడీశాస్త్రం మొదలైనవన్నీ భవిష్యత్తును తెలియచేసేవే. ఈ కోవకి చేరిందే 'సోది' కూడా. దీన్నే 'ఎరుక చెప్పడం' అనికూడా అంటారు.

మరీ లోతుపాతులకు వెళ్ళవలసిన అవసరంలేదుగానీ—ముందు ముందు ఏం జరుగనున్నదో ఇప్పుడే తెలుసుకోవడం చాలా కుతూహలంగా ఉంటుంది. ఈ కుతూహలం ఖరీదు - అవతలివారి ఆర్థిక స్థాయినిబట్టి ఉంటుంది. ఒకప్పుడైతే చక్రవర్తుల, మహారాజుల, నవాబుల ఆస్థానాల్లో జ్యోతిషపండితులుండేవారు. ఏ చిన్న పనిచేయడానికైనా – ఈ పండితులను సంప్రదిస్తూ ఉండేవారు. ఇప్పటికీ, వీరి గిరాకీకి ఎలాంటి కొదువా లేదు. ప్రముఖ రాజకీయవేత్త లెందరో బహిరంగంగానూ, రహస్యంగానూ, ఈ జ్యోతిషశాస్త్రవేత్తలను సంప్రదిస్తూనే ఉన్నారు. వారి సలహాల మేరకు నడచుకుంటూనే ఉన్నారు.

తోకల నరసమ్మకు అంత పేరుప్రతిష్ఠా లేనిమాట నిజమేగాని, ఆమె వృత్తిలో ఆమెకున్న నైపుణ్యం చెప్పుకో దగ్గదే :

"మా స్వగ్రామం నెక్కల్లు. అంటే - మా పుట్టింటి వారిది. మేం నలుగురం అప్ప చెల్లెళ్ళం. నేను మూతోదాన్ని. మా అమ్మకు సోది చెప్పటం బాగా చాతనవుతుంది. ఆమెకు అమ్మవారు కనపడేది. తలచుకుంటే పూనకం వచ్చేది. ఆ పూనకంలో – ఎవరేది అడిగితే దాన్నే చెప్పేది. 'నక్కాకోటమ్మ సోది' అంటే. దానికి తిరుగులేదు" అన్నది నరసమ్మ తన తల్లిని గురించి చెబుతూ.

నరసమ్మ తండ్రిపేరు ఆదెయ్య. ఆయనకు యాభయ్ పందు లుండేవి. ఆ వందుల్ని పగలంతా పొలాలగట్లమీదా, ఊరివెలుపలా కాస్తుండేవాడు. అలా కాస్తూనే పందుల ఎరువును పోగుచేసే వాడు. ఆదెయ్యగారికి అంతా ఆడపిల్లలే. తొలిచూరు మగపిల్లాడు, పురిటి లోనే ఎన్నెమ్మ తగిలి చనిపోయాడు, మళ్ళీ మగనలుసు కలగలేదు.

"మా పెద్దక్కను 'వినుకొండ' యిచ్చారు. రెండో అక్కను 'నరుకుళ్ళపాడు' ఇచ్చారు. వాళ్ళ సంసారాలు బాగానే ఉన్నయ్యనుకోండి. మా అత్తవారిది - పూర్వం ఉయ్యూరు. దాన్ని విడిచిపెట్టి పది పన్నెండేళ్ళయింది. ఇప్పుడు మేము బెజవాడలో ఉంటున్నాం" అంది నరసమ్మ.

సోదిని గురించి చెబుతూ నరసమ్మ- ఆ వృత్తికి సంబంధించిన అనేక వివరాలను తెలియచేసింది. సోదిని నమ్మడం, నమ్మకపోవడ మన్నది వారి వారి ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుందన్నది.

"తిరుపతి వెంకన్నను నమ్ముతున్నవారూ ఉన్నారు. ఆ దేవుణ్ణి తిడుతున్నవారూ ఉన్నారు. దీనికేం చెబుతారు ? ఎవరి గురి వారిదీ !" అన్నది నరసమ్మ.

ఆమె దృష్టిలో ఇది నేర్చుకుంటే వచ్చే విద్యకాదు. దీనిక్కొంత సంస్కారం ఉండాలి. పూర్వజన్మ పుణ్యం ఉండాలి. అడ్డమైన తిళ్ళూ తినేవారికీ, తాగి తందనాలాడేవారికీ ఈ విద్యపట్టు పడదు. సోది చెప్పేవారూ, నేర్చుకునేవారూ కూడా నియమంగా, నిష్ఠగా ఉండాలి.



"చచ్చి ఏ లోకాన ఉందోగానీ అబ్బాయిగారూ ! మా అమ్మ మహా ఇల్లాలు. ఒక్కపూటనే అన్నంతినేది. చద్దివీ, పాచిపోయినవీ ముట్టుకునేది కాదు. "నీచు"ను దగ్గరకు రానిచ్చేది కాదు. ఇక్కడ్నే మా అమ్మా, మా అయ్యా కొట్టుకు చచ్చేవారు. మా అయ్యకు రోజూ నీచు కావాలి. మా అమ్మకు అదంటేనే పడిచావదాయె .... అయనే వొండుకు తినేవాడు. రోజూ తాగేవాడు. చెరువు తూముమీద కూచుని, లిల్లాయి పాటలన్నీ పాడేవాడు ...ఆ సంగతే చెబుతామనుకుంటున్నా. మా అమ్మ బాగా సోది చెబుతుందన్నానుగదా. మా అమమ్మ- ఇంకా బాగా చెప్పేదిట. మా అమ్మ పొట్టిగా, గుమ్మడి పండులాగా ఎర్రగా వుంటుంది, కాయపారు మనిషి.

చిర్రజుట్టు. ఎప్పుడూ ఆముదం రాసుకునేది తలకు. చిక్కంటుతో దువ్వుకుని కొప్పు పెట్టుకునేది. ఎప్పుడూ పూలు మాత్రం పెట్టుకునేది కాదు. రూపాయంత కుంకం బొట్టు, రెండు చేతులకూ రెండు దండ కడియాలు, కాళ్ళకు కడియాలు అందెలూ వుండేవి. రెండుజతల మెట్టెలూ, పిల్లెళ్ళూ వుండేవి. చెవులకు గూబ్బానీలు, ముక్కు బులాకీ ఉండేవి. ఎప్పుడూ ఎర్రటి చీరలే కట్టుకునేది. గుత్తంగా, మోచేతులదాకా రవికలు వేసుకునేది .... ఎండలయ్యేది, రాళ్ళయ్యేది, రప్పలయ్యేది ఛస్తే చెప్పులు వేసుకునేది కాదు ..... ఎందుకేమిటి అబ్బాయిగారూ ! ఇవన్నీ సోది చెప్పే వారికి నియమాలు" అన్నది నరసమ్మ.

తను కూడా తల్లితోపాటు ఊరూరు, ఇల్లిల్లూ తిరిగానన్నది నరసమ్మ. తన తల్లికి అనలు తీరుబాటే ఉండేది కాదన్నది.

"సంపాదనా! ఆ రోజుల్లో సొలెడు, గిద్దెడు గింజలు చాటలో పోసే వారు....అదే చెబుతా. ఆ సోది బుట్టను ఈతాకులతో అల్లుతారు. మా అమ్మమ్మ - కర్ర కడిగిన తరువాత, ఆ బుట్టనూ, ఆ సోది పీటనూ, ఆ కర్రనూ మా అమ్మకిచ్చిందండీ! మా అమ్మ కూడా చెప్పినంతకాలం చెప్పింది. ఇక తనవల్ల కాదనుకొన్నప్పుడు కర్రకడిగి, ఆ సామానంతా నాకిచ్చిందండీ....కర్ర కడగడమంటే మరేంలేదు అబ్బాయిగారూ! 'ఇక సోది చెప్పను' అని నిశ్చయించుకున్న తరువాత, సోదిబుట్టనూ, పీటనూ, కర్రనూ పాలతో కడిగి, ఆ తరువాత వారికిస్తారు. అలా ఒకసారి ఇచ్చాక-మరింక సోది చెప్పరండీ! అదో కట్టుబాటు....రోజుకు రెండుమూడిళ్ళ దగ్గర మాత్రమే మా అమ్మ చెప్పేది. అప్పటికే ఆమె బాగా అలిసి పోయేది కూడా ఒకసారేం జరిగిందంటే, నడెండా కాలం. తిప్పినీడ అయ్యప్పగారనీ - పెద్ద రైతండీ! ఆయనకు పదరకల వ్యవసాయం ఉంది. గొడ్డూగోదా, జీతగాళ్లూనాతగాళ్లూ వేస్తేవేయి రూపులుగావుండేదండీ వారి సంసారం. వారి పశువులన్నీ తోటపొలంలో వాముల దగ్గర కట్టేస్తూ వుండేవారు. ఒకసారి వాళ్ళ చూడి ఆవు తప్పి పోయింది. ఎక్కడికి పోయిందీ ఎవరికీ అంతుచిక్కలేదు. అప్పుడేమో - అయ్యప్పగారు మా ఇంటికి ఎడ్లబండిని పంపించారు. మా అమ్మా నేను వెళ్ళాం. అయ్యప్పగారి భార్య తిరుపతమ్మగారు-మంచి తల్లి. పార్వతీ అమ్మవారికిమలె ఉండేది ఆమెగారు. సోదికికూచున్నారు. మా అమ్మ అందరు దేవుళ్ళనూ, దేవతల్ని తలచుకుంది. ఆవు పోయినసంగతి మాకు తెలియదు గదా! అమ్మ చెప్పింది - అది తప్పిబోవడమేననీ, గోలక్ష్మి ఫలానాచోట అంగలా రుస్తున్నదనీ చెప్పింది. అయ్యప్పగారు మనుషుల్ని పంపించారు అక్కడికి. వైకుంఠపురం దగ్గర కృష్ణ ఊబిలో కూరుకుపోయి ఉందా ఆవు. నలుగురు మనుషులు మోకులేసి, బయటికిలాగి ఇంటికి తెచ్చుకున్నారు. అట్లాగే కల్లంపూడి పెదరామయ్యగారి పెద్దకొడుకు తప్పిపోయినప్పుడు కూడా, మా అమ్మ సోదిచెప్పింది. చెప్పినట్లుగానే, పదోరోజున అతనే ఇంటి కొచ్చాడు"....నరసమ్మ చెప్పడం ఆపి చెమట తుడుచుకొంది.

"దీన్నొట్టం పెట్టుకుని బతికేవాళ్ళున్నారనుకోండి. మాకా అవసరం లేదు. మా అమ్మ ఉపకారంగా మాత్రమే చేసింది. నేనూ అలాగే చేస్తున్నాను. మా అమ్మ ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగింది. ఉయ్యూరులో

ఉన్నప్పుడు నేనూ తిరిగానుగానండీ - ఈ ఐస్తీలో కుదరదు అబ్బాయి గారూ! ఇదేదో మోసమనీ, దగా అనీ అనుకుంటారు,...ఇదినాకు బతుకుతెరువు కాదు. మా ఆయన లారీల కంపెనీలో పనిచేస్తుంటాడు. ఆయన సంపాదనే మాకు చాలు. కాకపోతే కులవృత్తిని విడిచి పెట్టడ మెందుకని, నా దగ్గర కొచ్చిన వాళ్ళకుమాత్రమే నేను చెబుతూ ఉంటాను. ఇప్పటికయినా, ఆ సోలెడు గిద్దెడు గింజలూ, ఒక చిన్నపైసా తీసు కుంటాను. ఎక్కువిచ్చినా ముట్టుకోను. ఆపాటికూడా ఇచ్చుకోలేనివారొస్తే, నేనే నా గింజలు చాటలోపోసి చెబుతా." అన్నది నరసమ్మ.

ఆ తరువాత తరతరాలుగా వస్తున్న తమ సోదిబుట్టను చూపించింది నరసమ్మ. అది శిధిలమయిపోయి ఉంది. లోపల పాతగుడ్డలూ, మంద కంచమూ. సత్తులోటా ఉన్నాయి. అవి—వాళ్ళఅమ్మమ్మ, తన అమ్మకి స్తే-అమ్మ తనకిచ్చిన ఆస్తి - అని చెప్పింది నరసమ్మ. ఓ మూలగా చిన్న సోదిపీట ఉంది. దాన్నిండా పసుపూ, కుంకుమా, వాటి మధ్యమెరిసి పోతున్న గవ్వలూ ఉన్నాయి. ఇంకోమూలగా, చిన్నకర్ర పుడక ఉంది. దానికి అటూ ఇటూ రెండు తోరాలు వేళ్ళాడుతున్నాయి.

"ఈ విద్య - మా వంశంలో నాతోటే ఆఖరు అబ్బాయిగారూ! నాకేకూతుళ్ళు లేరు. నా కోడలేమో చదువుకున్నపిల్ల. దానికివన్నీ నరి పడవు" అన్నది నరసమ్మ పమిట చెంగుతో సోదిపీటను తుడుస్తూ.

అంగిటిలోపోచ అటూపోదు - ఇటూ రాదు

''వీనికేం మహారాజులు. పెట్టిపుట్టినవాళ్ళు. ఎన్ని కబుర్లయినా చెబుతారు. మీతో మాట్లాడుతూకూచున్నాననుకోండి. కుండలు పొయిమీది కెక్కవు. కాబట్టి ....." అని వాక్యం పూర్తిచెయ్యకుండానే వలను కాల వలోకి విసిరాడు–నూతక్కల గంగయ్య.

దూరంగా సరివి చెట్లు గాలి వీచినప్పుడల్లా, తలలు విరబోసుకుని, గోల చేస్తున్నాయి. కాలవకు అవతల-పచ్చని తివాచీ పరచినట్లుగా పసుపు తోటలూ, వాటికి కుడి వేపుగా కంకుల బరువుతో వంగిపోయిన వరి పొలాలు, ఇంకా దూరంగా, తాడిచెట్ల చరసా, ఉండి ఉండి రోడ్డును అదరగొడుతూ పరుగెత్తే లారీల కొదా, వీటి మధ్యనే వున్నా వీటన్నింటికీ అతీతంగా, వలకేసి చూస్తూ కూచున్నాడు గంగయ్య.

అయిదారు నిముషాల తరువాత మెల్లిగా వలను లాగాడు. ముందుగా ఏమీ కనిపించలేదు. కుడిచేత్తో వలనులాగుతూ, ఆ లాగినవలను మెలిచి ఎడం చేతికి చుట్టుకుంటూ నెమ్మదిగా పైకి తీశాడు. బురదా, కంప, గొగ్గురురాళ్ళు, నత్తగువ్వలతోసహా రెండుదోసెళ్ళ చేపలు వలలో భలభలలాడుతూ కనిపించాయి. వాటిల్లోనూ చిన్న చిన్న చేపపిల్లలు వల కన్నాల్లోంచి దూకిపోయాయి. మిగిలిన వాటిని వొడ్డుమీద పోసి పైన గుడ్డనుకప్పాడు గంగయ్య.

కాలవపక్కనే చిన్న గుడిశ. గుడిశలోంచి తుగిడీలు తుగిడీలుగా పొగ లేస్తువ్వది. మోకాళ్ళదాకా చీర దోపుకున్న అలివేలమ్మ నత్తుగిన్నెల్ని లొటలొటలాడిస్తున్నది.

"ఈమధ్యనే పెళ్ళయింది. యింకా ఏడాది తిరగలా? అప్పుడే పిల్లా జెల్లా అంటారేంది బాబూ ?" అన్నాడు గంగయ్య నవ్వుతూ.

దూరంగా కాలవలో ఈత కొడుతున్నవాడు తన బావమరిదని చెప్పాడు. అప్పను చూసిపోదామని రెండురోజుల క్రిందట వచ్చాడట. తన మామగారు కూడా యిదేపని చేస్తాడట.

"మాది మొదట్నుంచీ ఈ వృత్తేనండి మా అయ్య సముద్రం మీద చేపలు పట్టేవాడు. మాకో చిన్న డింగీ వుంది. అప్పుడప్పుడు మా అయ్యతోబాటు, నేనూ పోతూ వుండేవాణ్ణి. మరీ దూరంపోతే, మంచి చేపలే దొరుకుతాయిగానండీ, పోవడానికి ధైర్యం కావాలి మీలాంటి

వాళ్ళకు నీళ్ళంటే భయంగానీ, మాకేం వుండదండీ. గంగమ్మ తల్లి మమ్మల్ని చల్లగానే చూస్తుంది" అన్నాడు గంగయ్య.

వాళ్ళ సంసారం మరీ ఉన్నదేమీ కాదు గానీ కటికపస్తులు కూడా ఎప్పుడూ చెయ్యలేదు. సముద్రం ఒడ్డునే చిన్న గుడిశ, నాలుగైదువలలు. తమకూ తమ చిన్నన్నలకూ కలిసి ఓ చిన్న పడవా - ఇవీ తమ ఆస్తిపాస్తులన్నాడు.

"నేను ముందుగా గాలంతో చేపలుపట్టే వాణ్ణి. చిన్నఎరను గాలానికిగుచ్చి కాలవలోనో. కుంటలోనో వేసేవాణ్ణి. ఎరకోసం, చేప వచ్చి గాలానికి తగులుకుంటుంది .... తెలిసేదెట్లానంటే గాలం తాడుకు, బెండుముక్క కడతాంగదండీ. చేప ఎరను నోటకరుచుకొని లాగుతుంది. లాగినపుడు బెండు మునుగుతుంది.మునగంగానే గాలాన్ని విసురుగాలాగేస్తా. చేప వొడ్డుకొచ్చి పడుతుంది. రోజంతా పట్టినా అరవీసెడు చేపలు పడవండి" అన్నాడు గంగయ్య.

కాలవలు బాగా పారుతున్నప్పుడు కాలువకు అడ్డంగా 'మావులు' పన్నుతాట్ట. ఆ మావుల్లో చేపలు చిక్కుకొంటాయట. వాటిని పొగేసు కొంటాడట. సాధారణంగా ఈ మావుల్ని దాటుకుని చేపలు పోలేవని, మరీ చిన్నవీ, మరీ పెద్దవీ మావుల్లో పడవనీ గంగయ్య చెప్పాడు.

"వాలిగలు, జల్లలు, బొమ్మిడాయిలు ఎక్కువగా దొరుకుతాయండీ. యివి దొరికినంతంగా రొయ్యలు దొరకవు, మిగిలినవాటికన్నా రొయ్యలకు మంచి ధర గిట్టుబాటవుతుంది" అన్నాడతను.



ఎండాకాలమప్పుడు, కాలువల్లో నీరు బాగా తగ్గి పోతుంది. అక్కడక్కడా మడుగులు ఏర్పడుతుంటాయి. ఈ మడుగుఁ చుట్టూ, ఎత్తుగామట్టితో కట్టలు కడతారు.మడుగులోవున్న నీరంతా కుండబొచ్చెలతో వొడ్డుకు చిమ్మేస్తారు. అప్పుడు మడుగులో వున్న చేపలన్నీ బయటపడతాయి. వాటిని పట్టుకుని, వొడ్డున పడేస్తారు. కొన్ని రకాల చేపలు, నీటిలో కాకుండా అడుగున మెత్తగా వుండే బురదలో కూరుకుపోయి వుంటాయని, వాటిని పట్టుకోవాలంటే బురదలోకి రెండు చేతులూ, పోనిచ్చి బురదతోసహా బయటకి తీయవలసిందేనని గంగయ్య వివరించాడు.

"అయ్యా! ప్రాణమంటే, మనకుమల్లే వాటికీ భయమేనండీ. చిక్కకుండా పోదామని వాటి తంటాలు అవి పడుతూ వుంటాయి. అవి పారిపోకుండా మన బాధలు మనం పడతాం. కొన్ని కొన్ని చేపలు కొరుకుతాయి, గీరతాయి, రక్తం కారుతుంది. కాళ్ళూచేతులూ గీరుకుపోతాయి.... నిజమే ! అందుకని చేపలు పట్టడం మానేస్తే బువ్వదొరుకుద్దా బాబూ" అని ప్రశ్నించాడు గంగయ్య.

జలగలు పట్టుకొంటాయని, అవి పట్టుకొన్నాయంటే, ఒక పట్టాన ఊడిరావని అన్నాడు.

''ఒడ్డుకొచ్చిందాకా జలగపట్టినట్టుగా తెలియదండీ. లాగామనుకోండి సాగుతుందికాని ఊడిరాదు. అటువంటప్పుడు జలగు సున్నం రాయాలి. అప్పటికప్పుడు సున్నమంటే దొరికిచావదుగదా. అందుకని చుట్టముక్కను కసాపిసాసమిలి ఆ ఉమ్మిని జలగమీదరాస్తేసరి. చుట్టలు చుట్టుకొని ఊడి కిందపడుతుంది. ఇక ఎండ్రకాయల సంగతి సరేసరి. గిట్టలతో వొత్తిందంటే బాబూ, నక్షత్రాలు తిరిగిపోతాయి. అప్పుడప్పుడు నీటి పాముల బాధకూడా తప్పదండీ" అన్నాడు గంగయ్య.

అన్నోదకాలకు కొరతలేని డిపిసీములో వున్నా, ఈ రెండింటి కోసమూ, నానా అగచాట్లూ పడక తప్పడం లేదన్నాడు గంగయ్య.

''ఇంత పొలమోగిలమో ఉన్నవాళ్ళకు ఫరవాలేదనుకోండి. మాలాంటి అలగా జనం సంగతేముంది చెప్పండి ? చేపలు పడతామను కోండి. వాటిని అమ్ముకోవాలి గదా! ఊళ్ళో ఎన్నని అమ్ముతాం ? ఎంత మందికని అమ్ముతాం? కావిడేసుకుని టౌనుకు తీసుకెళ్ళాల్సిందే.అంతదూరం తీసుకెళ్ళాక, కమిషనుదారు అడిగినంతకూ ఇవ్వాల్సిందే. నిలవవుండే సరుక్కాదాయె లేదు కూడదని వుంచామనుకోండి. రేపయినా అల్లా వాడికే అమ్మాలిగదా లేదా ఇంకో కమిషనుదారుకి అమ్మాలి. వ్యాపారంలో వాళ్ళలోవాళ్ళకి ఎన్ని పోటీలున్నా, మా దగ్గరి కొచ్చేసరికి, వాళ్ళంతా వొకటేనండీ, 'సరుకు బాగాలేదంటారు' కానే దిక్కులేదు పొమ్మంటారు. ఏదో దయతలచికొన్నట్టు కొంటారు. ఏదో కాడికి అమ్ముకోవడం, ఆ డబ్బుల్తో ఉప్పుపప్పు నూనెగీనె కొనుక్కోవడం మళ్ళా కావిడేసుకుని కొంపకు చేరడం .... ఇదీ వరస. అట్లాకూడా బతక్కుండా, భగవంతుడు మా కొంపలు కూల్చేశాడు .... ఆ తుపానులో మా వాళ్ళంతా చచ్చిపోయారు. నేనొక్కణ్ణే తాటిచెట్టెక్కి బతికా" అన్నాడు గంగయ్య.

కట్టు పంచతప్ప, వంటిమీద ఇంకేమీలేని గంగయ్యను, ఎవరో దయామయుడు ఆదరించాడు.

"ఇంకా-ఆ దేశం పోనండి. అయ్యా! అందరూ చచ్చిపోయారు. ఉన్నఊరేమో దిబ్బేసుకుపోయింది. ఇక్కడికొచ్చిపడ్డా. ఈ కాలువలో చేపలు పడతా. సాయంకాలానికల్లా తెనాల్లో అమ్ముకొస్తా. ఆ గుడిసె నేనే సొంతగా వేసుకొన్నా. ఈ కాలవమీది మేస్త్రీ అప్పుడప్పుడొచ్చి బెదిరిస్తుంటాడు. పావలో అర్ధో చేతిలో పెడతా. బుట్టెడు చేపలిస్తా. వెళ్ళిపోతాడు...సుఖమని అనుదోకండి. ఇంతపరకూ పస్తులు చెయ్యలేదుబాబూ.

ఆ గీత రాసిపెట్టి ఉందనుకోండి. మీరూ నేనూ తప్పించలేంగదా !" అన్నాడు గంగయ్య వేదాంతిలాగా.

దివిసీమలో జరుగుతున్న పునర్నిర్మాణ కార్యక్రమాల గురించి అతను ఎవరో అంటుండగా విన్నాడట. మత్స్య పారిశ్రామికుల సహకార సంఘాల గురించి గానీ, వారి సంక్షేమం గురించిగానీ అమలు జరుగుతున్న పథకాల గురించి గాని, గంగయ్య కేమీ తెలియదు.

"ఏం చేస్తున్నారో, ఏం ఛస్తున్నారో నాకు తెలియదండి. అంతో ఇంతో చేసినా, అది నాలాంటి వాళ్ళదాకా రానేరాదండి. మధ్యనున్నోళ్ళు మింగడానికే సరిపోతుంది. పేరు మాది - నోరు వారిది" అన్నాడు గంగయ్య, ఇంకోసారి వలను కాలువలో పిసిరేస్తూ.

'కేసరి జీర్ణతృణంబు మేయునే'

ఆర్ధశతాబ్దం క్రిందట, ఇపుడున్నంత మంది దేశభక్తులేరు. ఈనాటి దేశభక్తిలేదు. దేశసేవ చేదామన్న సత్సంకల్పంతో ఏనాడు ముందుకొస్తున్నంతమంది ప్రజాసేవకుల్లో, పెయ్యోపంతు, లచ్చోపంతు కూడా ఆనాడు లేరు.

కారణాలు మనకుతెలుసు. 'దేశభక్తికి' ఇపుడున్నంత గిట్టుబాటు అప్పుడులేదు. 'లీడర్' అన్న ప్రతివాడూ, ఇపుడు ఏదో ఒక పదవిలో వుండి, తనవిదీరా ప్రజాసేవ చేస్తున్నాడు. తను తరిస్తున్నాడు. తన వారినీ తరింపచేస్తున్నాడు. అప్పుడలా కాదుమరి. దేశంపట్ల భక్తి చూపడం నేరం. రాట్నం వడకడం నేరం. ఖద్దరు కట్టుకోవడం నేరం. గాంధీపేరు పలకడం నేరం. కల్లు లాగపడ్డనడం నేరం. విదేశీ వస్త్రాలుర్చి వాడిపడ్డనడం నేరం. ఈ నేరాలను శిక్షయినా దారుణంగానేవుండేది.

ఖద్దరు కట్టుకొని, జైల్లోవున్నవాళ్ళున్నారు. రాట్నంవొడికి లాఠీలతో చేతులు విరగ్గొట్టించుకున్నవారున్నారు. కల్లుపాకల దగ్గరా, సారా దుకాణాల దగ్గరా, పికెటింగ్ చేసి, నెత్తురు మడుగుల్లో వోలలాడిన వారున్నారు. ఓ చెట్టుమీదో, గుట్టమీదో జాతీయ పతాకాన్ని ఎగరేసి నందుకు చచ్చిపోయినవాళ్లూ వున్నారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని, ఆస్తులన్నీ పోగొట్టుకున్న వారున్నారు. తమ సమస్తాన్నీ దేశస్వాతంత్ర్యానికి అర్పించేసి ఈనాడు బికారులుగా బతుకుతున్నవారూ వున్నారు.

మీరాసాహెబుగారు, ఈ చివరి కోవకు చెందిన వ్యక్తి. మీరా పుట్టుంబానికి దేశభక్తికి సంబంధం లేదు. ఆయన తండ్రి మంచి సంగీత విద్వాంసుడు. ఆయన చేతికింద అయిదుగురు జనం హామేషా వుండే వారు. వారందరూ కలిసి పెళ్ళిళ్ళకు 'తాషా మరబాద్' వాయించేవారు. మీరాతండ్రి షే (హ)నాయ్ అద్భుతంగా వాయించేవాడు. తన కొడుకును కూడా, తనంతవాణ్ణి చేదామని, ముసిలాయన ఉబలాటం.

అంతో ఇంతో చదువుకొన్న మీరాకు, అక్షరంముక్క వంటబట్టలేదు. ఆయన గొంతులో సప్తస్వరాలు గునగున లాడుతుండేవి. గుండెల్లోంచి సంగీతం ఝరి పెల్లుబుకుతుండేది. అదృష్టవశాత్తూ, మీరా గొంతుకమ్మగా కూడా వుంటుంది. తండ్రి శిక్షణలో మీరా సంగీతం నేర్చుకొన్నాడు. తండ్రి బృందంతోపాటు, పెళ్ళిళ్ళకూ, హాజరవుతుండేవాడు.

ఉన్నవ లక్ష్మీనారాయణగారు, తమ శారదా నికేతనంలో, వొక విధవా వివాహం తల పెట్టినప్పుడు ఊరి వారందరూ ఆయన్ను దాదాపుగా వెలివేశారు. అయినా ఉన్నవ వారు లెక్కచేయలేదు. ఈ పెళ్ళిని శాస్త్రో

్తంగా జరిపించాలని ఉన్నవ వారి అభిప్రాయం. మరి పురోహితుడెలా ? మేళతాళాలెలా ? కవిరాజు రామస్వామి చౌదరిగారూ, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారూ మంచి స్నేహితులు, పౌరోహిత్యం జరిపించడానికి రామస్వామిగారు ఒప్పుకున్నారు.

"ఆ పెళ్ళికి నాన్న మేళంవాయించాడండి. మా నాన్నతోపాటు నేనూ వెళ్ళాను. పెళ్ళిసి ఆపుచేయడానికి ఊళ్ళోవాళ్ళు చాలా మంది సిద్ధంగావున్నారు. అయినా ఎటువంటి ఇబ్బందులూ లేకుండానే పెళ్ళి జరిగిందనుకోండి". అన్నాడు మీరా.

అప్పుడే మీరాకు ఉన్నవ వారితో పరిచయం. తొలిసారిగా, సహపంక్తి భోజనాలలో పాల్గొన్నది కూడా అప్పుడే నన్నాడు మీరా. "మా వాడు బాగాపాడతాడండి! అని మా నాన్నగారు రామస్వామిగారితో అన్నారండి. చౌదరిగారు పాడమన్నట్లుగా సైగ చేశారు. నేను రెండు మూడు పద్యాలు పాడాను. ఉన్నవవారు ఆశ్చర్యపోయారు. రామస్వామిగారు మెచ్చుకున్నారు". అన్నాడు మీరా. ఆ తరువాత ఉన్నవ వారినుండి తరచుగా మీరాకు కబుర్లొస్తూ ఉండేవి. అక్కడెక్కడో మీటింగు ఏర్పాటు చేశామనీ, ఆ మీటింగులో పాడమనీ పంతులుగారు అనేవారు. మీరా సరేనంటూ పాడేవాడు.

"వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరొతెల్పుడీ" అన్న పాటను, మీరా పాడుతుంటే పైన పోతున్న పక్షులు కూడా ఆలకించేవట.



"మామూలు జనంకన్నా, పోలీసులే ఆ మీటింగులకు ఎక్కువగా వచ్చేవారు బాబూ! వాళ్ళకూ నాపాటలంటే ఇష్టమే. నాప్రార్థన అయిందాకా అక్కడక్కడా వుండి, ఆ తరువాత, సభను చెదరగొట్టేవారు. ఒకసారి నన్నూ పట్టుకొన్నారు. రిమాండులో వుంచారు. నాచేత పాడించుకొని ఆ తరువాత చావబాదారు. మీరు పేరు విన్నారోలేదోగానీ దప్పుల సుబ్బారావని ఆ రోజుల్లో పరమ కిరాతకుడైన పోలీసాఫీసరు ఉండేవాడు. వాడికి పాపం పుణ్యం, దయ, దాక్షిణ్యం ఏ కోశానా లేవు.....అమరావతిలో శివరాత్రికి, బ్రహ్మాండంగా అమరేశ్వరస్వామివారి ఉత్సవాలు జరుగు

తున్నాయి. ఆ ఉత్సవాలకుగాను, కొత్తగా కల్లు అంగళ్ళు తెరచారు. తెల్లాకుల జాలయ్యగారి నాయకత్వాన మేమంతా, పికెటింగు చేస్తున్నాం. మాతోబాటు పదిమంది ఆడవాళ్ళు కూడా వున్నారు. సుబ్బారావు తన బలగంతో మా మీద దాడి చేశాడు. నాకూ, జాలయ్యగారికీ చావు దెబ్బలు తగిలాయి. ఆడవాళ్ళ గాజులు బద్దలు కొట్టారు. పుస్తెలతాళ్ళు తెంచేశారు. జాతీయ జెండాను బూట్లకాలతో, మట్టగించారు. చాలామంది స్పృహ తప్పిపోయారు``. అని ఆగిపోయాడు మీరా.

1942 లో తెనాలి రైల్వే స్టేషన్ను ధ్వంసం చేసినవారిలో, తనున్నదీ, లేనిదీ, మీరా చెప్పలేదు.

"ఇప్పుడా సంగతులన్నీ ఎందుకులెండి అబ్బాయిగారూ !" అని దాటవేశాడు మీరా.

స్వరాజ్యం వచ్చాక, దేశస్వరూపంలో విచిత్రమైన మార్పులు చాలా చాలా వచ్చాయి. ఈ మార్పుల్ని చూసి, మీరా ఆశ్చర్యపోయాడు. ఒకప్పుడు త్యాగదీక్షతో, తమ సమస్తాన్నీ దేశమాత పాదాల వద్ద సమర్పించిన వ్యక్తుల్లో క్రమంగా ఆ ఉత్తమ గుణం లుప్తమయి పోతున్నందుకు మీరా బాధపడ్డాడు.

"ఆశ్రయించితే నాకూ, ఏదో ఒకటిదొరికేది. నాకు తెలిసినవాళ్ళు ఇప్పుడులేరనుకోండి. ఒకప్పుడు ప్రభుత్వంలో వుండేవాళ్ళు. ఆశ్రయించి, ఏదోఒకటి ఇంకించుకొమ్మని ఉబ్బువేసిన వారూ వున్నారు. యాచించడం నాకిష్టంలేదు. అందులోనూ ఈ జనాన్ని ఆశ్రయించడం అసలేఇష్టం లేదు. ఏం సంపాదించినా, వెంట ఏం వొస్తుంది గనుక ? ఈ లుంగీ కూడా లాగేసి, పాతగుడ్డ మీద కప్పి పారేస్తారు. ఆ భాగ్యానికి నీతీ నియమాలు లేకుండా బతకాలా? నలుగురిచేతా ఛీ ఛీ అనిపించుకోవాలా?" అని ప్రశ్నించాడు మీరా. గడిచిన పదిహేను సంవత్సరాలుగా, మీరా ఈ వృత్తిలోనే ఉంటున్నాడు. ఆయన ఇద్దరు కొడుకులూ దర్జీపని చేస్తున్నారు.

"ఏమీ వెనకేసుకోలేదు. అలా వేసుకోవాలన్న ఆబకూడా లేదు. ఓపికున్నంతవరకూ కష్టపడతాం. ఉన్నదేదోతింటాం.....నేను మాంసం తినను. నా పిల్లలూ తినరు. అవీ ఇవీ తాగరు. నాకున్న దురభ్యాసం చుట్ట కాల్చడం. అదీ ఈ మధ్యనే అలవాటయింది. విపరీతంగా పళ్ళు సలుపు తాయ్. చుట్టతాగితే మంచిదన్నారు. మంచిదో వల్లకాడోగానీ బాబుగారూ చుట్టమాత్రం నన్నొదిలి పెట్టనంటున్నది" అన్నాడు మీరా.

ప్రస్తుత దేశ పరిస్థితుల్ని గురించి అడిగిన ప్రశ్నకు, మీరా సూటగా సమాధానం చెప్పలేదు.

"మరేదో అడిగారుగానీ, నా ఉద్దేశ్యం ఎవడిక్కావాలయ్యా నాయనా! మనం ఇంకేదన్నా మాట్లాడుకొందాం. నేనుకుట్టిన పరుపులుచూడండి. పదేళ్ళు గ్యారంటీఇస్తా. దూదిముద్దకుట్టదు. ఒకవేపుకువుండచుట్టుకుపోదు. కుట్లు పిగలవు. మాపిల్లలుకూడా దర్జీపని బాగాచేస్తారు. రండిచూద్దురుగాని" అనిలేచాడు మీరా. అప్పుడెప్పుడో, ఏ వుద్యమంతోనూ, ఏ పోరాటంతోనూ ఏ మాత్రం సంబంధంలేని వారెంతో మంది, స్వాతంత్ర్యయోధులుగా, దేశభక్తులుగా, ప్రజానాయకులుగా దేదీప్యంగా వెలిగిపోతున్నారు. ఎడా పెడా ఆర్జించుకొంటున్నారు, అవునుగదా !

అలాంటి వారిని చూసి, నేర్చుకుందామన్నా కనీసజ్ఞానం కూడా మీరాలో కనిపించదు. బొత్తిగా చెల్లుబాటులో లేని నీతినీ, నిజాయితినీ నమ్ముకొని, నానాఅవస్థా పడుతున్నాడంటే మరి పడడా! ఇతన్నిచూసి జాలిపడడంకన్నా మనం మాత్రం, ఏం చెయ్యగలం కనుక !

గడయెక్కినా, గడప గడపెక్కినా..

"ఇప్పుడంటే పిదప కాలమొచ్చి, అన్నీ ఇలా ఆర్చుకుపోతున్నాయిగానీ, నా చిన్నతనంలో రోజులు యిలా వుండేవి కాదండీ".

డోలుతాడును బిగిస్తూనే తన అసంతృప్తిని తెలియజేసింది రాములమ్మ. ఆ తరువాత పది, పదిహేను నిమిషాలదాకా రాములమ్మ మాట్లాడలేదు. డోలుతాడును బిగిస్తూ మధ్య మధ్య, చర్మాన్ని మోగించి, శృతి సరిపోయిందో లేదో చూసుకొంటూ, మరీ హెచ్చుగా ఉన్నప్పుడు, తాడును వదులుచేస్తూ, బోలుగా శబ్దం వొస్తున్నప్పుడు పళ్ళు బిగించి, ఒక్క ముక్కతో తాడును బిగించుతూ కాలక్షేపం చేసింది రాములమ్మ.

ఎండ మిటమిటలాడుతోంది. కాలవలోంచి మురుగునీరు వాసన, ఆ ప్రాంతాన్ని ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. గోడవారగావున్న పొయ్యి మండకుండా పొగల్నికక్కుతోంది. రాములమ్మ చేస్తున్నపని అయిపోయిందేమో, మరొక్కసారి అనుమానం తీర్చుకొనేందుకు డోలును మోగించి చూసుకుంది. ఆ మోత సంతృప్తికరంగా వుందిగావును, ఆ డోలును అసింటా వుంచి, చెమట తుడుచుకొని వో లోటాడు నీళ్ళుతాగి గొంతుసవరించుకొంది. సవరించుకొని చెప్పడం ప్రారంభించింది.

మీకూ, నాకూ ఓ జిల్లావుంది. ఓ ఊరుంది. ఆ ఊళ్ళో, సొంతానిదో అద్దెదో వో యిల్లుంది. మీతోనూ, నాతోనూ పని వున్నవారికి ఫలానా చోటికివస్తే, ఫలానా అప్పుడు దొరుకుతారు అన్న నిమ్మకం వుంది. కాని రాములమ్మకు అటువంటి చిరునామా అన్నదే లేదు

అర్ధశతాబ్దం క్రిందట, కృష్ణా గుంటూరు జిల్లాలవారికి పోతుల దాసప్ప పేరు చెబితే ఎగిరిగంతేసేవారు. గుమ్మడికాయంత జుట్టుముడి. మొలకు బిళ్ళమొలతాడు, పట్టెవర్ధనాలు, మెళ్ళో పూసలపేర్లూ, నిమ్మకాయల్నయినా చులాగ్గా నిలబెటగలిగినంత పెద్దపెద్ద ఓసాలతో, బండిజల్లంత శరీరంతో, దాసప్ప కాస్తంత భయంకరంగానే వుండేవాడు, కాని, ఆకారంలోనే తప్ప దాసప్ప అంతరంగంలో భయపడవలసిందేమీలేదు.

"దాసప్ప మా అయ్యేనండీ! మీదేవూరు .... అయితేమీకు తెలిసే వుండాలే, కనీసం విన్నైనావుండాలే ! మీకుగాకపోతే మీ అయ్యనడగండి. లేకపోతే మీ తాతనడగండి - మా అయ్యను గురించే చెబుతారు" అన్నది రాములమ్మ. దాసప్ప ఆటంటే, జనం విరగబడి వచ్చేవారు. పిల్లాజెల్లాతో, ఊరు ఊరంతా తీర్థానికి కదిలినట్లు కదిలివచ్చేది. పక్కా రెండుగంటల సేపు జరిగే ఆ ఆట ముగిసేదాకా జనం కదిలేవారే కారు.

ఈనాడు మనం పేరుపొందిన సర్కసుల్లోచూసే చాలా ఫీట్సును దానప్ప ఆ రోజుల్లో చులాగ్గా చేసిపారేసేశాడు.

"రెండుకత్తుల్ని ఎగరేసి మీరు పట్టుకుంటారా? మీ సర్కసువాళ్ళు ఆరేసు. ఎనిమిది కత్తులు ఎగరేస్తుంటేనే మీరు ఆహా, ఓహో అని ఆశ్చర్యపడతారు. మా అయ్యా పన్నెండు కత్తుల్ని ఎగరేసేవాడు. నేను మాఅయ్యకు కత్తుల్ని అందించేదాన్ని" అన్నది రాములమ్మ, ఆకత్తులయినా బండవీ, మొండివీకావు. వేస్తేవేయిరూపులుగా వుండేవి. అనుమానమున్న వాళ్ళు ఆ కత్తుల్ని పరీక్షకూడా చేసేవాళ్ళు. పన్నెండు కత్తులేగరేసినా చేతికి గాటుకూడా పడేది కాదు.

"ఒకసారి మాకూ, ఇంకోముఠాకూ పందెం పడింది. అవతలి ముఠావాడుకూడా పన్నెండు కత్తుల్ని ఎగరేశాడు. మా అయ్యకు రోషం వచ్చింది. కళ్ళు నిప్పుకణాల్లాగా అయ్యాయి. ఏదయితే అదే అవుతుందని పధ్నాలుగు కత్తులూ తీసుకొని ఎగరేశాడు. జనం చప్పట్లు కొట్టి కేకలు వేశారు, ఈపని అవతలివాడు చేయ్యలేకపోయాడు" అన్నది రాములమ్మ.

ఆవిడకూడా చిన్నప్పుడు మొగ్గలేసేది. సన్నని ఇనుప చక్రం లోంచిదూరి వచ్చేది; ఎసిమిది బంతుల్ని ఏకకాకీన ఎగరేసేది.

రాములమ్మకున్న పేరు బంతులు ఎగరేయడంలో కాదు; గడకర్ర మీద ఆడడంలో. ఆ రోజుల్లో రాములమ్మ గడాట అంటే, అప్పటి కుర్రకారు ఆకలాలా పడిచచ్చేవారు(ట). బాగా ముదిరి, చేవదేలి, పండ



బారిన బొంగును ఎన్నుకునేవారు, ఆ పెదురుకు ప్రతి గనుపు దగ్గరా బిల్లలుండాలి. బిల్లల్ని జానెడు పొడవుంచి నున్నగా చిప్పేవారు, ఈ బిల్లలు గడకు రెండువేపులా, గడ చివరిదాకా వుండాలి.

"అలాంటి గడను, మైదానంలో, లోతుగా పాతేస్తారు. గడకు ఎనిమిది వేపులా ఎనిమిది పగ్గాలు కట్టి, ఆ పగ్గాలను దూరంగా తీసుకు పోయి దగ్గరున్న చెట్లకో, రాళ్ళకో, పాతిన గడ్డపారకో బిగిస్తారండీ, గడ కదలకూడదుగదండీ; నేను చెడ్డీ కట్టుకుని గడమీదకెక్కేదాన్ని గడచివర చిన్న 'బొడ్డు' వుంటుందండీ. నేనేమో నడుముకో బొడ్డుపీటకట్టు

కొనేదాన్ని. ఈ పీటమధ్య చిన్నగుంట ఉంటుంది. వెదురు బొడ్డు ఈ గుంటలోకొచ్చేలాగా నర్దుకొనేదాన్ని. మొదటిసారి మాత్రం బిల్లపట్టుకొని తిరిగేదాన్ని. అంతే, ఆ తరువాత నా అంతట నేనే ఊపుతెచ్చుకొని తిరిగే దాన్ని....మోదట్లోకాస్త భయంగానేఉండేదనుకోండి. ఆ తరువాత అదీ వుండేదికాదు. పక్కా అరగంట తిరిగేదాన్ని, ఆగిన తరువాత; చేతుల్తో గడను పట్టుకోకుండాకాళ్ళతోబిల్లల్ని వడేసుకొంటూ కిందికొచ్చేదాన్ని. ఇక తాడుమీద నడవడం నాకోలెక్కలోదేకాదు" అన్నది రాములమ్మ.

ఆ రోజులు పోయాయని ఇప్పుడా ఆటలు చూసే జనంకూడా లేరనీ వాపోయింది రాములమ్మ.

"అయినా కులవృత్తిని వదల్లేము బిడ్డా! పండగలకీ! పబ్బాలకీ ఏజో మారుమూల పల్లెలకువెళ్ళి ఆటాడి వస్తుంటారు. మావాళ్ళు చాలామంది ఆపనుల్లోకి ఈపనుల్లోకి పోతున్నారు. ఒక ఊరేముంది? ఒక పేటేముంది? రోజుకో వూరు తిరుగుతుండేవాళ్ళం. ఆ రోజుల్లో యాపాయి కనబడితే సంబరంగావుండేది. అన్నీ గింజలే బిడ్డా సంచులు నింకి పోయేవి. మాకు మూడుగాడిదలుకూడా వున్నాయ్. సామానంతా పాటి మీద పడేసి ముందేవూరొస్తుందోకూడా తెలియకుండా ప్రయాణించిన రోజులున్నాయి".

ఏం ఆడినా, ఏ ంపాడినా, అస్తుబిస్తేతప్ప గుండెనిబ్బరం ఎప్పుడూ లేదన్నది రాములమ్మ, "అప్పుడు ధర్మప్రభువులువున్నారు. ఇప్పుడేముంది బిడ్డా! అంతా." అని బూతుమాటవిసిరింది రాములమ్మ.

చుట్టూ వున్నవారంతా తన బిడ్డలు కారనీ, తన కొడుకుబిడ్డలూ, కూతురు బిడ్డలు కూడా ఉన్నారనీ, పేరుపేరు పిలిచి పరిచయం చేసిందామె.

"మాఅయ్యతోపోలిస్తే నాకేమీ ఆట రానట్టే లెక్క. ఈ సన్నానులున్నారే బిడ్డ నాకన్నా పనికిమాలినోళ్ళు" అని చిన్న మనవణ్ణి దగ్గరకు తీసుకుంది.


వీళ్ళకు చదువుకోవాలనే వున్నదనీ, కానీ ఎక్కడా స్థిరంగా వుండక పోవడంచేత బళ్ళోకి పంపే అవకాశం లేదని అన్నది రాములమ్మ.

ఏలినవారు ఈ సంచార జాతుల సంక్షేమం కోసం ఏవేవో చేస్తున్నా మంటున్నారు. ఆవేసేదేమిటో వీరిదాకావస్తే, కాస్త వెసులుబాటు దొరకవచ్చు, కాని, ప్రభువులు చేయాలిగదా!

గొడ్డుచాకిరి - గుడ్డక్కరువు...

రెండుమూడు వేల సంవత్సరాల కిందటినుంచీ, మనకూ, ఇతర దేశాలకూ ముఖ్యంగా మధ్య పాశ్చ్య దేశాలకూ, వాణిజ్య సంబంధాలున్నాయి. మనదేశంనుండి, వందలాది నౌకలు, సరుకుల్ని నింపుకొని, ఆయా దేశాల తీరాలలో లంగరువేసుకొని నిలిచేవి. మన సరుకుల కోసం, మధ్యప్రాచ్య దేశాలవారు ఎదురుచూస్తూ ఉండేవారు. మన దేశంలో తయారయిన ఉక్కు కత్తులు, శిరస్త్రాణాలు, ఆభరణాలు, వస్త్రాలు, సుగంధద్రవ్యాల కోసం అక్కడి సంపన్నులు ఎగబడేవారు. కొన్నికొన్ని వస్తువులను డబ్బులేకుండా వాటి బరువుతూగే బంగారం చెల్లించి, మరీ కొనేవారనీ, చరిత్రకారులు చెబుతున్నారు.

తార్కాణాలూ, రుజువులూ చూపడమంటే సరేననుకోండి, ఓ చిన్న సెనగడొక్కులో ఇమిడేపాటి వస్త్రాలను ఆనాటి చేనేత పనివారు తయారుచేసేవారట. బంగారు, పెండి, జరీపనివాడితనానికి, మనదేశం పెట్టింది పేరు. అంతటి మహోన్నతమయిన సంప్రదాయానికి వారసుడు



మన రామస్వామి. తరతరాలుగా, రామస్వామి కుటుంబీకులు ఈ వృత్తినే నమ్ముకున్నారు.

"ఇప్పుడంటే – మా పని ఎందుకూ కొరగాకుండా పోయిందనుకోండి. నిజానికి ఇంతకన్నా మంచి వృత్తి ఏముందో మీరే చెప్పండి ? అన్నం తరువాత –సిగ్గుదాచుకోవడానికి వస్త్రం ముఖ్యం కదా ! అన్నం లేకుండా మీరు వీధుల్లో తిరగవచ్చు. మీరు తిన్నారో తినలేదో – మీరు చెబితే తప్ప తెలియదు. కాని, గుడ్డ సంగతి అలా కాదుకదా ! ఏదీ–మీ ధోవతీ, చొక్కా విడిచి ఓ పదినిమిషాలపాటు అలా తిరిగిరండి చూద్దాం. మిమ్మల్ని పిచ్చివాడికింద జమకట్టి, రాళ్ళతోనన్నా కొడతారు, లేదా న్యూసెన్సు కేసుపెట్టి జైలుకన్నా పంపుతారు. అవునా ? — మరి మా వృత్తికీ గతి ఎందుకుపట్టిందో తెలియదు" అన్నాడు రామస్వామి రునరులాడుతూ. జంటకవుల్లాగా, విడవకుండా ఏడుస్తున్న కవలపిల్లల్ని భార్యదగ్గిర విడిచివచ్చాడు. వస్తూనే చుట్టతీసి వెలిగించాడు తన అసహ్యాన్నంతా కూడదీసుకుని, చుట్టకొరికి, తుపుక్కున ఊశాడు.

"మా బతుకుల్లాగే ఇది–కంపనా, కట్టెనా కాలకుండా వుంది బాబు గారూ! దవడలు పీక్కుపోతున్నాయి గాని, బొక్కెడు పొగరాదు. పొరపోయిందేమో ననుకున్నా..,కాదు-అసలు అడ్డీసరుకు. దీని కులమే ఇలాంటిది" అన్నాడు రామస్వామి, ఇంకో చుట్టను వెలిగిస్తూ.

రామస్వామి తాతపేరు కూడా రామస్వామిగారే! ఆ రోజుల్లో ఆయనగారు-రోజుకో పంచలచాపు నేసేవారుట, ఆయన హస్తవాసి కూడా మంచిదేనంట. ఊళ్ళో ఏ ఇంట పురుడొచ్చినా తన తాతగారే 'కాట్రీడు కోక'నేసి ఇచ్చేవారుట. ఆయన్నేసిన దుప్పట్లు ఇంకాఉన్నాయిట, ఎలుకలుకొట్టి, కొర్రుబట్టి, పోతేతప్ప–దారం పీచురేగడంగాని, పోగు తప్పుపడడం గాని ఛస్తే జరిగేది కాదన్నాడు రామస్వామి.

"మా తాతను నేనెరగనయ్యా బాబూ! మా తాతచచ్చిపోయిన ఏడాదికినేను కడుపున పడ్డాను! మా అయ్య నాకు వాళ్ళయ్య పేరు పెట్టుకున్నందుకే.....నేనా! ఆయనంత పనివాణ్ణి కాదనుకోండి....అసలు- ఆనాటి పనివాడితనం యిప్పుడెవడి క్కావాలయ్యా! అంతానదరుమీద నడుస్తున్నారు జనం! నాణ్యం ఏ గుజిగాడిక్కావాలి ?" అని, చుట్టను అవతల పారేశాడు రామస్వామి, తన తండ్రికూడా మంచి పనివాడే నన్నాడు రామస్వామి.

"ఆ రోజుల్లోనండి- అప్పయ్యసెట్టి పంచెలన్నా, చీరలన్నా, జనం ఎగరేసుకు పోయేవారు. చీరనేసి, రంగులద్ది చిటికేశ్వర చెట్టుకొమ్మమీద ఆరేసినప్పుడు చూస్తేనండీ వళ్ళుపులిసిపోయేదంటే నమ్మండి! రెండుకళ్ళూ చాలేవేకావు. ఆయన పాతిక మిషి మళ్ళా వళ్ళు దాచుకునేవాడా- అంటే, అదీకాదు! కానీ, గంటల మీదనో, రోజుల మీదనో కావాలంటే మాత్రం, ఆయనకు కోపం వచ్చేది. ఊపిరి తిరగనంత పని, మజూకీ ఎక్కువ తీసుకుంటాడు. నేత గ్యారంటీ, రంగు గ్యారంటీ, ఒకసారి ఉమ్మనేని పానయ్యగారని, మావూళ్ళో పెద్దఆసామి ఉన్నాడండి! రెండొందలెకరాల పొలం. ఆయనగార్ని అందరూ 'డాబా పానయ్యగారు' అంటారు, మావూళ్ళో అప్పటికి డాబా కట్టించినవారు ఆయనగా రొక్కరే. ఆయన కూతురు పెళ్ళొచ్చింది. మానాన్న ఆ పెళ్ళిచీరి నేశాడండీ! చేతితే

మీరు అబద్ధమనుకుంటారేమో, దశావతారాలూ, ఆచీరమీద దించేశాడండీ, నెలాపదిహేనురోజులుపట్టింది. ఆ చీరకు మానాన్న కూలీతీసుకోలేదు, కిట్టకారయిన పెయ్యను మాకు తోలిపెట్టాడు, నేను చిన్నవాణ్ణనుకోండి, అయినా, నాకుబాగా గుర్తుంది" అన్నాడు రామస్వామి.

అప్పయ్యశెట్టిగారి ముగ్గురు మగపిల్లలలోనూ రామస్వామి ఆఖరివాడు, చిన్నతనంలో అతను అంతో ఇంతో చదువుకున్నాడుగాని, అక్షరంమీదకన్నా మగ్గంమీదనే మనసుండడంతో చదువు గుంటపూలు పూసింది.

"ఏం చదువులో, ఏం పత్తికట్టో బాబూ! మా మేనల్లుళ్ళున్నారు.... నాకయితే తెలియదుకానీ, పెద్దచదువే చదివారు. నాలుగేళ్ళయింది ఉద్యోగంలేదూ, నా బొందాలేదు, అడ్డగాడిదలా బలాదూరు తిరుగుతున్నారు. మా బావ నెత్తీ నోరూ బాదుకొంటాడు, వాళ్ళకు చీమకుట్టినట్లుకూడా ఉండదు.... మరీ కోపమొచ్చి కసురుకుంటే, కొట్టడానికి మీదిమీది కొస్తున్నారని మా అక్క మొన్న వచ్చినప్పుడు చెప్పుకుని ఏడ్చింది.... నేను సంతకం పెడతానుగానండీ - సరిగ్గా చదవలేను" అన్నాడు రామస్వామి.

ఆ తరువాత తన సంగతి చెప్పుకొచ్చాడు. తనకు ముగ్గురు పిల్లలని, రెండోకాన్పుకు కవలలనీ చెప్పాడు. తన భార్యకూడా ఈ పని తెలుసునన్నాడు. కండెలుచుట్టటం, ఆసుపొయ్యడం, ఆవిడే చేస్తుందన్నాడు. ఈ వృత్తిని నమ్ముకోవడమంత బుద్ధితక్కువ ఇంకొకటి లేదన్నాడు. దానిక్కారణాలు చెప్పుకొచ్చాడు.

"నూలు దొరకదు. దొరికినా ఎక్కువధర యిచ్చికొనాలి. రంగులు మరీ మండిపోతున్నాయి. చచ్చిచెడి నేశామనుకోండి, అమ్మడం మరీకష్టం, మగ్గంమీదనే కూర్చోనా, బజార్లంట తిరిగి నేసినవాటినే అమ్ముకోనా,... నిజమే, అక్కడక్కడా సొసైటీలున్నాయి. వాళ్ళకు అమ్ముకోవచ్చు ననుకోండి, అక్కడ లక్షగ్రూపులు, ముఠాలు, తగాదాలు. అది బాగాలేదని ఇది బాగాలేదని వంకలు పెడతారు. తడిచేస్తే గమ్మునతీసుకుంటారు. కాని అందరికీ తడి చేసుకుంటూపోతే, నేను 'పొడిపొడి' అయిపోతామ బాబూ, బాంకులు డబ్బులిస్తాయన్నారు, తిరిగి తిరిగివచ్చాను. ఆఖరికి ఇచ్చారనుకొండిబాబూ! అదేం బాంకులో, అదే పాడో, కాగితాలు కదలనే కదలవండీ! అన్నీ ఇంగ్లీషులో ఉంటాయి. అక్కడేముందో నాకు తెలియదాయె. ఆఖరికి ఒకాయన్నిపట్టుకున్నా.... పేరెందుకులేండి బాబూ, ఆయనింకా బ్రతికేవున్నాడు. చెబితే నాగొంతు పిసికేస్తాడుకూడా, ఆయన్ని 'తడి' చేశా. వారం తిరక్కుండా లోను కాంక్షనయింది. ఏదో సామెత చేబుతారే-'అంగట్లో పూస అటూపోదూ, ఇటూరాదు' అని అలాగయింది. ఆ అప్పు....ఇంకా చెల్లుపేయడంలా, ఏంవేస్తాం అయ్యగారూ, గొడ్డుచాకిరీ చేస్తున్నామా, ముద్దకూ కరువే,ఆఖరుకు మేం నేస్తున్న గుడ్డకూ కరువే... బాకి తీర్చకపోతే మగ్గం పట్టుకెళ్ళతారేమో! పోనీండి, నా పీడ విరగడ మవుతుంది. అప్పులెగేసిన వాళ్ళను జైల్లో పెడితే బాగుండునండి బాబూ! ఈ తిండి, గుడ్డా, ఇల్లూ, పిల్లాజెల్లా-కొంతకాలం తప్పినా తప్పినట్టే, మూకింత ఆధరువు చూపించడం చాతకాకపోతే పోనీండిగాని-కనీసం మాలాంటివాళ్ళను జైల్లోపెట్టడంకూడా ఈ గవర్నమెంటుకు చాతకాకపోతే ఎల్లాగండీ!" అన్నాడు రామస్వామి.

వ్యాఖ్య అనవసరం !

* *
* *

కుడి ఎడమల దగా దగా !

అప్పుడెప్పుడో, ఎన్నాళ్ళకిందటో ఏమో, అప్పుడెప్పుడో, ఎన్నేళ్ళ కిందటో ఏమో మనిషి, మృగంనించి వేరుపడాలని పోరాడి, ఆ పోరాటంలోంచి బయటపడి, వ్యవసాయంవేపు చూపు మళ్ళించినప్పుడే బ్రహ్మానందం పూర్వీకులు, ఆ మార్పుకు స్వాగతం పలికారు.

అనాది మానవుడు తన అవసరాలకోసం, భూమిని దున్నినప్పుడు, విత్తనాలు నాటినప్పుడు, పంటను కోసినప్పుడు బ్రహ్మానందం వంశంవారు, ఆనాటి కృషికులకు కావలసిన పరికరాలను తయారుచేసి ఇచ్చారు. మొన్న మొన్నటిదాకా, ఆ వంశంవారు, ఆయా పనిముట్లను తయారుచేస్తూనే ఉన్నారు, రైతులకు సరఫరా చేస్తూనే ఉన్నారు.

విజ్ఞానశాస్త్రం, అద్భుతంగా పెరిగిందిగదా! అవనినుండి అంతరిక్షంలోకి మానవుడు ఎగసిపొతున్నాడు గదా ! పరమాణు గర్భాన్ని విచ్ఛిత్తిచేసి, పరమశక్తివంతమయిన శక్తిని ఆవిష్కరించాడు గదా! కోట్లాది కాంతి సంవత్సరాల దూరంలోఉన్న నభోమూర్తుల ఆనుపానుల్ని కూడా తెలుసుకుంటున్నారు గదా! మరి ఈ ప్రభావం వ్యవసాయ రంగంమీద బాగా కనిపించదేం ? మన రైతులింకా, ఆలోకుడి కాలంనాటి వ్యవసాయ పరికరాల్నే వాడుతున్నారేం ?

గడచిన 20 ఏళ్ళుగా, ఏవో మార్పులొచ్చాయనుకోండి. ఈ మార్పులు రావడం మంచిదేగానీ, దీనివల్ల చాలామందివృత్తులు కోల్పోయారు. వారికి బతుకుతెరువు కనిపించలేదు. వారికి దిక్కూ-మొక్కూ-లేకుండా పోయింది. అలా పోయినవారిలో బ్రహ్మానందం ఒకడు.

బ్రహ్మానందం వంశం వారందరూ, వడ్రంగం పనిచేసేవారే ! అందులోనూ, అప్పిశంగా, వ్యవసాయ పనులు మాత్రమే చేసేవారు.

"ఇంకోరి దగ్గర కెళ్ళి నేర్చుకోవలసిన అవసరం నాకేంలేదండీ ! మా తాత ఈ పనిచేశాడు. మానాన్నచేశాడు. నేనూకొంతకాలం చేశాను." అని కాస్సేపు ఆగాడు బ్రహ్మానందం. పొరబోయినచుట్టను, దవడలు పీక్కు-పోయేలాగా రెండు గుంజులు గుంజి, కొసకొరికి దూరంగా వూస్తూ, మళ్ళా వెలిగించాడు.

''పల్లెటూళ్ళు, ఇదివరకులాగా లేవండి ! అంతా తెలివిమీరి పోయారు. నాకు పదిహేను అరకలుండేవి. అరక్కు, పాతికమానికల జొన్నలు కొలిచేవాళ్ళు. కందులు, పెసలు, శనగలు, పండితే అడ్డెడు, మూడు మానికలదాకా పెట్టేవాళ్ళు. నాకు రెండు పాడి బర్రెలుండేవి, ఏ రైతుబీట్లోనో మేసి వస్తుండేవి. ఏ అయ్యవామిలోంచో ఓ మోపెడు

చొప్ప కొట్టుకొచ్చుకొనేవాణ్ణి. ఏ జీతగాణ్ణి బతిమిలాడినా, రెండు గాబుల్నిండా, బరీగా నీళ్ళుతోడి పోసేవాడు. ఇప్పుడా పద్ధతులన్నీ మారి పోయాయండి."

బ్రహ్మానందం, రోజుకు రెండు కొత్తనాగళ్ళు దుయ్యచెక్కి, అవతల పడేసేవాడు. గొరుగ్గానీ, గుంటకగానీ చేస్తే, మరింక 'వంక' పెట్టడానికే ఉండేదికాదు. దంపె చేసినా, జడ్డిగం చేసినా, 'కరాకట్‌గా' ఉండేవి. ఏడికర్ర చెక్కినా, చీలునాగలు బిగించినా, మరింక ఎలుపూ-నలుపూ అన్న ప్రశ్నే ఉండేదికాదుట. ఈ పనికూడా ఆ రైతు పొలాన్ని బట్టి, అతని ఎద్ద పరిస్థితినిబట్టీ, తనే నిర్ణయం తీసుకునేవాడు.

"జడ్డిగం చేయడం, చాలా కష్టమండీ : మూడు కంతల్లోంచీ, విత్తనాలు సరిగా కిందికి జీరాలి, కన్నాల కొలతల్లో తేడాలున్నా, వంకర టింకరలున్నా, విత్తనాలన్నీ వొకచాలులోనేపడిపోతాయి. ఆ చాలులోనేమో పైరు చిత్తపత్తుగా పెరుగుతుంది. మిగిలిన చాళ్ళల్లో మొక్కలు ఈసుకు పోతాయి. నేను పదేళ్ళు చేశానుగదా! కావాలంటే మీరెళ్ళి అడగండి, బ్రహ్మానందం పనివాడితనం మీకే తెలుస్తుంది" అన్నాడతను.

వ్యవసాయం పనిముట్లు తయారీకి వడ్రంగం పనివొస్తే చాలదు, కమ్మరంకూడా రావాలి. నాగలికర్రు సరవాలన్నా, గుంటక పలుగులు సాగ బట్టాలన్నా, ఏడికర్రను కట్లు బిగించాలన్నా, మొలలు తాపడంచేయాలన్నా, కమ్మరం తప్పకుండా తెలిసి వుండాలి. బ్రహ్మానందానికి ఆ పని కూడా క్షుణ్ణంగా తెలుసు.



"మక్క మంచిదికావాలేగానీ బాబూ, నాగలికర్రు మూడేళ్ళదాకా పదునుపోకుండా పనిచేస్తుందండీ! గుంటకపల్లుకూడా అంతే. నలిగితే గడ్డ

నలగాలీ, లేదా బెడ్డ విరిగి, పెళ్ళగించుకురావాలిగాని, నేను చేసిన 'పల్లు' మాత్రం మొన విరగదండీ! ముక్క మెతక సరుకనుకోండి, నేను చేయ గలిగిందేమీలేదు. అందుకే, టౌనుకెళ్ళి నేను ముక్కలు తెస్తానండీ!" అన్నాడు బ్రహ్మానందం.

ఎండాకాలంలో, బండిపనులు, ఇంటిపనులు చేసేవాడుబ్రహ్మానందం. డొల్లపుచెక్కైనా, ఇరుసు బిగించినా- వడీ, సడీ ఉండేది కాదన్నాడు. బండి కుండమీద, తన పనివాడి తనమంతా చూపించేవాడినన్నాడు. కుండకు బెజ్జాలు తొలిచి, ఆకులు బిగించి, పూటీలు బిగగొట్టిన తరువాత, మరింక వాటిని ఊడదీయడం దేవుడితరం కూడా కాదన్నాడు.

"అసలు కష్టమంతా, లక్కాకులు చేయడంలోనూ, వాటిని బిగించ డంలోనూ, ఉన్నాయండీ ! లక్కాకు ఏ కాస్త తేడాగావున్నా, ఇరుసు, ఏడాదికల్లా, కోసుకుపోతుంది, బండిగాను, పెడగా తిరుగుతుంది. లాగే ఎడ్లుకూడా, గుంజలేక సచ్చిపోతాయండీ! పరంపట్టె బిగించానంటే బాబుగారూ! నాలుగుపుట్ల బరువేసినా బండి నమోయినుగా ఉంటుందేగానీ, బెసికిళ్ళాడదండీ! ఇలా ఇలా చెయ్యాలని; ఎక్కడా రాసి ఉండదు సార్ ! అంతా చూసి నేర్చుకోవాలి. అనుభవం మీదగాని, ఈ కిటుకులన్నీ తెలియవండీ !" అన్నాడు బ్రహ్మానందం.

కత్తికాసుతో లైన్ గీసడంగాని, చేబాడితో చివ్వి, అవతల పడేసేవాడే గానీ, ఏనాడూ సీటిమట్టం ఉపయోగించలేదన్నాడు బ్రహ్మానందం. మరి మంచాలకూ, మొగరాలకూ తప్ప తను చిత్రిక గుల్లను ఉపయోగించేవాడే కాదుట. ఉలితో బెజ్జం వేసినా, ఆగరతో బొక్క తొలచినా, పెద్ద తేడా ఉండేది కాదుట. ఎడంకన్ను మూసి, కుడికంటితో అంచును చూస్తే మీరింక మూలమట్టం వేసి చూడాల్సిన అవసరమే ఉండేదికాదుట.

"ఏమయితేనేంగాని, ఆ పనంతా ఇప్పుడెందుకూ పనికిరాకుండా పోయిందండీ. అక్కడా చాలా పోటీ ఉంది. రైతులేమో, గట్టి గింజ కొలవడం మానేశారు. ఈ కాలవలొచ్చాక అంతా వరిమీద పడ్డారండీ! ఆ వడ్లే పాతిక మానికలు కొలిచారనుకోండి, తాలూతప్పా, నూక, తవుడూ, పోగా పదిమానికల బియ్యంకూడా నాకు దక్కవు. ఇదివరకూ లాగా, గొడ్లను గోదను పొలాలలోకి రానివ్వడంలేదు. నేను పుట్టి బుద్దెరిగిన తరువాత, పాలూ, పెరుగూ, మజ్జిగా కొనుక్కోలేదండీ. ఇంటికి చుట్టమొచ్చినా, పక్కమొచ్చినా, ఏ రైతు ఇంటికెళ్ళినా, చింత గింజేస్తే మునగని చిక్కని మజ్జిగ దొరికేవి. వొడినిండా కూరగాయలేసి పంపేవాళ్ళు. ఇప్పుడవన్నీ పోయాయి. పాలన్నీ బస్తీలకు అమ్ముకుంటు న్నారు. కూరలూ, అంతే, పంటలూ అంతేనండి !" అన్నాడు బ్రహ్మానందం.

అందుకనే, అతను పల్లెటూరును విడిచిపెట్టి విజయవాడ వచ్చాడు. వచ్చాక-రెండు మూడు నెలలపాటు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడలేకపోయాట్ట. లోగడ తను వతనుగా కలపకొంటున్న షావుకారు దగ్గరే పనికి కుదిరాట్ట.

"ముందుగా రోజుకూలీకి పనిచేశానండీ! రోజుకు ఎనిమిది రూపాయ లిచ్చేవాడు. చచ్చేపని తీసుకొనేవాడు, ఏ రోజుపనికి రాకపోతే, ఆ రోజు నాగాకిందలెక్క. మరింక ఆ పూటకు మాడిచావాల్సిందే! అందుకని ఆయన దగ్గరే కాంట్రాక్టుకు చేస్తున్నా. రోజుకు, ఆడతాపాడతా చేసినా, రెండు డ్రాయర్లు చేస్తావండి! పది, పన్నెండు తంగుమని, చేతిలో పడతాయి. కుర్చీలు, స్టూలుబల్లలు, కిటీకీలు, ద్వారబందాలు, తలుపులు రకరకాల మంచాలు, గడియారాలు పెట్టుకొనే బాక్సులు. బీరువాలు, ఫర్నిచర్ పనంతా చేస్తాను...." అన్నాడు బ్రహ్మానందం.

ఊళ్ళో అద్దెభరించలేక, కృష్ణలంకలో వో చిన్న పూరిల్లు అద్దెకు తీసుకుని, తలదాచుకొంటున్న బ్రహ్మానందానికి, నలుగురు పిల్లలున్నారు. వాళ్ళనయినా బాగాచదివించి 'ఉద్యోగం'లో చేర్చాలని బ్రహ్మానందం కలలు కంటున్నాడు.

"నా రెక్కలుతప్ప, నాకింకో దిక్కులేదు బాబు!" అన్నాడతను, మంచంపట్టెకు అంచును మలుస్తూ. "కలకాలం నమ్ముకున్న పల్లెటూరు నన్ను దగాచేసింది. గంపెడన్ని ఆశలు మోసుకుంటు వచ్చినందుకు, ఈ బెజవాడకూడా నన్ను దగాచేసింది". ఈ ఆరేళ్ళలోనూ, మూడుసార్లు కొంపలుకాలి, అతను, అతని సంసారమూ కట్టుగుడ్డలతో ఇవతలకు రావలసి వచ్చింది. ఏచ్చిన ప్రతిసారీ, మళ్ళీ 'అ ఆ'ల దగ్గరనుండీ బతుకును ప్రారంభించవలసి వచ్చింది.

ఈ సామాజిక వ్యవస్థలో అతని కలలు, నీరుగారిపోతాయే తప్ప, ఫలించవని, అతనికెవరు చెబుతారు ? ఎప్పుడు చెబుతారు ?

నేను సైతం ఇంటి పాయ్యాకి...

మనమాటలు పేటలూ, తోటలూ, కోటలూ దాటిపోతాయిగానీ, మన చేతలు మననించి అరంగుళం మేర దాటిపోవు. మనం మాటల మనుషులం. కోతలరాయుళ్ళం. బడాయి సన్యాసులం. అరచేతిలో స్వర్గం, కైలాసం, వైకుంఠం ఇంకా ఇంకా ఇలాంటివీ చూపెడుతూ ఉంటాం. మన అభ్యుదయం, కాగితాలమీద అద్భుతంగా చిత్రితమయి ఉంటుంది. మన ప్రగతి అంకెల్లోకి ప్రవహించి, వాటిని అలిసిపోయేలాగున చేస్తుంది. మన పథకాలు - పరమ రమణీయంగా ఉంటాయి. మన ప్రణాళికలు చదివిన వారికి నోరూరి లొటలు వేయలేక ఛస్తారు. కాని, మన బతుకుల్లో ఆ ఛాయలేవీ కనిపించవు. నాలుగు దశాబ్దాల కింద సామాన్య జన జీవనం ఎలా ఉన్నదో - ఈనాడు అలాలేదు. మరింత దిగజారి, దిగజారి దిగజారి పరమ అధ్వాన్నంగా తయారయింది. పేదలు నిరుపేదలయ్యారు. ఉన్నవారు మరింత ఉన్నవాళ్ళయ్యారు. నాలుగెకరాల రైతు, కూలివాడుగా మారితే-నలభయ్ ఎకరాల ఆసామీ వ్యవసాయం మానేసి, కంట్రాక్టరుగా మారి లక్షలు సంపాదించాడు.

దీనిక్కారణం లేమిటో పోశమ్మకు తెలీదు. తన బతుకిలా బుగ్గి పాలుకావడానికి, దేవుడే కారణమనుకుంటున్నది గాని,మనల్ని పరిపాలించే వారే కారణమని ఆమెకు తెలీదు. మనం తెలియజెప్పినా ఆమె వినదు. ఒకవేళ విన్నా నమ్మదు. నిజం చెప్పినా, నమ్మనంత మూఢత్వంలో మన పాలకులు, మన పాలనా వ్యవస్థ పోశమ్మను అట్టేపెట్టిన విషయం మనలో చాలామందికి తెలియదు.

నెహ్రూ 'సోషలిస్టుతరహా సమాజం' నెలకొల్పుతానన్నారు. ఇందిరాగాంధి 'సోషలిజమే మనపరమలక్ష్యం' అన్నారు. ఈ ఉభయుల ప్రభుత్వాలూ, దేశాన్ని మూడు దశాబ్దాలపాటు దున్నిపారేశాయి. సోషలిజం సంగతి సరేసరి - సామాన్యుడికి నిలువనీడ లేకుండా పోయింది.

మనం మోసగాళ్లం దగాకోరులం. మహావంచకులం. గుర్రం ముట్టెకు, పచ్చగడ్డి పరకల్ని లగాయించి, బక్క గుర్రంచేత చావుపరుగు తీయించే ఆదిమానవులం. ఉష్కవాగ్దానాలతో ప్రజల్ని మోసగించి, వంచించి, అదిరించి, బెదరించి, గెలిచి సింహాసనాలమీద కూచున్నజాతి మనది. అలా గెలిచిన చాళ్ళ కాళ్ళుపట్టుకొని, వారి ఎంగిలినీళ్లుగతికి, దానితోనే సంతృప్తిపడి, తోకలు ఆడించే బజారు కుక్కలం.

కాకపోతే — పోశమ్మ బతుకిలా బుగ్గిపాలెందుకయింది ? ఆ వయస్సులో సుఖంగా కాలక్షేపం చేయవలసిన పోశమ్మ జీవితం నిప్పుల ఉప్పలా ఎందుకు తయారయింది ?

పోశమ్మను మీరెప్పుడన్నాకలుసుకుని, ఆప్యాయంగా పలకరించి చూడండి. మీ గుండెలు బద్దలయ్యే గాథలు వినిపిస్తుంది. ఒక మనిషి—మరో మనిషిపట్ల ఇంత క్రూరంగా ప్రవర్తించగలడని మీరు ఊహించను కూడా లేరు.

"నా బతుకు బంతలయిండిరా బిడ్డా! వాళ్ళ కొంపలు నాశన మయిపోను. వాళ్ల బొందలమీద జిల్లేళ్ళు, తంగేళ్ళు మొలచ. నా ఉసురు వాళ్లకెప్పుడు తగులుద్దో బిడ్డా." అని ఘోరమంటుంది పోశమ్మ.

గద్వాల సంస్థానం, కవి పండితులను ఆదరించిందనీ, సారస్వతానికి సేవచేసిందనీ చెబుతారు. వారికి పట్టుశాలువలూ, భారీ సంభావనలూ యిచ్చిందనీ చెబుతారు. వందల మందికి వార్షికాలు ఇచ్చేవారని ఇప్పటికీ చెప్పుకుంటూ వుంటారు. కాని, వీరందరినీ సన్మానించేందుక్కావలసిన సంపదను పోశమ్మలాంటి సామాన్యులే సృష్టించారని చాలామందికి తెలియదు, పోశమ్మకూ తెలియదు.

'గద్వాల సంస్థానంలోని చిన్న పల్లెటూరులో పదెకరాల పొలానికి కాపలాదారు' రాంరెడ్డి. ఎన్నో ఏళ్ళుగా, రాంరెడ్డి ఆ పొలాన్ని సేద్యం చేస్తున్నాడు. అయినా ఆ భూమ్మీద అతనికి హక్కులేదు. అతను కేవలం కౌలుదారు మాత్రమే. ప్రభువుల అవసరాన్నిబట్టి శిస్తులు పెరుగుతూ ఉంటాయిట. పెరగడమేతప్ప తరగడంలేదుట. పెరిగిన శిస్తును ఇవ్వలేక పోతే పొలం వదులుకోవలసిందేనట. "ఒదులుకొని ఏంచేస్తాం బిడ్డా: ఎగసాయం తప్ప ఇంకోటి చేతకాదాయె. యగసాయానికయినా" ఏం గుర్తుకొచ్చిందోగానీ ఏడ్చేసింది పోశమ్మ.



అన్నదమ్ముల తగదా, 'కొరి' అధికాయిత్యం, వానలు లేకపోవడం, పెట్టుబడి కొరత - ఈ కారణాలన్నింటివల్లా - పొలాన్ని పిడిచిపెట్టి, రాంరెడ్డి కూలిచేసుకు బతికాడు. పోశమ్మనూ, బిడ్డల్ని బతికించాడు:

"ఓసారి పొలం పోయాడు. నా దేవుడు మళ్లీ రాలా: పొలంలో పురుగుముట్టింది. అక్కడే చచ్చిపోయాడు.... పిల్లలు పెద్దవాళ్ళే బిడ్డా: చదువులేదు, అయినింటివాళ్ల పిల్లల్నితెచ్చి పెళ్లిళ్లు చేశా. వాళ్లు పెళ్ళాల మాటలు విని నన్ను వదిలేసిపోయారు. ముగ్గురు మగబిడ్డలున్నా, నాకీ చాకిరీ తప్పలేదునాయనా:" అన్నది పోశమ్మ. హైదరాబాద్ వచ్చి కూడా ఇరవయ్యేళ్లు దాటింది.

"చాలా పనిచేశా. కూలిపనిచేశా. ఇటికపనిచేశా. సున్నం కొట్టే వాళ్లతో పనిచేశా. ఇళ్లదగ్గర కసువుపనీ అంట్లుతోమే పనిచేశా. చేసి చేసి చేసీ నా రెక్కలు విరిగిపొయాయి. తిరిగీ తిరిగీ తిరిగీ నా కాళ్లు అరిగి పోయాయి.... మాయబతుకు నాయనా : ఈ పాడుముండాకొడుకు–దేవుడు సచ్చినోడు ఆకలి ఎందుకు పెట్టాడో తెలియదు. సముద్రాలు నిండు తున్నాయిగానీ, నా జానెడు పొట్టా నిండడంలేదు బిడ్డా!" అన్నది పోశమ్మ తడి అయిన కళ్లను తుడుచుకొంటూ.

ఓపిక తగ్గింది. ముసలితనం శరీరాన్ని కమ్ముకొన్నది. మరింక తిరగలేననుకొంది. మెల్లగా ఈ 'బేరం'లోకి దిగింది.

మొదట మొదట్లో తనే పేడ పోగేసుకొచ్చేది. వరిడొక, దంటు ముక్కలు, కాగితం పీచులు వేసి, తొక్కి పిడకలు చేసి అమ్ముకొనేది. బాయిలర్లురావడంతో పిడకలకు గిరాకి తగ్గిపోయింది. అందుకని ఈ ఉండలు చేసి అమ్ముతున్నదిప్పుడు.

"నడవలేను. కాళ్ళతీపులు. లేస్తే తూలుడొస్తున్నది. నర్సింలు దగ్గర బరెల్లున్నయ్. పేడకొంటా....నులి బొగ్గునుసి కొంటా. కలిపి ఉండలు చేస్తా. ఇప్పుడా పనిచేయ్యలేను బిడ్డా. రెండో మూడో ఇచ్చి అచ్చవమ్మను బతిమిలాడతా,ఏ సందకాడోవచ్చి పనిచేసిపోద్ది. ఆరబెడతా, అమ్ముకుంట".

పోశమ్మ సమస్యలు ఈ బేరానికి సంబంధించి చాలా వున్నాయి. ఉండలు చేశాక ఆరబెట్టటం అన్నింటిలోకి పెద్ద సమస్య. మహాపట్నం కదా. స్థలం వుండదు. రోడ్డువార ఆరబెట్టుకొంటే మునిసిపాలిటీ వాళ్లు గొడవపెడతారు. పోతీసులు పేచీపెడతారు. అయినా ఏదో విధంగా బండిని నెట్టుకొస్తూనే వుంది పోశమ్మ.

"ముసిలీ ముతకావాళ్లకు సర్కారోళ్లు సాయం చేస్తామన్నారంట. ఎవరో అన్నారు. అక్కడికెళ్ళా. నన్నుచేర్చుకోమని అడిగా. బతిమిలాడా ఏందేందో కాగితాలు కావాలన్నారు కొడుకులు. అయ్యేందో నాకు తెలవదు విసుగేసింది, మానేశా...."

సికిందరాబాదులో ఉన్న మరో సంస్థవారిని కూడా పోశమ్మ అడిగి చూసింది. అప్పటికి వారిదగ్గర, పెండింగులో వున్న దరఖాస్తులు చాలా వున్నాయని, ఆ లిస్టు పూర్తయితే తప్ప కొత్తవారిని చేర్చుకోలేమని,అలా చేర్చుకోవడానికి తమ సంస్థ నిబంధనలు ఒప్పుకోవనీ వారన్నారు. ఇక చేసేదేమీ లేక, ఈవృత్తినే అంటిపెట్టుకొనివుంది పోశమ్మ.

"ఒకప్పుడు బాగాబతికిసిదాన్ని బిడ్డా. ఒకళ్లకింత పెట్టాగానీ, అడుక్కోలేదు. ఇప్పుడా - ఈచీర నాది కాదు. ఈ అంగీ నాది కాదు. నేనుంటున్న గుడిశ నాది కాదు" అన్నది పోశమ్మ.

ఈ పుణ్యభూమిలో పోశమ్మకు 'నాది' అని చెప్పుకోదగ్గ వేమీ లేవు – ఒక్క ఆకలి, దరిద్రమూ తప్ప.

* *
* *

ఒకసారి, రెండుసార్లు...



ఇవ్వాళ ఏకాంబరప్పను చూసి ఎవరయినా గర్వపడవచ్చుగాని, పాతికేళ్ళ కిందటయితే, అతనెందుకూ పనికిరానివాడికిందే లెక్క. ఈ మాట ఇంకెవరో, ఎవరో అంటే మనం తుడిచిపారేస్తాం. స్వయంగా అతని మేనమామగారే అన్నారు. పోనీ, ఏకాంబరప్పకూ, నరసప్ప గారికీ, తగాదాలేమన్నావుంటే, ఆ విరోధంకొద్ది మేనల్లుడిమీద అభాండాలు వేశాడనుకోవచ్చు. అదేమీకాదు. ఏకాంబరప్ప చిన్నప్పటి నుంచీ మేనమామల దగ్గరే పెరిగాడు.

జరిగిందేమిటంటే –

ఏకాంబరప్ప తండ్రిపేరు దాసప్ప. ఆయన మాటకారి తెలివిగల వాడు. చదువుసంధ్యలు బొత్తిగా లేనివాడు. పొలంపుట్రా అసలే లేనివాడు. అయినా ఆర్థికంగా దాసప్పగారెప్పుడూ అవస్థపడలేదు. ఆయన ఖాయిదా బేరం చేసేవాడు.

"అంటే మరేం లేదండీ, ఎవరికన్నా పాడి బర్రెకావాలనుకోండి. మా బావతో చెబుతారు. ఇంకెవరన్నా బర్రెను అమ్ముకోవాలనుకోండి. అదీ మా బావతో చెబుతారు. ఈ ఇద్దరి అవసరాలూ మా బావ తీరుస్తాడు. అమ్ముకునేవాడితో 'నీ గేదెకు పాడిచార లేదయ్యా, ధర పలకదు' అనేవాడు. కొనుగోలుదారుతో "మంచి కులంగల గొడ్డు. సుడులు కూడా బాగావున్నాయ్. మణుగు చట్టం చూస్తే తెలియదా, నువ్వు అడిగిన ధరకు ఆ బర్రెకొమ్ము కూడా రాదు. పది రూపాయలు పోతేపోయినయ్, గుట్టు చప్పుడుకాకుండా కొనుక్కో' అని సలహా యిచ్చేవాడు. నేను సరిగ్గా చెప్పలేక పోతున్నానుగానండీ, మా బావ చెబుతుంటే అక్షరాలా నిజమే

ననిపిస్తుంది. ఎక్కడా తొణకడు. బెణకడు. ముఖం చూసి ఆయన కడుపులో వున్నదేమిటో కనుక్కోవడం హరిహరాదులక్కూడా సాధ్యం కాదు." అన్నాడు నరసప్ప.

అటు అమ్మకందారు దగ్గిరా, ఇటు కొనుగోలుదారు దగ్గిరా ఆయన సంపాదించేవాడు. రూపాయికి అణా పట్టంతో ప్రారంభించి, ముక్కానికి బేరం కుదిర్చేవాడు. నలభయ్ రూపాయల బేరం పైసలయితే, నలభయ్ కాన్లు- పదణాలు ఘల్లున చేతిలో పడేవి. ఇటు పదణాలు, అటు పదణాలు, వెరసి రూపాయిపావలా, ఒక్క రూపాయికి నాలుగు మాణికెల బియ్యం దొరికే రోజుల్లో, రూపాయి పావలా తక్కువ సంపాదనేంకాదు. ఖర్చులు పోగా ఆయన నిలవచేసుకుంటే బోలెడంత డబ్బు ఆయనదగ్గిర వుండవలసింది. కాని, వచ్చింది వచ్చినట్లుగా ఆయన సారాకొట్టుకు అర్పితం చేసేవాడు.

ఏకాంబరప్పకు మూడోఏడు వెళ్ళుజతన అతనితల్లి చచ్చిపోయింది. నలుగురు అన్నదమ్ముల మధ్య ఒక్కతే ఆడపిల్ల. అందుకని, నరసప్ప గారు, మేనల్లుడ్ని తమ దగ్గరకు తీసుకొచ్చుకున్నారు. ఇది జరిగిన ఆరేడు మాసాలకల్లా దాసప్పగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఈ రెండో భార్యకు అయిదుగురు పిల్లలుకూడా.

"అప్పుడప్పుడు మా [illegible] మా ఇంటి కొస్తుండేవాడు. కొడుకును చూసుకునేవాడు. వాడికి అవీ ఇవీ కొనిచ్చి, పోతూ ఉండేవాడు... తప్పేం లేదనుకోండి. తల్లిలేనివాడు కావడంతో ఏకాంబరప్పను మేం మరీ గారాబంగా పెంచేవాళ్ళం. మా అమ్మకయితేనండీ-వీడంటే పంచప్రాణం. వీడు ఆడిందే ఆట - పాడిందే పాట. ఏడెనిమిదేళ్ళ వయస్సు వచ్చేదాకా, వీడికి అక్షరంముక్క రాదు ఇప్పటి సంగతి వేరులెండి" అన్నాడు నరసప్ప, మేనల్లుడికేసి గర్వంగా చూస్తూ.

ఏకాంబరప్ప-నలుగురు మేనమామలమధ్య పెరిగాడు. తోబుట్టువు మీది ఆపేక్షకొద్ది అతన్ని ఎవరూ ఏమి అనేవారుకాదు. మరీ అల్లరి మితిమీరినప్పుడు కాస్తనోరుచేసుకుంటే ముసలమ్మ గయ్ మని ఒంటకాలి మీద లేచేది.

అతడు బళ్ళోకి వెళ్ళడం గొప్ప. వెళ్ళినా కూచునేవాడుకాదు. అయ్యవారు చెప్పేది వినేవాడుకాదు. దిద్దబెట్టిన అక్షరాలు దిద్దేవాడు. అనేకసార్లు బళ్ళోకి పోతున్నానంటూ ఇంటిదగ్గర చెప్పి ఎటో తిరిగేవాడు. ఎక్కడికెళ్ళేవాడో ఎవరికీ తెలియదు. బడి విడిచిపెట్టేవేళకు, మళ్ళీ కొంప కొచ్చేవాడు.

"కొండమీది కెళ్ళేవాణ్ణి. కోనేట్లో ఈత కొట్టేవాణ్ణి. కొండకింద చెన్నకేశవస్వామివారి గుడి వుంది. నేనూ, శంకర్రావూ, ఆ గుళ్ళో కూచుని బీడీలు కాల్చేవాళ్ళం. సిగరెట్లు కాల్చేవాళ్ళం. నోరువాసన వస్తుందేమోనని భయం. అందుకని, తులిశాకు నమిలేవాళ్ళం... శంకర్రావు చాలా మంచివాడు సార్- అప్పుడప్పుడు ఇంట్లోంచి డబ్బులు కాజేసి తెచ్చే

వాడు. డబ్బులు దొరకనప్పుడు లాగుజేబుల్లో బియ్యం పోసుకొచ్చి, రత్తయ్య కొట్లోఅమ్మేవాడు. ఆ డబ్బుతో బీడీలు కాల్చేవాళ్ళం. చదువుకో బుద్దయ్యేదికాదు. బండచదువు, బండబాదుడు. కోదండం తీసేవాడు. చెర్నాకోలతో కాళ్ళమీద కొట్టేవాడు. బల్లమీద ఒంగోపెట్టేవాడు గోడ కుర్చీ వేయించేవాడు. నా కర్మకాలిపోతే, నాకు చదవబుద్దయ్యేదికాదు. గంటకింద చదివింది ఇప్పుడు గుర్తుండేదికాదు " అన్నాడు ఏకాంబరప్ప తన చిన్నప్పటి సంగతులు గుర్తుచేసుకుంటూ.

శంకర్రావయితే దొంగతనం చేశాడు కానీ, తనెప్పుడూ చేయలేదన్నాడు ఏకాంబరప్ప. ఆ అవసరం తనకు లేదన్నాడు. అడిగినప్పుడల్లా మేనమామలిస్తూండే వారనీ, వారూ ఇవ్వనప్పుడు, అమ్మమ్మ ఇస్తూఉండేదని అన్నాడు. కొంతకాలం ఓ ఫొటోగ్రాఫర్ దగ్గిర పనిచేశాడు. ఇంకొంతకాలం నాపరాళ్ళ షాపులో పనిచేశాడు. సొంతంగా, కిళ్ళీకొట్టు పెట్టి చూశాడు. అన్నీ ఎదురు తిరిగాయి. ఏ వృత్తీ అతనికి నచ్చలేదు.

"ఒకసారి సంగమేశ్వర స్వామితో తిరనాళ్ళకెళ్ళా. గాసులైట్ల ముందు-సగనిగ లాడుతున్న పాంటును, వేలంవేస్తున్నారు. అయిదు రూపాయలతో పాట మొదలు. ఇంకెవరో అయిదుం బావలా అన్నారు. నా పక్కకు నుంచున్నవాడు- 'ఆరు' అన్నాడు. నేను ఏడు రూపాయలని అన్నాను.... ఇలా పెరిగి పెరిగి పద్దెనిమిది రూపాయలకు నేను కొన్నాను ఇంటికొచ్చాను. అమ్మమ్మకు చూపించాను. నా తెలివి తక్కువకు ఆవిడ గోల పెట్టి ఏడ్చింది. మా చిన్న మేనమామ కిష్టప్ప-'దేంట్లోనన్నా దూకి చావరాదురా! మా ప్రాణాని కొచ్చి పడ్డావే' అన్నాడు ఆనాడు ఆ సంఘటనే జరక్కపోతే, నా బతుకు ఇంకోలాగా వుండేది. ఎలా వుండేదో నాకు తెలియదు " అన్నాడు ఏకాంబరప్ప హాయిగా నవ్వుతూ.

అమ్మమ్మ-కొడుకులకు తెలియకుండా పులిచేరునాకు, గోట్లుతీసి మనవడి చేతిలో పెట్టింది. వాటిని కర్నూలులో అమ్మాడు. ఆ అమ్మకంలో కూడా ఏకాంబరప్ప మోసపోయాడు. అమ్మిన డబ్బుతో చీరెలు, రవికలు గుడ్డలు కొన్నాడు. కొన్నదానిమీద రూపాయికి పావలా లాభం వేసుకొని ధరలు చెప్పేవాడు. కానీ అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఇది పనికిరాదు అనుకుని 'వేలం' పద్ధతి ప్రారంభించాడు. గుడ్డ నాణ్యంకన్నా తళుకుబెళుకులు ఎక్కువగా వుండాలని, అనుభవంమీద గ్రహించాడు. గిట్టిన రేటుతో పాటప్రారంభమయ్యేది. ఆ పైన – ఎక్కువమ్మిందంతా లాభమే.

"ముందుగా ఇందులోనూ నష్టాలొచ్చాయి. అయినా నిలదొక్కుకున్నాను ... మరీ మీరు మా బిజినెస్ సీక్రెట్స్ అన్నీ అడుగుతున్నారు సార్. మీరు ఈ ఫీల్డులోలేరు గనుక చెబుతున్నా. వేలంపాట బాగా నడపాలంటే, అయిదారుగురు కలిసి కట్టుగా ఉండాలి. ఒకడు పాట పాడుతూ ఉండాలి. మిగిలినవాళ్ళు కొనుగోలుదార్లుమధ్య, అక్కడక్కడా వుండి పాటను పెంచుతూ పోవాలి. అసలు—ఏ వస్తువును పాటకు పెట్టడానికయినా ముందు, దాన్ని గురించి బాగా చెప్పాలి. నాణ్యం ఎవడిక్కావాలి సార్ ! ఈ రోజుల్లో—కంటికి నదరుగా వుండాలిగానీ, పాట

పెరుగుతున్న కొద్దీ ఆశగా–మరీ పెంచకూడదు. అనుకున్న లాభంరాగానే, ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు.... అంటూ పాట కొట్టెయ్యాలి. ఒక్కోసారి ఓ చీరమీద లాభం వస్తూన్నా, కొనుగోలుదారుల కోసమని, 'లాభంకావాలా ? వస్తువుకావాలా' ? అని ఆడుగుతా. లాభంకావాలన్నాడను కోండి. మూడు నాలుగు లాభం అతనికిస్తా. సాధారణంగా లాభం కావాలనే వాళ్ళు, మావాళ్ళే అయివుంటారు. అప్పుడప్పుడు పరాయివాళ్ళు కావచ్చు. అయినా లాభం అతనికి ఇచ్చేస్తా. అదంతే ! డబ్బు వ్యాపారం మరి!" అన్నాడు ఏకాంబరప్ప.

అతను, బొంబాయి, అహమ్మదాబాద్, బెంగుళూరు, గద్వాల, పోచంపల్లి, చీరాల తరుచుగాపోతుంటాడు. కావలసిన గుడ్డల్ని చౌకగా కొంటాడు. ఒకప్పుడు చీరెలు, జాకెట్‌గుడ్డలు మాత్రమే అమ్మేవాడు. యిప్పుడు పాంటు గుడ్డలు, షర్టుగుడ్డలు, ధోవతులు బెడ్‌షీట్స్ కూడా అమ్ముతున్నాడు.


"మా అమ్మమ్మ చచ్చిపోయింది. మా మామయ్య లందరూ ఇప్పుడు నాతోనే వుంటున్నారు. అందరం కలిసే ఈ వ్యాపారం చేస్తున్నాం. అదాయాన్ని గురించి అడక్కండి. అ సంగతి మీరడక్కూడదు, నేను చెప్పకూడదు....లేదండీ ! ఎక్కువగా బస్టీల్లోనే ఈ బిజినెస్ సాగుతుంది. రాత్రిళ్ళు ఎందుకంటే – గుడ్డల్లో ఎక్కడన్నా, ఏదన్నా...." అని తక్కున ఆగిపోయాడు ఏకాంబరప్ప.

"ఇప్పటికే చాలా చెప్పాను. నిజానికి ఇవన్నీ చెప్పకూడదు .... పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఒక్క ఊరనేదేమీ లేదు. ఈ ఊరొచ్చి పది రోజులయింది. ఇంకా పది, పదిహేనురోజులు ఇక్కడే వుంటాం .... మళ్ళీ ఇంకోచోట.... నేను కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుల్లోకూడా తిరుగుతాను ..." అన్నాడు ఏకాంబరప్ప.

అతనిప్పుడు, అయిదారు భాషలు, అనర్గళంగా మాట్లాడుతాడు. మాట్లాడి చూపించాడుకూడా.

జీవితపుఠంలో జిర్రకాగి, సిగ్గుతేలిన మేలిమి శలాకలాంటివాడు ఏకాంబరప్ప.

లేదురా ఇటువంటి భూమి ఇంకెందు ...



ఈ పుణ్య భూమికి స్వతంత్రం వచ్చి ముప్పయ్ మూడేళ్ళ యింది గదా. ఈ స్వతంత్ర భారతాన్ని నందనవనం చేసి, ఇక్కడున్న యావత్తు జనాభాను, సుఖసంతోష సముద్రాలలో వోలలాడించాలని ఏలిన వారు ప్రయత్నిస్తున్నారు గదా. కొటానుకోట్ల రూపాయలు ఖర్చు చేశారు గదా. దేశంలో డబ్బు చాలక విదేశాలనుండి కూడా అందినంత వరకూ అప్పులు చేశారు గదా : ఇన్నీ అయ్యాక ఇప్పుడు లెక్కలు చూసుకొంటే కనిపించే అభ్యుదయం, నిజంగా అబ్బురంగానే వుంది.

గ్రామప్రాంతాలలో నివసిస్తున్నవారిలో 23 కోట్ల 90 లక్షలమందీ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 5 కోట్ల 50 లక్షలమందీ, వెరసి 29 కోట్ల 40 లక్షలమంది, దారిద్ర్యరేఖకు దిగువస్థాయిలో బతుకుతున్నారని ప్రణాళికా సంఘంవారి సర్వే చెబుతున్నది. 50, 60 లక్షల మాటేమిటిగానీ, దేశ జనాభాలో సుమారుగా సగం మంది ముష్టిబతుకు బతుకుతున్నారు. ఇలా బతుకుతున్నవారిలో కర్రి అప్పన్న వొకడు.

మనం మరీ అన్నింటిలోనూ తీసికట్టుగా వున్నామని అనుకోనవసరం లేదు. అందుకోసం బాధపడవలసిన అవసరమూ లేదు. చిన్నపిల్లల చేత పనిచేయించడంలో మనం అగ్రస్థానంలో వున్నాం. మన దేశంలో వున్న బాలలందరకూ ప్రాథమిక విద్యకు రాజ్యాంగం వాగ్దానం చేసింది నిజమే. కాని, నూరింట ఐదువంతుల మంది పిల్లలు పాఠశాలల్లో చేరడానికి బదులుగా, పనిపాటల్లో చేరుతున్నారు.

1971 వ సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 23 కోట్లమంది బాలబాలికలున్నారు. దేశ జనాభాలో వీరి సంఖ్య, దాదాపుగా 42 శాతం. మంచి తిండి యివ్వలేనికారణంగా నెలకొక లక్షమంది పిల్లల్ని మనం చంపుకొంటున్నాం. ప్రతి ఏడాదికి 25 లక్షలమంది పిల్లలు గుడ్డి వాళ్ళుకాకుండా ఆపలేకపోతున్నాం. ఏటా 15 లక్షలమంది పిల్లలు బిచ్చగాళ్ళుగా మారిపోతుంటే చూస్తూవూరుకుంటున్నాం. 9కోట్ల 20లక్షలమంది పిల్లలు దరిద్రరేఖకన్నా తక్కువస్థాయిలో బతుకుతున్నా సహిస్తున్నాం. ఇలా బతుకుతున్న వారిలో సింహాచలం వొకడు.

సింహాచలం తండ్రి పేరు అప్పన్న. అప్పన్న పెద్ద కొడుకు సింహాచలం, వారిద్దరి మధ్యా కాలవ్యవధి సుమారుగా వో పావు శతాబ్దం వుంటుంది. ఈ పాతికేళ్ళలో ఎన్ని ఎన్ని అద్భుతాలయినా జరుగవచ్చని ఎవరయినా అనుకుంటారు. కాని ఏ అద్భుతమూ జరగలేదు. జరిగిందేమిటంటే—

అప్పన్న బానిస దేశంలో పుట్టాడు, సింహాచలం స్వతంత్రదేశంలో పుట్టాడు, అప్పన్న బానిస దేశంలో పలకా, బలపమూ పుచ్చుకుని, రెండేళ్ళ పాటు బళ్ళోకెళ్ళాడు. సింహాచలం స్వతంత్రదేశంలో రెండు వారాలపాటు కూడా బడికెళ్ళలేదు. అప్పన్న స్వతంత్ర భారతంలో పెళ్ళాడాడు.

ఇక సింహాచలం సంగతి—

"ఈ కరువోజుల్లో అప్పటిదాకా బతికిన్నాటి మాటగందా!" అంది కొండమ్మ ముక్కురగత్తును సర్దుకుంటూ. జీవితం తన్నేతన్నుల్ని భరించలేక ఆ కుటుంబం గావుకేకలు వేసింది. ఊరూరూ, వీధి విధీ తిరిగింది.

అన్నీ సక్రమంగా ఉండే యిజీనగరంలోనే వుండాల్సింది. అన్నీ సక్రమంగా ఉండవనీ, వుంటనివ్వరనీ, ఆ కుటుంబానికి తెలీదు. పార్వతీపురం, సాలూరు, తుమ్మిడాం, బొబ్బిలి తిరిగి తిరిగి విసుగెత్తి, టిక్కెట్లు కూడా లేకుండా అనకాపల్లి వచ్చారు. 'అనకాపల్లి లో 'ఉద్దేగం' తేరగా దొరుకుతుందని ఎవరో చెప్పారుట. అప్పన్నకు ఆ మాటమీద గురి కుదిరింది. 'నెగళా' అంటూ కొండమ్మనూ, సింహాచలాన్నీ తీసుకొచ్చేశాడు అనకాపల్లికి.

అనకాపల్లిలోమాత్రం ఏముంది గనక ? కొండమ్మ హోటల్లో పని చేసింది. అప్పన్న సూదెమిషన్ దగ్గర, బెల్లంయార్డులోనూ పనిచేశాడు. చాకిరితప్ప—కడుపునిండా తిండంలేదు.

విశాఖపట్నం "బోడ్ల పెద్దచెట" గనక పనులు బాగా దొరుకుతా యిన్నారెవరో. అనకాపల్లికి "చాణ్ణం" పెట్టేసి విశాఖపట్నం మకాం మార్చాడు అప్పన్న రెండేళ్ళ తర్వాత. కొంతకాలం కూలీనాలీ చేశాడు ఓసారి వో పెద్దమనిషి కూరగాయాల బుట్టను ఇంటిదాకా తెస్తే రెండు రూపాయలిస్తానన్నాడు. రెండు రూపాయలంటే చిన్న మొత్తమేమీ కాదు గదా! నెత్తి పెట్టుకున్నాడు. చస్తేంత బలవుగా వుంది.

రెండురూపాయల మీది తీపితో మెడనరాలు సుడులు తిరుగుతున్నా, చుట్టలు తిరుగున్నా కిక్కురుమనకుండా భరించాడు.

తట్టలో ఉన్నవి కూరగాయలు కాదేమోనన్న అనుమానం వేసింది అప్పన్నకు. నడుస్తుంటే ఏవో సీసాలు కదులుతున్న చప్పుడవుతోంది. ఆతగాడు – ఆసామి ముందు పోతున్నారు. అప్పుడప్పుడు వెనక్కు తిరిగి చూసుకొంటూ అప్పన్న ఆయన్ను అనుసరించాడు. అరుగుమీద దించబోతే లోపలికి రమ్మన్నాడు. ఆయన తనూ సాయంబట్టి, బుట్టను దించాడు. చెమట తుడుచుకొంటున్నప్పుడు, రెండు కాదు - అయిదు రూపాయలిచ్చాడాయన ...

తను మోస్తున్నది దొంగసరుకన్న సంగతి, చాలా కాలానిగ్గాని అప్పన్నకు తెలీలేదు. తెలిసాక ముందుగా వొణికిపోయాడు.

"మరేం భయంలేదు. అన్నీ నే చూసుకొంటా. అనుమానం కలక్కుండా చూసుకో. పట్టుబడినా నా పేరు చెప్పకు. చెప్పావో చంపేస్తాను నా కొడకా ! నీపెళ్ళాం బిడ్డల సంగతా– నా కొదిలేయ్" అన్నాట్ట, ఆ పెద్దమనిషి.

"అప్పటికీ నేను 'వొద్దో' అని మొత్తుకొంటూనే వున్నాను బాబు గారు. వాడు నామాట వినలా. పదులూ, పాతికలూ తెస్తుండేవాడు, మంచి మంచి గుడ్డలు వేసుకొనేవాడు. అప్పుడప్పుడు చెడతాగి కొంపకొస్తుండే వాడు." అన్నది అప్పలకొండమ్మ.

అప్పన్నకు అంతకుముందు తాగే అలవాటులేదు. ఇక్కడికొచ్చాకా, ఈ చండాలం పనిలోకి దిగాకా, మెల్లిగా అలవాటు చేసుకున్నాడు. ఒక్కోసారి పెద్దపెద్ద పెట్టెలూ, సంచులూ, తీసుకురమ్మనేవాడుట పెద్దమనిషి. వాటి నిండా సిల్కుతానులు, గడియారాలు, చిన్నచిన్న రేడియోలు వుండేవిట. ఆలాంటివి దొంగచాటుగా తీసుకొచ్చేందుకు అప్పన్న భయపడ్డప్పుడు, ఆ పెద్దమనిషి ధైర్యం చెప్పేవాడుట. మరీ దిగజారిపోకుండా వుండేందుకు 'మందు' మప్పేవాడుట. ఆ చెడతాగిన తిక్కలో, ఏ అఘాయత్యం చేయమన్నా చేసేవాడుట అప్పన్న.

ఇంకోసారి– వేడవమీద ఎక్కడికో ప్రయాణమయ్యాడు అప్పన్న. ఏదో కొంపమునుగుతుందని కొండమ్మ అనుమానిస్తూనే ఉంది. బతిమిలాడింది, కాళ్ళట్టుకుంది, బెదిరించింది, చంపుతానన్నది, చచ్చిపోతానన్నది, అవతలి పెద్దమనిషి ఏంచెప్పాడో తెలీదు. అప్పన్న విన్నాడు కాదు. రాత్రి పదిగంటలకు పూటుగా పట్టించాడు. రోడ్డుమీదక్కారొచ్చింది. అప్పన్న తూలుకుంటూ వెళ్ళాడు. అంతే !

– మరింక రానేలేదు.

"అప్పటినించీ ఈ బిడ్డకు నేనూ, నాకు వీడూ దిక్కు" అంది కొండమ్మ ముక్కు చీదేస్తూ. ఊరికి దూరంగా, పొలాల్లోనే రోడ్డు వొంచన, చిన్న పాక వేసుకొంది కొండమ్మ. నేను అద్దెకు తీసుకుంది. తన తండ్రికి గానుగుండేది. అప్పుడెప్పుడూ తను పనిచేయలేదుగాని,


పనిలోని బిగువులు తెలుసు "ఇసక తెస్తా, సున్నం తెస్తా. గానుగుంది, కుర్రాడున్నాడు" పొడిపొడిగా అంది. సింహాచలం అన్ని పనులు చేస్తాడు. ఎన్ని తట్టల ఇసక్కు ఎంత సున్నం వేయాలో, ఎన్ని చుట్లు తిరిగితే సున్నం పాకానికొస్తుందో, అడిగిన ధర ఇచ్చేవాడికి కలిపే పాళ్ళేమిటో, గీసిగీసి బేరమాడేవాడి రోగం ఎలా కుదర్చాలో సింహాచలానికి బాగా తెలుసు. అయినా, వాడు ఉలకడు, పలకడు. అడిగితే మాత్రం తల్లికేసి చూస్తూ అవునా, కాదా చెపుతాడు.

డబ్బు వ్యవహారాలన్నీ కొండమ్మే చూస్తుంది. కప్పరకప్పర చీకటుండగా దున్నపోతును కడితే, చద్దన్నాలవేళకు ఒక విఘత దిగిపోతుంది- తల్లీ తనూ కలిసి దాన్ని బండిలోకి చేరుస్తారు. ఆ దున్ననే బండికట్టి ఖాతాదారు ఇంటికి చేరుస్తాడు సింహాచలం. సున్నం ఖరీదు వేరు, బాడుగ వేరు.

మళ్ళీ సాయంకాలం ఇంకో విడత చేస్తారు. దీన్ని కుప్పవేసి గడ్డిగాదం కప్పి అది అరిపోకుండా నీళ్ళు చల్లుతారు. మళ్ళీ ఇసక, సున్నం పోసి, నీళ్ళుచల్లి నానబెడతారు. ఇక కప్పరకప్పర చీకటుందనంగా లేచి..

"రెండు మూడేళ్ళ నుంచి ఇట్లానే బతుకుతున్నాం ... అబ్బో చాలా ఇళ్ళకు సపలయ్ చేశాం నాయనా !" అంది అప్పలకొండమ్మ. ఇక్కడ గానుగాడిన సున్నంతో ఏ మహాభవనాలు, కార్యాలయాలు, విద్యాలయాలూ, పై ద్యాలయాలూ రూపుదిద్దుకున్నాయో మనకు తెలియదు. మనకు తెలిసిందల్లా-పట్టుమని పదిహేనేళ్ళయినా లేని సింహాచలం, పదిపదుల బతుకుభారాన్ని మోస్తున్నాడని మాత్రమే !

వెదురుతో వేయి రకాలు



ఏభయ్యేళ్ళ క్రిందట సీతయ్య వయస్సు ఇరవయ్యేళ్ళు. ఈమధ్య కాలంలో సీతయ్య చాలా మార్పులు చూశాడు. రెండు ప్రపంచ యుద్ధాలు చూశాడు. మొదటి ప్రపంచయుద్ధం గురించి, సీతయ్య సరిగా చెప్పలేక పోయాడు. కానీ రెండో యుద్ధంగురించి చాలాచెప్పాడు. ఆయన తమ్ముడు కిష్టయ్య. రెండో ప్రపంచ యుద్ధమప్పుడు సిపాయిగా చేరాడు. మూడు సంవత్సరాలపాటు కిష్టయ్య, అక్కడా, ఇక్కడా తిరిగాడు. ఆఖరుకు బర్మాలో చనిపోయాడు. చనిపోయేనాటికి కిష్టయ్యకు ఇరవయ్‌నాలు గేళ్ళుండేవిట. అతగాడు మిలిటరీలో చేరకపోతే వాణ్ని తన పనిలోనే ఉంచుకునే వాణ్ణన్నాడు సీతయ్య.

"ఆ రోజులే వేరు. ఆ జనమే వేరు. గుంటూరు పోవాలంటే రెండామడ దూరమూ చచ్చినట్లు నడిచేవాణ్ని. పాతికరూపాయలు పెడితే బండెడు బొంగులొచ్చేవి. ఆర్నెల్లదాకా చేతినిండాపని. కడుపునిండా తిండి. ఇప్పుడేమున్నదండీ నా పాడె! నా పచ్చి బద్దలూ!" అన్నాడు సీతయ్య తీరుచూర్ణం తీర్చిదిద్దుకుంటూ.

ఆ రోజుల్లో సీతయ్య ఇంటిచుట్టూరా బొంగులే వుండేవి. "బండి జల్లలు, గుమ్మెలు, కంకులెత్తే గంపలు నేను చేసినట్టు చేసేవాళ్లు తక్కువండీ. మందపాటి బద్దతో బండిజల్ల అల్లానంటే రెండు తరాలు చూసేది. ఇక ఇళ్ళ సీజను వొచ్చిందంటే, బువ్వతినే తీరుబాటుకూడా ఉండేదికాదు. వర్షపాయ్య బొంగులు బిగించి పోయేవాడు. నేనూ నాబామ్మరిది తడిక అల్లేవాళ్ళం. అప్పుడు నేనల్లిన ఇళ్ళు ఇంకా రాళ్ళలాగా ఉన్నయ్. ఇప్పుడేముందండీ నా పాడె, నా పచ్చి బద్దలూ" అన్నాడు సీతయ్య. బొట్టు కిడ్డీని తిరుచూర్ణం సీసాలో వేసి, దాన్నివొంకెకు తగిలించి "వీడు మా పెద్దోడండి. ముగ్గురాడపిల్లల తరువాత పుట్టాడు. వాళ్ళమ్మ వెంకటేశ్వర

స్వామికి మొక్కుకొంది. అందుకనే తిరుపతయ్యని పేరుపెట్టాం" అన్నాడు సీతయ్య. లోపల్నుంచి గిన్నెల చప్పుడయ్యింది. డేక్కుంటూ లోపలి కెళ్ళాడు సీతయ్య.

అంతదాకా నిశ్శబ్దంగా బుట్టలల్లుకొంటున్న తిరుపతయ్య, తండ్రి అటుపోగానే బీడి ముట్టించాడు. గుప్పుమని పొగ వదలి చెప్పడం ప్రారంభించాడు, "మా నాన్నదంతా పరమ ఛాదస్తమండీ ! చెప్పిందే, చెప్పిందే, చెప్పిందే మళ్లా, మళ్లా చెప్పి ప్రాణాలు తీస్తాడు బాబయ్యగారూ ! ఆయనకు మతి చలించిందండి. ఆ మాట మేమంటే భగ్గుమని మండిపడతాడు. నాకూ పెళ్ళయింది. ఇద్దరుపిల్లలు. అయినా నేనింకా చిన్నపిల్లాణ్ణనుకొని, మీది మీదికొస్తాడు, కొట్టబోతాడు, 'నరుకుతా' నంటాడు. 'చీలుస్తా' నంటాడు' ఈయన్తో చచ్చిన చావుగా ఉందండీ." అని విసుక్కున్నాడు తిరుపతయ్య.

తరువాత మెల్లిగా అసలు విషయంలోకి వచ్చాడు. పూర్వానికీ ఇప్పటికి సంబంధం లేదన్నాడు. ఆ రోజుల్లో పాతికరూపాయలిస్తే బండెడు బొంగులోచ్చేమాట నిజమే కానీ, ఈ రోజుల్లో ఆ పాతిక రూపాయలకు రెండు బొంగులుకూడా రావన్నాడు.

"అవునండీ! రావు. ఇదిగో చూడండీ! పిడికెడంతలేని ఈ బొంగు నాలుగు రూపాయలు. దీన్ని చీల్చి అల్లితే నాలుగు చేటలకన్నా కావు. ఒక్కోచేట రూపాయిన్నర, పావలక్కవరెండు. చచ్చి చెడి రెండురూపాయలకు అమ్ముడుపోడం కనాకష్టం. ఒక్కసారి చేట కొన్నారనుకోండి. రెండేళ్ళదాకా అదే పనిచేస్తుంది. ఏమంటారు?" అన్నాడు తిరుపతయ్య.

ఇంకో లావుపాటి వెదురును చూపించాడు. "దీని పేరు పర్వతం బొంగు. ఇది అల్లడానికి పనికిరాదు. నిచ్చెన్లు చేస్తాం. ఒక్క బొంగు పదిహేను, ఇరవయ్ దాకా వుంటుంది. రెండు బొంగులూ కలిపి, రెండు పదిహేన్లు ముప్పయ్. మెట్లకోసం, ఇంకా రెండు చిన్నబొంగులు కావాలి. రెండు నాయిగులు ఎనిమిది కలిసి ముప్పయ్ ఎనిమిది. నిచ్చెన ఖరీదు ఆరయిదు దాకా చెబుతామనుకోండి, యాభయ్ యాభయ్యయిదు కన్నా పలకదు. అంటే ఖర్చులు పోను 12 నుండి 15 దాకా మిగులుతాయి. మీరైనా రోజూ నిచ్చెన కొంటారా ? ఒక్కసారి కొంటే ముప్పయ్యేళ్లదాకా వుంటుంది. ఊరు మొత్తంమీద పది నిచ్చెన్లుంటే, ఊరు ఉరంతా వాటితోనే సర్దుకుంటారు. అవునా బాబూ?" అన్నాడు తిరుపతయ్య.

ఈ లావు బొంగులు, పందిళ్ళకూ, పరంజాలకూ, నిచ్చెనలకూ తప్ప పనికి రావన్నాడు. ఏవి అల్లినా సన్న బొంగులతోనే అల్లాలన్నాడు.

బొంగులావును బట్టి, పొడుగును బట్టి ఒక్కో బొంగుతో, 4, 5 చేటలు తయారవుతాయన్నాడు. సైజును బట్టి, 5,6,7 బుట్టలు డా తయారు చేయవచ్చునన్నాడు. 3,4 దాకా జల్లెడలు కూడా అల్లవచ్చునన్నాడు. ఒక్కమనిషి రోజుకు 5,6 చేటలు అల్లడం పెద్దకష్టమేమీ కాదన్నాడు.

"ఈ బొంగులన్నీ పై నించి వస్తాయండీ. విశాఖపట్నం, రాజమండ్రి, జన్నారం, వరంగల్లు నుంచి, అడితీవాళ్ళు తీసుకొస్తారు. పైజువారీగా ఏరి లాట్లుపెడతారు. వంద 40 నుండి 50, 60 దాకా ఉంటాయండీ! ఒక్కసారి గుత్తేదార్లు లారీలమీద తీసుకొచ్చి అమ్ముతారు. అయితే అప్పటి కప్పుడు 'కాష్' పడేయాలి. ఉండి కొనుక్కుంటే మంచిది. కానీ వుండాలిగా సార్! అందుకని, నాలుగైదు రూపాయలెక్కువయినా, అడితీల్లోనే మేం తెచ్చుకుంటాం" అన్నాడు తిరపతయ్య.

ఈ వృత్తిలోకి - అంటే - వెదుళ్ళు చీల్చి బుట్టలు, జల్లిలు, చేటలు, గంపలు, జల్లెడలు, తడికలు అల్లేవృతిలోకి ఇతర వృత్తులవాళ్ళు రాలేదన్నమాటగాని, ఇప్పుడీ పరిశ్రమకూడా మట్టిగొట్టుకుపోయే రోజులొచ్చాయన్నాడు తిరుపతయ్య.

"ఏం వొచ్చాయంటారేమిటండీ సార్! మీరు తెలిసేఁ అంటున్నారా, గమ్మత్తుకంటున్నారా? ప్లాస్టిక్కులొచ్చాక- ఇప్పుడన్నిటికి అవే గదండీ! ప్లాస్టిక్ బుట్టలు, గంపలు, జల్లెడలు, చేటలు, వచ్చాయి. పెదురు బుట్టలు వాడడం నామోషీకింద తయారయింది. అ వరకూ - సరేగదా! ఈ రోజుల్లో అన్నీ సిమెంటు కొంపలే కడుతున్నాయె. పై తడికలల్లించే పని పోయిందికదా! పార్టిషన్‌కు, పూర్వం తడికలుండేవి. ఇప్పుడు వొంటిఇటికి గోడన్నా కడుతున్నారు. ప్లయివుడ్ పలకలన్నా పెడుతున్నారు. ఈ పనీ మా చేతుల్లోంచి పోయినట్టేగదా! ఇన్నీ పోగా, పోగా, పోగా, ఇక మాకు మిగిలి చచ్చిందేమిటో మీరే చెప్పండి!" అన్నాడు తిరుపతయ్య చిరాకుపడుతూ. అతన్ని మామూలు మనిషిని చేయడానికి చాలా టైం పట్టింది.

"మా వృత్తిని మేం తిట్టుకోకూడదు గాని సార్ – ఇంత ముద నష్టపుపని ఇంకొటేదన్న ఉంటే చూపించండి.... సామాన్లు కూడా పెద్దగా అవసరంలేదండీ! వోక త్తి, ఇదిగో-ఈ అమ్ము, ఈ ఒంకెదబ్బనం- చాలు ఈ కత్తితో ఎంతసన్నగానయినా బద్దను చీల్చవచ్చు....మీవల్ల కాదులెండి. ప్రాక్టిస్ కావాలి. కాగితమంత పల్చగా చీల్చాలంటే - వెదురు మంచిది కావాలి చూశండి!" అంటూ ఓ వెదురును పల్చగా చీల్చి చూపించాడు తిరుపతయ్య.

ద్రాక్షకాయల సీజనప్పుడు కాస్త పని యెద్దడిగా ఉంటుందన్నాడు. కమీషనుదార్లొచ్చి వెయ్యి, రెండువేలు, మూడువేల బుట్టలకు ఆర్డరిచ్చి పోతారట. ఒకోబుట్ట రూపాయిపావలా, రూపాయిన్నర చొప్పున అల్లిస్తారట. వాళ్ళేమో, గిరాకీని బట్టి రెండు, రెండున్నరకు అమ్ముకుంటారట.

"అన్ని ఖర్చులూ పోను బుట్టకు పావలా, ముప్పావ్ పైసలూ ఉంటాయి. కమీషన్‌దారుకు ముప్పావలా నుండి రూపాయిదాకా మిగులుతుంది ... లాభమేనండీ! అంత పెట్టుబడి నా దగ్గరలేదు. వడ్డీకి తెస్తే గిట్టదు. బ్యాంకులేమో, నన్ను నమ్మి నాకు మదుపు పెట్టవు. అందుకే నా పిల్లలకు చదువు చెప్పిస్తున్నా. ఈ పనిలో పెట్టకుండా, వాళ్ళన్నా ఉద్యోగాల్లో చేరితే, వాళ్ళతోనన్నా ఈ వృత్తి–మా వంశంలో ఆఖరవుతుంది." అన్నాడు తిరుపతయ్య.

ఉద్యోగాలు అంత సులభంగా దొరకవనీ, చదువుకున్న చాలామంది ఉద్యోగాల్లేక, ఈ పుణ్యభూమిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తిరుపతయ్యకు తెలీదు పాపం!

* *
* *

అందరికీ వేడి (తే)నీరు

"నా పేరు జహంగీర్" అన్నాడతను కెటిల్‌లోంచి ఆవిరులు కక్కుతున్న టీని కప్పుల్లో పోస్తూ, కాని అతని తండ్రిపేరు అక్బర్‌కాదు.

షరీఫ్‌సాబ్‌కు ఆరుగురు కొడుకులూ, ఐదుగురు కూతుళ్ళూ కలిసి వెరసి పదకొండుమంది సంతానం.

"నేను మూడోవాణ్ణండీ ! పెద్దవాళ్ళిద్దరూ ఊళ్ళో వ్యవసాయం చేసుకుంటున్నారు. నాకన్నా చిన్నవాళ్ళు అక్కడక్కడా చిల్లరమల్లర పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. చిల్లరమల్లరంటే- ఒకడేమో ఉస్మాన్‌గంజ్‌లో బస్తాలు మోస్తున్నాడు, రెండోవాడు పెట్రోలు బంకు దగ్గర పనిచేస్తున్నాడు. ఆఖరువాడు పైలరింగ్ నేర్చుకొంటున్నాడు" అన్నాడు జహంగీర్.

నలుగురూ ఒకే ఊళ్ళోవున్నా ఒకే ఇంట్లోమాత్రం ఉండడంలేదు. అలా ఉండడం సాధ్యంకూడా కాదు. ఎంచేతనంటే, జహంగీర్, జూలాజికల్ పార్కుకు అవతలగా ఉంటున్నాడు. అతని భార్య అక్కడేఉన్న ఓ పిండిమరలో కూలిపని చేసుకుంటున్నది. ముడుచుకోవడానికే తప్ప బారచాపడానికూడా చాలనంత చిన్నపాకలో అతనిప్పుడుంటున్నాడు. పైగా ఇద్దరు చంటిపిల్లలుకూడా. అందర్నీ వొకేచోట ఉంచుకోవడం– ఛస్తే కుదిరేపనికాదు. ఈమాటే జహంగీర్ కూడా అన్నాడు.

"నాకు చదువురాదు. రాదంటే చదువుకోలేదు. అసలు మా వూళ్ళో ఆ రోజుల్లో బడేలేదు, మా నాన్నతోపాటు పొలంపని చేసే వాణ్ణి. అప్పుడెప్పుడో సీతాఫలాల లారీమీద మా నాన్నతోపాటు హైదరాబాదు వొచ్చా. హోటల్లో తిన్నా. సినిమా చూశా. ఇక్కడే ఉందామనుకొన్నా. ఇక్కడికి వొచ్చేశా" అన్నాడు జహంగీర్.

అతను హైదరాబాద్ వచ్చి దాదాపు పదిహేను, పదహారు సంవత్సరాలు కావచ్చింది. ఈ మధ్యకాలంలో 'సిటీ' చాలా మారిపోయిందంటాడు.

ఆ రోజుల్లో కొండలు, గుట్టలు, పెద్దపెద్ద తోటలు, మైదానాలు, పీచుపీచుమనే బ్రహ్మాండమైన లోగిళ్ళు, వాటిల్లో నిద్రమత్తుతో జోగినలాడుతూ తిరిగే జనం, పలచగా ఉండేవారట. ఇప్పుడా కొండలమీదా గుట్టలమీదా, ఇళ్ళులేచాయని, తోటల్ని నరికేసి "కాలనీలు" కట్టారని అతనన్నాడు.


తన కథకొస్తూ జహంగీర్ నీరసంగా నవ్వాడు–

"చాలాపనులు చేశానండీ! ఆఖరికి ఇందులో కుదురుకొన్నాను. మరో ఉద్యోగానికి వెళ్ళను. భగవంతుడి దయవల్ల, మూడునాలుగు ఆఫీ

సుల్లో మంచి మంచి ఖాతాలున్నాయి. ఏదోకాలం గడిచిపోతున్నది." అన్నాడు జహంగీర్.

మొదట అతనో ఇరానీ హోటల్లో పనిక్కుదిరాడు. ఆ అనుభవాలను చెబుతున్నప్పుడు అతని ముఖం గండరించిపోయింది.

"రోజుకు 'ఇన్ని గంటలు' అన్నదేమీ లేదండీ! కాయితాలమీద ఉంటాయేమో నాకుతెలియదు. "చాయ్'లు ఇవ్వడం, అప్పుడప్పుడు తాగినకప్పుల్ని నీళ్ళగ్లాసుల్నీ తీయడం, మరొకడు వొచ్చిందాకా పనిచేయడం, ఏ కారణంచేతనన్నా వాడు రాకపోతే, అతగాడి డ్యూటీ కూడా చేయవలసి రావడం, బూతులు, అప్పుడప్పుడు దెబ్బలు—ఇదీ తంతు. ఇవన్నీ భరిస్తూ మూడుసంవత్సరాలు పనిచేశానండీ. అయితే ఈమూడేళ్ళూ వొక్కచోటనే పని చేయలేదు. చాలాచోట్ల మారాను. కాస్తకుడి ఎడంగా అన్ని హోటళ్ళలోనూ, వొకేరకంగా తగలడ్డాయి పరిస్థితులు" అన్నాడు జహంగీర్. ఈ హోటళ్ళలో పనిచేసే వారి జీతభత్యాలు వోరకంగా ఉండవన్నాడు జహంగీర్. రెండు పూటలా భోజనం, రెండుసార్లుటీఇచ్చి నెలకు ముప్పయ్యో, నలభయ్యో ఇవ్వడం వొకపద్ధతి. కమీషన్‌పద్ధతిమీద పనిచేయడం ఇంకో పద్ధతి. ఈ కమీషన్ పద్ధతిలోనూ, మళ్ళీ చాలా రకాలున్నాయిట.



"ఇదికూడ హోటల్‌నుబట్టి మారుతూ ఉంటుందండి : ఓ మాదిరి అమ్మకాలున్న హోటల్, ఒక్కోచాయ్‌కు, ఐదుపైసలు ఇస్తుంది. ఇంతకన్నా అమ్మకాలు బాగా జరిగే సెంటర్లలో ఉన్న హోటల్ వారు ఒక్కోచాయ్‌కు రెండు, మూడు పైసలిస్తారు. ఎప్పుడూ జనంతో కిటకిటలాడే చోట రూపాయికి పది పైసల్నిమించి ఇవ్వరు. ఈ పది పైసలూ చాయ్

మీదనే కాదండి · కేకులు, బన్నులు, బిస్కెట్లు అన్నింటి మీద కలిపి ఉంటుంది" అన్నాడు జహంగీర్. కొన్ని కొన్ని చోట్ల, హోటల్లోపల జరిగే అమ్మకాలమీద కూడా కమిషన్ ఉంటుందనీ, ఇది ఇంకో పద్ధతి అని ఆతను చెప్పాడు. అన్ని సరుకులకు ధర నిర్ణయమై ఉంటాయి. సప్లయర్ ముందుగానే టోకెన్లు కొనుక్కుంటాడు. ఈ కొనేటప్పుడే డిస్కౌంటు ఉంటుంది. సరుకును తీసికెళ్లే ప్రతిసారీ, దాని ఖరీదుకు సరిపడినన్ని టోకెన్లు మేనేజరుకివ్వాలి. అమ్మడు కాని సరుకును లోపలికి తీసుకెళ్ళేప్పుడు తిరిగి మేనేజరుకు చూపించి, రిటరన్ చేసిన సరుకు విలువకు సరిపడా టోకెన్లు తీసుకుంటాడు. ఇందువల్ల మోసం జరగడానికి అవకాశం ఉండదు.

అయితే జహంగీర్ చేస్తున్నది ఇటువంటి పనిమాత్రం కాదు, అతను హోటల్లోపల సప్లయిచేయడు. ముందుగానే టోకెన్లు కొనుక్కుంటాడు. వాటితో కష్టమర్సు అడిగిన సరుకునుకొని పట్టుకెళ్ళి, వారికి వారికి అందజేస్తాడు.

"ఇక్కడ బాగా అమ్మకాలు జరుగుతాయండీ ! మంచి సెంటరు. రూపాయికి పదిపైసల కమిషన్ దొరుకుతుంది. రొట్టెలు, బిస్కెట్లు, బన్ మస్కా, సమోసాలు, పీటన్నింటిమీదా ఇదేకమిషన్ ఉంటుంది. 'చాయ్' ఇంకా స్త లాభమెక్కువ, ఎనిమిది చాయ్‌లు తీసుకెళ్లి పది కప్పుల్లోనో, తొమ్మిది కప్పుల్లోనో సర్దేశాననుకోండి. ఆడబ్బు నాకు అదనంగా వొచ్చినట్టేగదా! కమీషన్ రాదుగాని, నా ఖాతాదార్లకు సిగరెట్లు పాన్‌లు, కూడా నేను అందిస్తుంటాను. అందుకనే నా దగ్గరకు ఎక్కువమంది వొస్తుంటారు. రోజుకు అయిదు, ఆరు, ఒక్కోసారి ఎనిమిది రూపాయల దాకా కమిషన్ దొరుకుతుంది. 'ఇంతే' అని ఖచ్చితంగా చెప్పలేమండీ! గిరాకీని బట్టి వుంటుంది." అన్నాడతను.

ఒక్కోసారి రెండురూపాయలు కూడా ఉండకపోవచ్చునన్నాడు. తనసాదరుకు ఓరూపాయికి మించకుండా తనదగ్గరుంచుకొని, మిగిలిన డబ్బంతా పక్కనే ఉన్న కిళ్ళీ దుకాణంలో తను దాచిపెట్టుకుంటానని, నెలాఖరున లెక్కచూసి తన డబ్బు తీసుకుంటానని ఈ నెల రోజులపాటు తన డబ్బును వాడుకొన్నందుగ్గాను, నూటికి ఒక రూపాయి చొప్పున పాన్‌వాలా 'మిత్తి' ఇస్తాడని అతనన్నాడు.


జహంగీరు ఉన్నచోట నీళ్ళకు చచ్చినచావుగా ఉంటుందిట ఒక్కటే 'పబ్లిక్ నల్లా' ఉందిట. అక్కడైన కాసేపుకన్నా నీళ్ళురావట. ఎన్నోసార్లు 'చోర'లకు చెప్పుకున్నా లాభం లేకపోయిందిట.

"మీరెప్పుడన్నా రండి చూద్దురుగాని. జుట్లు జుట్లు పట్టుకొని ఛస్తున్నాం. ఎవరూ పినిపించుకోరు.... సరేలెండి. మాకూ ఇది అలవాటయిపోయింది."

తాగుతున్న బీడిని ఊర్పి, సంచిలో వేసుకుని చువ్వలాగా నిలబడ్డాడు జహంగీర్. అతనలా లేచినప్పుడు మెటికలు విరుచుకున్నట్లునరాలు కిటమటమన్నాయి.

* *
* *

ఎదుగు బొదుగూ లేదు నారాయణా ...



నీకూ నాకూ ఓ పేరున్నది. ఓ అడ్రసున్నది. మనల్నెవరయినా కలుసుకోవాలంటే ఫలానా హైముకు ఫలానా చోటుకువస్తే మనల్ని కలుసుకోవచ్చు.

కానీ నూకరాజు సంగతి అలాకాదు, అసలతని పేరు "నూకరాజు" కూడా కాదు.

"నా అనలు పేరేమిటని అడక్కండి. చిన్నప్పుడు నన్ను "అబ్బిగా" అనేవాళ్లు ఇప్పటికీ మా "విజీనగరం" వెడితే అక్కడోళ్లు "అబ్బిగా" అనే అంటారు".

చేతి సిరా మరకల్ని, పాత గుడ్డకు తుడుచుకుంటూ చెప్పుకొచ్చాడు నూకరాజు. విజయనగరం మొత్తంమీద వత్తిరాజును మించిన హైలర్ లేడనడం అతిశయోక్తి అవుతుందేమో గానీ బాగాకుట్టే హైలర్లలో అతనూ వొకడంటే ఎవరికే అభ్యంతరమూ వుండదు. ఆ పనివాడితనంతో అతను సుఖంగా బతకవచ్చు. ఆపాటి పని చేతగానివాళ్లు కూడా అతని కన్నా మిన్నగా బతుకుతున్నారు.

అయితే వత్తిరాజుకున్న వదభ్యాసాలు ఇన్నీఅన్నీకావు. రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలదాకా పనిచేసి, వొస్తూ వొస్తూ మందుపుచ్చుకొని ఏ అర్ధరాత్రికో అపరాత్రికో కొంపకు చేరుకునేవాడు. తింటే రెండు మెతుకులు తినేవాడు. లేకపోతే, పెళ్ళాంతో దెబ్బలాట పెట్టుకునే వాడు. అదీ ఇదీ కాకపోతే ముసుగెట్టుకుని పడుకునేవాడు.

తిండి తిన్నరోజున వోయగ్గెం చేసినంత హడావుడి జరిగేది. అన్నంలోకి చేపా ఙెల్లా లేనందుకు సత్తిరాజు తారామండలానికి లేచి పోయేవాడు. ఆ కోపంలో ఏది దొరికితే దాన్ని పుచ్చుకొని, భార్యమీదకి విసిరేసేవాడు. జుట్టువడేసి పట్టుకొని చితకతన్నేవాడు.

"నా చిన్నప్పుడు దాదాపు ప్రతిరోజు ఈ కొలువు ఉండేది, నాకు లీలగా గుర్తున్నది. ఓ రోజు మానాన్న చుట్టతో మా అమ్మ చేతుల్ని జబ్బల్ని కాల్చాడు. నేను భయంవేసి అరిచాను. నన్ను రెండు చరుపులు చరిచి, రోడ్డుమీదకి తోశాడు" అన్నాడు నూకరాజు.

సత్తిరాజు ఖర్చులకూ, ఆదాయానికి పొంతన లేదు. వచ్చేరాబడి 'మందు' కోసం ఖర్చయిపోతే, మిగిలిన ఖర్చులకు 'పైసా' వుండేదికాదు. అందుకని సులువుగా డబ్బుసంపాదించే పద్ధతుల్ని వెదకసాగాడు. ఆతని కెవరుచెప్పారో, ఎప్పుడు చెప్పారో తెలియదుగాని బ్రాకెట్ ఆటను మప్పారు. ఒకప్పుడు 'అణా' - 'బేడా' ఆడేవాడు. కాస్తా రానురాను రూపాయీ, రెండూ ఆడడం మొదలెట్టాడు. అంతకుముందు 'మందు'కు పోగా మిగిలిన చిల్లరన్నా ఇంటికొచ్చేది. ఇప్పుడదీలేదు.

"చాలామందికి నాన్నను చూస్తే ప్రేమ, అభిమానం పుట్టుకొస్తుంట్ల. నాన్నను చూడగానే పరుగెత్తుకుంటూ వెళ్ళి, కావలించుకునే వాళ్ళున్నారు. అలా వచ్చిన పిల్లల్ని ఎత్తుకొని ఆప్యాయంగా ముద్దులాడే నాన్నలు వున్నారు. నాకర్మ కాలిపోతే నాకీ ముచ్చట్లలో వొక్కటీ తీరలేదు. నాకు మా నాన్నను చూస్తే చచ్చేంతభయం. ఆయన కొట్టడం కోసమే ఇంటి కొస్తున్నాడనిపించేది. ఆయన అంతదూరంలో వుండగానే పారిపోయే వాణ్ణి," అన్నాడు నూకరాజు.

ఒకసారి సత్తిరాజును పోలీసులు పట్టుకొన్నారని సింహాచలం మావయ్య చెప్పాడు. అమ్మ లబ్బుమని గోలకెత్తింది. గోలకెత్తినందుకు, అమ్మమీద నూకరాజుకు బోలెడంత కోపమొచ్చింది. అమ్మ సింహాచలం కాళ్ళమీద పడ్డది. సింహాచలం విసుక్కొంటూ వెళ్ళాడు. గంటా గంటన్నరకల్లా, సత్తిరాజును తీసుకొచ్చాడు.

"ఒకసారయితే, ఎవరన్నా ఆదుకొంటారుగానండీ, రోజూ చచ్చేవాడికోసం ఎవరేడుస్తారండీ? అప్పుడప్పుడు నాన్నను పోలీసులు పట్టుకెళ్లడం, రెండేసి మూడేసిరోజులకు విడిచిపెట్టడం మామూలయి పోయింది. నేను భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను బాబూ! నేను చెప్పింది అబద్ధమయితే నాకీ అన్నంకూడా దొరక్కుండా పోవాలి. బజారుకెళ్ళాలంటే నాకు చిన్నతనంగా ఉండేదండీ! నా ఈడువాళ్ళంతా నన్ను ఎద్దేవ చేస్తుండేవాళ్ళు. 'దొంగ సత్తిగాడి కొడుకు' అనేవాళ్ళు 'జాగ్రత్తగా ఉండాల్రోయ్' అనేవాళ్ళు. ఆడుకునేటప్పుడు ఏదిపోయినా, నేనేతీశాననేవాళ్ళు. మానాన్న కారణంగా నేను 'దొంగ'నని పేరుపడ్డాను" అన్నాడు నూకరాజు ముఖం చిన్నబుచ్చుకుంటూ.

అదేదో పెద్ద దొంగతనం కేసులా సత్తిరాజునుకూడా యిరికించారు పోలీసులు. ఆరేడు మాసాలపాటు విచారణ జరిగింది. సత్తిరాజుకు రెండు సంవత్సరాలు జైలుశిక్షవేసి రాజమండ్రి పంపించారు.

"నేనూ అమ్మ కూడా రాజమండ్రి వచ్చామండీ!" అన్నాడు నూకరాజు. అప్పటికి అతనికి తొమ్మిదేళ్ళన్నా వుండలేదు. రాజమండ్రిలో కోటగుమ్మందగ్గర వో హోటల్లో పనిక్కుదిరింది అమ్మ. నూకరాజు అస్తమానూ, అమ్మనే అంటిపెట్టుకుని ఉండేవాడు. అప్పుడప్పుడు అమ్మకు, పనిలో సాయం చేస్తూ వుండేవాడు. ఆ హోటల్లోనే తిని, అక్కడే నిద్రపోయేవాడు.

"బల్లలు తుడవడం, గ్లాసులు, పళ్లాలు, ఎత్తడం, అవి పంపుదగ్గర పడేయడం, కడిగిన వాటిని అరుగుమీద పేర్చడం, మధ్యాహ్నంపూట తడిగుడ్డతో బల్లల్నీ, కుర్చీల్నీ శుభ్రం చేయటం ఇవన్నీ చేశానండీ!" నూకరాజు బతుకు అయిదు సంవత్సరాలపాటు హోటల్ గోడల్నీ దాటి ఇవతలకు రాలేదు.

నిజానికి - శిక్ష పూర్తికాగానే సత్తిరాజు వచ్చి వుండవల్సింది కాని రాలేదు. రానందుకు అమ్మగానీ, నూకరాజుగానీ విచారించలేదు. 'వస్తాడేమో' నన్న భయం మాత్రం నూకరాజుకున్నది.

"నా కసలీ పనిమీద ఇష్టంలేదండి ! ఎందుకొచ్చి పడ్డానో ఈ లైన్లోపడ్డాను. ఇదెవరి దగ్గరా నేర్చుకోలేదు. నాఅంతట నేనునేర్చుకున్నాను. నాకు ఇప్పుడు ఇరవైనాలుగేళ్ళు. నాలుగేళ్ళ నుంచి ఈ పని చేస్తున్నా. అప్పటిదాకా అమ్మపనిచేస్తూనే ఉండేది....అదే హోటల్ కాదనుకోండి. కొంతకాలం సొంతంగా కూరగాయలదుకాణం పెట్టింది. ఇంకొంతకాలం కూరల తట్ట మోసుకుంటూ ఇల్లిల్లూ తిరిగింది. దుకాణం పెట్టినప్పుడు పోలీసుల స్యూసెన్సు చాలా ఉండేది. అదిరించి, బెదిరించి, ఉన్న కూరలన్నీ గుంజేసుకునేవాళ్ళు." అన్నాడు నూకరాజు.

ఇప్పటికీ తనకాబాధ తప్పలేదన్నాడు. రోజుకు రూపాయీ, అర్ధా, వాళ్ల ఎదనకొడుతూనే ఉన్నానన్నాడు.

"ఆదాయమా?" అని నవ్వేశాడు నూకరాజు. రోజుకు ఆరేడు రూపాయలకు ధోకా ఉండదు ... పెన్నుల రిపేరు పనంతా నాకు తెలుసు నండీ! మారు బేరానికి కలాల్ని, కళ్లజోళ్లనూ అమ్ముతుంటా. ఒక్కో కలం మీదా 40, 50 పైసలుంటుంది. ఇక చలవజోళ్ల సంగతి మాకు నాలుగు డబ్బులు మిగిలేది ఇందులోనేనండీ! మనిషి వాలకాన్ని బట్టి బేరం చెబుతా.... వీలయినంత ఎక్కువ గుంజుకోవాలనే చూస్తానండీ! కష్టమర్ని మాత్రం పోనివ్వను."

నూకరాజు తన ఆదాయం విషయంలో నిజం చెప్పలేదనిపించింది. ఆమాట అన్నప్పుడు అతను చిరాకు పడ్డాడు.

"ఇన్ని సంగతులు నిజంచెప్పినోణ్ణి ఈసంగతి అబద్ధమెందుకు చెబుతానండి ? నాలుగు పెట్టెల నరుకు చూసి, మీరు లాభాలు అంచనా

వేసి ఉంటారు. ఓసారి కలంకొంచే, కనీసం రెండేళ్లదాకా పని చేస్తుంది గదా! చిన్నచిన్న రిపేర్లు వస్తే, పావలా, అర్థాకూడారాదు. ఎన్ని పావలాలు పోగేస్తే పది రూపాయలవుతాయో మీరే చెప్పండి!" అన్నాడు నూకరాజు.

"మీకంచే వో ఇల్లుంది గనుక, స్థిరంగా ఉంటారు. నాకు బాధ లేదండీ! ఈ ఊళ్ళన్నీ నావే! ఈ రాజ్యమంతా నాదే!" అన్నాడు నూకరాజు హాయిగా నవ్వుతూ.

అతనికి సినిమాలు చూడడమంచే చాలా ఇష్టం, క్రైం, సెక్సు, డాన్సులు, ఉన్న సినిమాలు రెండేసి, మూడేసిసార్లు కూడా చూస్తానన్నాడు. "జయమాలిని గాని, హలం గాని సినిమాలో వుంచే నేను తప్పకుండా చూస్తాను సార్" అన్నాడు నూకరాజు వాళ్ల ఫోటోలను పర్సులోంచి తీసి చూపిస్తూ.


నూకరాజుకింకా పెళ్ళికాలేదు. ఇప్పట్లో పెళ్ళిచేసుకోవాలని కూడా తనకు లేదన్నాడు. తన అమ్మ కులాసాగానే వున్నదని. ఇప్పటికీ ఆ పనీ ఈ పనీ చెస్తానని గునుస్తూ ఉంటుందని, తనే కోప్పడి ఊరుకోబెడుతూ వుంటానని నూకరాజు అన్నాడు. తన దగ్గర నిలవ లేదన్నాడు.

"నాకా అలవాటు లేదండీ! నేను తాగను. ఇంతవరకూ సరదా కోసం కూడా నేను చుక్క ముట్టుకోలేదు". అన్నాడు నూకరాజు చిత్రమేమిటంచే–అతనలా అంటున్నప్పుడు గప్పు మని మందు వాసన కొట్టడం!

ఏమున్నది గర్వకారణం?

సుప్రసిద్ధమైన పురావస్తు శాలలు ప్రపంచ దేశాలన్నింటిలోనూ వున్నాయి ఎన్నో అపురూపమైన వస్తువుల్ని మనమూ మ్యూజియములలో చూస్తూ వుంటాం. కనీసం చదవనన్నా చదువుతాం. కానీ ఒకే ఒక వ్యక్తి సమకూర్చిన బ్రహ్మాండమైన మ్యూజియాలు బహు తక్కువగా వున్నాయి. అవైనా సాలార్‌జంగ్ మ్యూజియంతో సరితూగుతాయని గట్టిగా చెప్పుకోలేం.

ఖాదర్‌కూ, సాలార్‌జంగ్‌కూ సరాసరి సంబంధాలేమీ లేవు కాని ఖాదర్ తండ్రి నవాబ్‌వదూద్‌సాబ్‌కూ, సాలార్ జంగ్‌కూ, అతిసన్నిహితమైన పరిచయాలున్నాయి. ఈ సన్నిహితత్వం చాలా దూరంగా పోయిందంటారు ఖాదర్. అలా ఇలా తిరగేస్తే, సాలార్ జంగ్‌కూ తనకూ బంధుత్వం కూడా దొరుకు తుందంటాడు. సాలార్‌జంగ్ మేనత్త కూతురూ, తన మూడోమేనత్తా తోడికోడళ్ళన్నాడు. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు గర్వంతో మెరసిపోయాయి.



"నాకయితే సరిగ్గా తెలియదు గానీ, నిజాం సాబ్‌కూ, సాలార్ జంగ్ సాబ్‌కూ, పడేది కాదని మా నాన్న ఆంటూవుండేవాడు. కారణాలు నాకూ తెలియవండి. ఇవన్నీ మా నాన్న చెబుతుంటే వినేవాణ్ణి. మా నాన్నకేమీ పనిలేదండీ. మహబూబ్‌నగర్ ఇలాఖాలో మా నాన్నకు మూడూళ్ళ జాగీరుండేది. పెద్ద యిల్లు. ఇంటిపక్కనే మసీదు గోడ నానుకొని పెద్ద ఖాళీస్థలం. అందులో ఒకపక్కగా, గొర్రెలమంద వుండేది. మరోపక్క ఇనుప తీగెలతో, సందులేకుండా అల్లిన ఓ మాదిరి ఆవరణా వుండేవి" అన్నాడు ఖాదర్.

ఆ ఆవరణనిండా రకరకాల పక్షులు వుండేవట. ముఖ్యంగా పావురాళ్ళు రంగురంగుల చిలకలూ, రెండు నెమళ్ళూ నల్లపిచ్చికలు, గువ్వలూ ఇంకా యిలాంటివే బోలెడన్ని రకాలు. వీటిని మేపడంకోసం హామేషా యిద్దరు మనుషులుండేవారు. గుర్రాల పని చూడడానికి ముగ్గురు మనుషులు, వాటి మేతకోసం పదెకరాలబీడు, నాలుగు రాతితొట్లు- ఈ తొట్లనిండా ఎప్పుడూ దాణా వుంచేవారు. ఆ పక్కనే పనివాళ్ళ గదులు వీళ్ళందరకూ, వొండడానికి,. వొడ్డించడానికి ఇద్దరు నీగ్రో ఆడవాళ్ళు ఉండేవారు.

"అదంతా శాశ్వతమనుకున్నామండీ. మీరు నమ్ముతారో లేదో గాని మా అమ్మకు ముఖం కడిగించడానికీ, ఆమె పనులు చూడడానికీ జులేఖా అనే పని మనిషి వుండేది. ఆమె కొడుకులుకూడా ఇప్పుడీ వూళ్లోనే వున్నారండీ. ఆమె చచ్చిపోయి చాలా కాలమయింది. మా అమ్మ చెవుల నిండా మేలిమి పోగులుండేవి. మోచేతులదాకా బంగారపు గాజులు, అరికాళ్ళకు మట్టికూడా అయ్యేదికాదు"అన్నాడు ఖాదర్ ఆ రోజుల్ని తలచుకుంటూ.

వహూద్‌సాబ్ అందరు జాగీర్దారు ల్లాంటివాడు కాదు. అతను వుండడం ఎక్కువకాలం హైదరాబాదులోనే వున్నా, నవాబులతో తిరిగినా డబ్బుకోసం తన రైతుల్ని పీడించేవాడు కాదు. దర్జాకోసం హోదాకోసం ఎంతయినా ఖర్చు చేసేవాడు, ఆదాయం అంతంత మాత్రంగా వుండి ఖర్చులు అధికం కావడంతో,ఉన్న ఆస్తిపాస్తులన్నీ అమ్ముకోవలసి వచ్చింది. వహూద్ చనిపోయే నాటికి, పెద్ద డాబా, జాగీర్దార్ అన్న పేరూ, ఆరుగురు పిల్లలూ తప్ప ఏమీ మిగల్లేదు.

"మా నాన్నకన్నా మా అమ్మచాలా తెలివయిందండీ. నాన్నకు తెలియకుండా కొద్దిగా డబ్బూ బంగారమూ దాచి పెట్టింది. దాంతో కొంత కాలం గడిపాము. నాకు చదువురాదు. నేనే పెద్దవాణ్ని. నా తరవాత యిద్దరు ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి, పిల్లలు పుట్టాక యిద్దరూ చనిపోయారు. మిగిలిన మొగపిల్లలుకూడా పెద్దగా చదువుకోలేదు. యిప్పుడంటే కాగితాలూ, దస్తావేజులూ, రిజిష్టర్లు పారీకత్తులు ఉన్నాయనుకోండి. ఆ రోజుల్లో యివేవీ లేవండి. కృష్ణాజిల్లా నుంచి వచ్చిన తెలుగోళ్ళకు ఇల్లు అమ్మేశాం" అన్నాడు ఖాదర్.

అతను చాలారకాల పనులు చేశాడు. కొంతకాలం ఓ రొబ్బెల కార్ఖానాలో పనిచేశాడు. రెండు సంవత్సరాలపాటు యిరానీ హోటల్లో సప్లయిర్‌గా వున్నాడు. మరో మూడున్నర సంవత్సరాలపాటు సినిమా హాల్లో గేటు కీపర్‌గా వున్నాడు. ఎక్కువకాలం ఉన్నది రొబ్బెల కార్ఖానాలోనే. ముందుగా రోజు కూలీకి కుదిరాడు; తరవాత ఇన్ని రొబ్బెలకు ఇంత మజూరీ అన్న లెక్కన పనిచేశాడు.

"రాత్రింబవళ్ళూ పనిచేసినా రెండు మూడుకన్నా వచ్చేవి కావు. ఇరానీ హోటల్లో పని చేస్తూ మానేయడానికి, మా పెద్దబ్బాయి కారణం.

వాడో రోజున తప్పతాగి ఇంకో ఇద్దరు జులాయి వెధవలతోసహా రాత్రి పదకొండు గంటలకు నేను పనిచేస్తున్న హోటలుకేవచ్చాడండీ. వాడికి నేను 'చాయ్' తెచ్చివ్వాల్సి వచ్చింది. అంతకన్నా—వాడు చడతాగి బండ బూతులు మాట్లాడడం నేను భరించలేక పోయాను".

"సినిమా హాల్లో—కాళ్ళు బిగుసుకు పోయేలాగా నిలబడడం, నిద్ర మేలుకోవడం నావల్ల కాకపోయింది బాబూ. ఊరికినే జీత మివ్వమంటే యిస్తారా ? ఇచ్చినా నేను తీసుకొంటానా?? అందుకని ఆ పనీ మానేసి ఈ చాప దుకాణం తెరిచాను" అన్నాడు ఖాదర్ బాధగా.

సినిమాల్లో వున్నప్పుడు 'చేవాటు'వల్లకూడా సంపాదించుకోలేని ఖాదరు పెళ్ళాం గుబ్బానీలు అమ్మగా వచ్చిన మూడొందలతో ఈవ్యాపారం చేస్తున్నాడు. తనక్కావలసిన పూసల దండలు, జడకుప్పెల తాళ్ళూ, గుండీలూ బ్లేడ్లు, రేజర్లు, చిన్న చిన్న అద్దాలు, పట్టు దారాలు, సవరాలు. జడపిన్నులు, అల్యూమినం గిన్నెలూ, ప్లేట్లు వగైరాలన్నీ ఉస్మాన్‌గంజి నుంచి తెచ్చు కుంటాడు. గుత్తగా కొంటాడు గనుక కాస్త చవకగా గిట్టు బాటు అవుతాయి. రూపాయికి పది పైసల నుంచి పావలా దాకా చూసు కొని అమ్ముకొంటాడు. రోజుకు పదిహేను యిరవైరూపాయల అమ్మకం దాకా వుంటుందని నాలుగయిదు రూపాయల దాకా మిగులుతాయని అన్నాడు ఖాదరు.

"రోజూ వొక్కచోటనే కూచోనండీ. అటు సనత్‌నగర్ నుండి షాలిబండదాకా తిరుగుతాను. ఎక్కువగా నాంపల్లి, కోటి, దోమల్‌గూడా, చిక్కడపల్లి, అఫజల్‌గంజి....ఇక్కడ వుంటాను. వానాకాలం పాయిదా వుండదు....పిల్లలా?" అని ఐదువేళ్ళు చూపించాడు ఖాదర్.

"ఒకడు రౌడీల్లో కలిశాడు. వాడిప్పటికి మూడు నాలుగుసార్లు కొట్లో పడ్డాడు. రెండోవాడు అవిటి సన్నాసి. మూడోవాడు ఆయిల్ మిల్లు కాడ పనిచేస్తున్నాడు. ఆడపిల్ల లిద్దరికి పెళ్ళి చేశా నేనూ....అవిడా.... అప్పుడప్పుడూ పెద్దోడూ ....అని ఆగిపోయాడు ఖాదర్ విషాదంగా నవ్వుతూ.

స్వరాజ్యం వచ్చే నాటికి ఖాదరు వయస్సు 32 సంవత్సరాలు. తన 68వ ఏట కూడా అతనింకా పూట బత్తెం కోసం దేవుళ్లాడుతూనే ఉండడం మనం సాధించిన అభ్యుదయానికొక ఉదాహరణ.

హల్లికి హల్లి...

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి రామదాసు వయస్సు రెండుసంవత్సరాలకు కాస్తో కూస్తో తక్కువ. అంతకు మూడు నాలుగు మాసాలకిందటే, రామదాసు తండ్రి కాలం చేశాడు. వెంకయ్య చనిపోయిందాకా నాగమ్మ బసీ ముఖం ఎరగదు.

వెంకయ్య రాళ్ళు కొట్టి బతుకుతుండేవాడు. ఉదయమనంగా, సరంజామా సంచిని భుజంమీద వేసుకొని గుట్టమీది కెడితే, కను చీకటి పడిగాని ఇంటికొచ్చే వాడు కాదు. అలా రెండు మూడేళ్ళు, వాళ్ళ సంసారం సుఖంగానే గడిచింది. ఒకరోజు మధ్యాహ్నంవేళ గుడిసె ముందు జనం కేకలువిని, తడికతోసుకుని బయటకొచ్చింది నాగమ్మ. మొగుడు నెత్తురు ముద్దలా ఉన్నాడు. కుప్పగూలిపోయింది నాగమ్మ.

జరిగిందేమిటంటే—

నిన్న సాయంకాలం చట్టును పగలగొట్టడానికి వెంకయ్య రంధ్రం తొలిచి వచ్చాడు. ఇవ్వాళ ఉదయం "రాతి మందు"ను బెజ్జంలో వేసి మెల్లిగా కూరుతున్నాడు వెంకయ్య, ఏం పొరబాటుజరిగిందో, ఎలాజరిగిందో తెలీదు, బ్రహ్మాండమైన ప్రేలుడుతోబాటు, వెంకయ్య, అంతెత్తుకు ఎగిరి పడి, నెత్తురు ముద్దకింద మారిపోయాడు....

అప్పట్నించే నాగమ్మ కష్టాలు ప్రారంభమయ్యాయి. కొంతకాలం కూలీనాలీ చేసి బిడ్డను పోషించుకొంది. ఆ కూలి పనులైనా ఏపెల్లపాడీ ఉండేవి కావు. పని పాటూ లేనప్పుడు కటిక పస్తు చేసింది. కానీ కొడుకును మాత్రం పస్తులుంచలేదు.

మరింక ఆ ఊళ్ళో ఉండలేక బతుకుదామని గుంటూరు వచ్చింది. అరండల్ పేటలో ఉన్న ఓ డాక్టరుగారింట్లో ఇంత నీడను సంపాదించుకొంది. క్రమక్రమంగా నాలుగైదు ఇళ్ళల్లో పనిపాట్లు దొరికాయి. ప్రతిరోజు ఇద్దరు ముగ్గురు తల్లులైనా, ఇంత అన్నం, ఇన్నికూరలు, గిన్నెల్లో వదిలేసేవారు.

"అట్టనే నా బిడ్డను సాక్కున్నాన్నండీ! ఆ తరవాత ఆ డాక్టరేరుగారే పుణ్యంకట్టుకొని, నాకు మంగళగిరిరోడ్డు మీదున్న వో పుగాకు కంపెనీలో గేడింగు పని ఇప్పించారు" అన్నది నాగమ్మ ఆ డాక్టరుకు చేయెత్తి దణ్ణం పెడుతూ.

ఇలా ఏడెనిమిది సంవత్సరాలు జరిగాయి. ఈ మధ్యకాలంలో, రామదాసును చదివింతామని, నాగమ్మ చాలా శ్రమపడింది. అదేం గ్రహచారమోగానీ, రామదాసుకు మిగిలిన లక్షణాలన్నీ అబ్బాయిగాని అక్షరం మాత్రం అంటలేదు.

అతను రోజంతా జులాయిగా తిరిగేవాడు. గోలీలాడేవాడు. బిళ్ళంగోడు ఆడేవాడు. గాలిపటాలు ఎగరేసేవాడు. సినిమాలు తెగచూసేవాడు. ఇష్టమయినప్పుడు, యింటికొచ్చేవాడు. లేనప్పుడు ఏ గాంధీ పార్క్‌లోనే, ఏ హోటలు ముందో పడుకొనేవాడు.

"ఒకసారి ఆంధ్రరత్న భవనం హోటల్లో దూరి తిన్నాను. ఇవ్వడానికి డబ్బులేదు. పారిపోయాను. నన్ను పట్టుకొని చావబాదారు. ఆ రోజంతా, ఆ హోటల్లో కప్పులు కడిగాను" అన్నాడు రామదాసు, కింద పెదవిని సుతారంగా కొరుక్కుంటూ.

"గుంటూరు టౌన్ మొత్తంమీద నాకు తెలియని బజారుగానీ, గొందిగానీ లేదు సార్. కళ్లు మూసుకొని నడిచినా, నేను బజార్లు గుర్తు పడతాను." అన్నాడు రామదాసు.

రానురాను అతని తిరుగుడు హెచ్చింది. తిరుగుడుతోబాటు ఆ బాపతు కుర్ర సజ్జతో సావాసాలుకూడా పెరిగాయి. అతని స్నేహితుల్లో చిల్లర చొంగతనాలు చేసేవారుకూడా ఉన్నారు. మొదటమొదట్లో రామదాసుకు ఆ పని చేయడమంటే చాలా భయంగా ఉండేది. కానీ, చుట్టూ ఉన్నవాళ్లంతా కలసి, అతని భయాన్ని పోగొట్టారు.



"చాలా పాడుపనులు చేసేవాళ్లమండీ! హోటల్లోదూరి, చెంచాలు కాజేసేవాళ్లం, గుడ్డి బిచ్చగాళ్ళదగ్గర కొట్టేసేవాళ్ళం. ఒకసారి ఓ పెద్ద మనిషి రత్నాటాకీసు దగ్గర టిక్కెట్లు తెచ్చిపెట్టమని రూపాయినోటు ఇచ్చాడు. నేల టిక్కెట్లిచ్చే కిటికీ దగ్గర బ్రహ్మాండమైన గలాటా. నేను

పరేనని రూపాయి తీసుకుని పారిపోయాను" అన్నాడు రామరాసు సిగ్గు పడుతూ.

రానురాను ఈ 'చేవాటు' వ్యవహారం బాగా ముదిరింది.

"ఒకసారి నేను జిన్నాటవర్‌కు ఎదురుగావున్న లైబ్రరీలో పడుకొన్నాను. నాలాంటిజనం ఇంకా చాలామంది పడుకొనిఉన్నారు. చచ్చేంత చలి. గజగజలాడిపోతున్నాను. నాపరాళ్ళు ఈకువెక్కి జిమ్ము మంటున్నాయి. అంతలోనే ఏవో పరుగులూ, ఊరుకులూ, కేకలూ, అల్లరీ అంతా లేచాం—పోలీసులు లాఠీలతో బాదుతూ మమ్మల్ని లేపారు. అందర్నీ సోదా చేశారు. నేను పడుకున్నచోట పర్సు కనిపించింది. అప్పుడు నన్ను కొట్టిన దెబ్బలు నా జన్మలో తినలేదండీ! ఆ పర్సు ఎవరిదో, ఎవరు తెచ్చి నా పక్క—నపడేశారో నాకు తెలీదు. నేను నిజాయితీ పరుణ్ణనికాదు గానీ—పర్సులు కొట్టేంత 'ఊకం' నాకు లేదండీ! ఆ పని నేను చెయ్యలేదు" అన్నాడు రామదాసు.

అయినా అతనికి జైలుశిక్ష తప్పలేదు. జైలంటే మరేం లేదు-అతన్ని గుంటూరు నుండి హైదరాబాదుకు మార్చారు. అలా మార్చటానికి ముందు, తల్లి, రెండు మూడుసార్లు పోలీసుస్టేషనుకొచ్చి లబో దిబోమని ఏడ్చింది. చిత్రమేమిటంటే, తను నేరం చెయ్యలేదని, రామదాసు విరూపించుకోలేక పోయాడు. రామదాపే దొంగతనం చేస్తుండగా పట్టుబడినట్లు పోలీసులు సాక్ష్యాధారాలతోసహా రుజువు చేశారు.

రామదాసు బాలనేరస్థుల కేంద్రంలో గడిపినప్పుడు, కొంతలో కొంత, క్రమశిక్షణను అలవరచుకున్నాడు. అంతో ఇంతో చదువుకూడా అబ్బింది. రెండు మూడు రకాల చేతిపనులుకూడా అక్కడ నేర్చుకొన్నాడు.

"అయితే అవేవీ నాకు పిడికెడు అన్నం పెట్టలేదుసార్. మళ్ళీ గుంటూరు వెళ్ళడం నాకిష్టంలేదు. అందుకని ఇక్కడే ఉన్నా. కొంత కాలం, బస్సు డిపోదగ్గరా, నాంపల్లి రైల్వే స్టేషన్‌లోనూ, మూటలు మోసా. ఆ తరవాతనే ఈ పనిలోకిదిగా. మా అమ్మను కూడా తీసుకొచ్చా" అన్నాడు రామదాసు.

అతను 'శిర్‌మాలిష్' చేస్తాడు. గుబిలి తీస్తాడు. సుతారంగా మెడ నరాలు విరుస్తాడు. నొప్పి తగలకుండా, చెవుల్ని సాగదీసి, 'కిరకిర' మనిపిస్తాడు. చేతివేళ్ళను, సుఖంగా విరిచి, ఫెళఫెళమనిపిస్తాడు.

"ఈ శిర్‌మాలిష్ కొకరేటు అంటూ ఏదీ లేదు సార్. పావలా దగ్గర్నించి ముప్పావలాదాకా గుంజుతాను. పావలాకు వాడేనూనె వేరు. ముప్పావలాకు వాడేనూనె వేరు. కాస్త సువాసననూనె కలుపుతాను. పది నిమషాలపాటు మాలిష్ చేస్తాను. శుభ్రంగా తలదువ్వుతాను. మరీ అన్యాయంగా అంటే అరగాలికదా సార్" అన్నాడు రామదాసు.

ఇంతకన్నా గుబిలి తీయడంలోనే తనకు బాగాగిట్టుబాటు అవుతుం దన్నాడు రామదాసు. మామూలుగా గుబిలితీస్తే పదిపైసల్నించి పావలా

దాకా తీసుకొంటాడు. కానీ, కొంత మంది చెవుల్లో 'రాళ్లు' ఉంటాయట. మనిషిని బట్టి, వాడి ధోరణిని బట్టి, చెవుల్లో ఉండేరాళ్ల సంఖ్యకూడా మారు తుంటుందన్నాడు రామదాసు.

"మరీమీరంత రింగరీజన్లన్నీ తీయకండి–చెవుల్లో రాళ్లుంటయ్యా? అంటే ఉంటయ్. ఓకోరాయికి పావలాకు తక్కువ తీసుకోను. కావాలంటే, రాయిని పించర్‌తోనూ, గుబిలి తెడుతోనూ, టక్‌టక్‌మని పించుతాకూడా! రాయితీసి, అరచేతిలో పెట్టాకనే డబ్బుతీసుకుంటాను" అన్నాడు రామదాసు నవ్వుతూ–ఇది మోసం కాదనీ, ఈపాటి దగాకూడా చేయకుండా బతక లేక పోతున్నాననీ రామదాసు వాదించాడు.

"లోకంలో లక్ష మోసాలు జరుగుతున్నాయి. వాళ్ళందరికన్నా నా మోసం పెద్దదేం కాదులేండి" అని తననుతాను సమర్థించుకొన్నాడు రామదాసు.

అతనికింకా పెళ్ళికాలేదుట. చేసుకోవాలని కూడా లేదుట. రోజుకు, ఎంత హీనంగా చూసుకొన్నా అయిదారురూపాయలు సంపాదిస్తాడుట. అంతకన్నా ఎక్కువగిట్టుబాటు అయినరోజున 'మందు' కొరతాడట. తల్లికిమాత్రం ఏలోపం రాకుండా చూస్తున్నానన్నాడు.

"ఇక్కడా అక్కడా అన్నదేమీ లేదు సార్. ఊరంతా తిరుగుతా. హోటళ్ళు, పార్కులూ, బస్సుస్టాండ్లు, రైలుస్టేషన్లు, ఎక్కడ గిరాకీ ఉంటే అక్కడే!" అన్నాడు రామదాసు.

రోజంతా తిరుగుతూ ఉండే రామదాసు, ఇంతవరకూ, కూడబెట్టిందేమీ లేదు. ఎప్పుడన్నా, మూడో, నాలుగో 'మందు' కొట్టాక కూడా మిగిలితే, సినిమాలు చూస్తాడు.

"ఊపిరున్నంతకాలం జల్సాగా తిరుగుతా, చచ్చాననుకోండి, ఉళ్ళో ఉంచరు. ఎవరో వొకరు లాగి అవతలపడేస్తారు" అన్నాడు రామదాసు హాయిగా నవ్వుతూ.

జీవితంపట్ల, అంత నిర్మలత్వంగా ఉండడం అందరకూ సాధ్యమేనా?

డూడూ బసవన్న

"ప్రభువుగారికీ దణ్ణంబెట్టూ
పాదంవొంచీ దణ్ణంబెట్టూ
చాపెడు గింజలు ఇస్తారంటా
చారెడు మేకలు ఇస్తారంటా
డూ డూ డూ డూ బసవన్న
డూ డూ డూ డూ బసవన్న"

నాగరికత రోజురోజుకూ పెరుగుతున్నది. పెరగవలసిందే! అలా పెరుగుతున్నపుడు, కొత్త సంప్రదాయాలు, కొత్త విలువలూ వస్తాయి. ఇలా రావడంతో బాటుగా, పాత ఆచారాలు కొన్ని కనుమరుగవుతాయి. అవుతున్నాయి. బొత్తిగా ఆచరణకు పనికిరానివీ, కాలంతోబాటు మార లేనివీ, ప్రయోజనం లేనివీ. మారినా, కనుమరుగయినా అంతగా బాధ ఉండదు. కానీ–ఇలాంటి వాటిల్లో అంతో ఇంతో ఉండే అందచందాలు కూడా రూపుమాసి పోతున్నపుడే బాధవేస్తుంది. అలా క్రమంగా కనుదాటి పోతున్న వాటిల్లో గంగిరెద్దు ఒకటి.

గంగిరెద్దాట చాలాప్రాచీనమయిందని చెప్పుకోవచ్చు. పరమేశ్వరు డంతటివాడు తన నందిచేత ఈ ఆట ఆడించాడు. మరీ మహాచక్ర వర్తులూ, యవనరాజులూ, రాజులూ, దేశమంతా చిత్తవత్తుగా ఉన్న రోజుల్లో, ఈ ఆట మరింత దేదీప్యమానంగా ఉండేదేమో! ఎందుకనంటే, అప్పట్లో పెలువడిన పుస్తకాలుచూస్తూ ఉంటే వాటిల్లోని రాజకుమారులూ, రాజకుమార్తెలూ ఈగంగిరెద్దాటలుచూసి ఆనందించినఘట్టాలు కనిపిస్తాయి. ప్రారంభంలో ఇదొక వినోద క్రీడగా మొదలయినా, రానురాను గంగి రెద్దును ఆడించడం వొక వృత్తిగా మార్పు చెందింది. ఇప్పుడా వృత్తికి తిలోదకా లివ్వవలసి వచ్చిందంటున్నాడు బసవయ్య.

బసవయ్యది–చాలా పెద్ద కుటుంబం. ఆరుగురు అన్నదమ్ముల్లోనూ పెద్దవాడు. తండ్రి వెంట ఊరూరూ తిరగడం, తండ్రిని గమనిస్తూ ఉండడం, ఆయన మాటల్ని, పద్ధతుల్ని అనుకరిస్తూ ఉండడంతో, చిన్న తనం నుండీ, ఈ ఆటలోని మెలకువలన్నీ అవగతమయ్యాయి. తండ్రి, "బసవా!" అని కేకవేసి, ఎద్దుచేత ఒక్కో మోళీ వేయిస్తున్నప్పుడు, బసవయ్య ఆ మోళీకి అనుగుణంగా 'రాందోలు' పాయించే వాడు.

"దాన్ని వాయించడం కష్టమండీ దొరగారూ! మామూలు దోలు వాయించడమంటే - ఒక చేత్తోదోలును కర్రను పట్టుకొని, మరో చేతి

వేళ్ళతో వాయించాలి. రాండోలును వాయించటానికీ, రెండు చేతుల తోనూ, రెండు కర్రల్ని పట్టుకోవాలి. ఒక పుడకతో, డోలు చర్మాన్ని కాపాడుతూ, మరో కర్రతో రెండోవేపున వరసలు వాయించాలి. నాకీ పని చిన్నప్పణ్ణించీ తెలుసునండీ!" అన్నాడు బసవయ్య.

తనూ, తన తండ్రీ, తన చిన్నన్నా కలిసి, అనేకవందల ఊళ్ళు తిరిగా మన్నాడు బసవయ్య. తన బాబాయి, సుతిపోస్తూ, రాండోలు వాయించే వాడట. తను సన్నాయి వాయిస్తుంటే, తండ్రి గంగిరెద్దును ఆడించే వాడు. ఆ రోజుల్లో, వారికో పెయ్యదూడ కూడా ఉండేది. అది గొడ్డుమోతు గొడ్డు. ఎద, సూడివుండేదికావు. అది సీతమ్మ. గంగి రెద్దేమో, రాములవారు. ఆ రెండింటికీ పెళ్ళి జరిగేది.

"పోలేరమ్మ గుడి దగ్గరో, కొండరాయి దగ్గరో 'గడీ' వేసే వాళ్ళ మండి. రెండుమూడు వందల మందిదాకా, చుట్టూ చేరేవారు. ఎద్దు చేత రకరకాల మోతీలు వేయించేవాడు మా నాన్న. ఆ ఎద్దు ముంగాళ్ళు వంచి, ముందుకు నడుస్తుంది. వెనక్కు జరుగుతుంది. ఒంటికాలితో దణ్ణం పెడుతుంది. "కాదు" 'అవును' అని తలతో సైగచేసేది. రాండోలు వాయిద్యానికి అనుగుణంగా గంతులువేసేది. అలిగేది. కోపగించుకొనేది. ఆనందంతో చిందులు తొక్కేది. కోపంతో కాలు దువ్వి, తోక మట్ట ఎగబట్టి, రంకెలు వేసేది. ఏ పని చేయమంటే, ఆ పని, సుబ్బరంగా చేసేదండీ" అన్నాడు బసవయ్య.



సాధారణంగా గంగిరెద్దుల్ని కొనడ మంటూ జరగదన్నాడు బస వయ్య. తప్పుడు సుడులున్న గిత్తల్నీ, పొగరుమోతు వాటినీ, పోట్ల కోడెల్నీ ఈ గంగిరెద్దుల వాళ్ళకు ఇస్తూ ఉండే వారుట. ముగదాడు వేసీ, మూతికి చిక్కంగట్టి, కాళ్ళకు బంధాలువేసి దాన్ని అంకెకు తెచ్చేవారుట. ఒక్కొగిత్త, మూడు, నాలుగు మాసాల కల్లా, విద్యలన్నీ నేర్చుకొంటే, మరొకదానికి నేర్పడానికి ఏడెనిమిది మాసాలు కూడా పడుతుందన్నాడు బసవయ్య.

"ముందుగా వినవండీ! దాన్ని సాదికలోకి తీసుకురావడం చాలా కష్టం! ఆట నేర్పేటప్పుడు—కొట్టక తప్పదండీ! నేర్చుకొన్న తరవాతకూడా వొక్కొసారి మొరాయించి, మా పరువు తీస్తుందండీ!" అన్నాడు బసవయ్య

ఆ రోజుల్లో, ఒక్కొఊళ్ళో, మూడేసి రోజులు మకాం వేస్తుండే వాళ్ళమనీ, ఊరి బయట, ఏచెట్టుకిందనో ఉడకేసుకు తింటూ ఉండేవాళ్ళ మనీ, ఏరైతు కొట్టం దగ్గర కెళ్ళినా, ఎద్దు మేతకు కరువుండేదికాదనీ చెప్పుకొచ్చాడు బసవయ్య.

"పోటీలుపడి ఆడించే వాళ్ళు బాబయ్యా! పాత పంచెలు, ఉత్త రీయాలు, చొక్కాలు, చీరెలు, రవికెలు, మూటెడు దొరికేవి. గంగిరెద్దుకీ, ఆవుకూ మేతా, దాణా-ఊరివాళ్ళు పోటీలమీద పంపించేవారు....క్రమంగా, చూస్తూ చూస్తూ ఉండగానే ఆ కాలం కళ్ళముందే దాటిపోయిందండీ! బస్తీల మొఖంచూసి, ఎన్నేళ్ళయిందోనండీ! మరీ మారుమూల పల్లెటూళ్ళను పట్టుకొని వేళ్ళాడు తున్నాం ఇదివరకు, చాటల్లో గింజలు పెట్టేవాళ్ళు. ఇప్పుడు గుప్పెళ్ళతో వేస్తున్నారు. లేదా 6 పైసలో 10 పైసలో పడేస్తున్నారు. నా తమ్ముళ్ళందరూ, కూలిపనో, నాలిపనో చేసుకుంటున్నారు. ఇదిగో నేనూ, మాలింగమయ్యా మాత్రం, ఇంకా బసవదేవున్ని నమ్ముకొని బతుక్కొస్తున్నాం....అసలు మాదేవూరో, పొట్టచేత పట్టుకొని, ఊరూరా తిరిగే వాడికొక ఊరంటూ ఉంటే గదుస్తుందా బాబూ! ఏ ఊరు పచ్చగా ఉంటే అదే నావూరు. ఎక్కడ ధర్మ ప్రభువు లుంటే, అదే నావూరు," అన్నాడు బసవయ్య!

బసవయ్యకు ఐదుగురు పిల్లలు. పెద్దవాడు, తన రెండో తమ్ముడి దగ్గర ఉంటున్నాట్ట. మిగిలిన నలుగురూ, తనతోబాటే ఊరురూ తిరుగు తుంటారట.

"ఈ విద్య నాతోనే ఆఖరుసార్!" అన్నాడు బసవయ్య. గంగిరెద్దు గంగడోలును ఆప్యాయంగా నిమురుతూ. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు నీటితో నిండిపోయాయి!

—o—

ఆడే రెక్క, మాడే డొక్క

ఇటు కన్యాకుమారి నుండి అటు కాశ్మీరు దాకా, తూర్పున వున్న బంగాళాఖాతం నుండి పశ్చిమ సముద్రం దాకా—వేలాది దేవాలయా లున్నాయి.

ఒక్కొక్కదేవాలయం వొక్కొక్క తీరులో వుంది. మహారణ్యాల మధ్యా, మహాగిరుల శిఖరాగ్రాల మీద వెలసిన దేవాలయాలూ వున్నాయి. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు ఇంతలా పెరిగిన ఈ రోజుల్లో కూడా, ఈ దేవాలయ నిర్మాణ రహస్యాలు దురూహ్యంగానే ఉన్నాయి.

అక్కడెక్కడో అరణ్యంలో ఓ పరమ రమణీయమయిన దేవాలయం ఉంది. ఆ గుడి నిర్మాణానికి వాడిన రాళ్లు ఆ పరిసరాల్లో లేవు. అక్కడికి వందలమైళ్ల దూరంలో ఉన్న కొండల్లో ఆ జాతి రాళ్ళున్నాయి. ఈ గుడికీ, ఆ కొండలకూ మధ్య రెండు నదులు, బోలెడు వాగులూ ఉన్నాయి. తిన్నని బాటలు కూడా లేవుమరి. అయితే రాళ్లను ఈ గుడి దాకా ఎవరు తీసుకొచ్చారు? ఎలాతీసుకొచ్చారు? ఆ రాళ్ళను వెన్నలా కరిగించి, శిల్పాలుగా తీర్చిదిద్దడానికి ఎన్నివందలమంది శిల్పులు, ఎన్ని సంవత్సరాలు శ్రమించారు?



ఈ ప్రశ్నలకు జవాబులు మనకెక్కడా దొరకవు.

మరోచోట—ఇంకో రాతి స్తంభం ఉన్నది. ఇలా మీటుతూ వెళ్ళండి. ఆ రాతి స్తంభం నుండి సప్తస్వరాలు వినపడతాయి.

ఇంకోచోట నాలుగు తాడిచెట్లంత ఎత్తున్న రాతి స్తంభం, ఓచిన్న ఆధారంతో, ఇంకో శిలాఫలకంమీద నిట్టనిలువుగా నిలుచుని, మబ్బులతో మేలమాడుతూ ఉంటుంది.

వేరేఒకచోట–మామూలుకొండగుట్ట లనుకొంటున్నచోట–ఆకొండ గుహల్లో పరమాద్భుతమయిన వర్ణచిత్రాలుండడాన్ని మనం గమనిస్తాం.

ఆచిత్రాలను ఎవరు వేశారు? ఎప్పుడు వేశారు? ఎంతకాలం వేశారు? ఇన్ని శతాబ్దాల కాలంలోనూ ఆ రంగులు వెలిసిపోకుండా ఎలావున్నాయి?

ఒకేరాతిలో రథాన్ని మలచిన అపరబ్రహ్మల ఆచూకీలేమిటి? ఒకే శిలాఫలకం మీద దశావతారాలను శిల్పించిన అపర సృష్టికర్త లెవరు? మూగరాల నుండి, ముడికొయ్యలనుండి దివ్య సౌందర్యాలను ఆవిష్కరించిందెవరు?

మనకు తెలియదు.

"పోనీ మీరుచెబుతారా?"

"నిజంగా నాకు తెలియదండి!" అన్నాడు నాగలింగం. దుబ్బు గడ్డాన్ని అరచేత్తో రుద్దుకుంటూ.

"కాని–మా ముత్తాత, తాతగారు, గొప్ప పనివారండి! ఆయన కంటితో చూసి రాయి కడుపులో దోషముందో లేదో చెప్పగలిగేవాడుట. ఉక్కు–ఉలి పొడుస్తూ తీసుకొని రాయి ముందు కూచుంటేనండీ–ఉలి మొనలోనుంచి దేవుళ్ళు, దేవతలూ, అప్సరసలూ, రాళ్ళ మీదికిదూకి, అక్కడే వుండిపోయేవారుట" అన్నాడు నాగలింగం.

నాగలింగం తాతగారు కూడా గొప్ప పనివాడేనట. ఆయన హయాంలో ఆయన్ను మించిన పనివాడు, ఆ చుట్టు పక్కలలేనేలేడుట.

"నాకప్పుడు బాగా చిన్నతనమండి! పదేళ్ళు ఉంటాయేమో! మైసూరు మహారాజా వారికి కిరీటం చేయవలసి వచ్చింది. మా తాతగారికి కబురు వచ్చింది. ఆయనతోబాటు నేనూ వెళ్ళాను. అయిదారు మాసాలు మహారాజా వారి దేవిడిలో రాజభోగంగా గడిపాను. మైసూరు మహారాజులకు, మా తాతగారు సాయంచేస్తూ ఉండేవారు... ఏమిచ్చారని అడక్కండి! మా తాతగారికి బంగారపు కంకణాలు ఇచ్చారు. అవి నా హయాంలోనే కరిగించుకు తిన్నాను...." అన్నాడు నాగలింగం బాధగా.

రాజులు పోయారు. రాజ్యాలు మాయమయ్యాయి. ఆదరణ కరిగిపోయింది. ఇవ్వాళ శిలాశిల్పమన్నా, దారు శిల్పమన్నా ఎందుకూ పనికిరాని విద్యలయి పోయాయి.

నాగలింగం చదువుకోలేదు. అయితేనేం? ఏ దేవతా విగ్రహం మలచాలన్నా శాస్త్ర ప్రకారం మలచగలడు. ఈ "శాస్త్రం" అతనికి వంశానుగతంగా సంక్రమించింది. రాళ్ళుకొట్టి కొయ్యలుచెక్కి, ఉలులు నూరి బండబారిపోయిన ఆ చేతులు అతిసుకుమారమయిన శిల్పాలను ఎలా మలుస్తాయో మనకు అవగాహనకాదు.

నాగలింగానికి ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేశాడు. ఒక కొడుకును మందుల షాపులో ఉద్యోగానికి ఉంచాడు. రెండోవాడికి వడ్రంగం నేర్పాడు.

"ఈ వృత్తి కూడా పాడయిపోయిందండీ! పనుల్లేవు. ఉన్నా - కూలి గిట్టుబాటుకాదు. ఉన్నప్పుడు వ్యవసాయం పనులు చేస్తా. తీరిగ్గా ఉన్నప్పుడు చిల్లర మల్లర పనులు చేస్తా....ఇక్కడ ఎలుకలు జాస్తిగా ఉంటాయండీ! మీరు చూస్తున్నవి ఎలకబోనులు, వెదురు చట్రాలు చేస్తాన్నేను. బద్ద అల్లకం నరసిమ్మయ్యతో చేయిస్తా నేనా పెద్దవాణ్ని. ఊరూరూ తిరగలేను. అందుకవి, మా చిన్నవాణ్ని పంపుతా. కావిడేసుకుని సాయంకాలం దాకా అమ్ముకొస్తాడు. ఖర్చులుపోను, కూలి డబ్బులు మిగుల్తాయి." అన్నాడు నాగలింగం. ఒకప్పుడు వందెక రాల మాన్యం ఉండేదిట. ఆస్తిపంపకాల్లో ముక్కచెక్కలయి, ఇప్పుడు కుంట తక్కువ నాలుగెకరాలు మాత్రం ఉందట.

"అది పంచాడివదండీ! విత్తనాలు కూడా దండగే. వానలా-పడవు. బావి తీసుకునే శక్తిలేదు. నిరుడు వేరుశనగ వేశా. నాలుగెకరాల మిదా, రెండుబస్తాలు పండినాయి. ఈ ఏడు ఆముదాలు వేద్దామనుకుంటున్నా.... మీరు మా వాణ్ని చూస్తామన్నారుగా. వీడే మా రెండోవాడు" అన్నాడు నాగలింగం, ఎలకల బోనుల్ని కావిడికి బిగిస్తున్న కొడుకును చూపిస్తూ.

కాదేదీ శిల్పి కనర్హం

చిన్న కథ: ఇది వరకు మనందరికీ తెలిసిందే అయినా, మరో సారి చెప్పుకోవలసిన కథ: అనగా అనగా ఓవూరు. ఆవూరు నానుకొని చెరువు పక్కనే పెద్ద రావిచెట్టు. ఆ రావిచెట్టుకు, ఆసింటాగా నీలాటి రేవు.

ఓరోజు సాయంకాలం, గడ్డం మాసి, అంతకన్నా మాసిన గుడ్డలు కట్టుకున్న ఓ యువకుడు, ఆ రావిచెట్టుకింద కూచుని ఉన్నాడు. అతనలా చాలా సేపట్నించీ కూచునే వున్నాడు. అప్పుడప్పుడు ఊరివేపు, చెరువు వేపు, నీలాటి రేవువేపూ చూస్తున్నాడు.

ఇన్నిటికి అతనెవరు:

ఎందుకలా చూస్తున్నాడు:

ఇక్కణ్ణుంచే అసలు కథ ప్రారంభమవుతుంది. ఆ దోవనే పోతున్న వో దొంగ, అతన్ని చూశాడు. "నాకు మల్లేనే మారు వేషం వేసుకొచ్చాడు. బహుశా ఈ రాత్రికీ ఊళ్ళో ఇతగాడు దొంగతనం చేయవచ్చు" ననుకొన్నాడు.

మరో పేదసంసారి అతన్ని చూశాడు. "ఆదాయం తక్కువ. ఖర్చు ఎక్కువ, బాకీలవాళ్ళు పీక్కు తింటున్నారు. ఏం చేయడానికి పాలుపోక ఇలా వచ్చాడు". అనుకొన్నాడతను.

వో ప్రేమోపాసి చూశాడు. "తను ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి కాలేదేమో: విరక్తిచెంది వుంటాడు. పాపం:" అనుకున్నాడు.

మరో సన్యాసి చూశాడు.

"సాంసారిక జీవితం మీద విసుగెత్తి ఉండాలి. పారిపోయివచ్చి ఉంటాడు. ఎవరైతే మాత్రం అంతకన్నా ఏంచేస్తారు గనక:" అనుకున్నాడు.

ఓ జూదరి చూశాడు.

"ఉన్నదంతా అయిపోయిందానాయనా: అదృష్టవంతుడివి. కట్టు గుడ్డలయినా మిగిలాయి నీకు." అనుకొన్నాడు.


- ఇలా ఎంత మారమయినా, ఈ కథను పెంచుకుంటూ పోవచ్చు. ఇన్నిటికీ అతగాడెవరో మనకు తెలియదు. తెలిసిందల్లా – ఆ వ్యక్తిని గురించి. వారివారి స్వభావాలుబట్టి వారివారి ప్రవృత్తులను బట్టే–తమలాంటి వాడే అతగాడూ ననుకోవడం:

ఇది వ్యక్తులకే కాదు, వస్తువులక్కూడా అన్వయిస్తుందనుకొంటే, కాశం సాహెబుగారు మనకు సులభంగా అర్థమవుతారు. మనకు ఎందుకూ పనికిరాని కొమ్ములోల్లో కాశింగారికి రకరకాల బొమ్మలూ కనబడుతాయి.

"మరీ పుచ్చిపోయినవీ, పొట్లిపోయినవీ తప్పిస్తే అన్నిరకాల కొమ్ములూ పని కొస్తాయండీ!" అన్నాడు కాశం, చేరంపంతో కొమ్ము చివర్ని కోస్తూ.

మరి తాత ముత్తాతల సంగతులడిగితే తనకు తెలియదన్నాడు కాశం. తనతాతను తను చూడనుకూడా చూడ లేనన్నాడు. "నాకు మానాన్న తెలుసునండీ. ఆయన వడ్రంగం పనిచేసేవాడు. మా వూళ్లో బ్రహ్మానందంగారని, ఈవడ్రంగం చేసే ఆయన ఉండేవాడట. వారిదగ్గర మానాన్న ఈపని అంటే బొమ్మలు చేయడం కాదు--వడ్రంగంపని- నేర్చుకొన్నాడట" అన్నాడు కాశం, ఆరిపోయిన బీడిని చెవులోంచి తీసి మళ్ళా వెలిగిస్తూ.

తండ్రి పని నేర్చుకోవడం తెలీదుగానీ పని చేయటం మాత్రం కాశింకు తెలుసు. "మా నాన్న బళ్ళు చేయడం లోనూ, ఇళ్లు కట్టడం లోనూ, మాంచి పని వాడండీ! ఒక్కో రోజున పొద్దునే చద్దన్నం తిని, బండి కుందలు, తరిణ పట్టడానికి సంగడి ముందు కూచున్నాడంటే, తిప్పే వాళ్ళు అలసి పోవలసిందే తప్ప, ఆయనకు అలుపూ సొలుపూ ఉండేది కాదు. మధ్యాన్నాని కల్లా రెండుజతల కుండల్నీ చులాగ్గా అవతల పారేసేవాడు" అన్నాడు కాశం. అలాంటప్పుడు, తను కూడా చక్రం తిప్పుతూ వుండేవాణ్ణని, అప్పుడప్పుడూ సన్న పోగరుతో, పెచ్చులు కూడా తీస్తూ వుండేవాణ్ణనీ కాశం అన్నాడు. తన తండ్రి లక్కాకులు మలిచి, ఇరుసు బిగిస్తేబండికి వడీ, సుడీ వుండేదే కాదన్నాడు.



ఇళ్లు కట్టడంలో ఆయనకున్న ఆసక్తి ఇంతా అంతా కాదు. ముఖ్యంగా ద్వారబంధాల మీద, లతలు చెక్కడంలో, ఆయనకు అయనే సాటి. వో తీగ, దానికో చిన్న కొమ్మ, ఆ కొమ్మ చివరన ఆకులు,

ఆ ఆకుల మాటున చివుళ్ళు, వాటి వొంచనే విడీవిడని మొగ్గలు - అద్భుతంగా ఉండేవి.

"ఆయన చేసిన ద్వారబంధాలు బెజవాడలో ఉన్నాయండీ! జగ్గయ్యపేటలో వున్నాయి. కావాలంటే మీరెప్పుడన్నా అటుకేసి వెళ్ళినప్పుడు చూసిరండి" అన్నాడు కాశం.

ఎంత పనివాడయితే మాత్రం ఏం లాభం! ఇప్పుడా పనివాడితనం ఎపరిక్కావాలి గనక! కాశం తండ్రి తన చివరి రోజుల్లో దువ్వెనలు, ఈర్వెనలూ చేసుకొని బతికాడు. అప్పుడే కాశం కూడా ఈ పని నేర్చుకున్నాడు. తండ్రి కొయ్యతో దువ్వెనలు చేస్తే, కాశం కొమ్ముతో చెయ్యడం ప్రారంభించాడు. కొంత కాలంపాటు ఈ వృత్తి బాగానే సాగింది.

"ఈ ప్లాస్టిక్కు సామాన్లువొచ్చి, మా పొట్ట కొట్టాయండి. పది పైసలకు ప్లాస్టిక్కు దువ్వెనొస్తుంటే రూపాయిచ్చి కొమ్ము దువ్వెన ఎవరు బాబూ కొంటారు!" అన్నాడు కాశం.

అందుకే, ప్లాస్టిక్ వస్తువులతో అంతగా పోటీలేని ఈ పనిలోకి తను మారాడన్నాడు. "కొమ్ము తిన్నగా వున్నా, వంకరగా వున్నా పని కొస్తుందండీ. వంకరను, మెడదగ్గర తీసుకుంటాను. మిగిలిన కొమ్ముతో పిట్ట శరీరం, తోక చెక్కుతాను. చూస్తున్నారుగా! కొమ్ము, ఇలా నిలువుగా వున్నదనుకోండి, కావలసినట్లుగా వొంచుకోవచ్చు....విరగదండీ!" అని నవ్వాడు కాశం.

అతని పక్కనే చిన్న కిరోసిన్‌దీపం వుంది. ఆ దీపం మీద, కొమ్మును వెచ్చచేసి, కావలసిన మేరకు దాన్ని వొంచుతాడు. తరవాత, చేబాడితతో మెల్లిగా చెక్కుతాడు. సన్నసన్న పెచ్చులు తీయడానికి జాతి ఉలిని ఉపయోగిస్తాడు. షలాక్‌ను, గ్రావర్‌నుకూడా ఉపయోగిస్తానన్నాడు కాశం.

"ఒక్కోసారి బాడిత పనిచేయదండీ! పోగరుతో చివ్వుతాను. గ్రావర్‌తో డిజైన్ చెక్కుతాను. సన్న ఆకురాయితో నున్నగా రుద్దుతాను. అప్పుడప్పుడు, గాజు పెంకులతో కూడా అవసరమైన కొమ్ము భాగాల్ని రుద్ది తీస్తానండీ. సన్నటి పీలికల్ని కళ్లుగా మలుస్తాను. ఇంకో రకంగా పనికిరాని కొమ్ముడొప్పులమీద జిగురుతో అంటిస్తాను." అన్నాడు కాశం.

బొమ్మను బట్టి, కొనేవాళ్ళని బట్టి 15 రూపాయల ధర చెబుతాట్ట. 10, 12 రూపాయలకు ఇచ్చేస్తాట్ట. "అంతకన్నా తక్కువడిగే వారూ వున్నారు. అయినా యివ్వనండీ. కూలిగూడా గిట్టకపోతే యెందుకండీ వ్యాపారంచేయడం!" అన్నాడు కాశం.

అతను కొమ్ములిన్ని కిలోల లెక్కన కొంటాడు. కొనేటప్పుడు దుకాణదారుడు ఏరుకోనివ్వడుట. ఒక్కోసారి మరీ పనికిరాని సరుకు వస్తుందట. అలాంటప్పుడు మొత్తం నష్టమేనన్నాడు కాశీం.

"రోజుకు అతికష్టం మీద రెండు బొమ్మలు తయారవుతాయండి. అవి అమ్మకోవడమే కష్టం. వీటిని రోజూ ఎవరూ కొనుక్కోరు గదా! ఒకసారి కొన్నారంటే ఏళ్ళపర్యంతం వుంటాయిగదా! అమ్మకాలు లేనప్పుడు, ఏ ఫాన్సీషాపు వారికో ఆలవసులవ ధరలకు అమ్ముతుంటాను.... పొట్టగడవాలిగా బాబూ!" అన్నాడతను.

ఈ పనిలో కూడా ప్లాస్టిక్కులొస్తున్నాయట. ఆ బొమ్మలు కూడా అచ్చంగా కొమ్ము బొమ్మల్లాగానే ఉంటాయట.

"నాకు ముగ్గురు పిల్లలండీ! పెద్దవాణ్ణి ఇరానీ హోటల్లో వుంచా. మా ఆవిడ సేమ్యా కంపెనీలో పనిచేస్తున్నది. అద్దె ఇల్లేనండి....పోలీసుల బాధ. మునిసిపాలిటివాళ్ళ బాధ...."

అని ఆగిపోయాడు కాశీం. లుంగీతో కళ్ళొత్తుకొంటూ.

...చెమ్మగిలు నయనమ్ము లేదు

ఎన్ని లక్షల సంవత్సరాల నాటిమాటో ఆరోజుల్లో భూమండల మంతటా మహారణ్యాలే ఉండేవట. ఈ అరణ్యాలను ఆశ్రయించుకొని, రకరకాల ప్రాణులూ బతుకుతుండేవట. ఈ ప్రాణుల్ని వేటాడి పొట్ట పొసుకొనే మృగాలు కూడా ఈ అడవుల్లోనేవుండేవట. ఈ క్రూరమృగాల నుండి తప్పుకొంటూ, సాధు జంతువుల్ని వేటాడి జీవించే మానవులూ ఈ అడవుల్లోనే ఉండేవారుట.

జంతువుల్ని వేటాడడం తగ్గించి, బతకడంకోసం భూమిమీద ఆధార పడడానికి ప్రయత్నించడం మానవేతిహాసంలో ప్రధానమైన ఘట్టం. ఒకప్పుడు అడవి జంతువుల్ని వేటాడేందుకు ఉపయోగించే రాతికత్తులను, రాతి గొడ్డళ్లను, రాతి ఈటెలను, భూమిని తవ్వడానికి ఉపయోగించి ఉండాలని మానవశాస్త్ర వేత్తల అభిప్రాయం. చిత్తవత్తుగా వున్న అడవుల్లో తవ్వి. గింజలు చల్లేందుకు అనువుగా వుండే మైదాన ప్రాంతాలు చాలా తక్కువగా వుండేవి. ఈ మైదానభూముల కోసం అనాదిమానవుడు అన్వేషించాడు. ఒకచోటు నుండి మరోచోటుకు వలసలు వెళ్ళాడు. సమతలమైన ప్రదేశాలు లభించేవి కావు. ఒకవేళ వున్నా అంతకు ముందే, ఆభూమి పరిసరాల్లో తనలాంటి వారెవరో ఉండేవారు. వారితో యుద్ధాలు చేసి, తాము చావడమో, ఎదుటివారిని చంపడమో చేసిన సంఘటనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. మరికొందరు, యుద్ధాలదాకా పోగిలిగే వారు కాదు. తమకున్నపరిమితమైన రాతిపనిముట్లతో, అడవులను భుభ్రం చేసుకొని అక్కడ విత్తులు చల్లుకొనేవారు. అనుభవంమీద తేలిందేమి టంటే యుద్ధాలకన్నా ఇదే సులువైనదని.

ఇలా వేలాది సంవత్సరాలు గడిచింది. అరణ్యాలను చేదించి, ఆ భూములను సేద్యానికి యోగ్యంగా చేయడానికి మనుషులు అలవాటు పడ్డారు. భుజబలం, కండబలం ఉన్నవారు అడవుల్ని ఆక్రమించుకొంటే, ఈ మనుష్యులు వెళ్లి చెట్లను కొట్టి, మోళ్లను త్రవ్వి మెరకపల్లాలను సరిచేసి, దున్నడానికి నేలను అమరికంచేసి, ఈ శ్రమకుగాను అంతో యింతో పుచ్చుకొని, బయట పడటానికి ఈ మనుషులు అలవాటు పడ్డారు.

ఇలా అలవాటుపడిన వంశానికి చెందిన వాడే మన పాపయ్య. పాపయ్య అడవిలో పుట్టాడు. అడవిలో పెరిగాడు. అడవిలోనే పెళ్లాడాడు. అడవిలోనే బిడ్డలి కన్నాడు. అడవిలోనే వాళ్లను పెంచాడు. అసలు అడివిని దాటి, ఇవతలకు రావాలని పాపయ్యకు లేనేలేదు. కానీ తప్పనిసరయి వచ్చాడు.

"మా అయ్య కూడా ఈపనేచే సేవాడండి. ఆయన గొడ్డలి తీసు కొని ఏ చెట్టుదగ్గర కొచ్చినా, ఆ చెట్టు గజగజలాడి పోయేది" అన్నాడు పాపయ్య నుదిటి మీది చెమటను తుడుచుకొంటూ.


చిన్నప్పుడు తన తండ్రితోపాటు తను గూడా అడవుల లోపలికి పోతూ వుండేవాణ్ణనీ, అడివిపందులు, ఎలుగ్గొడ్లు అప్పుడప్పుడు చిరుత పులులు కనిపించేవనీ, చెప్పాడు తనకు వాటిని చూస్తే భయం వుండేది కాదనీ చెప్పాడు. కాలు తీసి కాలు పెట్టడానికి వీలుండేది కాదన్నాడు.

"అది చెప్పడానికి కుదరదు బాబయ్యగారూ. చూడాల్సిందే. ఎటు పోదామన్నా చెట్టో పొదోముళ్లదొంకో, మానో, అడ్డంవస్తుంది పాములు కోకొల్లలు. ఎన్నిరకాల పిట్టలనీ ఎన్ని రకాల జీవాలనీ" పాపయ్య ఆ వివరాలన్నీ చెప్పుకొచ్చాడు.

తమ కుటుంబాలే ఏడెనిమిది దాకా ఉండేవిట. వీళ్లందరూ కలిసి చెట్లను కొడుతూ వుండేవారట.

"గుత్తదార్ దొరలు కొట్టమనేవారు. గొడ్డళ్ళు, రంపాలు, మోకుడు, కొమ్మ కత్తులు, దొరలే ఇచ్చేవాళ్ళు" అన్నాడు పాపయ్య.

అడవుల్ని కలపకోసం కాంట్రాక్టు తీసుకొన్న కంట్రాక్టర్, ఎక్కడో వుండేవాడు. ఆయన తాలూకు మనుషులు మాత్రం అడవుల్లోకి వొచ్చేవాళ్ళు. వచ్చి, ఈ కుటుంబాల వాళ్ళను కలుసుకోనేవాళ్ళు. వీళ్లతో కూలినాలి మాట్లాడి అడవుల మధ్యకు "తోలుకు" పోయేవారు. కర పొద్దు పొడుస్తున్నప్పుడు, గొడ్డళ్ళు, రంపాలు, సప్తామేకులు, కొమ్మకత్తులు భుజాన వేసుకొని, అడవిలోకి పోయిన పోవడం ఇక–కనుచీకటి పడిం దాకా వొచ్చేవారు కాదు. మకాంకి – కొట్టే స్థలానికీ మరీదూరమయితే మకాను, అక్కడికి మార్చేవారు. కాస్త పల్లుడు చూసుకుని గొయ్యితీస్తే నీరు పడేది.



"ఆరోజుల్లో కూలి, బేడా మూడణా లుండేది. ఈ డబ్బులయినా- మాకేం ఉపయోగంలేదు. ఎందుకూ పనికిరావు. అందుకని దొరలే మాకు

జొన్నలు, ఉప్పు, నూనె, కారం ఇస్తుండేవారు. మధ్యాన్నంపూటసంకటిగాని అంబలిగాని ఇస్తుండేవారు. ఇకపనిసంగతి అడగబాకండి. చచ్చేటంతపని. గొడ్డుచాకిరీ చేయాల్సిందే! పాలుమాలడానికి లేదండి. కూచోడానికి లేదండి. నడుంవాలిస్తే వాల్చినట్లుచూస్తే చావబాదేవారు. గుత్తేదార్ మనుషులదగ్గర తుపాకులుండేవి. చుట్టూరా కాపలావుండేవారు. ఆ అద్దాన్నపు అడవిలో కాల్చి చంపినా, అడిగేదిక్కులేదు అడవుల ఆఫీసర్లు వుంటారనుకోండి; ఏంవుంటే ఏం? లాభంలేదండి. అందరూవొంగలే! వాళ్లూ వీళ్ళూ కుమ్మక్కయి ఈ ఘోరమంతా చేస్తుంటారు.'' అన్నాడు పాపయ్య.

ఈ కంట్రాక్టర్ల క్రింద నలభయి సంవత్సరాలు పనిచేశాడు పాపయ్య, ఎన్ని వేలచెట్లు నరికాడో లెక్కలేదు. అడవిపందుల్ని గొడ్డలితోనే నరికిన సందర్భాలు చాలా వున్నాయన్నాడు. ఎంత నిటారుగా వున్న చెట్టునయినా క్షణంలో ఎక్కగలనన్నాడు. పాముల్ని, జీవాల్ని చూస్తే తనకు భయంలేదని, తనంటేనే వాటికి భయమని అన్నాడు. ఆదిలాబాద్, ఖమ్మం, విజాగాపాదు అడవులకే తన బతుకులు అర్పితం చేసిన పాపయ్య – కంట్రాక్టర్లకు లక్షలు పోగు చేసిపెట్టిన పాపయ్య– బొక్కెడు కంతలతో బయట పడ్డాడు.

"రాంరెడ్డిగారి దగ్గర అప్పుచేశా. పెద్దోణ్ని, ఆ దొరదగ్గర ఉంచా .. పెద్దపిల్లకు పెళ్ళి చేయడానికయింది అప్పు. బిడ్డను కాల్చుకు తినేవాడండీ! మీలాంటి దొర – కల్కచేరుతో చెప్పి కొడుకును విడిపించాడు. వాడిప్పుడు ఇక్కడే ఉన్నాడు. రిక్షా తొక్కుతున్నాడు"....

కొడుక్కు పిల్లలున్నారు. రిక్షామీదవచ్చే నాలుగు పైసలూ చాలవు. తనకింకా ఓపిక వుంది. ఊరికే పడి తినడం తనకిష్టంలేదు. అందుకే ఇక్కడ పనిచేస్తున్నాడతను.

"నెలకింత జీతం కాదండి. రోజుకింత–అనికూడాకాదు. ఇవిగో .... ఈ మోడులవ్వీ నాకిస్తారు. వీటిని పేళ్ళకిందా, చితుకులకిందా పగలెయ్యాలి. ఎంతచేస్తే అంతేవస్తుంది. ఎంతచచ్చుగా చూసుకున్నా రెండురూపాయలకు తక్కువుండదు లేండి!" అన్నాడు పాపయ్య.

తనెప్పుడు పుట్టిందీ తనకు తెలియదన్నాడు. తనతాత పేరుకూడా తనకు తెలియదన్నాడు. అడవిలో ఉన్నప్పుడు తాడికల్లు, ఈతకల్లు తాగే వాణ్ణన్నాడు. ఇప్పసారా తాగిన మాట నిజమేగాని, చేయడం మాత్రం తెలియదన్నాడు.

ఎంతకాలం చేస్తావంటే, "ఏం చెప్పను బాబూ! ఓపికున్నంతకాలం చేస్తా. ప్రాణం పోయేదాకా చేస్తా. ఇదివరకుమల్లే ఉడాయించి గొడ్డల్ని ఎత్తలేకపోతున్నా. ఆయాసమొస్తున్నది. రొప్పొస్తున్నది. గుండెల్లో దడదడగా ఉంటున్నది".

ఎండ తగలకుండా చుట్టుకున్న తలగుడ్డతో మొఖం, గొంతు తుడుచుకొని భుజంమీద వేసుకున్నాడు పాపయ్య. అతనన్నట్లు–ఓపికున్నంతవరకూ, పేళ్ళు వేస్తూనే ఉంటాడు. ఎప్పుడో ఓపిక సన్నగిల్లుతుంది. గొడ్డలి బరువును ఓప లేక, కట్టెపేడులాగా నేలకు వొరిగిపోతాడు పాపం!

* * *

ఊరు ఉండమంటుంది...

''గుర్రం గుడ్డిదయినా దాణాకు లోపం లేదు'' అన్నసామెత మనకు తెలిసిందే!

"సంస్థానం చిన్నదయినా సరదాకు లోపం లేదు" అన్న సామెత మనకు కొత్తగానీ, సంస్థానాధీశులకు కాదు.

కర్నూలు జిల్లాలోని బనగానిపల్లి సంస్థానం నిజానికి చిన్నదే! దాని ఆదాయం కూడా - ఇతర సంస్థానాలతో పోలిస్తే అంతంత మాత్రమే! కానీ, ఆ సంస్థానాధీశుల సరదాలు చూస్తే-మరే మహారాజుగారి సరదాలకు తీసిపోవు. పెద్ద పెద్ద సంస్థానాధీశుల్లాగానే, ఈ బుజ్జి బుజ్జరాజాలూ ఖర్చుపెడుతూ ఉండేవారు. అయితే, కళ్లు తిరిగేటంత మొత్తాలను ఈ ఛోటా నవాబులు ఎలా సేకరించేవారు ? ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం. ప్రజలమీద అదనంగా పన్నులు వేసేవారు. వారి శ్రమను, దారుణంగా దోచుకొనే వారు. ఆ డబ్బునంతా తమ విలాసాలకు వ్యయం చేసేవారు.

బనగానిపల్లి నవాబులకున్న సరదాలు ఇన్నీ అన్నీ కావు. వాటన్నిటి లోకి ఖరీదైన సరదా-గుర్రాలను పెంచడం. సింహాసనం మీద కూచున్న అఖరు నవాబుగారు, ఓసారి హైదరాబాద్ నవాబుగారిని దర్శనం చేసు కొన్నారు. నిజంగా అంతులేని సంపదను చూడలేకపోయారు గానీ, వారి అశ్వసంపదను మాత్రం చూశారు. అందులో ఒక గుర్రం వారికి నచ్చింది.



దాని ఆనుపానులన్నీ తెలుసుకున్నారు. తెలుసుకొని, అదే కుటుంబానికి చెందిన మరో గుర్రాన్ని కొన్నారు. అలా కొనడానికి ముందు, తమ ఏజెంట్లను దేశమంతా తిప్పారు. అలా తిప్పడానికి వేలాది రూపాయలు

ఖర్చయ్యాయి. అయినాసరే - ప్రిన్స్ ఆఫ్ బేరార్ ముచ్చటపడిన గుర్రం లాంటిదే తన కొడుక్కూ వుండాలి. ఆ గుర్రాన్ని చూసి తన కొడుకూ ముచ్చట పడాలి.

"హసీనా", అన్న ఆ గుర్రంకోసం, బొంబాయినుండి కర్నూలు దాకా ప్రత్యేకమైన రైలు బోగీని ఏర్పాటు చేశారు బనగానిపల్లి ప్రభువులు. ఆ గుర్రంతోపాడే, దాన్ని 'మసాజ్' చేసే మొయినుద్దీన్ కూడా బనగాన పల్లి వచ్చాడు.

"అప్పుడు వేస్తే వేయి రూపులుగా ఉండేవాణ్ణి. గిరిజాలజుట్టు చక్కని గెడ్డం, అత్తరుల్లో మునిగితేలుతూ ఉండేవాణ్ణి. అదీగాక అంతకు సంవత్సరం కిందట్నే నాకు పెళ్ళయింది." అన్నాడు మొయినుద్దీన్ నవ్వుతూ.

నవాబుగారు, అతనికీ, అతని కుటుంబానికీ కలిపి పెద్దఇల్లిచ్చారు. ఆ ఇంటి ప్రక్కనే గుర్రపుసావడి. రోజురోజంతా ఆ గుర్రం దగ్గరే మొయినుద్దీన్ గడుపుతూ ఉండేవాడు. "హసీనా - అంటే నవాబుగారికి వల్లమాలిన ఆపేక్ష. తనకు లోపం జరిగినా సహించేవాడు గానీ, గుర్రానికి లోపం జరిగినట్లు అనుమానం కలిగితే, చంపేసేవాడు. ప్రజల్ని కలుసు కోవడానికైనా ఆయనగారు నిరాకరించేవారేమో గాని, హసీనాను చూడ కుండా ఉండేవారే కాదు". అన్నాడు మొయినుద్దీన్ ఆ పాతరోజుల్ని గుర్తు చేసుకుంటూ.

గుర్రాన్ని మేపటం వరకూ మంచిదేగాని, దానికి సోమరితనం మప్పకూడదని, మొయినుద్దీన్ చాలాసార్లు సూచనగా చెప్పిచూశాడు. వేరే కసరత్తు అవసరంలేదనీ, మాలిష్ మాత్రమే సరిపోదని, సవారీకూడా చేయాలనీ, అతనన్నాడు. అలా అన్నప్పుడల్లా 'ఖాముష్‌సాలే' అనేవాడట నవాబుగారు.

ఒకసారి తన కొడుకుల్ని, హసీనా మీద కూర్చోబెట్టి ఫొటోలు తీయించాడుట. ఆ ఫొటోలను బొంబాయిలో డెవలప్ జేయించి ఒక కాపీని నిజాంగారికి, అందేలాగానూ చేశాడుట!

"తన దగ్గర బ్రహ్మాండమైన గుర్రం ఉన్నదని మిగిలిన వారికి తెలియజేయడం కోసం, ఆయన ఖరీదైన విందుల్నికూడా ఏర్పాటు చేశాడు. ఆ విందులకు ఎక్కడెక్కణ్ణించో డబ్బున్న మారాజులంతా వచ్చేవారు. డాన్సులు, తాగుళ్ళు, ఆతరవాతవీ విచ్చలవిడిగా సాగిపోయేవి. వేలాది రూపాయలు కళ్ళముందే కరిగి పోయేవి."

ఈ రంగరంగవైభోగం, అయిదారేళ్ళ పాటు నిరాఘాటంగా సాగింది. నవాబుగారి కూడా హసీనా మీద మోజు తగ్గిపోయింది. వారి దగ్గరున్న మిగిలిన గుర్రాలకూ, హసీనాకూ తేడా అన్నదే లేకుండా పోయింది. ఒకప్పుడు మహారాజు వైభోగం అనుభవించిన హసీన ఆ సాలలోనే మామూలుకన్నా హీనమైన బతుకును చవిచూసింది.

"సరిగ్గా నా పనికూడా అంతే అయింది బాబూ! బనగానిపల్లిలో ఉండగా, నాచేతి కింద ముగ్గురు పనివాళ్ళుండే వాళ్ళు. నా భార్య 'బేగం సాబ్' లాగా బతికింది. హసీనా రాత మారటంతో నా జాతకం కూడా మారిపోయింది. నేనూ అక్కడో కుక్కలాగా గడిపాను. ఏ రోజున నన్ను నవాబుగారు నౌఖరీ వొదిలి పొమ్మంటారోనని హడలి చచ్చాను" అన్నాడు మొయినుద్దీన్.

చివరి అనుకున్నంతా అయింది. కట్టుబట్టలతో బనగానిపల్లి విడిచి పెట్టాడు మొయినుద్దీన్. ఆ చుట్టుపక్కల ఉండేందుకు ముఖం చెల్లలేదు. అందుకని హైదరాబాదు వచ్చాడు.

"అప్పట్నించే నా కష్టాలు మరీ పెరిగిపోయాయండీ! గుర్రాల మాలిష్ తప్ప - ఇంకేపనీ రాదు. ఇంక దేనికీ అలవాటు పడలేదు. అప్పటికే నాకు ముగ్గురు పిల్లలు. ఆఖరువాడు మగపిల్లాడు....నేను చేయని పని లేదు బాబూగారూ! పస్తులు చేయని వారం లేదు. కొంత కాలం రొట్టెల దుకాణంలో పని చేశాను. తరువాత కట్టెల అంగట్లో కొంత కాలం ఉన్న. ఓ గ్లాస్ ఫ్యాక్టరీలో రెండేళ్ళు పని చేశా. అప్పుడే నా పెద్దల్లుణ్ణి చూశా. మా జబ్బార్ కోత మిషన్ దగ్గర ఉండేవాడు. పిల్ల మరీ ముదిరి పోతుందని వాడికిచ్చా. వాళ్ళిద్దరూ, సనత్‌నగర్‌లోనే ఉంటున్నారిప్పుడు. వాళ్ళకు నలుగురు పిల్లలు" అన్నాడు మొయినుద్దీన్.

మొయినుద్దీన్ భార్య చచ్చీ చెడీ, ఓ బట్టల మిల్లులో కూలీకి కుదిరింది. ఇక పర్వాలేదు. గదా - అనుకొన్నాడు మొయినుద్దీన్.

"కానీ భగవంతుడికి నా మీద దయ తప్పింది. నన్ను పనిలోంచి తీసేశారు. మళ్ళీ దరిద్రం, ఆకలి – వీటికన్నా మా అబ్బాయిదో పెద్ద సమస్య. వాడు పరమ బద్మాష్‌గా తయారయ్యాడు....మా రెండో అమ్మాయిని గురించి అడక్కండి బాబూ! అది చక్కని చుక్క,కుందనం బొమ్మ. అచ్చంగా -- దానిదంతా వాళ్ళమ్మ పోలికే!" అని కళ్ళు తుడుచుకొన్నాడు మొయినుద్దీన్.

"రజియా కూడా పెళ్ళి చేదామనుకొన్నాడు మొయినుద్దీన్. పిల్ల ఎంత చక్కందయితేనేంగాక – కాస్త ఉన్న సంబంధం మాత్రం తటస్థ పడలేదు. ఏదో వో దారిన పోయే దానయ్య కివ్వడానికేమో - మన స్సొప్పదు. సరిగ్గా ఆ సమయంలోనే చిన్నకొడుకు, ఓ సంబంధం తీసుకొచ్చాడు. ఆ పెళ్ళికొడుకుది ఈ ఊరుకాదు, ఈ దేశమూ కాదు. కువాయిట్‌లో అతనికి చాలా ఆస్తి పాస్తులున్నాయట. ఉన్నమాట కూడా నిజమేకావచ్చు. కాకపోతే. ఆ షేక్, అలా వందలకు వందలు, చిత్తు కాగితాల్లా ఖర్చు చేస్తాడా! తన ఆమోదం లేకుండానే రజియా పెళ్ళి ఆ షేక్‌తో జరిగిపోయింది. పెళ్ళయిన మరునాడే వాళ్ళిద్దరు బొంబాయి వెళ్ళారు. అక్కణ్ణించి కువాయిట్ వెళ్ళి పోతామన్నారు.

"నా రజియాను అదే ఆఖరుసారి చూడడం బాబూ! ఈ మూడేళ్ళు వించీ, దాని సంగతి మాకేమి తెలీదు. ఆ దిగులుతో మా ఆవిడ కన్ను మూసింది. మావాడు షేక్ దగ్గర అయిదువేలు తీసుకొన్నాడని, తరవాత తెలిసింది. వాడూ, అంతూ పొంతూ లేడు. ఇక మిగిలిందల్లా..." అని బావురుమన్నాడు మొయినుద్దీన్.

ఇంకేం చేయడానికీ చేతకాక, ఈ మధ్యనే ఈ మారుబేరం ప్రారంభించాడు మొయినుద్దీన్. ఇంత వరకు నష్టం రాలేదు. గానీ—అను కొన్నంత లాభం కూడా రాలేదంటాడు మొయినుద్దీన్.

"మార్కెట్‌లో ఓ కుప్పకుప్ప కొంటానండీ! అందులో ఎన్నుం టాయో, గుత్తెదారు చెప్పడు. లెక్క పెట్టుకోనీడు. కొంత మంది కట్టలు కట్టి అమ్ముతారు. ఒక్కో-కట్టలో వంద తేగలుంటాయి. వాడు ఐదు రూపాయలు చెబుతాడు. నేను రెండు దగ్గర్నించి బేరమాడతా.... మరీ ముదురువి ఎవరూ కొనరు. లేతవేమో సవ్వగా ఉంటాయి. మరీ చిన్నదయితే 5 పైసలు. పెద్దదీ పదునుమీద ఉన్నదీ అయితే పావలా. ఏ రోజు సరుకు ఆ రోజునే అమ్ముడు పోదు. అలాగని నిలవవుంచితే ఎండిపోతాయి. నాకిప్పుడు 18ఏళ్ళు. ఎవ్వరూ లేరు బాబూనాకు. ఎప్పుడో దాటిపోదామనుకొన్నా. పోయినా ఈ బాధలుండవు.. కానీ బాబూ, పాపిష్టి ముండాకొడుకును, ఇంకా చావురావడంలేదు...." తుండుగుడ్డతో కళ్ళొత్తుకున్నాడు మొయినుద్దీన్.

అతని కన్నీరు తుడిచేందుకొక్క- దయామయుడు కూడా ఈ దేశంలో లేడా!

బండబారిన మొండిబతుకులు

"ఆకాశంబున నుండి శంభుని శిరం బందుండి శీతాద్రి సుశ్లోకం బైన హిమాద్రినుండి భువి, భూలోకంబు నందుండి యస్తోకా భోధి ..."

అన్నపద్యాన్ని రాసిన కవి బహుశా మన పండరినాథ్‌నే చూసి రాసి ఉండాలి. ఆ కవిగారు ఈ పద్యం రాసేవేళకు మనవాడు లేడే అనుకుందం, అప్పుడు మన పండరిలాంటి వాణ్ని చూసైనా రాసి ఉండాలి. ఎందుకంటే-ఈ పద్యం, వొక అక్షరం కూడా మార్చకుండా మన పండరికి అచ్చు గుద్దినట్లు సరిపోతుంది.

మహ్మదీయుల పరిపాలన మహోధృతంగా ఉన్న కాలమది. హిందూ రాజు లందరూ మదిరముతో మగువలతో కాలక్షేపం చేస్తున్న రోజులవి. ప్రజల గోడును వినిపించుకోవడం, కథల్లో తప్ప కలికానికూ్కడా



కనిపించకపోయినా–కనీసం రాజ్య సంరక్షణకోసమన్నా తంటాలు పడుతూ ఉండేవారు. ఒకప్పుడు శివాజీ నాటికి ఆదీ సన్నగిల్లిపోయింది. ఢిల్లీ నుండి

ఔరంగజేబు సైన్యాలు, దక్షిణాదికి పొరుపు కొస్తూ ఉంటే, స్థానికంగా ఉన్న రాజులు దానోహమని లొంగి పోయారే తప్ప, కనీసం ఎదుర్కొన ధానికయినా ప్రయత్నించారు కాదు. అప్పుడే శివాజీ అవసరం కలిగింది. అతనేదో హిందువులనందర్ని కూడగట్టు కొచ్చాడని చరిత్రకారులు రాయడం కొంతవరకే నిజం. అతను చేసిందల్లా ఏటికొకరూ, కోటికొకరుగా ఉన్న స్థానికపాలకుల్ని ఏకం చేయడం, మరీ లోభుల్నీ వెధవల్నీ తొలగించి, వారిస్థానంలో తనవారిని ఉంచడం ఇదంతా మరొకరి పాలనకిందికి తన దేశం పోగూడదన్న ఇచ్ఛతోనే శివాజీ చేసాడు.

ఆ శివాజీ సైన్యానికి కావలసిన కత్తులు, కఠారులు, డాళ్లు, బల్లేలు, ఈటెలు, శిరస్త్రాణాలు ఇంకా ఇతరమైన మారణాయుధాలు తయారు చేసిన వారిలో శంభోజీ అన్న శిల్పి కూడ ఉన్నాడు. శంభోజీ భక్తి విశ్వాసాలకూ నైపుణ్యాలకుమెచ్చి, శివాజీ స్వయంగా ఇచ్చిన రజతపతకం ఇవ్వటికీ పూనాలోని వారి వంశీయులవద్ద ఉన్నది. శివాజీ అనేక యుద్ధాలలో విజయం సాధించడానికి, అనేక కారణాలుండవచ్చు, అందులో తను, శంభోజీ చేసిన ఆయుధాలు కూడ ఒక కారణమే నంటాడు పండరి.

ఆ రాజులూ ఆ యుద్ధాలూ పోయాయి. పోవటంమంచిది కూడా. ఆ రకమైన ఆయుధాలకు ఇప్పటి యుద్ధంలో స్థానం కూడా లేదు, కానీ చిరకాలంగా ఆ వృత్తికే అలవాటు పడి, దాన్నే నమ్ముకున్న వారందరికీ వృత్తులు పోయాయి. అందుకే వారంతా చెల్లాచెదరయి పోయారు. అటు పలాసా నుండి, ఇటు తిరుచునాపల్లిదాకా, పడమర నాందేడు దాకా–ఇంకా ఇంకా పశ్చిమానికీ, ఉత్తరానికీ కూడా వలసలు వెళ్లారు.

"మావాళ్ళు శ్రీకాకుళం, ఆముదాలవలస, భీమనిపట్నం. విశాఖ పట్టణం, నరిసీపట్నం, విజయనగరం, బొబ్బిలి, కాకినాడ, సామర్లకోట, తుని, ఏలూరు, ఇంకా ఇంకా చాలా చోట్ల–ఉన్నారండీ! మాదంతా వొకటే కుదురు, కానయితే మాలో మేం వొకరినొకరు చూసుకొని ఏళ్ళూ పూళ్ళూ అయింది" అన్నాడు పండరి.

వారంతా వొకే పనికూడా చేయడం లేదుట. కొంతమంది ఫ్యాక్టరీల్లో కూలీలుగా, గుమాస్తాలుగా, పళ్ళషాపులలో పనివాళ్ళుగా, పని చేస్తున్నారు. ఇంకొంత మంది రంగులు వేయడం, సున్నాలువేయడం, వడ్రంగం, పాత్ర సామానులు చేయడం, మూరు బేరానికి గ్లాసులు, గిన్నెలు, అమ్మి కోవడం చేస్తున్నారు. చాలా కొద్దిమందిమాత్రమే అసలు వృత్తిని ఇంకా అంటిపెట్టుకొని ఉన్నారు.

"ఏం ఏడిచినా బాబూ! అవ తీసిన గంధంలాంటిదేనండీ మా సంపాదన, అని ఫక్కున నవ్వాడు పండరి".

"ఇప్పుడు కూడా, కత్తుల బాణాలు చేయడం కాదండీ! అయినా మార్పు చెందిన ఆ పనినే నమ్ముకొని ఉన్నారు. అంటే ఏమిటంటే

బాకులు కత్తెరలు కత్తిపీటలు, ఇలాంటివి ఉన్నాయనుకోండి, అవి ఎల్ల కాలం పదునుగా ఉండవుగదా! మీరు వాడుతున్నకొద్ది వాటిపదును తగ్గి పోయి బండబారి పోతాయి గదా! ఆఖరికి కాగితంకూడా తెగని దశ వస్తుంది గదా! ఆలాంటి వాటిని నేను పదును పెడతానండీ! ఇదే పల్లె టూరోలో అయితే ఏ కమ్మరి దగ్గరకో వెడతారు. ఓ అరణోలెడు గింజలు పోసి, పదును పెట్టించు కొస్తారు. మరి బస్తీలో, ఆ కమ్మరా యన ఎక్కడుంటాడో ఎప్పుడుంటాడో అందరికీ తెలియదు. అందుకని-" అన్నాడు పండరి.

ఎప్పుడుంటాడో ఎక్కడుంటాడో తెలిసినా, అతనున్న చోటుకు పోవాలన్నా, అతనున్నప్పుడే పోవాలన్నా అందరకూ కుదరదు. ఉద్యోగా లకూ, పనులకు, హడావుడిగా. ఉరుకులూ, పరుగులూ తీసే, జనానికి పదును పెట్టించు కొచ్చేంత అవకాశం ఎక్కడుంటుందిగనుక, ఉండదని పండరికి తెలుసు. అందుకే అవసరమున్న చోటుకు తనే వెడతాడు లేదా– తనే కృత్రిమంగా అవసరాన్ని కలిగించి మరీ వెడితాడు. తనిక్కడున్నానని తెలియ చేయడానికి అతను పాడతాడు, కేకలు పెడతాడు. సానమీంచి, ఏ ఉక్కు–ముక్క–నో ఉంచి నిప్పు రవ్వలు చిందిస్తాడు.

"పెద్దకత్తెర సానపడితే ముప్పావలా తీసుకొంటా.చిన్న దానికైతే ముప్పయిపైసలు. రకరకాల చాకులున్నాయనుకోండి. సైజునుబట్టి 10 పైసలనుండి 50 పైసలదాకా వసూలుచేస్తా. మంగలి కత్తి పదునుపెడితే 50 పైసలు తీసుకొంటానండీ! మళ్ళా 15 రోజులదాకా యమాగా పని చేస్తుంది. మీరన్నది నిజమేనండీ! ఇందులోనూ మోసం దగా ఉంటుంది. గీసిగీసి బేరమాడారనుకోండి, మందడి మాత్రం, వాడిగా సానేసి అవతల పడేస్తా. అడిగినంత ఇచ్చారనుకోండి. వెన్నుదగ్గర్నుంచి సవాదుగా సాన పడతా. అన్నిటికీ వొకే మెయినుగా సానపడితే పొట్టగడవదండీ!" అన్నాడు పండరి.

ఈ సానల్లోనూ చాలా రకాలున్నాయన్నాడు. మొంటుపనికోసం కొన్ని.సున్నితమైన పనికోసం కొన్ని ఉపయోగిస్తారట. తనదగ్గిర ఐదారు రకాలదాకా ఉన్నాయన్నాడు. భుజంమీద మోసుకు పోయేదానికన్నా సైకిల్‌కే అమర్చిన దయితే సులువుగా ఉంటుందన్నాడు.

"కాని దానిఖరీదు 300 నుంచీ 350 దాకా ఉంటుందండీ! కోనే వోపికలేదు. అందుకనే దీన్ని మోసుకు తిరుగుతున్నా. దీన్ని మోసినంత సేపు, నా పిల్లాణ్ణి కూడా మోయిలేదండీ! నా బతుకంతా దీని మీద ఆధార పడి ఉంది. అందుకే నా బిడ్డలాగా దీన్ని చూసుకొంటా" అన్నాడు పండరి ఆసానను అప్యాయంగా చెత్తోనిమురుతూ. "బాబూ! మూడు నాలు గొందల పెట్టుబడిఉంటే సైకిల్‌సాన కొంటానండీ! అప్పుడయితే ఇంకా ఎక్కువదూరం తిరగవచ్చు, ఎక్కువ పనీచేసుకోవచ్చు. నాలుగు పైసలు

అదనంగాకూడా వస్తాయి. కానీ–ఆపాటి సాయంచేసే మారాజే కరువయి పోయాడండీ" అని ఖేదించాడు పండరి.

ఉదయం ఆరు గంటలకు ఇంట్లో బయలుదేరిన పండరి, మసక పందెదాక, తిరుగుతూనే ఉంటాడు. ఒక్కో–సారి తిరిగిన శ్రమంతా వృధాఅవుతుందన్నీ, పావలా డబ్బులుకూడా రావనీ అన్నాడు.

అయినా ఆశ అలాంటిది బాబయ్యా! నాతోబాటు ఐదుగురుబతకాలి. ముగ్గురూ ఆడపిల్లలే....ఇంకా పెళ్ళిళ్ళుచేయాలి. అప్పటికి, మా ఇంటిది నసపెడుతూనే ఉంటుంది. నన్నేం చేయమంటారో చెప్పండి. ఇట్టా పొట్టకే తిప్పలుపడనా, అటు ఎదిగిన ఆడపిల్లల పెళ్ళిళ్ళే చేయనా! నేనూ చూస్తా వున్నానండీ ఆఖరికి ఎప్పుడో పిచ్చెక్కు–తుంది....అప్పుడు–" అని సాన ఇరుసుకు పక్కగా వేళ్ళాడదీసిన చాకులవేపు చూశాడు పండరి.

అతనేదయినా అఘాయిత్యం చేసినా తనకు తను చేసుకొన్నా, ఆది పోసుకోడానికి మనమంతా సిద్ధంగా వున్నాం అంతదాకా రాకముందే అతనికింత సాయపడడానికి, మనకెవ్వరికి ప్రాణం వొప్పదు.

అవును!

మనతీరే అలాంటిది!!

Blank Page

150

భరద్వాజ రచించిన

ముచ్చటైన మూడు నవలలు

పాకుడు రాళ్ళు

చలన చిత్ర జగత్తులోని చిత్ర విచిత్రాలకు దర్పణం.
తెలుగులో వెలువడిన తొలి "నేమరలిస్టు" నవల!

కాదంబరి

వర్తమాన, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, రంగాలన్ను,
అత్యంత సహజంగా చిత్రించిన నవల!

ఇదంజగత్

వ్యావసాయిక దశనుండి, పారిశ్రామిక దశలోకి పరి
ణామం చెందుతున్న సమాజాన్ని ప్రతిబింబిస్తున్న నవల!

రావూరి రవీంద్రనాథ్ రచనలు

మీకు తెలుసా?

మనం అనునిత్యం ఉపయోగించే అనేక వస్తువుల్ని
గురించీ, అపురూపమైన నిర్మాణాల్ని గురించీ, అందరికీ
అర్థమయ్యే సులభశైలిలో వ్రాయబడిన పుస్తకం!

చిత్రం విచిత్రం

కొన్ని సంఘటనలు, మరికొన్ని సన్నివేశాలు, అద్భుత
కల్పనలేమో ననిపిస్తాయి. మనం నమ్మలేని ఒకవార్త,
మనం ఊహించని ఒక దృశ్యం.— మనముంటున్న, ఈ
ప్రపంచంలోనే జరిగిన వైనాన్ని తెలియజేసే గ్రంథం!

వివరాలకు

శ్రీ కమలా పబ్లిషింగ్ హౌస్

విజయవాడ-2

Cover Printed at Avon Printing Works, Hyderabad.

Priver von n Printon Prin Printinsad